సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 22+32 పేజీల ఆదివారం అనుబంధం

వెల: ₹ 7.00

సంపుటి: 17

సంచిక: 312

ఆదివారం 2-2-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'



సచిన్‌కు బీసీసీఐ 'జీవిత సాఫల్య' పురస్కారం

మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్‌కు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) 'జీవిత సాఫల్య' పురస్కారం అందజేసింది. ముంబైలో శనివారం జరిగిన బీసీసీఐ వార్షిక అవార్డుల కార్యక్రమంలో అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) అధ్యక్షుడు జై షా చేతుల మీదుగా సచిన్ ఈ పురస్కారాన్ని అందుకున్నాడు. క్రికెట్లో దేశానికి అందించిన విశేష సేవలకు గుర్తింపుగా భారత తొలి కెప్టెన్ కల్నల్ సీకే నాయుడు పేరు మీదుగా 1994 నుంచి ఈ 'లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్' అవార్డును ప్రదానం చేస్తున్నారు.

పసిడి పతకం నెగ్గిన పల్లవి

డెహ్రాడూన్: జాతీయ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్‌కు రెండో స్వర్ణ పతకం లభించింది. శనివారం జరిగిన మహిళల వెయిట్‌లిఫ్టింగ్ 71 కేజీల విభాగంలో సనాపతి పల్లవి పసిడి పతకం సొంతం చేసుకుంది. పల్లవి మొత్తం 212 కేజీల బరువెత్తి అగ్రస్థానంలో నిలిచింది. పల్లవి స్నాచ్‌లో 94 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 118 కేజీలు బరువెత్తింది. శుక్రవారం పురుషుల 67 కేజీల విభాగంలో నీలంరాజు ఆంధ్రప్రదేశ్‌కు తొలి బంగారు పతకాన్ని అందించాడు.





కేలా రెనెకె
నికీ ప్రసాద్

ఒకటే లక్ష్యం... రెండో ప్రపంచకప్

నేడు మహిళల అండర్-19 టి20 ప్రపంచకప్ టైటిల్ పోరు
- దక్షిణాఫ్రికాతో భారత్ 'ఢీ'
- ఓటమి లేకుండానే రెండు జట్లు ఫైనల్లోకి
- త్రిష, కమలినిలపై దృష్టి
- మధ్యాహ్నం 12 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

కౌలాలంపూర్: రెండేళ్ల క్రితం దక్షిణాఫ్రికా గడ్డపై జరిగిన మొట్టమొదటి అండర్-19 టి20 ప్రపంచ కప్‌లో భారత అమ్మాయిల జట్టు జగజ్జేతగా అవతరించింది. రెండేళ్ల తర్వాత అదే ప్రపంచకప్‌ను నిలబెట్టుకునేందుకు ఈసారి దక్షిణాఫ్రికా జట్టుతో టీమిండియా ఫైనల్ సంగ్రామానికి సిద్ధమైంది. అజేయంగా తుది పోరుకు అర్హత సాధించిన నికీ ప్రసాద్ నాయకత్వంలోని భారత అమ్మాయిల జట్టు విజయవంతంగా 'రెండో ప్రపంచకప్ మిషన్' పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉంది. భారత్ మాదిరిగానే ఓటమి లేకుండా ఫైనల్ చేరిన దక్షిణాఫ్రికా జట్టు వరల్డ్‌కప్ ముచ్చట తీర్చుకోవాలనే పట్టుదలతో ఉంది. ఈ నేపథ్యంలో జోరు మీదున్న రెండు అజేయ జట్ల మధ్య నేడు జరిగే అండర్-19 ప్రపంచకప్ టైటిల్ పోరుపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది. ఈసారి భారత్ జైత్రయాత్ర కొనసాగుతుందా! లేదంటే కొత్త చాంపియన్ ఆవిర్భవిస్తుందా! మరి కొన్ని గంటల్లో తేలిపోతుంది. అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్ వనరులతో పూర్తిస్థాయి ఆల్‌రౌండ్ సామర్థ్యంతో ఉన్న టీనేజ్ టీమిండియాను ఎదుర్కోవడమే ఎవరికైనా అతిపెద్ద సవాల్. ఇక అలాంటి అభేద్యమైన జట్టును ఓడించాలంటే మాత్రం దక్షిణాఫ్రికా మైదానంలో పెద్ద 'ప్రపంచ' యుద్ధమే చేయాలనడంలో అతిశయోక్తే లేదు!

ఆ ఇద్దరిని కట్టడి చేస్తే...

తెలంగాణ స్టార్ బ్యాటర్ గొంగడి త్రిష! మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) వేలంలో తనను విస్మరించిన ఫ్రాంచైజీల కళ్లకు కట్టుకున్న గంతల్ని తన అసాధారణ బ్యాటింగ్‌తో విప్పేసింది. ఇప్పుడు 'ఫైనల్ మిషన్' ముంగిట అందరి దృష్టి ఆమెపైనే ఉంది. ఈ టోర్నీలో ఓపెనర్ త్రిష ఫామ్, క్రీజులో ఆమె కనబరుస్తున్న పోరాటపటిమ ప్రత్యర్థి బౌలర్లకు కఠిన సవాళ్లు విసురుతున్నాయి. మరో ఓపెనర్ కమలిని, సనిక చాల్కెలతో కూడిన భారత బ్యాటింగ్ విభాగం పటిష్టంగా ఉంది. దక్షిణాఫ్రికా విజయంపై ఆశలు పెంచుకోవాలంటే మాత్రం ముఖ్యంగా త్రిష, కమలినిలను తక్కువ స్కోరుకు పరిమితం చేయాల్సి ఉంటుంది. ఈ టోర్నీలో త్రిష 265 పరుగులతో టాప్ స్కోరర్‌గా ఉండగా... కమలిని 135 పరుగులతో మూడో స్థానంలో ఉంది. ఆ తర్వాత భారత్ నుంచి అత్యధిక పరుగులు సనిక చాల్కె (6 మ్యాచ్‌ల్లో 69) చేసింది. భారత బౌలింగ్ విభాగాని కొస్తే ఆయుశి శుక్లా, పారుణిక సిసోడియా, వైష్ణవి శర్మలతో కూడిన స్పిన్ త్రయం విశేషంగా రాణిస్తోంది. సహజంగానే సఫారీలకు స్పిన్ అంటేనే కష్టం. అలాంటి జట్టుపై ఫామ్‌లో ఉన్న ఈ ముగ్గురు స్పిన్నర్లు తప్పకుండా ప్రభావం చూపిస్తారు. అలాగని ఫైనల్‌కు చేరిన సఫారీ జట్టును తక్కువ అంచనా వేయలేం. కేలా రెనెకె కెప్టెన్సీలో దక్షిణాఫ్రికా జట్టు సెమీఫైనల్లో గట్టి ప్రత్యర్థి ఆస్ట్రేలియాను బౌలింగ్‌తో కట్టడి చేసి... బ్యాటింగ్‌తో చుట్టేసింది. జెమ్మా బోతా, లౌరెన్స్, కరబో మెసోలతో కూడిన బ్యాటింగ్ లైనప్, ఆష్లే వాన్‌విక్, ఎన్‌తబిసెంగ్ నిని, శేషిని నాయుడులతో కూడిన బౌలింగ్ దళం కూడా మెరుగ్గా ఉంది.

పిచ్, వాతావరణం

భారత్‌కు బాగా అలవాటైన పిచ్. అటు బౌలింగ్‌కు, ఇటు బ్యాటింగ్‌కు అనుకూలించే అవకాశం ఉంది. సాధారణ వాతావరణమే. వాన ముప్పు దాదాపుగా లేదు.

ఆధిక్యం కోసం ఆఖరి పోరు

నేడు ఇంగ్లండ్‌తో భారత్ ఐదో టి20 మ్యాచ్
- సంజూ సామ్సన్, సూర్యకుమార్‌లకు మరో అవకాశం
- ఒత్తిడిలో బట్లర్ బృందం
- రాత్రి 7 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

ముంబై: ఇప్పటికే సిరీస్ భారత్ చేతికందింది. ఇక మిగిలిందల్లా ఆధిక్యం పెంచుకోవడమే! మూడు వన్డేల సిరీస్‌కు ముందు ఈ చివరి మ్యాచ్ గెలిచి... 4-1తో ఆధిక్యం, ఆత్మవిశ్వాసంతో వెళ్లాలని టీమిండియా భావిస్తోంది. ఇక ఇంగ్లండ్ పరిస్థితి దీనికి భిన్నం. చేజారిన సిరీస్‌తో ఒత్తిడిలో ఉన్న బట్లర్ బృందం ఇప్పుడు భారత్ ఆధిపత్యానికి గండి కొట్టాలని... ఈ పొట్టి సిరీస్‌లో ఆతిథ్య జట్టు శుభారంభమివ్వగా... విజయంతో ముగింపు తమది కావాలని ఇంగ్లండ్ జట్టు గట్టిగా ఆశిస్తోంది. ఈ నేపథ్యంలో ఆఖరి పోరులో పైచేయి సాధించేందుకు పర్యాటక జట్టు సర్వశక్తులు ఒడ్డేందుకు సిద్ధమైంది. మొత్తంమీద ఇరుజట్ల మధ్య మరో రసవత్తర పోరుకు నేడు వాంఖెడే స్టేడియం వేదిక కానుంది.

సంజూ... మెరిపించు!

ఈ సిరీస్‌లో ఓపెనర్ అభిషేక్ శర్మ ఆడాడు. తిలక్ వర్మ గెలిపించే 'షో' చేశాడు. హార్దిక్ పాండ్యా అసలైన ఆటను గత మ్యాచ్‌లో బయటికి తెచ్చాడు. అక్షర్ పటేల్ బంతితో లేదంటే బ్యాటింగ్‌తో జట్టుకు అక్కరకొస్తున్నాడు. అంతెందుకు అరకొరగా... అంటే శివమ్ దూబే 'కన్‌కషన్'తో తుది జట్టులోకి వచ్చిన హర్షిత్ రాణా కూడా మ్యాచ్ గెలిపించే బౌలింగ్ ప్రదర్శన కనబరిచాడు. కానీ టాప్-4లో ఓపెనర్ సంజూ సామ్సన్, కెప్టెన్ సూర్యకుమార్‌లతోనే జట్టు మేనేజ్‌మెంట్ కలవరపడుతోంది. తర్వాతి ప్రపంచకప్ వేటకు కోచ్ గంభీర్ కోర్ గ్రూపులోని ఆటగాళ్లు ఇలా వరుసగా విఫలమవడం జట్టుకు ప్రతికూలంగా మారింది. బౌలింగ్‌లో అర్ష్‌దీప్, పాండ్యాలు వెన్నుదన్నుగా నిలుస్తుంటే స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ఉన్నపళంగా మ్యాచ్‌ను మలుపుతిప్పే మాయాజాలంతో ఆకట్టుకుంటున్నాడు. రవి బిష్ణోయ్ కూడా ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెడుతున్నాడు.



2-3 లక్ష్యంతో ఇంగ్లండ్

సిరీస్‌ను కోల్పోయిన ఇంగ్లండ్‌కు ఇప్పుడు ఆఖరి పంచ్ మాత్రమే మిగిలుంది. ఇందులో తమ పవర్ చాటుకొని తదుపరి వన్డే సిరీస్‌ను తాజాగా ప్రారంభించాలని బట్లర్ జట్టు అనుకుంటుంది. సాల్ట్ గత మ్యాచ్‌లో టచ్‌లోకి వచ్చినా కొద్దిసేపే క్రీజులో ఉన్నాడు. ఇప్పుడు లయను అందుకుంటే బెన్ డకెట్‌తో ఓపెనింగ్ వికెట్‌కు భారీ ఆరంభం ఇవ్వగలడు. ఇదే జరిగితే... తదుపరి పరుగుల ప్రవాహాన్ని బట్లర్, హ్యారీ బ్రూక్, లివింగ్‌స్టోన్, జాకబ్ బెథెల్, బ్రైడన్ కార్స్‌లు తీసుకెళ్తారు. ఆర్చర్, సకిబ్ మహమూద్ పేస్‌తో ఆకట్టుకుంటుండగా, స్పిన్‌తో ఆదిల్ రషీద్ నిలకడను ప్రదర్శిస్తున్నాడు.

5 వాంఖెడే మైదానంలో ఇప్పటి వరకు భారత జట్టు ఐదు టి20 మ్యాచ్‌లు ఆడింది. ఇందులో మూడింటిలో గెలిచి, రెండింటిలో ఓడిపోయింది. చివరి మూడు మ్యాచ్‌ల్లో భారత జట్టే నెగ్గింది.

సిరీస్ చేజారినా... సమరంలో పట్టు కోల్పోరాదని ఐదో టి20లో నిరూపించుకోవాలని ఇంగ్లండ్ బృందం చూస్తోంది.

పిచ్, వాతావరణం

వాంఖెడే బ్యాటింగ్‌కు అచ్చొచ్చే పిచ్. చాలా మ్యాచ్‌ల్లో, ప్రత్యేకించి టి20ల్లో చేజింగ్ జట్లకు విజయ అవకాశాలిచ్చింది. అలాగని బౌలింగ్ తేలిపోదు. స్పిన్నర్లు ప్రభావం చూపొచ్చు. వాన ముప్పు లేదు.

బడ్జెట్‌లో క్రీడలకు రూ.3,794 కోట్లు

గతం కంటే 351.98 కోట్లు పెంపు

న్యూఢిల్లీ: భారత ప్రభుత్వం కొత్త బడ్జెట్‌లో క్రీడలు, యువజన సర్వీసుల శాఖకు రూ. 3,794.30 కోట్లు కేటాయించింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆ మేరకు నిధుల్ని కేటాయించారు. గత బడ్జెట్‌లో రూ. 3442.32 కోట్లు ఇవ్వగా... తాజాగా రూ.351.98 కోట్లు పెంచింది. కేంద్ర క్రీడాశాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఖేలో ఇండియా' కార్యక్రమానికే ఈ క్రీడా బడ్జెట్లో ప్రాధాన్యం దక్కింది. గతంలో రూ. 800 కోట్లు కేటాయించగా ఈసారి ఆ మొత్తాన్ని రూ. 1000 కోట్లకు పెంచింది. నికరంగా రూ. 200 కోట్లను హెచ్చింపు చేసింది. జాతీయ క్రీడా సమాఖ్యలకు ఇచ్చే గ్రాంట్లను కూడా పెంచింది. గతంలో సమాఖ్యలకు రూ. 340 కోట్లు ఇవ్వగా తాజా ఆర్థిక సంవత్సరంలో రూ. 400 కోట్లు కేటాయించారు. భారత స్పోర్ట్స్ అథారిటీకి రూ. 830 కోట్లు (గత బడ్జెట్ కంటే రూ. 15 కోట్లు అదనం) ఇవ్వనున్నారు. అథ్లెట్ల పారదర్శకత పోటీ కోసం పాటుపడుతున్న జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) లాబోరేటరీకి రూ. 23 కోట్లు (గతంలో రూ. 18.70 కోట్లు) కేటాయించింది. 1998లో ఏర్పాటు చేసిన జాతీయ స్పోర్ట్స్ అభివృద్ధి నిధి కోసం రూ. 18 కోట్లను యథాతథంగా కొనసాగించినప్పటికీ... క్రీడాకారులకు ఇచ్చే ప్రోత్సాహకాలకు స్వల్పంగా కోత పెట్టింది. పోయిన ఏడాది రూ. 42.65 కోట్లు ఇస్తే ఈసారి రూ. 37 కోట్లకు పరిమితం చేసింది. యువజన సర్వీసులకు భారీగా కోత పెట్టింది. గత బడ్జెట్లో రూ. 55 కోట్లు కేటాయిస్తే ఈసారి కేవలం రూ. 11.70 కోట్లే విదిలించింది. జమ్మూకశ్మీర్‌లో క్రీడా సదుపాయల కల్పన కోసం రూ. 20 కోట్లు ఇవ్వనుంది. గతం కంటే రూ. 14 కోట్లు ఎక్కువగా కశ్మీర్‌లో మౌలిక సౌకర్యాలకు వెచ్చించనుంది.

టోగోపై 2-0 ఆధిక్యంలో భారత్

న్యూఢిల్లీ: డేవిస్‌కప్ ప్రపంచ టీమ్ టెన్నిస్ వరల్డ్ గ్రూప్-1 ప్లే ఆఫ్ మ్యాచ్‌లో భారత్ శుభారంభం చేసింది. టోగో జట్టుతో శనివారం మొదలైన ఈ పోటీలో తొలి రోజు జరిగిన రెండు సింగిల్స్‌లోనూ భారత ఆటగాళ్లు ఆడుతూ పాడుతూ విజయం సాధించారు. ఫలితంగా భారత్ 2-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. తొలి సింగిల్స్‌లో శశికుమార్ ముకుంద్ 6-2, 6-1తో లియోవా (టోగో)పై నెగ్గగా... రెండో సింగిల్స్‌లో రామ్‌కుమార్ 6-0, 6-2తో సెటోడ్జి (టోగో)ను ఓడించాడు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో


● 'దిల్' రాజు, అనిల్ రావిపూడి, శిరీష్

ఈ సక్సెస్ చాలా పాఠాలు నేర్పింది

-'దిల్' రాజు

''ఇండస్ట్రీలో బడ్జెట్ కాదు.. కథే ముఖ్యం. మేము కూడా కథలని నమ్ముకుని సినిమాలు నిర్మించాం. కొత్త దర్శకులతో తీసినప్పుడు ఎన్ని విజయాలు వచ్చాయో అందరికీ తెలిసిందే. అయితే కాంబినేషన్స్ అంటూ నాలుగైదేళ్లుగా మేం తడబడుతున్నాం. 'సంక్రాంతికి వస్తున్నాం' హిట్‌తో అనిల్ మళ్లీ మాకు ఒక రహదారి వేసి ఇచ్చాడు. ఈ సక్సెస్ నాకు కూడా చాలా పాఠాలు నేర్పించింది'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. వెంకటేశ్ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. మీనాక్షీ చౌదరి, ఐశ్వర్యా రాజేశ్ హీరోయిన్లుగా నటించారు. 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ నిర్మించిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 14న విడుదలైంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన డిస్ట్రిబ్యూటర్స్ గ్రాటిట్యూడ్ మీట్‌లో 'దిల్' రాజు మాట్లాడుతూ– ''సాధారణంగా డిస్ట్రిబ్యూటర్స్‌కి బ్రేక్ ఈవెన్ అయితేనే సూపర్ హిట్. అయితే వాళ్లు నష్టపోయినప్పుడు కూడా సినిమా సూపర్ హిట్ పోస్టర్స్ పడుతుంటాయి. 90 శాతం ఫెయిల్యూర్స్, కేవలం 10 శాతం మాత్రమే సక్సెస్ ఉండే ఇండస్ట్రీ ఇది. 20 ఏళ్లుగా మాతో ప్రయాణం చేస్తున్న డిస్ట్రిబ్యూటర్స్‌కి ధన్యవాదాలు'' అని చెప్పారు. అనిల్ రావిపూడి మాట్లాడుతూ– ''సంక్రాంతికి వస్తున్నాం' ఆరు రోజుల్లోనే రూ.100 కోట్లు షేర్ రాబట్టింది. ఓ రీజినల్ ఫిలింకి చూడలేనేమో అనుకున్న రూ. 300 కోట్ల గ్రాస్ నంబర్ మా మూవీతో చూడబోతున్నందుకు హ్యాపీ'' అని తెలిపారు. ''20 ఏళ్ల క్రితం డిస్ట్రిబ్యూటర్‌కి ఉన్న విలువ ఇప్పుడు లేదు. ఇలాంటి సమయంలో వాళ్లు తలెత్తుకునేలా చేసిన సినిమా 'సంక్రాంతికి వస్తున్నాం'' అని శిరీష్ పేర్కొన్నారు. డిస్ట్రిబ్యూటర్స్ సాయికృష్ణ, రాజేశ్, హరి, శోభన్, ఎల్వీఆర్ మాట్లాడారు.


● 'తంగలాన్'లో విక్రమ్


● 'గామి'లో విశ్వక్ సేన్

అరుదైన గౌరవం

విశ్వక్ సేన్ హీరోగా నటించిన 'గామి', విక్రమ్ కథానాయకుడిగా చేసిన 'తంగలాన్' సినిమాలకు అరుదైన గౌరవం దక్కింది. 'ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ రోటర్‌డామ్ 2025'లో ప్రదర్శనకి ఈ చిత్రాలు ఎంపికయ్యాయి. నెదర్లాండ్స్ వేదికగా ఈ నెల 9 వరకూ జరగనున్న ఈ ఫిల్మ్ ఫెస్టివల్‌లో భారత సినిమాలకు చోటు దక్కడం విశేషం. విశ్వక్ సేన్ హీరోగా, చాందినీ చౌదరి హీరోయిన్‌గా రూపొందిన తెలుగు చిత్రం 'గామి'. ఈ చిత్రంతో విద్యాధర్ కాగిత దర్శకుడిగా పరిచయమయ్యారు. కార్తీక్ శబరీష్ నిర్మించిన ఈ చిత్రం 2024 మార్చి 8న విడుదలైంది. ఈ సినిమాలో విశ్వక్ సేన్ అఘోరాగా నటించారు. ఆయన నటనకు ప్రేక్షకుల నుంచి మంచి మార్కులు పడ్డాయి. అదే విధంగా విక్రమ్ హీరోగా నటించిన తమిళ చిత్రం 'తంగలాన్'. పా. రంజిత్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో మాళవికా మోహనన్, పార్వతీ తిరువోతు కీలక పాత్రల్లో నటించారు. కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించిన ఈ సినిమా 2024 ఆగస్టు 15న తమిళంతో పాటు తెలుగులోనూ విడుదలైంది. కోలార్ గోల్డ్ ఫీల్డ్స్‌లో జరిగిన సంఘటనల ఆధారంగా ఈ చిత్రం రూపొందింది. ఈ సినిమాలో మరోసారి తన నట విశ్వరూపం చూపించారు విక్రమ్. ఇక 'గామి, తంగలాన్'లు 'ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ రోటర్‌డామ్ 2025' ప్రదర్శనకు ఎంపిక కావడంపై పలువురు అభినందనలు తెలుపుతున్నారు.

పల్లెటూరి డిటెక్టివ్


● కిశోర్ శ్రీకృష్ణ, తనికెళ్ల భరణి, మిధున ప్రియ

తనికెళ్ల భరణి ప్రధాన పాత్రలో 'అసుర సంహారం' అనే చిత్రం రూపొందనుంది. కిశోర్ శ్రీకృష్ణ దర్శకత్వం వహించనున్న ఈ సినిమాలో మిధున ప్రియ కీలక పాత్ర చేయనున్నారు. శ్రీ సాయి ప్రవర్తిక బోయళ్ల సమర్పణలో శ్రీ సాయి తేజో సెల్యులాయిడ్స్ బ్యానర్‌పై సాయి శ్రీమంత్, శబరీష్ బోయళ్ల నిర్మించనున్న ఈ చిత్రాన్ని శనివారం ప్రకటించారు. 'క్రైమ్, సస్పెన్స్, థ్రిల్లర్ చిత్రాలకు ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది. ప్రస్తుతం కాన్సెప్ట్, కంటెంట్ ఓరియెంటెడ్ చిత్రాలకి ప్రేక్షకాదరణ ఉంటోంది. ఈ క్రమంలోనే విలేజ్ క్రైమ్ డ్రామాగా 'అసుర సంహారం' రూపొందనుంది. ఈ మూవీలో తనికెళ్ల భరణి విలేజ్ డిటెక్టివ్‌గా ఓ విభిన్నమైన పాత్రలో ప్రేక్షకులను అలరించనున్నారు. త్వరలోనే షూటింగ్ ప్రారంభిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మిధున ప్రియ, కెమెరా: బాలు ఏబీసీడీ, సంగీతం: కరీం అబ్దుల్.

స్క్రీన్స్ పెరగడం ఆనందం

- విష్ణువర్ధన్


● విష్ణువర్ధన్, ఆకాశ్ మురళి, స్నేహ

ఆకాశ్ మురళి, అదితీ శంకర్ జంటగా 'పంజా' ఫేమ్ విష్ణువర్ధన్ దర్శకత్వంలో రూపొందిన తమిళ సినిమా 'నెసిప్పాయ'. ఈ రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ జనవరి 14న విడుదలైంది. ఈ సినిమాను 'ప్రేమిస్తావా' టైటిల్‌తో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ సంస్థ జనవరి 31న తెలుగులో విడుదల చేసింది. శనివారం హైదరాబాద్‌లో జరిగిన ఈ చిత్రం సక్సెస్‌మీట్‌లో ఆకాశ్ మురళి మాట్లాడుతూ–''తెలుగు పరిశ్రమకు నన్ను ఆహ్వానించిన ప్రేక్షకులకు థ్యాంక్స్. మా సినిమా తెలుగు ప్రేక్షకులకూ నచ్చడం హ్యాపీగా ఉంది'' అన్నారు. ''రిలేషన్‌షిప్ నేపథ్యంలో జరిగే రొమాంటిక్ డ్రామా ఇది. ఈ సినిమాలోని క్రైమ్ ఎలిమెంట్ అందర్నీ సర్‌ప్రైజ్ చేస్తుంది. ఆకాశ్ ప్రతిభగలవాడు. యాక్షన్ స్టంట్స్‌ను కూడా తనే చేశాడు. అదితి అద్భుతంగా నటించింది. 'ప్రేమిస్తావా' సినిమాకు స్క్రీన్స్ పెరుగుతున్నాయని మైత్రీవారు చెప్పడం హ్యాపీగా ఉంది'' అని చెప్పారు విష్ణువర్ధన్. ''ఈ సినిమాని ఆదరిస్తున్న ప్రేక్షకులకు థ్యాంక్స్'' అన్నారు సహనిర్మాత స్నేహ.

సస్పెన్స్


● ఆర్పీ పట్నాయక్, సురేష్

రాంప్రసాద్, జెమినీ సురేష్, కిరీటి, సాయి ప్రసన్న, సాయి కిరణ్, నజియా ఖాన్, అద్వైత చౌదరి ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'వైఫ్ ఆఫ్ అనిర్వేష్'. గంగ సప్తశిఖర దర్శకత్వం వహించారు. మహేంద్ర గజేంద్ర సమర్పణలో వెంకటేశ్వర్లు మెరుగు, శ్రీ శ్యామ్ గజేంద్ర నిర్మించారు. ఈ సినిమా ఎస్‌కేఎంఎల్ మోషన్ పిక్చర్స్ ద్వారా తెలుగులో రిలీజ్ కానుంది. ఈ మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను దర్శకుడు, మ్యూజిక్ డైరెక్టర్ ఆర్పీ పట్నాయక్ విడుదల చేసి, మాట్లాడుతూ– ''అద్భుతమైన స్క్రీన్‌ప్లేతో రూపొందిన ఈ సస్పెన్స్ థ్రిల్లర్ మంచి విజయం సాధిస్తుంది'' అన్నారు. వెంకటేశ్వర్లు మెరుగు, శ్రీ శ్యామ్ గజేంద్ర మాట్లాడుతూ–''ఓ మిమిక్రీ ఆర్టిస్ట్ తన ఇబ్బందులను తనకు తెలిసిన కళతో ఎలా పరిష్కరించాడు? అనేది దర్శకుడు ఆసక్తిగా తెరకెక్కించారు'' అని తెలిపారు.

సూర్యాపేట్ నేపథ్యంలో....



● ఈశ్వర్, నైనా

'కొత్తగా మా ప్రయాణం' మూవీ ఫేమ్ ఈశ్వర్ హీరోగా, నైనా సర్వర్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'సూర్యాపేట్ జంక్షన్'. రాజేశ్ నాదెండ్ల దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అభిమన్యు సింగ్ ప్రధాన పాత్ర పోషించారు. అనిల్‌కుమార్ కాట్రగడ్డ, ఎన్. శ్రీనివాసరావు నిర్మించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ట్రైలర్ విడుదల వేడుకలో ఈశ్వర్ మాట్లాడుతూ– ''సూర్యాపేట్ జంక్షన్'కి నేను కథ రాశాను. సూర్యాపేట పరిసరాల్లో జరిగే కథ ఇది. ప్రభుత్వం నుంచి ఉచితాలు తీసుకోవడం వల్ల మధ్య తరగతి ప్రజలు ఎలాంటి ఇబ్బందుల్లో ఇరుక్కుంటున్నారో మా చిత్రంలో చూపిస్తున్నాం'' అన్నారు. ''మా సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. రోషన్ సాలూరి, గౌర హరి మంచి సంగీతం ఇచ్చారు'' అన్నారు అనిల్ కుమార్.

ఓటీటీ ఇది చూడొచ్చు

చూసి తెలుసుకోదగ్గ డాక్యుమెంటరీ

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో బాలీవుడ్ చిత్రం ది రోషన్స్ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



ఈ జీవితమనే చక్రంలో కొందరి వంతు వస్తుంది, కొందరి వంతు ముగుస్తుంది. ముగిసిన వారి జ్ఞాపకాలు మన మనసులో పదిలంగా ఉంటాయి. వారిలో ఎందరో మహానుభావులుంటారు. వారి జ్ఞాపకాలైతే మనం నెమరువేసుకోవచ్చేమో కానీ ఆ కాలంలో వారు పడ్డ కష్టం, ఆనందం కానీ మనకు తెలియవు. అటువంటి వారి జీవిత చక్రానికి వెండి తెర రూపమిస్తే మన ఆనందం అవధులు దాటుతుంది. ఆ కోవకు చెందినదే నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమ్ అవుతున్న 'ది రోషన్స్' టీవీ షో. ఇదో డాక్యుమెంటెడ్ మినీ సిరీస్. ఒకే కుటుంబానికి చెందిన నలుగురి జీవిత చక్రాలకు తెర రూపమే ఈ షో. బాలీవుడ్ దిగ్గజ రోషన్ కుటుంబానికి చెందిన నాటి సంగీత కళాకారులు రోషన్ లాల్ నాగ్రత్ నుండి నేటి తరం నటుడు హృతిక్ రోషన్ వరకు... వారి జీవిత ప్రయాణాన్ని ఎంతో అందంగా చూపించారు ఈ డాక్యుమెంటరీలో. ఓ రకంగా చెప్పాలంటే మనం ఈ షో ద్వారా నాలుగు తరాలు ప్రయాణిస్తాం. ముందుగా రోషన్ కుటుంబం నుండి రోషన్ లాల్ నాగ్రత్ సంగీత ప్రయాణంతో ఈ షో ప్రారంభమై ఆ పై అతని కొడుకు రాజేష్ రోషన్ బాలీవుడ్ ప్రయాణంతో సాగి, ఆ తరువాత ఆయన కొడుకు రాకేశ్ రోషన్ నటనా ప్రయాణంతో పాటు ప్రొడ్యూసర్‌గా ఎలా రాణించారు? అన్నది చూపిస్తూ నేటి తరం కథానాయకుడు హృతిక్ రోషన్ బాలీవుడ్ ప్రయాణంతో షో ముగుస్తుంది. ఈ షో ద్వారా నాటి బాలీవుడ్ సంగీతం నుంచి నేటి తరం సినిమాల వరకు మనకు తెలియని ఎన్నో రహస్యాలతో పాటు హిందీ చిత్ర పరిశ్రమలోని అప్పటి ఒడిదుడుకులను ఇప్పటి పట్టు విడుపులను సవివరంగా చూపించారు. ఈ రోషన్ కుటుంబానికి బాలీవుడ్ పరిశ్రమలో ఉన్న నాటి, నేటి దిగ్గజాలు తమ అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ప్రేక్షకులకు చెప్పడం మరింత బావుంది. అందుకే 'ది రోషన్స్' చూసి నేర్చుకోదగ్గ, తెలుసుకోదగ్గ డాక్యుమెంటరీ. ఇది ప్రతి సినిమా ప్రేక్షకుడు తమ వ్యక్తిగత లైబ్రరీలో భద్రపరుచుకోదగ్గ డాక్యుమెంటెడ్ మినీ సిరీస్. వర్త్‌ఫుల్ టు వాచ్.

– ఇంటూరు హరికృష్ణ


'రాష్ట్రాన్ని దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా తీర్చిదిద్దాలనేది నా స్వప్నం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 22+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 17 | సంచిక: 312


ఆదివారం 2-2-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

మనం.. క్షణం.. జెర్సీ.. ఇలాంటి తెలుగు సినిమా దేన్నైనా చూడండి. సినిమా అటూ ఇటూగా ఉన్నా... చివరి పావుగంట క్లైమాక్స్ అదిరిపోతుంది. అంతే... హిట్ కొట్టేస్తాయి. ప్రధాని నరేంద్ర మోదీ దర్శకత్వంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమర్పించిన '2025-26 బడ్జెట్'దీ ఇదే కాన్సెప్ట్. భగ్గుమంటున్న నిత్యావసరాల ధరలు... నానాటికీ పతనమైపోతున్న రూపాయి... అంతకంతకూ తీవ్రమవుతున్న నిరుద్యోగంపై ఫోకస్ లేదు. గతంలో ఆర్భాటంగా ప్రకటించిన స్మార్ట్ సిటీలు, డిజిటల్ ఇండియా, స్టార్టప్ ఇండియా వంటి పథకాలను అదే స్థాయిలో కొనసాగించడానికి అవసరమైన కేటాయింపులూ లేవు. అయితేనేం! క్లైమాక్స్‌లో 'ఆదాయ పన్ను'ను అద్భుతంగా ప్రజెంట్ చేశారు. ఆదాయ పన్ను మినహాయింపు పరిమితిని ప్రస్తుత 7 లక్షల నుంచి 10 లక్షలకు పెంచుతారంటూ కొన్నాళ్లుగా రకరకాల లీకులు వస్తుండగా... ఈ పరిమితిని ఏకంగా 12 లక్షలకు పెంచి ఊహించని ముగింపునిచ్చారు. ప్రభుత్వ విధానాలను విమర్శించాలన్నా.. ప్రశంసించాలన్నా ప్రధానంగా మధ్యతరగతే కాబట్టి... మోదీ తన ఇంద్రజాలంతో గురిచూసి కొట్టారు. అంతే! బడ్జెట్ ప్రసంగం ముగిసిన క్షణం నుంచీ.. ఆదాయం లేనివారితో సహా దేశమంతా మాట్లాడుకున్నది ఆదాయ పన్ను గురించే!!. సోషల్ మీడియాలో విశ్లేషణల వెల్లువంతా దీనిపైనే. కీలక సమస్యలను ప్రస్తావించకపోయినా... ఎన్నికలు సమీపిస్తున్న బిహార్‌కు రకరకాల వరాలు ప్రకటించినా... క్లైమాక్స్ అదిరింది కాబట్టి ప్రతిపక్షాలు తప్ప అంతా ఆదాయ పన్ను గురించే మాట్లాడారు. మధ్య తరగతి ఉద్యోగులంతా.. తాము లక్కీ భాస్కర్‌లమేనని సంబరపడ్డారు. నిజానికి మోదీ ఈ వేతన జీవులను లక్ష్యించటం ద్వారా అలాంటివారు అత్యధికంగా ఉన్న ఢిల్లీపైనా గురిపెట్టారు. నాలుగు రోజుల్లో ఎన్నికలున్నాయి కనుక... అప్పటిదాకా ఈ మాటలే ఉంటాయి. కాకపోతే ఈ పన్ను మినహాయింపులకు ఏమైనా మెలికలుంటాయా? ఇంకేమైనా షరతులుంటాయా? అనేవన్నీ వచ్చే వారం ప్రవేశపెట్టే కొత్త పన్ను చట్టంలో చూడాల్సిందే. అప్పటికి ఎన్నికలైపోతాయి. అదీ మోదీ లెక్క.

₹12.75 లక్షల వరకూ పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు
(స్టాండర్డ్ డిడక్షన్‌తో కలిపి)

వేతన జీవే.. లక్కీ భాస్కర్..



కీలక సమస్యల ప్రస్తావన లేకపోయినా.. ఆదాయ పన్ను బొనాంజా

- తన దర్శకత్వ ప్రతిభతో క్లైమాక్స్ సీన్‌ను అద్భుతంగా ఆవిష్కరించిన మోదీ
- ధరలు, నిరుద్యోగం, రూపాయి పతనంపై కట్టుదిట్టమైన చర్యలూ లేవు
- డిజిటల్ ఇండియా, స్టార్టప్ ఇండియా, స్మార్ట్ సిటీల ప్రస్తావనా లేదు
- లక్ష్మీ కటాక్షం బిహార్‌కే.. ఢిల్లీ ఎన్నికలపైనా కన్ను

2025-26 బడ్జెట్
పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



బడ్జెట్ స్వరూపం (అంకెలు రూ. కోట్లలో)

మొత్తం బడ్జెట్	రెవెన్యూ వసూళ్లు	రెవెన్యూ వ్యయం	మూలధన వసూళ్లు	మూలధన వ్యయం
50,65,345	34,20,409	39,44,255	16,44,936	11,21,090


ధరలు తగ్గేవి
- విదేశాల నుంచి దిగుమతి చేసుకొనే 36 రకాల ప్రాణాధార ఔషధాలు
- రూ.35 లక్షలకు పైగా విలువైన విదేశీ మోటార్ సైకిళ్లు
- విదేశీ ప్రీమియం కార్లు
- ఆహారం, పానీయాల పరిశ్రమల్లో ఉపయోగించే సింథటిక్ పరిమళ ద్రవ్యాలు
- కొన్ని రకాల నగలు, స్వర్ణకారుల ఉత్పత్తులు
- ఈథర్నెట్ స్విచ్చెస్ (క్యారియర్ గ్రేడ్)
- దిగుమతి చేసుకొనే ఎలక్ట్రానిక్ ఆట వస్తువులు, బొమ్మల విడిభాగాలు

ధరలు పెరిగేవి
- విదేశాల నుంచి దిగుమతి చేసుకొనే ఫ్లాట్ ప్యానెల్ (టచ్ స్క్రీన్) డిస్‌ప్లేలు
- కొన్ని రకాల వస్త్రాలు
- దిగుమతి చేసుకొనే పాదరక్షలు
- స్మార్ట్ మీటర్లు
- సోలార్ సెల్స్
- యంత్రాల్లో ఉపయోగించే టేపర్లు
- పీవీసీ ఫ్లెక్స్ ఫిలింలు, పీవీసీ ఫ్లెక్స్ షీట్లు, పీవీసీ ఫ్లెక్స్ బ్యానర్లు
- దిగుమతి చేసుకొనే యాట్‌లు, కొవ్వొత్తులు



వివరాలు 2,4,6,7,8,9,10,11,12,13లో

ఇది ప్రజల బడ్జెట్: ప్రధాని మోదీ



పొదుపు, పెట్టుబడులు, వినియోగం, అభివృద్ధి వంటి అంశాలకు ఈ బడ్జెట్ ఊతమిస్తుంది. ఇది ప్రజల బడ్జెట్. ప్రతి భారతీయుడి కలలను నెరవేరుస్తుంది. సాధారణంగా ప్రభుత్వ ఆదాయాన్ని పెంచేలా బడ్జెట్‌లు ఉంటాయి. ఈసారి అందుకు భిన్నంగా ప్రజల చేతుల్లో డబ్బులు ఎక్కువ చలామణీ అయ్యేలా ఆర్థిక మంత్రి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.

బుల్లెట్ గాయాలకు బ్యాండ్ ఎయిడ్ వేసినట్టుంది..



బుల్లెట్ గాయాలకు బ్యాండ్ ఎయిడ్ వేసినట్లుగా ఈ బడ్జెట్ ఉంది. కేంద్రానివి దివాళాకోరు ఆలోచనలు. సంక్షోభంలో ఉన్న దేశ ఆర్థిక రంగాన్ని గాడిలో పెట్టడానికి తగిన చర్యలేవీ లేవు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం మరోసారి అన్ని వర్గాలను మోసం చేసింది.

- రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అగ్రనేత



రైల్వేలకు పాత పద్దే!

- రూ.2.52 లక్షల కోట్ల బడ్జెట్ కేటాయింపు
- రెవెన్యూ అంచనా రూ.3,02,100 కోట్లు
- మరో 200 వందేభారత్ రైళ్లు తెస్తాం
- రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి

8లో



కేంద్ర బడ్జెట్‌పై ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో చర్చిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు సీతక్క, కొండా సురేఖ, తుమ్మల, కోమటిరెడ్డి, దామోదర రాజనర్సింహ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి, శ్రీధర్‌బాబు, పొంగులేటి

కేంద్ర బడ్జెట్‌పై సీఎం అసంతృప్తి!

రాష్ట్ర ప్రతిపాదనలు, బడ్జెట్ కేటాయింపులపై ఆర్థికశాఖ అధికారులతో సమీక్ష

11లో

- అధికారులు, మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం
- బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై లేఖ రాసే యోచన
- రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ రూపకల్పనపైనా చర్చ

ఓం.. భీమ్ తుస్..



రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలను పట్టించుకోని కేంద్రం

రూ.1.65 లక్షల కోట్లు ఇవ్వాలని కోరినా.. బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా ప్రత్యేక కేటాయింపు లేని తీరు

11లో

- ట్రిపుల్ ఆర్, మెట్రో రైలు, ఫ్యూచర్ సిటీ, రేడియల్ రోడ్లు, ఐఐఎంల ఊసెత్తని నిర్మలమ్మ
- గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు, హైవే.. సీవరేజీ.. డ్రైనేజీ.. అన్ని వినతులూ హుళక్కే
- పన్నుల వాటాలో స్వల్ప పెరుగుదల.. మౌలిక వసతుల్లో భాగంగానే రాష్ట్రానికి నిధులు



చిల్లిగవ్వ కూడా తేలేదు

తెలంగాణకు చిల్లిగవ్వ కూడా తేలేకపోయిన సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రులు, రాష్ట్రం నుంచి ఎన్నికైన కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు క్షమాపణలు చెప్పాలి. రాష్ట్రం నుంచి 8 మంది బీజేపీ ఎంపీలు గెలిచి, అందులో ఇద్దరు కేంద్ర మంత్రులున్నా తెలంగాణకు నయాపైసా తేలేదు.

- కేటీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

ఇదం జగత్




ఎన్నికలప్పుడు బడ్జెట్ వస్తే ఆ రాష్ట్రాలకు వచ్చే కిక్కేవేరు!

గచ్చిబౌలిలో కాల్పుల కలకలం



- ప్రిజం పబ్‌లో పోలీసులపై పాత నేరస్తుడు బత్తుల ప్రభాకర్ కాల్పులు
- మాదాపూర్ సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ వెంకట్‌రెడ్డికి బుల్లెట్ గాయం
- ప్రభాకర్ పారిపోతుండగా చుట్టుముట్టి పట్టుకున్న పోలీసులు

20లో





డాక్టర్. అందె సత్యం
ఆర్థిక విశ్లేషకుడు

కేంద్ర బడ్జెట్ చిన్నచిన్న విషయాల్లో సానుకూలంగా ఉన్నా విధానాల విషయంలో మాత్రం ప్రైవేటీకరణకు మొగ్గు చూపేలా ఉంది. ఎల్ఐసీ, గనుల ప్రైవేటీకరణ, అణుశక్తి మిషన్‌లోకి ప్రైవేటు వ్యక్తుల ప్రవేశానికి అవకాశం కల్పించడం, పెట్టుబడుల ఉపసంహరణ, వైద్య, విద్యారంగాల్లో ప్రైవేటు వ్యవస్థను మరింతగా ప్రోత్సహించడం లాంటి చర్యలకు కేంద్రం పూనుకోనుంది.

EXPERT OPINION



ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, పేదరికం వంటి సమస్యలతో దేశప్రజలు ఇబ్బంది పడుతుంటే బడ్జెట్‌తో ప్రజలను మోసగించే యత్నం చేశారు. పదేళ్లలో మధ్యతరగతి నుంచి రూ.54.18 లక్షల కోట్లను ఆదాయపు పన్నుకింద వసూలు చేసి, ఇప్పుడు రూ.12 లక్షలు సంపాదించే వారికి మినహాయింపులు ఇస్తోంది.

-- ఖర్గే, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు



వరుసగా 8వసారి

దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్' అన్న గురజాడ హితోక్తే మా సర్కారుకు స్ఫూర్తి

జీవకోటి వానల కోసం ఎదురు చూసినట్టే పౌరులు సుపరిపాలనను అభిలషిస్తారన్న తిరుక్కురళ్ హితవును పన్ను విధానాల రూపకల్పనలో దృష్టిలో ఉంచుకున్నాం

ఇది సామాన్యుల బడ్జెట్. 2047 నాటికి వికసిత భారత్ కలను సాకారం చేసుకునే దిశగా ఇదో పెద్ద ముందడుగు

- బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



ఇది ప్రజల బడ్జెట్: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. ప్రజల బడ్జెట్‌గా అభివర్ణించారు. ఇది ప్రతి భారతీయుడి కలలను నెరవేరుస్తుందని అన్నారు. బడ్జెట్‌లో తీసుకున్న చర్యలవల్ల ప్రజల మధ్య మరింత డబ్బు చలామణి అవుతుందని, ఆయా రంగాల్లో పెట్టుబడులకు ఊతం ఇస్తుందని, ఇది దేశ అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. మరిన్ని రంగాల్లో యువతకు అవకాశాలు కల్పిస్తున్నామని, దీని ద్వారా 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని ముందుకు తీసుకువెళ్లవచ్చని అన్నారు. పొదుపు, పెట్టుబడులు, వినియోగం, అభివృద్ధి వంటి అంశాలకు ఈ బడ్జెట్ ఊతం కల్పిస్తుందని చెప్పారు. దేశాభివృద్ధికి దోహదపడేలా బడ్జెట్‌ను రూపొందించినందుకు ఆర్థిక మంత్రి నిర్మలతోపాటు దీని రూపకల్పనలో పాలుపంచుకున్న ఆర్థిక శాఖ బృందాన్ని ప్రధాని అభినందించారు. సాధారణంగా ప్రభుత్వ ఆదాయాన్ని పెంచేలా బడ్జెట్‌లు ఉంటాయని, కానీ ఈ సారి అందుకు భిన్నంగా ప్రజల చేతుల్లో డబ్బులు ఎక్కువ చెలామణి అయ్యేలా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని కొనియాడారు.

పంచరంగుల చిత్రం

2025-26 కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన నిర్మలా సీతారామన్

2047 కల్లా వికసిత భారతే లక్ష్యం	పది రంగాల్లో ప్రగతిపై ప్రత్యేక దృష్టి	సాగు, ఎంఎస్ఎంఈ, పెట్టుబడులే గ్రోత్ ఇంజన్లు	ఆర్థికం సహా ఆరు కీలక రంగాల్లో భారీ సంస్కరణలు	వేతన జీవులపై అనూహ్య కరుణ

గమ్యస్థానం: వికసిత భారత్
దారిదీపం: సమష్టి కృషి
ఇంధనం: కొత్త తరం సంస్కరణలు

స్థూలంగా చెప్పాలంటే 2025-25 కేంద్ర బడ్జెట్లో నిర్మలమ్మ ఆవిష్కరించిన పంచ రంగుల చిత్రం సారాంశమిదే! మధ్య తరగతి కొనుగోలు శక్తిని, తద్వారా అంతిమంగా ఆర్థిక వృద్ధి రేటును ఇతోధికంగా పెంచడం, ప్రైవేట్ రంగంలో పెట్టుబడులను విస్తృతపరచడమనే మోదీ ప్రభుత్వ లక్ష్యాలను బడ్జెట్లో ఘనంగానే ఆవిష్కరించారు విత్త మంత్రి. ''ఇది సామాన్యుల బడ్జెట్. 2047 నాటికి వికసిత భారత్ కల సాకారం దిశగా ఇదో పెద్ద ముందడుగు'' అని చెప్పుకున్నారు. పౌరులందరి ప్రగతే (సబ్ కా వికాస్) లక్ష్యంగా పలు పథకాలను, చర్యలను ప్రతిపాదించారు. 'దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్' అన్న తెలుగువారి అడుగుజాడ గురజాడ పంక్తులతో ప్రసంగం మొదలు పెట్టారు. 'పేదరికం లేని సమాజం, అందరికీ అందుబాటులో ఉండే నాణ్యమైన, పాఠశాల విద్య, వైద్య సదుపాయాలు, నైపుణ్యంతో కూడిన కార్మిక శక్తి-వారికి మెరుగైన ఉపాధి, మహిళల్లో కనీసం 70 శాతం మందికి ఆర్థిక కార్యకలాపాల్లో భాగస్వామ్యం, భారత్‌ను ప్రపంచ ఆహార పాత్రగా తీర్చిదిద్దేలా రైతన్నకు వెన్నుదన్నుగా నిలవడం' తమ ప్రభుత్వ లక్ష్యాలని పేర్కొన్నారు. వాటి సాధనకు 'ఆర్థిక వృద్ధి-ఉత్పాదకత, గ్రామీణ స్వావలంబన, వృద్ధి పథంలో సమష్టి అడుగులు, మేకిన్ ఇండియా ద్వారా నిర్మాణ రంగానికి పెద్దపీట, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు మరింత తోడ్పాటు, ఉద్యోగిత ఆధారిత వృద్ధి, మానవ వనరులపై భారీ పెట్టుబడులు, రక్షిత ఇంధన సరఫరాలు, ఎగుమతులు, ఇన్నోవేషన్లకు ఇతోధిక ప్రోత్సాహం'... ఇలా పది రంగాలపై ప్రధానంగా దృష్టి సారించనున్నట్టు ప్రకటించారు. ఈ ప్రస్థానంలో వ్యవసాయం, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, పెట్టుబడులు, ఎగుమతులను నాలుగు ప్రధాన చోదక శక్తులుగా పేర్కొన్నారు. పన్నులు, ఇంధన, పట్టణాభివృద్ధి, గనులు, ఆర్థికం, నియంత్రణ... ఈ ఆరు కీలక రంగాల్లో వచ్చే ఐదేళ్ల పరిధిలో భారీ సంస్కరణలను ప్రతిపాదించారు. కాకపోతే లక్ష్యాలను ఘనంగా విధించుకున్న మంత్రి, వాటి సాధనకు ఏం చేయనున్నారనేది మాత్రం ఇదమిత్థంగా చెప్పకుండా పైపై ప్రస్తావనలతోనే సరిపెట్టారు. వేతనజీవికి వ్యక్తిగత వార్షిక ఆదాయపన్ను మినహాయింపు పరిమితిని ఏకంగా రూ.12 లక్షలకు పెంచేశారు. తద్వారా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మధ్య తరగతిని ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. కొత్త ఆదాయ పన్ను బిల్లును వారంలో ప్రవేశపెడతామని తెలిపారు. పన్నుల రంగంలో భారీ సంస్కరణలకు తెర తీస్తున్నట్టు మంత్రి ప్రకటించారు. మోదీ సర్కారు మానస పుత్రికలైన స్టార్టప్‌లు, డిజిటల్ ఇండియా తదితరాలకు నామమాత్రపు కేటాయింపులతోనే సరిపెట్టారు.



లోక్‌సభలో బడ్జెట్ ప్రవేశపెడుతున్న నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ:

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం 2025-26 కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. రూ.50,65,345 కోట్లతో కూడిన పద్దును పార్లమెంటుకు సమర్పించారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ద్రవ్య లోటు 4.4 శాతం ఉండొచ్చని మంత్రి జోస్యం చెప్పారు. జీడీపీ వృద్ధి రేటు 6.3 శాతానికే పరిమితం కావచ్చన్న అంచనాల నేపథ్యంలో సంక్షేమాన్ని, సంస్కరణలను పరుగులు పెట్టించేలా పలు చర్యలను ప్రతిపాదించారు. 74 నిమిషాల బడ్జెట్ ప్రసంగంలో ఆమె ఏమేం చెప్పారంటే...

పరిశ్రమలకు మహర్దశ

సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ)ల్లో పెట్టుబడులను రెట్టింపునకు పైగా పెంచనున్నట్టు మంత్రి వివరించారు. ''ప్రస్తుతం కోటికి పైగా ఎంఎస్ఎంఈల ద్వారా 7.5 కోట్ల మందికి పైగా ఉపాధి పొందుతున్నారు. వాటికి ఐదేళ్లలో రూ.1.5 లక్షల కోట్లకు పైగా రుణ సదుపాయం అందనుంది. సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలకు రుణ పరిమితి రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్లకు, స్టార్టప్‌లకు రూ.10 కోట్ల నుంచి రూ.20 కోట్లకు పెరగనుంది. తయారీ రంగంలో మేకిన్ ఇండియాకు మరింత ప్రాధాన్యం దక్కనుంది'' అని చెప్పారు.

చదువుకు జేజే

ఈ ఏడాది మెడికల్ కాలేజీలు, బోధనాసుపత్రుల్లో 10 వేల అదనపు సీట్లు, ఐఐటీల్లో కనీసం 6,500 అదనపు సీట్లు అందుబాటులోకి రానున్నట్టు విత్త మంత్రి ప్రకటించారు. ''రూ.500 కోట్లతో సాగు, ఆరోగ్యం తదితర రంగాల్లో కృత్రిమ మేధలో సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటవుతాయి. భారత్‌నెట్ ప్రాజెక్టు కింద గ్రామీణ ప్రభుత్వ పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలన్నింటికీ బ్రాడ్‌బ్యాండ్ సౌకర్యం అందుబాటులోకి తేనున్నాం. బాలల్లో శాస్త్రీయ జిజ్ఞాసను పెంపొందించేందుకు సర్కారీ స్కూళ్లలో వచ్చే ఐదేళ్లలో 50 వేల అటల్ టింకరింగ్ ల్యాబులు ఏర్పాటవుతాయి. 'భారతీయ భాషా పుస్తక్' పథకంతో స్థానిక భాషల్లోని ప్రభుత్వ పాఠ్య పుస్తకాలన్నీ డిజిటల్ రూపంలో అందుబాటులోకి వస్తాయి'' అని తెలిపారు.

సాగుకు పట్టం...

వ్యవసాయ రంగానికి పట్టం కట్టేందుకు మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందని నిర్మల ప్రకటించారు. ''7.7 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూర్చేలా కిసాన్ క్రెడిట్ కార్డుల పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచుతున్నాం. అసోంలో 12.7 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యంలో భారీ యూరియా ప్లాంటు ఏర్పాటవనుంది. వ్యవసాయోత్పత్తి, నిల్వ సామర్థ్యం పెంపు తదితర లక్ష్యాలతో రాష్ట్రాల భాగస్వామ్యంతో 100 జిల్లాల్లో ప్రధానమంత్రి ధనధాన్య కృషీ యోజన అమలవనుంది. రూరల్ ప్రాస్పరిటీ అండ్ రెజీలియన్స్ పథకంతో ఈ పథకంతో గ్రామీణ మహిళలు, యువ రైతులు, చిన్న, సన్నకారు రైతులకు బాగా లబ్ధి చేకూరుతుంది. వంట నూనెల ఉత్పత్తి తృణధాన్యాల సాగులో ఆత్మనిర్భరత సాధనకు ప్రాధాన్యమిస్తున్నాం. కూరగాయ లు, పళ్ల సాగుకు సమగ్ర పథకం తేనున్నాం. జన్యు బ్యాంకుల ద్వారా విత్తన నిల్వ సా మర్థ్యం పెంపొందిస్తాం'' అని వివరించారు.

పట్టణాలకు ప్రాధాన్యం

పట్టణాలను గ్రోత్ హబ్‌లుగా తీర్చిదిద్దడానికి రూ.లక్ష కోట్లతో అర్బన్ చాలెంజ్ ఫండ్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇందులో భాగంగా అమలు చేసే ప్రతి పథకంలోనూ నాలుగో వంతు నిధులను కేంద్రం అందజేస్తుంది. 2047 కల్లా కనీసం 100 గిగావాట్ల అణు విద్యుదుత్పత్తే లక్ష్యంగా న్యూక్లియర్ ఎనర్జీ మిషన్ ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు.

మెడికల్ టూరిజానికి ఊపు

మెడికల్ టూరిజంలో భాగంగా రూ.20 వేల కోట్లతో 'హీల్ ఇన్ ఇండియా' పథకాన్ని ప్రకటించారు. దేశవ్యాప్తంగా మరో 50 పర్యాటక ప్రాంతాలను స్థానిక ఉపాధి కేంద్రాలుగా తీర్చిదిద్దుతామన్నారు. మరో 120 పట్టణాలను ఉడాన్ పథకం పరిధిలోకి తేవడం ద్వారా వచ్చే పదేళ్లలో మరో 4 కోట్ల మందికి విమాన ప్రయాణాన్ని అందుబాటులోకి తెస్తామని మంత్రి చెప్పారు. అంతర్జాతీయ వాణిజ్యానికి సంబంధించి సింగిల్ విండో సదుపాయంగా 'భారత్ ట్రేడ్‌నెట్'ను అందుబాటులోకి తెస్తామన్నారు.



అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను తీర్చిదిద్దడంలో ప్రధాని మోదీ విజన్‌కు ఈ బడ్జెట్ అద్దం పడుతోంది. ప్రధాని ఆలోచనంతా మధ్యతరగతి ప్రజల బాగోగులపైనే. రైతులు మొదలుకొని మధ్యతరగతి ప్రజల వరకు.. అన్ని వర్గాల సంక్షేమంపై ఈ బడ్జెట్ దృష్టిపెట్టింది.

-- అమిత్‌షా, కేంద్ర హోం మంత్రి




బిహార్ అభివృద్ధికి ఈ బడ్జెట్ ఎంతగానో తోడ్పాటునందిస్తుంది. మఖానా బోర్డ్ ఏర్పాటు, గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాలు.. రాష్ట్ర భవిష్యత్ అవసరాలను తీరుస్తాయి. పట్నా ఐఐటీని విస్తరించాలన్న నిర్ణయం వల్ల రాష్ట్రంలో సాంకేతిక విద్యకు ఊతం లభిస్తుంది.

-- నితీశ్‌కుమార్, బిహార్ సీఎం



కోటీశ్వరులకు రుణాలు మాఫీ చేసే విధానానికి స్వస్తి చెప్పి, అలా ఆదాచేసిన డబ్బులను మధ్యతరగతి ప్రజలు, రైతుల సంక్షేమానికి వాడాలని నేను చేసిన సూచనను బడ్జెట్‌లో పరిగణనలోకి తీసుకోకపోవడం నిరుత్సాహపరిచింది. కోటీశ్వరుల రుణమాఫీ కింద పెద్ద ఎత్తున ప్రజాధనాన్ని వెచ్చించడం సరికాదు.

-- కేజ్రీవాల్, ఆప్ జాతీయ కన్వీనర్



బడ్జెట్‌లో అంకెలకన్నా, కుంభమేళాలో జరిగిన తొక్కిసలాటలో ఎంత మంది మరణించారు, ఎంత మంది గల్లంతు అయ్యారన్న విషయమే నాకు ముఖ్యం. తొక్కిసలాటలో ఎంతమంది మరణించారన్న విషయాన్ని ప్రభుత్వం చెప్పలేకపోతోంది. బాధితులు ఇంకా తమ కుటుంబ సభ్యులకోసం వెతుక్కుంటున్నారు.

-- అఖిలేశ్ యాదవ్, ఎస్పీ అధినేత




రాష్ట్రాలకు 1.5 లక్షల కోట్ల వడ్డీ రహిత రుణాలు

న్యూఢిల్లీ: మౌలిక వసతుల కల్పనలో రాష్ట్రాలకు మద్దతుగా నిలిచేందుకు కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ కీలక ప్రకటన చేశారు. వడ్డీ లేకుండా రాష్ట్రాలకు రూ.1.5 లక్షల కోట్ల రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. 50 ఏళ్ల కాలానికి వడ్డీ లేకుండా ఈ రుణాలు కేంద్రం ఇస్తుంది. ఈ నిధులను వివిధ రంగాల్లో మౌలిక వసతుల కల్పన కోసం ఖర్చుచేయాల్సి ఉంటుంది. దేశంలో మౌలిక వసతుల ప్రాజెక్టులను ప్రోత్సహించేందుకు కేంద్రం 2021లో మొదటి అసెట్ మానిటైజేషన్ వ్యూహాన్ని ప్రకటించింది. తాజా బడ్జెట్‌లో 2025-30 కాలానికి సంబంధించి రెండో అసెట్ మానిటైజేషన్ ప్లాన్‌ను ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ ప్లాన్‌లో భాగంగా మౌలిక వసతుల ప్రాజెక్టులకు రూ.10 లక్షల కోట్ల మూలధన సహకారం అందిస్తారు. ఇండియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్ ఫండ్ మద్దతుతో రాష్ట్రాలను కూడా ప్రోత్సహిస్తామని మంత్రి తెలిపారు.


బడ్జెట్ హైలైట్స్

- కొత్త పన్నువిధానంలో రూ.12 లక్షల వరకు వ్యక్తిగత ఆదాయపు పన్ను ఉండదు. వేతన జీవులకు రూ.75వేల స్టాండర్డ్ డిడక్షన్‌తో కలిపి రూ.12.75 లక్షల వరకు పరిమితి ఉంటుంది. దీంతో ప్రభుత్వానికి రూ.లక్ష కోట్ల రెవెన్యూ తగ్గిపోతుంది.
- ఏడు టారిఫ్ రేట్ల తొలగింపు
- 82 టారిఫ్ లైన్లపై ఉన్న సామాజిక సంక్షేమ సర్‌చార్జి రద్దు.
- అప్పుల ద్వారా ఆదాయం రూ. 34.96 లక్షల కోట్లు, మొత్తం వ్యయం రూ.50.65 లక్షల కోట్లు
- జీడీపీ రెవెన్యూ లోటు 4.4 శాతం
- రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ప్రధాన్‌మంత్రి ధన్ ధాన్య యోజనకృషి యోజన ఏర్పాటు. దేశవ్యాప్తంగా 100 జిల్లాల్లోని 1.7 కోట్ల మంది రైతులకు ప్రయోజనం
- కంది, మినుములు, పెసర రైతుల ప్రోత్సాహకం కోసం పప్పుధాన్యాల ఆత్మనిర్భర మిషన్ ఏర్పాటు. దీనిద్వారా నాఫెడ్, ఎన్‌సీసీఎఫ్‌లు రైతులనుంచి వచ్చే నాలుగేళ్లలో పప్పుధాన్యాలను సేకరిస్తాయి.
- కూరగాయలు, పండ్లు పండించే రైతుల కోసం సమగ్ర పథకం
- మఖానా విత్తనాల ఉత్పత్తిని పెంచేందుకు బిహార్‌లో మఖానా బోర్డు స్థాపన. అస్సాంలో ఏడాదికి 12.7 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఉత్పత్తిచేసే యూరియా ప్లాంట్.



ఇదీ బడ్జెట్ సమగ్ర స్వరూపం (అంకెలు రూ.కోట్లలో)

అంశం	2023-24 వాస్తవ గణాంకాలు	2024-2025 బడ్జెట్ అంచనాలు	2024-2025 వాస్తవ (ప్రాథమిక) గణాంకాలు	2025-2026 బడ్జెట్ అంచనాలు
1. రెవెన్యూ వసూళ్లు	27,29,036	31,29,200	30,87,960	34,20,409
• పన్ను ఆదాయం	23,27,251	25,83,499	25,56,960	28,37,409
• పన్నేతర ఆదాయం	4,01,785	5,45,701	5,31,000	5,83,000
2. మూలధన వసూళ్లు	17,14,411	16,91,312	16,28,527	16,44,936
• రుణాల రికవరీ	26,646	28,000	26,000	29,000
• ఇతర వసూళ్లు	33,122	50,000	33,000	47,000
• రుణాలు	16,54,643	16,13,312	15,69,527	15,68,936
మొత్తం ఆదాయం (1+2)	44,43,447	48,20,512	47,16,487	50,65,345
మొత్తం వ్యయం (3+6)	44,43,447	48,20,512	47,16,487	50,65,345
3. రెవెన్యూ పద్దు	34,94,252	37,09,401	36,98,058	39,44,255
4. వడ్డీ చెల్లింపులు	10,63,872	11,62,940	11,37,940	12,76,338
5. మూలధన ఆస్తుల కోసం కేటాయించిన గ్రాంట్లు	3,03,916	3,90,778	2,99,891	4,27,192
6. మూలధన పద్దు	9,49,195	11,11,111	10,18,429	11,21,090
నికర మూలధన వ్యయం (5+6)	12,53,111	15,01,889	13,18,320	15,48,282
7. రెవెన్యూ లోటు (3-1)	7,65,216	5,80,201	6,10,098	5,23,846
8. నికర రెవెన్యూ లోటు (7-5)	4,61,300	1,89,423	3,10,207	96,654
9. ద్రవ్య లోటు	16,54,643	16,13,312	15,69,527	15,68,936
10. ప్రాథమిక లోటు	5,90,771	4,50,372	4,31,587	2,92,598



Kia Syros
Evolved by the future

The new Kia Syros is light years ahead of its contemporary SUVs. Right from an evolved design language with upright squared shoulders, to the future-forward autonomous safety tech and future-ready connected car tech with Over-the-Air (OTA) updates, everything about the Kia Syros is a giant leap in automotive thinking. Settle into the first-in-segment 2nd row ventilated, reclining & sliding seats, and you'll agree that the future itself has evolved it. Experience the Syros today!

Innovative Technology Future, reimagined


Dual Pane Panoramic Sunroof



2nd Row Seat Reclining & Sliding with Seat Ventilation



76.20 cm (30") Trinity Panoramic Display Panel



Kia Connect 2.0** with Over-the-Air (OTA) Software Updates and Other 80+ Connected Car Features


Harman Kardon Premium 8 Speakers Sound System


ADAS Level 2^ with 16 Smart Autonomous & Robust 20 Standard Safety Features



Kia Service
Connected · Adaptive · Responsive · Engage

Introducing My Convenience Secure#: Option to cover your car's wear and tear parts for up to 3 years from date of delivery.

3 Years Unlimited km Warranty	Extended Warranty^ Up to 5 Years	Scratch Care Program``	IoT Based Smart Services``	24x7 | 3 Years Nationwide RSA°

Kia Connect Diagnosis## Enables vehicle diagnosis remotely

Terms & Conditions Apply. *Ex-showroom price all India. Segment is defined as vehicle with length between 3 990 mm – 3 999 mm and height - 1 680 mm. **Kia Connect 2.0 comes with 3 years free subscription. Kia Connect 2.0 features may vary depending on the variant, device compatibility, software and network availability in vehicle. ^Advanced Driver Assistance System (ADAS) is not a substitute for human eye and driver vigilance. It is an assistance feature that enhances driving experience and safety. Effectiveness of ADAS may vary based on actual situation and all objects around vehicle may not be detected. The driver shall remain responsible for safe, vigilant, and attentive driving. #My Convenience Secure available with My Convenience/ My Convenience Plus at the time of sales at additional cost, covers wear and tear of selected parts only. ^3 Years standard warranty and 2 years extended warranty. ``Scratch Care Program coverage includes repair of 1 scratch free of cost in an ownership period of 12 months from the date of sale, applicable on the new Syros retailed up to 30th June 2025. ``IoT based workshops for live vehicle tracking for digital experience. °Upto 6 years extendable RSA coverage. Applicable across India except Andaman & Nicobar Islands and Lakshadweep. ##Kia Connect Diagnosis has limited set of functionalities. Customers may be required to visit Kia workshop for issue resolution. The product & feature images shown in this brochure is for representation purpose only. Features and specifications as shown may not be part of standard fitment and may vary. The colors shown are subject to availability and may not be available across all variants and may differ slightly from those shown in this brochure. The specifications and features may vary depending on models/ variants. Kia India Pvt. Ltd. (Formerly known as Kia Motors India Private Limited) reserves the right to make any changes with respect to the trims, colors, specifications, Kia Connect 2.0 features and other details of any model as mentioned or to discontinue any model without prior notice. For more details visit your local Kia dealership. Kia India Pvt. Ltd. urges you to follow traffic rules, these are meant to keep you safe on roads. We do not endorse vandalism or illegal activities related to road safety. Safety is a top priority, and we urge responsible behavior regarding traffic regulations and road safety.

FOR INFORMATION CONTACT: TELANGANA: HYDERABAD: **AUTOMOTIVE KIA**, KONDAPUR, PH: 7995699908, NAGOLE, PH: 7995999404, RC PURAM, PH: PH: 6309908117, AS RAO NAGAR, PH: 6309908118, **CAR KIA**, FINANCIAL DISTRICT, PH: 7330888041, JUBILEE HILLS, PH: 7997858880, GACHIBOWLI: PH: 7799906846, **MALIK KIA**, KUKATPALLY, PH: 7399346666, HIMAYATHNAGAR, PH: 7995999340, **PROSPERA KIA**, MALAKPET, PH: 08047361555, **LANDMARK KIA**, MEDIPALLY, PH: 9281428303, BOWENPALLY, PH: 9347997583, KARIMNAGAR: **MALIK KIA**, PH: 7730911111, KHAMMAM: **AUTOMOTIVE KIA**, PH: 6309908189, MAHBUBNAGAR: **AUTOMOTIVE KIA**, PH: 6309908110, NALGONDA: **AUTOMOTIVE KIA**, PH: 6309908183, NIZAMABAD: **SUNRISE KIA**, PH: 7995939995, SECUNDERABAD: **AUTOMOTIVE KIA**, PH: 7995999146, WARANGAL: **MALIK KIA**, PH: 9703433333, MANCHERIAL: **SUNRISE KIA**, PH: 7416662030, ANDHRA PRADESH: ANANTAPUR: **MGB KIA**, PH: 8333929195, BHIMAVARAM: **SIMHA KIA**, PH: 8688836542, CUDDAPPAHA: **HOSHI KIA**, PH: 9100773485, GUNTUR: **SIMHA KIA**, PH: 8688836566, KAKINADA: **KANTIPUDI KIA**, PH: 7799740208, KURNOOL: **MGB KIA**, PH: 8500963906, NELLORE: **HOSHI KIA**, PH: 8688829718, RAJAHMUNDRY: **KANTIPUDI KIA**, PH: 7799740208, TIRUPATI: **HOSHI KIA**, PH: 8688829739, VIJAYAWADA: **CASA KIA**, PH: 8345959595, **SIMHA KIA**, PH: 8688836501, VISHAKHAPATNAM: **LAKSHMI KIA**, PH: 7997815777, ONGOLE: **SIMHA KIA**: KUNCHANAPALLI, PH: 7799981582, **SANKAR KIA**, PH: 88866624966

INNOCEAN-006/25



ఏపీకి మొండిచెయ్యేనా?



జైరామ్ రమేశ్
రాజ్యసభ సభ్యుడు

చూస్తుంటే బిహార్‌కు బడ్జెట్‌లో పెద్ద వాటానే దక్కింది. ఈ ఏడాది చివర అక్కడ ఎన్నికలు ఉన్నాయి కాబట్టి అది సహజమే. కానీ ఎన్డీయేకు ఇంకో స్తంభం అయిన ఆంధ్రప్రదేశ్ ఎందుకు అంత దారుణ విస్మరణకు గురైంది?


విశ్వాసం కల్పిస్తోంది!



కిరణ్ మజుందార్ షా
వ్యాపారవేత్త

సుస్థిర, సమ్మిళిత ఆర్థిక వృద్ధి సాధన దిశగా ఇండియా సరైన రంగాల్లో పెట్టుబడులు పెడుతోందని 2025-26 ఆర్థిక సంవత్సర కేంద్ర బడ్జెట్ విశ్వాసం కల్పిస్తోంది.

పంచి పెట్టడమే!



ఎస్.వై.ఖురేషీ
కేంద్ర మాజీ సీఈసీ

కోట్ ఆఫ్ ద డే: 'బడ్జెట్ అనేది పనిచేసేవాళ్ల నుంచి ఓటు వేసే వారికి డబ్బు పంపిణీ జరిగే అత్యుత్తమ ప్రజాస్వామిక ప్రక్రియ.'

ముఖ్యమైన బడ్జెట్



ఇండియాలో ఇప్పుడున్న స్థితిగతులను చూస్తే, 1991 తర్వాత బహుశా ఇది అత్యంత ప్రాధాన్యం కలిగిన బడ్జెట్.

– హిందోళ్ సేన్ గుప్తా, ప్రొఫెసర్

మీమ్స్ ఆగేనా?



పాపం ఇప్పటికైనా నిర్మలా సీతారామన్ మీద సోషల్ మీడియాలో మీమ్స్ ఆగుతాయా? ఆదాయ పన్ను పరిమితిని 12 లక్షలకు పెంచడం ద్వారా ఆమె ఇప్పటివరకూ అత్యంత సాహసోపేత ఆర్థిక మంత్రిగా నిలిచారు.

– మోనికా వర్మ, పరిశోధకురాలు

ఇలా చెల్లించాలి!



ఒక వివరణ. 12 లక్షల వరకూ ఆదాయ పన్ను లేదు. కానీ అంతకంటే ఎక్కువ సంపాదిస్తే 4 లక్షల నుంచి శ్లాబు రేట్లలో పన్ను ఉంటుంది. అంటే, ఏటా 25 లక్షలు సంపాదించే వారికి మొదటి 12 లక్షలకు మినహాయింపు ఉండదు. కేవలం 4 లక్షలకే మినహాయింపు. 4 లక్షల నుంచి శ్లాబు రేట్ల ప్రకారం పన్ను కట్టాల్సిందే!

– సుమంత్ రామన్, టీవీ హోస్ట్

వాళ్లు మంచివాళ్లు



ఇదోసారి ఆలోచించాలి. 12 లక్షల కంటే తక్కువ సంపాదించేవారు సున్నా పన్ను కడతారు. కానీ బడ్జెట్ అంచనాల్లో ఆదాయ పన్ను రాబడులను 14,38,000 కోట్లుగా చూపారు. అది మొత్తం రాబడుల్లో 22 శాతం. ఇది కార్పొరేట్ పన్ను కంటే ఎక్కువ. జీఎస్టీ, కస్టమ్స్ కంటే ఎక్కువ. అంటే, ఎంతమంది ఏటా 12 లక్షల కంటే ఎక్కువ సంపాదిస్తున్నారు? ఈ చిన్న సంఖ్యే దేశ నిర్మాణంలో పావు వంతుకు తోడ్పడుతున్నట్టు! వాళ్లు మంచివాళ్లు. అయితే, ఈ పన్నుల నుంచి తప్పించుకునేవాళ్లను వెతకడమే తర్వాత చేయాల్సింది!

– విక్రమ్ చంద్ర, జర్నలిస్ట్

మానవాభివృద్ధి దిశగా!

అభిప్రాయం



డా॥ తమ్మా కోటిరెడ్డి

2025-26 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర బడ్జెట్‌ను ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టారు. వ్యవసాయం; సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా సంస్థలు; పెట్టుబడి, ఎగుమతుల అభివృద్ధిని వేగవంతం చేయడం, సమ్మిళిత సాధన, ప్రైవేటు రంగ పెట్టుబడులను ప్రోత్సహించడం, మధ్యతరగతి ప్రజల వినియోగ వ్యయ సామర్థ్యం పెంపు లాంటి లక్ష్యాల సాధన 'వికసిత్ భారత్' ఆకాంక్షలుగా ఆర్థిక మంత్రి అభివర్ణించారు. నూతన పన్ను వ్యవస్థలో భాగంగా ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితి పెంపు వల్ల ప్రజల వ్యయార్హ ఆదాయాలు పెరిగి, కుటుంబ వినియోగ వ్యయం పెరుగుతుంది. తద్వారా దేశంలో సమష్టి డిమాండ్ పెరిగి, ఆర్థికాభివృద్ధి వేగవంతం అవుతుంది.

బీమా రంగంలో వంద శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు అనుమతించడం ఆహ్వానించదగిన పరిణామం. ఈ చర్య ఆరోగ్య బీమా రంగంపై దీర్ఘకాల ప్రభావాన్ని కలుగజేస్తుంది. బీమా రంగంలో పెట్టుబడులు పెరగడంతో పాటు పోటీతత్వం పెరిగి బీమా పాలసీల రూపకల్పన, సేవల డెలివరీలో నవకల్పనలు చోటుచేసుకుంటాయి. తద్వారా వ్యక్తులు, కుటుంబాలు తమ ఆరోగ్య సంరక్షణ వ్యయాన్ని సక్రమంగా నిర్వహించుకోవడం ద్వారా నాణ్యతతో కూడిన ఆరోగ్య సేవలను పొందగలుగుతారు. ఆర్థిక సేవల అందుబాటు దేశంలో మానవాభివృద్ధికి దారితీస్తుంది, ఆర్థికాభివృద్ధి వేగవంతమవుతుంది.



గ్రామీణాభివృద్ధి, ఉపాధి కల్పనపై పెట్టుబడులు, ఆర్థిక కార్యకలాపాల పెరుగుదలకు దారితీస్తాయి. ఫలితంగా వినియోగం పెరిగి, మార్కెట్ విస్తరణకు నూతన అవకాశాలు ఏర్పడతాయి.

ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌ను విద్యారంగానికి విస్తరించి పెట్టుబడులను ప్రకటించడం ద్వారా దీన్ని భవిష్యత్ సామాజిక – ఆర్థిక ప్రగతికి కారకంగా ప్రభుత్వం గుర్తించింది. అదనంగా పదివేల మెడికల్ సీట్లు, ఐఐటీలలో అదనంగా 6,500 సీట్ల పెంపు, నాణ్యతతో కూడిన శ్రామిక శక్తి పెంపు నవకల్పనలకు దారితీస్తాయి. గ్రామీణాభివృద్ధి, ఉపాధి కల్పనపై పెట్టుబడులు, ఆర్థిక కార్యకలాపాల పెరుగుదలకు దారితీసి, అధిక వినియోగం, మార్కెట్ విస్తరణకు నూతన అవకాశాలు ఏర్పడతాయి. 36 లైఫ్ సేవింగ్ డ్రగ్స్‌కు కస్టమ్ సుంకాన్ని మినహాయింపునివ్వడం వల్ల పేషెంట్లపై ఆర్థిక ఒత్తిడి తగ్గి ఆరోగ్య ప్రమాణాలు మెరుగవుతాయి.

బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత బీఎస్ఈ సెన్సెక్స్, నిఫ్టీ 50 సూచీల క్షీణతకు మూలధన వ్యయంలో స్వల్ప పెరుగుదల కారణంగా భావించవచ్చు. 2024-25 ఆర్థిక సంవత్సరం మూలధన వ్యయంతో పోల్చినప్పుడు 2025-26లో మూలధన వ్యయంలో పెరుగుదల 10 శాతం మాత్రమే. ఆర్థికాభివృద్ధికి మూలధన వ్యయంలో పెరుగుదల అధికంగా లేనప్పుడు ఆ ప్రభావం ఉత్పాక రంగాలపై రుణాత్మకంగా ఉండి, వృద్ధి క్షీణతకు దారితీస్తుంది. ప్రభుత్వ కోశ విధానాలకు అనుగుణంగా స్టాక్ మార్కెట్లు స్పందిస్తాయి. 2024-25 ఆర్థిక సంవత్సరం ద్రవ్యలోటు జీడీపీలో 4 శాతంగా నమోదు కావడం, పెరుగుతున్న ప్రభుత్వ రుణాలు, బాండ్ల రాబడి, ఈక్విటీ మార్కెట్లపై స్వల్పకాల ఒడుదొడుకులను కలుగజేస్తాయి. విదేశీ పెట్టుబడులను భారత్ అధికంగా ఆకర్షించడమనేది ప్రతిపాదిత బడ్జెట్ చర్యలు ఆర్థిక విస్తరణ, రాజకీయ సుస్థిరత, కార్పొరేట్ సంస్థల రాబడుల పెరుగుదలకు దారితీశాయా, లేదా అనే అంశాలపై ఆధారపడి ఉంటుంది.

ఆదాయపు పన్ను మినహాయింపు వలన పెరిగిన వ్యయార్హ ఆదాయాన్ని, వినియోగదారులు వినియోగ వ్యయంగా మరల్చగలరనే విషయంలోనూ అనిశ్చితి ఉంది. పన్ను రేట్ల తగ్గింపు స్వల్పకాల ప్రయోజనాలకే దారి తీస్తుంది. మరోవైపు అవస్థాపనా సౌకర్యాలపై పెట్టుబడులు అధికవృద్ధి సాధనకు దారి తీస్తాయి.

రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో వంద జిల్లాల్లో వ్యవసాయ ఉత్పాదకత పెంపు, పంట మార్పిడి విధానాన్ని ప్రోత్సహించడం, సరకు నిల్వ, నీటి పారుదల సౌకర్యాల విస్తరణ, స్వల్పకాల, దీర్ఘకాల వ్యవసాయ పరపతి పెంపు లక్ష్యాలుగా, 'ప్రధాన మంత్రి ధన్ – ధాన్య క్రిషి యోజన' పథకాన్ని ప్రకటించారు. భారత్‌లో వ్యవసాయ రంగానికి సంబంధించి అధిక శాతం రైతులు ఉపాంత, చిన్న కమతాలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. మొత్తం వ్యవసాయ భూమిలో రెండు హెక్టార్ల కన్నా తక్కువ ఉన్న కమతాల వాటా 86 శాతం. కమతాల విస్తీర్ణం తక్కువగా ఉండటం వలన ఆధునిక వ్యవసాయ పద్ధతులను రైతులు అవలంబించలేకపోతున్నారు. బడ్జెట్‌లో ప్రతిపాదించిన సంస్కరణలు ముఖ్యంగా మేలు రకమైన వంగడాల వినియోగం, పంటమార్పిడి విధానాన్ని అవలంబించగలిగే సామర్థ్యం తక్కువగా ఉండటానికి రైతులలో ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన లేకపోవడంతోపాటు, పరపతి లభ్యత తక్కువగా ఉండటాన్ని కారణాలుగా పేర్కొనవచ్చు.

స్టార్టప్‌లు, సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా సంస్థలకు బడ్జెట్ ప్రతిపాదనలు అనుకూలంగా ఉన్నప్పటికీ లోపభూయిష్ఠ సప్లయ్ చెయిన్ వ్యవస్థ, అసంఘటిత రంగ కార్యకలాపాలు, సంస్థాపరమైన పరపతి లభ్యతలో ఇబ్బందులు అభివృద్ధికి అవరోధంగా నిలిచే అవకాశాలు ఉన్నాయి.

వ్యాసకర్త ప్రొఫెసర్ అండ్ డీన్, ఇక్ఫాయ్ స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్, ఐఎఫ్ హెచ్ఇ, హైదరాబాద్

సాగుకు ఊతమేది?

అభిప్రాయం



డా॥ దొంతి నరసింహారెడ్డి

భారత్‌ను అభివృద్ధి పథంలో పయనింపజేసే కీలకమైన నాలుగు ఇంజిన్లలో వ్యవసాయం ఒకటని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. వ్యవసాయ అభివృద్ధి–ఉత్పాదకతల్లో సాధించే ప్రగతి... గ్రామీణ భారతం తిరిగి పుంజుకోవడానికీ, సౌభాగ్యవంతం కావడానికీ దారితీస్తుందని ఆమె 2025-26 బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. కానీ అందుకు తగిన కేటాయింపులు చేయడం మాత్రం మరిచారు. భూతాపం పెరుగుతున్న నేపథ్యంలో ప్రకృతిలో సంభవిస్తున్న వాతావరణ ప్రతికూల ప్రభావాలు, అతివృష్టి, అనావృష్టి, సారం లేని నేలలు, నాణ్యత లేని విత్తనాలు వల్ల సగటు రైతులు పంట దిగుబడిలో తీవ్ర మార్పులు ఎదుర్కొంటున్నారు. బడ్జెట్‌లో ఈ పరిస్థితి నుంచి వారిని బయటపడవేయడానికి ఎట్లాంటి నిధులూ లేవు.

ఈ ఏడాది వ్యవసాయ బడ్జెట్ రూ. 1,27,290.16 కోట్లుగా ప్రకటించారు. ఇది 2024-25లో రూ.1,22,528 కోట్లు, 2023-24లో రూ. 1,16,788 కోట్లుగా ఉంది. 2025-26 మొత్తం బడ్జెట్ అంచనా (బీఈ) రూ. 50,65,345 కోట్లు. అంటే వ్యవసాయానికి మొత్తం బడ్జెట్‌లో ఇచ్చింది కేవలం 2.51 శాతం మాత్రమే అన్నమాట. వ్యవసాయం, వ్యవసాయ పరిశోధన, చేపలు, పాడి పశువుల శాఖలకు కలిపి మొత్తం రూ. 1,45,300.62 కోట్లు. గత ఏడాది ఇది రూ. 1,39,607.54 కోట్లుగా ఉంది. వ్యవసాయ పరిశోధనకు గతేడాది రూ. 9,941.09 కోట్లు ఇస్తే ఈసారి రూ. 10,466.39 కోట్లు కేటాయించారు (పెరుగుదల 5.2 శాతం).



వాతావరణ ప్రతికూల ప్రభావాలు, సారం లేని నేలలు, నాణ్యత లేని విత్తనాలు వల్ల పంట దిగుబడిలో సమస్యలు ఎదుర్కొంటున్న రైతులను బయటపడవేయడానికి ఏ కేటాయింపులూ లేవు.

ఆశ్చర్యంగా, పంటల దిగుబడి ప్రభుత్వ లెక్కలలో పెరుగుతోంది. అనుకూల పరిస్థితుల వల్ల కేరళ రాష్ట్రంలో 3 పంటలు పండించే ప్రాంతంలో ఒకే పంట వేస్తున్నారు. గత 10 ఏండ్లలో వేల ఎకరాల వ్యవసాయ భూమి రోడ్లకు, ఇంకా ఇతర అభివృద్ధి పనులకు మళ్ళింది. దాదాపు 100 నదులు ఎండిపోయాయి. ఇవేవీ కూడా కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పంటల దిగుబడి మీద వ్యతిరేక ప్రభావం చూపకపోగా... దిగుబడి పెరగడం ఆశ్చర్యం కలిగిస్తోంది. పంటల విలువ పెరిగింది అని ఆర్థిక సర్వే చెబుతున్నది. అంటే ధరలు పెరిగినాయి. దీని వలన రైతుల ఆదాయం పెరగలేదు. కాగా ఆహార వస్తువుల ధరలు పెరిగాయి. అందువల్ల సాధారణ పౌరులకు అనేక పంట ఉత్పత్తులు అందుబాటులోకి రాకుండా పోతున్నాయి.

ఆర్థిక మంత్రి తన 2024-25 బడ్జెట్ ప్రసంగంలో 9 ప్రాధాన్యాలను ప్రస్తావించారు. వ్యవసాయంలో దిగుబడి పెంచడం, వ్యవసాయాన్ని దృఢంగా సవాళ్ళను ఎదుర్కొనే విధంగా తయారు చేయటం వంటివి ఇందులో ఉన్నాయి. అయితే ఏడాది గడిచేటప్పటికి ఈ ప్రాధాన్యాలు మరిచిపోయారు. పశుగణ అభివృద్ధికి, మత్స్య రంగానికి కలిపి రూ. 7,544 కోట్ల కేటాయింపు జరిగింది. వ్యవసాయ రంగ పెరుగుదలలో ఆర్థిక సర్వే కీలకంగా గుర్తించిన ఈ రెండు రంగాల మీద ప్రభుత్వం బడ్జెట్ పెరుగుదల 5 శాతం లోపే. మొత్తం బడ్జెట్ దిశ మారలేదు. ఈ రంగాల అభివృద్ధిని నిలువరిస్తున్న మౌలిక అంశాల మీద మాత్రం దృష్టి పెట్టలేదు. ప్రధానంగా నీటి వనరుల కాలుష్యం, పశువులకు దొరకని దాణా వంటి అంశాల మీద దృష్టి లేనే లేదు. వ్యవసాయ పరిశోధనలకు రూ. 9,504 కోట్లు కేటాయించారు.

వ్యవసాయ శాఖ ఆఫీసు ఖర్చులు 167 శాతం పెంచిన ప్రభుత్వం, 'ప్రధాన మంత్రి పంటల బీమా పథకా'నికి 13 శాతం కోత విధించింది. ఈ సారి ఇచ్చింది కేవలం రూ. 13,625 కోట్లు మాత్రమే. ప్రకృతి వైపరీత్యాలు పెరుగుతున్న నేపథ్యంలో, నకిలీ విత్తనాల బారిన పడి, రైతులకు పంట నష్టం పెరుగుతుంటే ఆదుకునే ఒకే ఒక్క బీమా పథకం తగ్గించడం శోచనీయం.

రైతులు ఎదుర్కొంటున్న వ్యవసాయ కూలీల కొరత, వ్యవసాయ కూలీ భారం వంటి అంశాల మీద ఆర్థిక సర్వేతో పాటు బడ్జెట్ కూడా ప్రస్తావించలేదు. గ్రామీణ భారతంలో ఉన్న భూమి లేని వారి ఉపాధికి, దాని రక్షణకు కేటాయింపులు లేవు. గ్రామీణ శ్రామిక శక్తికి అవసరమైన వసతుల కల్పనకు, సంక్షేమానికి, ఉపాధి రక్షణకు నిధులు మృగ్యం. వ్యవసాయంతో గ్రామీణ శ్రామిక శక్తి అనుసంధానం గురించిన కేటాయింపులు లేవు. పెరుగుతున్న ఉష్ణోగ్రతల వల్ల శ్రామికుల ఉత్పాదకత శక్తి పడిపోతున్నది. ఆహార ద్రవ్యోల్బణం వల్ల సరైన పరిమాణంలో పోష్టిక ఆహారం శ్రామిక కుటుంబాలకు అందడం లేదు. ఈ సమస్యలను ప్రభుత్వం గుర్తించకపోవటం దురదృష్టకరం.

భారత ప్రభుత్వం పెరుగుతున్న ఆదాయాన్ని గ్రామీణ ప్రాంతాల మీద ఖర్చు చేయడం లేదు. కరోనా లాంటి కష్టకాలంలో ఉపాధి ఇచ్చి ఆదుకున్న వ్యవసాయానికి కాకుండా ఇతర రంగాలకు ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం సంసిద్ధమైంది. వ్యవసాయంలో ఉపాధిని తగ్గించే డిజిటలీకరణకు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. పెరుగుతున్న భూతాపాన్ని తగ్గించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోక పోగా హాని కలిగించే పనుల మీద దృష్టి సారించడం మంచిది కాదు. కేంద్ర బడ్జెట్‌లో తీవ్ర మార్పులు అవసరం ఉన్నాయి. దార్శనిక నిధుల కేటాయింపుల అవసరం ఎంతైనా ఉంది.

వ్యాసకర్త వ్యవసాయ రంగ నిపుణులు

గ్రామీణ వినియోగం కీలకం

అభిప్రాయం



ప్రొ॥ ఇ. రేవతి

గ్రామీణ నిరుపేదలున్న భారత దేశంలో వారి ఆదాయం పెంచితే దేశ ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది. కొనుగోలు శక్తి పెంచితేనే వినిమయ డిమాండ్‌ను చేరుకోవడం సాధ్యం. మధ్య తరగతిలో కొనుగోలు శక్తి పెంచే ప్రయత్నం ప్రయోజనకరమే అయినప్పటికీ, గ్రామీణ యువతకు ఆర్థిక తోడ్పాటు అందించే మరిన్ని ప్రయత్నాలు జరగాలి. ప్రపంచ ఆర్థిక పరిస్థితి అనిశ్చితిలో ఉంది. యుద్ధం వల్ల వాణిజ్యంపై నీలి నీడలు వ్యాపిస్తున్నాయి. అభివృద్ధి చెందిన దేశాలు సైతం దిగుమతులపై ఆంక్షలు విధించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో భారత్ కూడా దిగుమతులపై ఆంక్షలు పెట్టే చర్యలు అనివార్యం. ఎగుమతులతో ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతుందనే వ్యూహానికి గండిపడే అవకాశాలు ఉన్నాయని గుర్తించాలి. పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన ఆర్థిక సర్వే కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తోంది.

ఆర్థిక వృద్ధి దిశగా ఈ బడ్జెట్ ఎలాంటి వ్యూహాన్ని అందిస్తుందనేది చర్చనీయాంశమే. మూడేళ్ళుగా దేశ ఆర్థిక వృద్ధి రేటు 8.7 శాతం (2021-22), 7.2 శాతం (2022-23), 8.2 శాతం (2023-24)గా నమోదైంది. అయితే 2024-25లో అంచనా వృద్ధి రేటును రిజర్వు బ్యాంకు 6.3 శాతానికి సవరించాల్సి వచ్చింది. వచ్చే రెండు, మూడేళ్ళలో కూడా అంచనాలను దిగువకే సవరించాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చు. ఈ వృద్ధి రేటుతో ఐదు ట్రిలియన్ డాలర్ల వృద్ధి సాధించడం కష్టమనే చెప్పాలి.



ఆర్థిక వృద్ధి సాధించాలంటే పెట్టుబడి శాతం (పెట్టుబడి-జీడీపీ నిష్పత్తి) స్థిరంగా ఎక్కువ స్థాయిలో ఉండాలి. కొంత కాలంగా చూస్తే ఇది గరిష్ఠంగా 41 శాతానికీ, కనిష్ఠంగా 34 శాతానికీ వెళ్ళింది. కోవిడ్ తర్వాత పెట్టుబడి వ్యయాన్ని కేంద్రం పెంచింది. మౌలిక వసతులపై వ్యయాన్ని కూడా 3.2 నుంచి 3.4 శాతానికి పెంచాల్సి ఉంది. ప్రభుత్వం చేస్తున్న పెట్టుబడి వ్యయానికి అనుగుణంగా ప్రైవేటు పెట్టుబడి పెరగలేదు. వినియమ డిమాండ్ సరిపోయినంత లేకపోవడమే దీనికి కారణం. ప్రజలకు ఆదాయం పెరిగితేనే కొనుగోలు శక్తీ పెరుగుతుంది. మన దేశంలో 80 శాతం గ్రామీణ నిరుపేదలే ఉన్నారు. వారి ఆదాయాన్ని పెంచితేనే వినియోగానికి ఊతం లభిస్తుంది. ఈ దృష్టితోనే ప్రభుత్వం ఆదాయ పన్ను రేట్లను సవరించింది. మధ్య తరగతి వర్గానికి ఇది మేలు చేస్తుందనేది నిర్వివాదాంశం. అయితే, దేశీయ డిమాండ్‌ను ఇది కొంత మేరే పెంచగలుగుతుంది. గ్రామీణ వ్యవస్థను బలోపేతం చేయడానికి వ్యవసాయ రంగం, గ్రామీణాభివృద్ధి, వైద్యం, విద్యపై కేటాయింపులు పెరగాలి.

మధ్య, చిన్న తరహా పరిశ్రమలు, వ్యవసాయ రంగాలపై పెట్టుబడులు ఉత్పాదకత పెంచే చర్యలుగా కన్పిస్తున్నాయి. గత బడ్జెట్‌లో సూచించిన విధంగా చిరు ధాన్యాల గురించీ, వాటి అభివృద్ధి గురించీ ప్రస్తావించలేదు. యువత నైపుణ్యం వైపు అడుగులేసేందుకు చర్యలు తీసుకున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇవి అవసరమే. అయితే వీటిపై కచ్చితమైన విధాన నిర్ణయం, సరైన ప్రణాళిక ఉండాలి. అప్పుడే అనుకున్న ఫలితాలు వస్తాయి.

వ్యాసకర్త సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్ (సెస్) డైరెక్టర్

లక్ష్యాల సాధన సాధ్యమేనా?

అభిప్రాయం



ప్రొ॥ డి. నర్సింహా రెడ్డి

'మిడిల్ క్లాస్ ఫీల్‌గుడ్ బడ్జెట్'గా 2025-26 బడ్జెట్‌కు మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం లభించింది. అయితే మధ్యతరగతిని సంతృప్తి పరిచే దిశలో కొంత ప్రయత్నం జరిగినా దేశంలో పెరుగుతున్న ద్రవ్యోల్బణ సమస్య పరిష్కారం దిశలో బడ్జెట్‌లో ఎలాంటి చర్యలూ లేవు. ప్రత్యేకంగా చూస్తే దేశంలో ఆహార ద్రవ్యోల్బణం సైతం పెరుగుతోంది. వివిధ రంగాల్లో ఉద్యోగాలు, ఉపాధి కల్పన దిశగానూ ప్రత్యేక చర్యలేవీ తీసుకోలేదు. దిగువ మధ్యతరగతి, పేద ప్రజల ఆదాయాలు పెంచేందుకు అవసరమైన నిర్దిష్టమైన కార్యక్రమాలు లేదా చర్యలు చేపట్టలేదు. అంటే సమాజంలో అధిక శాతమున్న ప్రజల చేతుల్లో మరింత డబ్బు పెట్టే చర్యలేవీ తీసుకోలేదన్నమాట.

అభివృద్ధి సాధనలో మౌలిక సదుపాయాల కల్పన ప్రభుత్వ పెట్టుబడులకు పరిమితం కావడం, ఆశించిన మేర ప్రైవేట్ పెట్టుబడులు పెరగక పోవడం, కేవలం క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్‌తోనే వృద్ధిని ముందుకు తీసుకెళ్ల లేకపోవడంతో ఉద్దీపనలతో ప్రైవేట్ పెట్టుబడులను పెంచాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. కీలకమైన రంగాల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోకుండా మధ్యతరగతి చేతుల్లో డబ్బుపెట్టి కొనుగోలుశక్తి పెంచడం ద్వారా పట్టణ ప్రాంతాల్లో వివిధ ఉత్పత్తులకు డిమాండ్ పెంచవచ్చని ఆశిస్తున్నట్టుగా కనిపిస్తోంది.

వ్యవసాయ రంగం విషయానికొస్తే... దేశంలో మొత్తం ఏడు వందలకు పైగా జిల్లాలు ఉంటే... కేవలం వంద జిల్లాల్లో 'ధన్, ధాన్య, కిసాన్ యోజన' కింద (11 కోట్ల మంది రైతులకు గాను 1.7 కోట్ల మంది) రైతాంగానికి ప్రయోజనం కల్పిస్తామని చెబుతున్నారు. అది కూడా మూడు పప్పుదినుసులకు సంబంధించి రాబోయే ఆరేళ్లలో దీనిని చేస్తామని చెప్పడం ద్వారా ఇప్పటికిప్పుడు ఈ రైతులకు ఒనగూడే ప్రయోజనం ఏమీఉండదు. దేశవ్యాప్తంగా విద్యాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న విశ్వవిద్యాలయాల్లో విద్యాభివృద్ధికి, దాని నాణ్యతను పెంచే దిశలో ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారనేది ఎక్కడా పేర్కొన లేదు.

దేశ జనాభాలో పెద్ద సంఖ్యలో ఉన్న మధ్య తరగతిని మంచి చేసుకునే ప్రయత్నంలో భాగంగా బడ్జెట్‌లో కొన్ని చర్యలు చేపట్టారు. ముఖ్యంగా పట్టణాల్లోని డిమాండ్ అనేది స్తబ్ధుగా ఉండగా, గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్ కొంత మెరుగైన పరిస్థితుల్లో ఉండడంతో అర్బన్ డిమాండ్ పెంచేందుకు ప్రైవేట్ పెట్టుబడులకు 'ఉద్దీపన' కింద రాయితీల కల్పన జరిగినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం దేశంలో ఉన్న పరిస్థితుల్లో మధ్యతరగతి అనేది అసంతృప్తితో ఉందని, ఈ వర్గం కొనుగోలు శక్తి తగ్గిందనే అభిప్రాయం సర్వత్రా నెలకొనడంతో ఈ అంశానికి బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇచ్చినట్టు కనిపిస్తోంది. వార్షిక బడ్జెట్‌లో ఇచ్చిన ఆదాయపు పన్ను మినహాయింపులతో దాదాపుగా అన్ని వర్గాలనూ సంతోషపరిచే ప్రయత్నం జరిగింది. ఇది ఎంతో కాలం నుంచి కోరుకుంటున్నదే. గతంలో రూ. 15 లక్షల వార్షికాదాయం గలవారు గరిష్ఠంగా



30 శాతం పన్ను కట్టేవారు. ఇప్పుడు ఈ 30 శాతం పన్ను ఏడాదికి రూ. 24 లక్షలకు పైగా ఆర్జిస్తున్నవారికి వర్తింపచేశారు. ఈ పన్ను మినహాయింపుల పరంగా చూస్తే రూ. 12 లక్షల దాకా ఆదాయం వచ్చేవారికి ప్రయోజనం కలుగుతుంది. అయితే ఇది నూతన ఆదాయ పన్ను విధానానికి లోబడి ఉన్న వారికే వర్తిస్తుంది.

ఈ విధంగా రూ. లక్ష కోట్ల వరకు వచ్చే ఆదాయపు పన్ను మొత్తాన్ని మధ్యతరగతి చేతుల్లో పెట్టి కొనుగోలుశక్తి పెంచడంద్వారా డిమాండ్‌పెంచితే ప్రైవేట్ పెట్టుబడులు వస్తాయనేది దీని వెనక ప్రభుత్వ వ్యూహంగా కనిపిస్తోంది. అయితే వాస్తవంగా చూస్తే... స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వ్యక్తపరిచే 'వోకల్ సెక్షన్స్'ను సంతృప్తి పరిచే ప్రయత్నంగానే ఇది నిలుస్తోంది. ఇలా పెద్ద సంఖ్యలోని ప్రజలు ఇంకా కొనుగోలు శక్తి లేక ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులే ఉంటాయి. అందువల్ల ఆదాయపు పన్ను మినహాయింపు రూపంలో ఇచ్చిన ఉద్దీపనలు ఏ మేరకు ఉపయో గపడతాయనేది ప్రశ్నార్థకంగా మారింది.

వ్యాసకర్త ఆర్థికవేత్త, హెచ్‌సీయూ స్కూల్ ఆఫ్ సోషల్‌సైన్సెస్ మాజీ డీన్

మధ్యతరగతి మందహాసం

అభిప్రాయం



డా॥ తిరునహరి శేషు

50.65 లక్షల కోట్ల రూపాయల వ్యయంతో, 'ద పవర్ ఆఫ్ రైజింగ్ మిడిల్ క్లాస్' పేరుతో, జీరో పావర్టీ లక్ష్యంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మధ్య తరగతి కొనుగోలు శక్తిని పెంచే చర్యలు చేపట్టారనే చెప్పాలి. గత ఏడాది పేదలు, రైతులు, మహిళలు, యువతను పట్టించుకున్న బడ్జెట్ ఈసారి ఆ నాలుగు వర్గాలతో పాటు మధ్యతరగతినిపై కూడా దృష్టి పెట్టింది. వ్యవసాయం, ఎమ్ఎస్ఎమ్ఈలు, పెట్టుబడి, ఎగుమతులనే నాలుగు గ్రోత్ ఇంజన్ల ద్వారా 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని చేరుకోవాలని భావిస్తున్నట్లుగా ఆర్థిక మంత్రి వెల్లడించారు.

ఆదాయ పన్ను పరిమితి, రాయితీలు, శ్లాబ్స్‌పై అసంతృప్తిగా ఉన్న వేతన జీవులను ప్రసన్నం చేసుకోవడానికి ఆర్థిక మంత్రి కొంత ఉదారత చూపారనే భావించాలి. నూతన పన్ను విధానంలో ఆదాయ పన్ను పరిమితిని పెంచటం, శ్లాబ్స్‌ను మార్చడం వలన వేతన జీవులకు, అధిక ఆదాయ వర్గాలకు కూడా ఉపశమనం కలుగుతుంది. వార్షిక ఆదాయం 12 లక్షల వరకు పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. గతంలో 15 లక్షల కంటే ఎక్కువ వార్షిక ఆదాయం ఉన్నవారు 30 శాతం పన్ను చెల్లిస్తే, ప్రస్తుతం ఆ పరిధిని 24 లక్షలకు పెంచటం వల్ల వ్యాపార వర్గాలకు కూడా వెసులుబాటు కలుగుతుంది.

ఎమ్ఎస్ఎమ్ఈలకు క్రెడిట్ గ్యారెంటీ పథకం ద్వారా రుణ సదుపాయం పెంచటం ఆ రంగానికి ప్రోత్సాహకరం. రుణ పరిమితిని ఐదు కోట్ల నుండి పది కోట్లకు, స్టార్టప్‌లకు 10 కోట్ల నుండి 20 కోట్లకు పెంచడం మంచి నిర్ణయమే. నేషనల్ మాన్యుఫాక్చరింగ్ బోర్డు ఏర్పాటు కూడా ఈ రంగానికి ఊతమిచ్చేదే. స్ట్రీట్ వర్కర్స్‌కు క్రెడిట్ కార్డులు, కోటి మంది గిగ్ వర్కర్లకు ఆరోగ్య బీమా కార్డులు, కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రుణ పరిమితి మూడు లక్షల నుండి 5 లక్షలకు పెంచడం అన్నీ మంచి చర్యలే. పట్టణ ప్రాంతాలను గ్రోత్ సెంటర్లుగా నిలపడానికి లక్ష కోట్ల రూపాయలతో ప్రకటించిన అర్బన్ చాలెంజ్ ఫండ్ కూడా ఆహ్వానించదగినదే.

అయితే, వ్యవసాయాన్ని మొదటి గ్రోత్ ఇంజిన్‌గా ప్రకటించినా ఆ స్థాయిలో నిధులు పెంచలేదు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ యోజన ద్వారా రైతులకు ఇచ్చే పెట్టుబడి సహాయాన్ని 6,000 నుండి 10,000 రూపాయలకు పెంచుతారని భావించారు. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించే విషయంపైన ఎలాంటి ప్రకటన లేకపోవటం రైతాంగాన్ని నిరాశ పరిచేదే. వ్యవసాయంలో ఆత్మ నిర్భర భారత్‌ను సాధించే నిర్ణయాలు లేవనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం లాంటి సమస్యలను నియంత్రించడానికి ప్రత్యేకమైన నిర్ణయాలు లేకపోవడం, మానవ వనరుల అభివృద్ధిలో కీలకంగా వ్యవహరించే విద్య, ఆరోగ్య రంగాలకు కేటాయింపులు పెద్దగా పెరగకపోవటం అసంతృప్తిని కలిగించేవే!

దేశంలో 39 శాతం ఉన్న మధ్యతరగతి ప్రజల కేంద్రంగా ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ అద్భుతాలు లేని ఒక సాదాసీదా బడ్జెట్‌గానే మిగిలిపోతుంది. ఆర్థిక సర్వేలో ప్రస్తావించినట్లు 6.4 శాతంగా ఉన్న వృద్ధిరేటు 8 శాతానికి చేరుకోవటానికి కావాల్సిన రోడ్ మ్యాప్ లేదనే భావన వ్యక్తం అవుతోంది.

వ్యాసకర్త అసిస్టెంట్ ప్రొఫెసర్, కాకతీయ విశ్వ విద్యాలయం, ఆర్థిక శాస్త్ర విభాగం । 98854 65877

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం . తిథి: శు.చవితి ప.12.29 వరకు, తదుపరి పంచమి, నక్షత్రం: ఉత్తరాభాద్ర తె.4.17 వరకు (తెల్లవారితే సోమవారం) తదుపరి రేవతి, వర్జ్యం: ప.2.50 నుండి 4.18 వరకు, దుర్ముహూర్తం: సా.4.26 నుండి 5.14 వరకు, అమృతఘడియలు: రా.11.44 నుండి 1.03 వరకు ; రాహుకాలం: సా.4.30 నుండి 6.00 వరకు, యమగండం: ప.12.00 నుండి 1.30 వరకు, సూర్యోదయం: 6.36, సూర్యాస్తమయం: 5.51.



వాగ్గేయకారుడికి స్వరార్చన చేస్తున్న కళాకారులు

స్వర రాగ ఝరి.. మురిసిన భద్రగిరి

- వైభవంగా భక్త రామదాసు 392వ జయంతి ఉత్సవాలు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో శనివారం భక్త రామదాసు 392వ జయంతి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. రామాలయం, చక్ర సిమెంట్స్ వారి నేంద్రగంటి అలివేలు మంగ సర్వయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కంచర్ల గోపన్నకు స్వర నీరాజనం సమర్పించారు. వివిధ ప్రాంతల నుంచి వచ్చిన సంగీత విద్వాంసులు రామయ్యకు, భక్త రామదాసుకు స్వరార్చన జరిపారు. తొలుత భద్రగిరి ప్రదక్షిణ, నగర సంకీర్తన చేపట్టారు. రామదాసు విగ్రహానికి అభిషేకం, గోదావరి తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. ఐదు రోజులు ఈ ఉత్సవాలు సాగుతాయి.



సిరిసిల్లలో మార్కండేయస్వామి శోభాయాత్ర

కన్నులపండువగా మార్కండేయుని శోభాయాత్ర

సిరిసిల్ల కల్చరల్: మార్కండేయస్వామి జయంతి ఉత్సవాన్ని శనివారం సిరిసిల్లలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పద్మశాలీ సామాజిక వర్గానికి ఆరాధ్య దైవమైన మార్కండేయుని జయంతి వేడుకలను వారం రోజులుగా వైభవంగా నిర్వహిస్తున్నారు. చివరి రోజు శనివారం ఆలయంలో యాగం చేశారు. పట్టణ పద్మశాలీ సంఘం ప్రతినిధులు గోలి వెంకటరమణ, గాజుల బాలయ్య, మోర రవి, కోడం శ్రీనివాస్ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. సాయంత్రం 6 గంటలకు స్వామి వారి చిత్రపటాన్ని ప్రత్యేక వాహనంపై ఏర్పాటు చేసి శోభాయాత్ర నిర్వహించారు. మార్కండేయ ఆలయం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర గాంధీచౌక్ నుంచి తిరిగి గుడికి చేరుకుంది.

క్లుప్తంగా...

10 జీపీఏ నావల్ల కాదు..

- ఒత్తిడి తట్టుకోలేక విద్యార్థిని ఆత్మహత్య



యోగిత

శ్రీరాంపూర్: 'చదువుల్లో రాణించలేకపోతున్నా.. ఎంత చదివినా ఎక్కువ మార్కులు రావడం లేదు. టెన్త్‌లో 10 జీపీఏ సాధించాలనుకున్నా అది సాధ్యం అయ్యేలా లేదు. నా వల్ల కాదు.. నేను చనిపోతున్నా. అమ్మానాన్నా.. నన్ను క్షమించండి..' అంటూ చదువు ఒత్తిడిని తట్టుకోలేక పదో తరగతి విద్యార్థిని సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మంచిర్యాల జిల్లా నస్పూర్ పట్టణం రాంనగర్‌లో శనివారం చోటుచేసుకుంది. సీసీసీ నస్పూర్ ఎస్సై సుగుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. చిలువేరి దేవేందర్, జ్యోతి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అమలాపురంలో నివాసం ఉంటున్నారు. వీరి కూతురు యోగిత (15) చిన్నప్పటి నుంచి రాంనగర్‌లో ఉన్న అమ్మమ్మ వద్ద ఉంటోంది. స్థానిక ఆదిత్య స్కూల్‌లో టెన్త్ చదువుతోంది. పరీక్షల్లో తక్కువ మార్కులు వస్తుండటంతో ఆవేదన చెంది.. శనివారం తెల్లవారుజామున ఐదు గంటలకు వంట గదిలో ఉరేసుకుంది. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. కూతురు మరణ వార్త తెలుసుకుని అమలాపురం నుంచి వచ్చిన తల్లిదండ్రులు మృతదేహంపై పడి బోరున విలపించడం అందరినీ కలచివేసింది.

తొమ్మిది రోజుల తరువాత.. లలిత అంత్యక్రియలు

- డిప్రెషన్‌తో బయటకురాని కూతుళ్లు
- సూసైడ్ నోట్‌లో పలువిషయాలు

బౌద్ధనగర్ (హైదరాబాద్): మరణించిన తర్వాత 9 రోజులపాటు ఇంట్లోనే ఉంచిన లలిత మృతదేహానికి శనివారం కూతుళ్లు, బంధువులు అంత్యక్రియలు నిర్వహించారు. ఈ నెల 23వ తేదీన బౌద్ధనగర్‌లోని ఇంట్లో లలిత చనిపోగా కూతుళ్లు ఆమె చనిపోయిన విషయాన్ని తొమ్మిదిరోజులపాటు బయటి ప్రపంచానికి చెప్పకపోవడం తెలిసిందే. అయితే ఆమె మృతదేహాన్ని వారాసిగూడ పోలీసులు గాంధీ మార్చురీకి తరలించి శనివారం పోస్టుమార్టం పూర్తి చేయించారు. అనంతరం లలిత సోదరుడు రమేశ్, కూతుళ్లు రవళిక, యశ్వితలకు ఇన్‌స్పెక్టర్ రాచకొండ సైదులు మృతదేహాన్ని అప్పగించారు. బంధువుల సమక్షంలో మృతదేహానికి అంత్యక్రియలు పూర్తి చేశారు.

తామూ చనిపోవాలనుకుని...

తండ్రి ఎటో వెళ్లిపోవడం, బంధువులు పట్టించుకోకపోవడంతో పాటు తల్లి కూడా మరణించడంతో ఇద్దరు కూతుళ్లు డిప్రెషన్‌లోకి వెళ్లిపోయారు. అంత్యక్రియలు చేయడానికి డబ్బులు లేకపోవడంతో తాము కూడా చనిపోవాలని నిర్ణయించుకున్నారు. సూసైడ్ నోట్ రాసిపెట్టి గొంతు, చేతులు కత్తితో కోసుకున్నారు. అటు తర్వాత ధైర్యం చాలక ఆత్మహత్యాయత్నం విరమించుకున్నారు. తీవ్రమైన డిప్రెషన్‌లో ఉండటంతో తమకు ఏమీ గుర్తు లేదని పోలీసులకు తెలిపారు. తమపై కొంతమంది బ్లాక్ మ్యాజిక్ చేసి చంపాలని చూస్తున్నారని నోట్‌లో పేర్కొనడంతో వీళ్ల మానసిక స్థితి కూడా సరిగా లేదని పోలీసులు భావిస్తున్నారు.

తాటిచెట్టుపై కల్లు గీస్తుండగా విద్యుదాఘాతం

- గీత కార్మికుడు మృతి



పంతంగి రాజు

సంగెం: తాటిచెట్టుపై కల్లు గీస్తున్న గీత కార్మికుడు.. విద్యుదాఘాతానికి గురై మరణించాడు. వరంగల్ జిల్లా సంగెం మండలం ఆశాలపల్లిలో శుక్రవారం రాత్రి జరిగిన ఈ సంఘటనపై స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలివి. గ్రామానికి చెందిన పంతంగి రాజు (38) తనకున్న ఎకరంన్నర భూమిలో వ్యవసాయంతోపాటు.. కల్లు గీస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శుక్రవారం రాత్రి 11 గంటలకు.. బొల్లికుంటకు వెళ్లే రోడ్డులోని ఎల్లమ్మ తల్లి గుడిసె వద్ద గల తాటి చెట్టుపైకి వడకల్లు కోసం ఎక్కాడు. కల్లు గీసే క్రమంలో తాటిమట్టను కోయడంతో.. కమ్మ ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న 11కేవీ విద్యుత్ తీగపై పడింది. దీంతో రాజు విద్యుదాఘాతానికి గురై చెట్టు పైనే వెనక్కి వాలి చనిపోయాడు. అక్కడే ఉన్న గ్రామస్తుడు దండు రాజు మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. గ్రామస్తులు అక్కడికి చేరుకుని జేసీబీతో రాజు మృతదేహాన్ని కిందకు దించారు. మృతుని భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేశ్ తెలిపారు.

జాడలేని గిరిజన సలహా మండలి!

- ఆరు నెలలకోసారి భేటీ కావాల్సిన టీఏసీ
- గత ఐదేళ్లలో ఏనాడూ జరగని సమావేశాలు
- గిరిజన పథకాలపై నిఘా బాధ్యత టీఏసీదే
- ఐటీడీఏ వార్షిక నివేదికలకు కమిటీ ఆమోదం తప్పనిసరి
- గిరిజన సంక్షేమశాఖ మంత్రే కమిటీకి అధ్యక్షుడు
- ప్రస్తుతం సీఎం రేవంత్ వద్దనే ఉన్న ఆ శాఖ
- భేటీ నిర్వహణపై చేతులెత్తేసిన గిరిజన సంక్షేమ శాఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గిరిజన సంక్షేమ కార్యక్రమాల అమలుపై పర్యవేక్షణ దారితప్పింది. గిరిజనులు, షెడ్యూల్ ప్రాంతాల సమగ్ర అభివృద్ధిపై కీలక నిర్ణయాలు తీసుకునే 'గిరిజన సలహా మండలి'(టీఏసీ) ఐదేళ్లుగా జాడ లేకుండా పోయింది. ఆరు నెలలకోసారి తప్పనిసరిగా సమావేశమై గిరిజన సంక్షేమ కార్యక్రమాలను సమీక్షించి, ప్రభుత్వానికి సూచనలు ఇవ్వాల్సిన ఈ కమిటీ గత ఐదేళ్లలో ఒక్కసారి కూడా భేటీ కాలేదు. సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ)ల పరిపాలన నివేదికల (అడ్మినిస్ట్రేటివ్ రిపోర్ట్స్)కు కూడా ఈ కమిటీ ఆమోదం తప్పనిసరి. ఇంతటి కీలక బాధ్యతలున్న టీఏసీ 2020 జనవరి నెలాఖరులో చివరిసారి సమావేశమైంది. ఆ తర్వాత కమిటీ జాడలేదు. దీంతో ఐటీడీఏల పరిపాలన నివేదికలు ఏమవుతున్నాయి? గిరిజన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల సంగతి ఎలా ఉంది? వారి అభ్యున్నతి కోసం చేసిన సూచనలు ఏమవుతున్నాయో ఎవరికీ తెలియని పరిస్థితి నెలకొంది. అసలు టీఏసీ ఉందా లేదా? అన్న సందేహం సర్వత్రా నెలకొంది.

గిరిజన సంక్షేమ శాఖ వైఫల్యం

టీఏసీ సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించాల్సిన బాధ్యత రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖపైనే ఉంది. టీఏసీ చైర్మన్‌తో పాటు సభ్యులు, సంబంధిత శాఖల అధికారులకు గిరిజన సంక్షేమ శాఖ సమాచారం ఇచ్చి సమన్వయం చేసుకోవాలి. సమావేశం తేదీని నిర్ణయించి సంబంధిత శాఖల ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలి. కానీ గత ఐదేళ్లుగా టీఏసీ సమావేశాన్ని నిర్వహించడంలో గిరిజన సంక్షేమ శాఖ విఫలమవుతోంది. దీంతో రాష్ట్రంలోని నాలుగు ఐటీడీఏలైన ఏటూరునాగారం, ఉట్నూరు, భద్రాచలం, మన్ననూరు వార్షిక నివేదికలకు సైతం ఆమోదం దక్కలేదు. టీఏసీ ఆమోదం లేనప్పటికీ వాటి కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

కొత్త ప్రభుత్వంలోనూ అదే తీరు

రాష్ట్ర ప్రభుత్వమే టీఏసీని ఏర్పాటుచేస్తుంది. కొత్తగా ప్రభుత్వం మారితే వెనువెంటనే ఈ కమిటీని నూతనంగా ఏర్పాటు చేయాలి. కానీ, కాంగ్రెస్ సర్కారు వచ్చి ఏడాది దాటినా టీఏసీ జాడలేదు. టీఏసీ సమావేశాలు జరగకపోవడంతో గిరిజన సంక్షేమ శాఖ కార్యక్రమాల అమలుతీరుపై పర్యవేక్షణ కరువైంది. ప్రస్తుతం గిరిజన సంక్షేమ శాఖకు పూర్తిస్థాయి కమిషనర్ లేరు. ఇన్‌చార్జి కమిషనర్‌గా ఆ శాఖ కార్యదర్శి వ్యవహరిస్తున్నారు. దీంతో టీఏసీ సమావేశాల గురించి ఎవరూ పట్టించుకోవడం లేదని అధికారులు అంటున్నారు.

సీఎం పరిధిలోనే..

రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అధ్యక్షత వహించే టీఏసీలో రాష్ట్రంలోని గిరిజన సామాజికవర్గానికి చెందిన ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు సభ్యులుగా ఉంటారు. ప్రస్తుతం గిరిజన సంక్షేమ శాఖ సీఎం రేవంత్‌రెడ్డి వద్దనే ఉంది. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీఏసీ ఏర్పాటైంది. స్వయంగా ముఖ్యమంత్రే చైర్మన్‌గా ఉండడంతో కమిటీకి ప్రాధాన్యత ఎక్కువే. ఏజెన్సీలతోపాటు మైదాన ప్రాంతాల్లోని గిరిజన ఆవాసాల్లో సమస్యలను ఈ కమిటీ ప్రస్తావిస్తే.. యుద్ధప్రాతిపదికన వాటిని పరిష్కరించాల్సి ఉంటుంది. ఐటీడీఏల వార్షిక నివేదికలను ఆమోదించటంతోపాటు కేంద్రం నుంచి వచ్చే నిధుల వినియోగంపై నిఘా పెట్టడం టీఏసీ ప్రధాన విధులు. అయినా, టీఏసీ సమావేశంపై నిర్లక్ష్యం కొనసాగుతూనే ఉన్నది.

దేశాభివృద్ధికి తోడ్పడే బడ్జెట్




వైద్యం, ఆరోగ్యం, వ్యవసాయం, రైతులకు చేయూతనిచ్చేలా కేంద్ర బడ్జెట్ ఉంది. మహిళా సాధికారతకు ఈ బడ్జెట్‌లో పెద్దపీట వేశారు. జల్‌జీవన్ ప్రాజెక్టు కాలపరిమితి పెంచడం ఆనందంగా ఉంది. కేంద్ర బడ్జెట్ అంతా పీపుల్ ఫ్రెండ్లీ బడ్జెట్‌గా ఉంది. ప్రతి రంగంలోనూ సమాన కేటాయింపులు జరిగాయి. ఇన్‌కం ట్యాక్స్ పరిమితి రూ.12 లక్షలకు పెంచడం శుభపరిణామం. లక్షన్నర కోట్ల రుణాలను కేటాయించి కేంద్రం రాష్ట్రాలకు చేయూతగా నిలిచింది. మొత్తంగా దేశాభివృద్ధికి ఈ బడ్జెట్ తోడ్పడుతుంది.

– సుధారెడ్డి, మేఘా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ డైరెక్టర్

మళ్లీ విద్యుత్ సంస్కరణలు

చట్టసవరణ బిల్లు తిరిగి తెరపైకి! • 'సాక్షి'తో ప్రయాస్ ఎనర్జీ సభ్యుడు ఎస్.శ్రీకుమార్



సాక్షి, హైదరాబాద్: పర్యావరణ పరిరక్షణ చర్యల్లో భాగంగా సోలార్ పీవీ సెల్స్, ఈవీ బ్యాటరీలు, ఎలక్ట్రోలైట్స్, విండ్ టర్బైన్స్ వంటి 'క్లీన్‌టెక్' పరికరాల తయారీని కేంద్రం పెద్దఎత్తున ప్రోత్సహించాలని నిర్ణయించడం మంచి పరిణామమని విద్యుత్‌రంగ నిపుణుడు, 'ప్రయాస్ ఎనర్జీ గ్రూప్'సభ్యుడు ఎస్.శ్రీకుమార్ తెలిపారు. కేంద్ర బడ్జెట్‌పై ఆయన 'సాక్షి'తో అభిప్రాయాలను పంచుకున్నారు. తీవ్ర నష్టాల్లో కూరుకుపోయిన విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లను గాడిలో పెట్టేందుకు కేంద్రం మళ్లీ సంస్కరణలను అమలు చేయబోతోందని పేర్కొన్నారు. ఈసారి ఎలాంటి సంస్కరణలు ఉండబోతున్నాయో ప్రకటించాల్సి ఉందన్నారు. 'డీరెగ్యులేషన్'పేరుతో మరింత సరళీకృత విధానాలను ప్రవేశపెట్టి జాతీయ, అంతర్జాతీయ స్థాయి పెట్టుబడులను ఆకర్షించేందుకు కేంద్రం చర్యలు చేపట్టిందని చెప్పారు. విద్యుత్ పంపిణీ రంగాన్ని ప్రైవేటీకరించేందుకు ప్రతిపాదించిన విద్యుత్ చట్ట సవరణ బిల్లు 2022ను మళ్లీ తెరపైకి తీసుకొచ్చే అవకాశాలను కొట్టివేయలేమన్నారు. ఇప్పటికే కేంద్ర పాలిత ప్రాంతాల డిస్కంలను కేంద్రం ప్రైవేటీకరిస్తోందని, రాష్ట్ర ప్రభుత్వాలు అడ్డుకుంటుండటంతో రాష్ట్రాల్లో ఇప్పటివరకు సాధ్యం కాలేదన్నారు. అయితే, విద్యుత్ సంస్కరణలు అమలుచేసే రాష్ట్రాలకు ప్రోత్సాహకంగా ఎఫ్ఆర్‌బీఎం పరిమితికి మించి 0.5 శాతం రుణాలు తీసుకునేందుకు మరోసారి అనుమతిస్తామని కేంద్రం ప్రకటించిందన్నారు.

చిత్తడి నేలలుగా మంజీర, పాకాల, అమీన్ పూర్

- అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని మంజీర రిజర్వాయర్, పాకాల సరస్సు, కిన్నెరసాని రిజర్వాయర్, రామప్ప సరస్సు, అమీన్‌పూర్ సరస్సులను చిత్తడి నేలలుగా గుర్తించినట్లు అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. మార్గదర్శకాల ప్రకారం వీటిని త్వరలోనే నోటిఫై చేస్తామన్నారు. తెలంగాణ వ్యాప్తంగా చిత్తడి నేలలను గుర్తించి, వాటి పరిరక్షణకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికలను రూపొందిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో రూపొందించనున్న ఎకో టూరిజం పాలసీలోనూ చిత్తడి నేలల సైట్లకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు మంత్రి సురేఖ తెలిపారు. జీవ వైవిధ్య పరిరక్షణలో చిత్తడి నేలల పాత్ర అద్వితీయమైనదని పేర్కొన్నారు. ఫిబ్రవరి 2న చిత్తడి నేలల (వెట్ ల్యాండ్స్) పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని.. ఆమె మాట్లాడారు. కాలుష్య తీవ్రత కారణంగా పర్యావరణ అసమతుల్యతతో తలెత్తే దుష్ప్రభావాలను అరికట్టడంలో, నీటి నాణ్యతను పెంచడంలో చిత్తడి నేలలు వడపోత వ్యవస్థగా పనిచేస్తున్నాయని వెల్లడించారు. అరుదైన మత్స్య, వృక్షజాతుల జీవనానికి తోడ్పాటునందించడంతో పాటు వరదలను నియంత్రిస్తూ, దేశ, విదేశీ పక్షులకు ఆవాసాన్ని కల్పిస్తూ పర్యావరణానికి ఎంతో మేలు చేస్తున్నాయని పేర్కొన్నారు.

ఇద్దరు రైతుల ఆత్మహత్యాయత్నం

- జాతీయ రహదారి నిర్మాణంతో భూములు పోతాయంటూ ఆందోళన
- అధికారుల జోక్యంతో సద్దుమణిగిన వ్యవహారం



కురుమూర్తి, శేఖర్‌లను ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

తాడూరు: జాతీయ రహదారి నిర్మాణం కోసం కొత్తగా సర్వే చేపట్టడం వల్ల భూములు కోల్పోయే ఇద్దరు రైతులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ సంఘటన శనివారం ఉదయం నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరులో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్ నుంచి నంద్యాల వరకు జాతీయ రహదారి(167) నిర్మాణం కోసం గతంలో సర్వే నిర్వహించి అధికారులు భూములను స్వాధీనం చేసుకున్నారు. అయితే ఎక్కువ మొత్తంలో భూములు కోల్పోతున్న భూస్వాములు అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చినట్టు సమాచారం. దీంతో గతంలో నిర్వహించిన సర్వే ప్రకారం కాకుండా..పేద రైతుల భూముల గుండా వెళ్లేలా ఒత్తిడి తెచ్చారు. ఈ క్రమంలోనే చింతా కురుమూర్తి, మంచెల శేఖర్‌లకు చెందిన సర్వే నంబర్లు 120, 125 భూముల్లో పూర్తిగా రోడ్డులో వెళ్లే పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో రెండు, మూడు రోజుల నుంచి ఆ రైతులు అధికారులకు చెప్పినా వినిపించుకోలేదు. మరోసారి శనివారం ఉదయం సర్వే చేసి హద్దులు నిర్ణయించేందుకు అధికారులు రావడంతో ఆ ఇద్దరు రైతులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. శేఖర్ పురుగు మందు తాగగా.. కురుమూర్తి ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకునే ప్రయత్నం చేశారు. పోలీసులు అడ్డుకొని వారించారు. భూములు కోల్పోయే రైతులకు ప్రభుత్వం ద్వారా న్యాయం జరిగేలా అధికారులు కృషి చేస్తారని ఆర్డీఓ సురేశ్, డీఎస్పీ శ్రీనివాస్‌యాదవ్ వారికి నచ్చజెప్పారు. అనంతరం రెవెన్యూ అధికారులు పోలీస్ బందోబస్తు మధ్య సర్వే కొనసాగించారు.

పంటలు పండక.. అప్పులు తీరక

- ఉరి వేసుకుని రైతు బలవన్మరణం



శ్రీనివాస్

ఇల్లంతకుంట(మానకొండూర్): పంటల సాగుకు చేసిన అప్పులు తీర్చే మార్గం కనిపించక మనోవేదనకు గురైన ఒక రైతు శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం నరసక్కపేటకు చెందిన తిప్పరవేణి శ్రీనివాస్ (45) తనకున్న అర ఎకరంతోపాటు మరి కొంత భూమిని కౌలుకు తీసుకుని పంటలు సాగు చేస్తున్నాడు. పంటల పెట్టుబడితోటు కుటుంబ అవసరాలకు రూ.10 లక్షల వరకు అప్పు చేశాడు. అప్పు ఎలా తీర్చేదని తరచూ భార్య వద్ద బాధపడేవాడు. ఈక్రమంలోనే శనివారం తన పొలం వద్ద ఉన్న చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొడుకు సాగర్ పొలానికి వెళ్లి చూడగా.. చెట్టుకు ఉరి వేసుకున్న తండ్రి కనిపించాడు. కిందకు దింపి పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. మృతునికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఇల్లంతకుంట ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

అప్పు ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వడం లేదని...

- పురుగు మందు తాగిన కుటుంబం
- భర్త, మరదలు మృతి... భార్య పరిస్థితి విషమం
- ప్రాణాలతో బయటపడిన కూతురు
- ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలో ఘటన



రాకేశ్



స్పందన


తలమడుగు/తాంసి: అప్పు తీసుకున్న వ్యక్తి తిరిగి ఆ డబ్బు ఇవ్వకపోవడం, తాను అప్పు తీసుకున్న వారికి సమాధానం చెప్పలేక ఓ వ్యక్తి మనోవేదనకు గురై కుటుంబంతో సహా ఆత్మహత్యకు యత్నించాడు. అందులో ఇద్దరు చనిపోగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. కుటుంబ సభ్యులు, డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, తలమడుగు ఎస్సై అంజమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. తలమడుగు మండలం ఉండం గ్రామానికి చెందిన ఆకుల రాకేశ్ చిన్నతనంలోనే తల్లిదండ్రులు పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. దీంతో రాకేశ్ తాంసి మండలం కప్పర్ల గ్రామానికి చెందిన తన మేనమామ వద్ద పెరిగాడు. రాకేశ్‌కు ఆదిలాబాద్‌కు చెందిన లావణ్యతో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి పదేళ్ల కూతురు ప్రశస్య ఉంది. మొదట్లో ఆటో నడిపేవాడు. తర్వాత ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఏడాది క్రితం ఫర్టిలైజర్ దుకాణాన్ని ప్రారంభించాడు. ఈ క్రమంలో మృతుడి మేనమామ–అత్త కొన్నేళ్ల క్రితం చనిపోయారు. వీరికి ఇద్దరు కూతుళ్లు సాయి, స్పందన ఉన్నారు. వారు రాకేశ్ సంరక్షణలోనే ఉన్నారు. ఇద్దరూ ఉన్నతవిద్య అభ్యసించగా, సాయి బెంగళూరులో ప్రైవేట్ ఉద్యోగం చేస్తోంది. స్పందన ఇటీవల నర్సింగ్ కోర్సు పూర్తి చేసింది.

రాకేందర్‌కు రూ.60 లక్షలు అప్పుగా..

ఆదిలాబాద్‌లోని విద్యానగర్ కాలనీలో 21 మంది సభ్యులతో కలిసి రాకేందర్ ఆర్‌కే సొసైటీని ప్రారంభించాడు. లావణ్య సైతం ఆ సొసైటీలో సభ్యురాలిగా ఉంది. అందులో కొంత పెట్టుబడి కూడా పెట్టారు. అయితే ఆ సొసైటీ దివాలా తీసింది. అదే విధంగా రాకేందర్‌కు రూ.60లక్షలు అప్పుగా ఇచ్చినట్టు రాకేశ్–లావణ్య దంపతులు సూసైడ్ నోట్ రాశారు. బాకీ ఉన్న డబ్బుల వివరాలు కూడా అందులో పేర్కొన్నారు. రాకేందర్ తీసుకున్న ఆ డబ్బులు తిరిగి ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని వివరించారు. దీంతో ఇచ్చిన అప్పు తిరిగి రాకపోవడం, బయట తాను చేసిన అప్పులను తీర్చే మార్గం కనిపించకపోవడంతో కొద్ది రోజులుగా రాకేశ్ తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నాడు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులతో కలిసి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు.

సొంత చేనుకు వచ్చి...

శనివారం ఉదయం తలమడుగు మండలం ఉండం శివారులో ఉన్న తన సొంత చేనులో రాకేశ్(35), ఆయన భార్య లావణ్య, మరదలు స్పందన(19) పురుగు మందు తాగారు. ఆ తర్వాత లావణ్య జిల్లా కేంద్రంలో ఉండే తన బాబాయికి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చింది. దీంతో ఆయన హుటాహుటిన అక్కడకు చేరుకున్నాడు. అప్పటికే రాకేశ్, స్పందన చనిపోయారు. కొనఊపిరితో ఉన్న లావణ్యను చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. ఆమె పరిస్థితి విషమంగానే ఉంది. కూతురుకు తాగించేందుకు మందు లేకపోవడంతో ఆ చిన్నారి ప్రాణాలతో బయటపడింది.





యెజ్దీ నాగపూర్‌వాలా
సీఈవో, కేపీఎంజీ ఇండియా

ఆదాయ పన్ను పరిమితిని పెంచడమనేది మధ్య తరగతికి ఎంతగానో ఊరటనిస్తుంది. అలాగే వినియోగదారుల చేతిలో మరిన్ని నిధులు అందుబాటులో ఉండటం వల్ల ఎకానమీ వృద్ధికి కూడా దోహదపడుతుంది. ఇక టీడీఎస్, టీసీఎస్ సరళతరం చేయడమనేది ట్యాక్స్‌పేయర్లపై నిబంధనల భారాన్ని తగ్గిస్తుంది.

EXPERT OPINION

ఈసారి జన గణన లేనట్లే

న్యూఢిల్లీ: జనాభా లెక్కల కార్యక్రమం ఈ సంవత్సరం కూడా ఉండదని తేలిపోయింది. వాస్తవానికి జనగణన చేపడితే వేల కోట్ల రూపాయలు అవసరమవుతాయి. కానీ జనగణన, సర్వేలు, స్టాటిస్టిక్స్/రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియాకు ఈసారి కేవలం రూ.574.80 కోట్లే కేటాయించడం చూస్తుంటే ఈ ఏడాది కూడా జనగణన చేయట్లేదని స్పష్టమవుతోంది. 2021- 22 బడ్జెట్‌లో జనగణన కోసం రూ.3,768 కోట్లు కేటాయించారు. కానీ జనగణన చేయలేదు. తాజా బడ్జెట్‌లో కేవలం రూ.574 కోట్లు కేటాయించడం చూస్తుంటే ఈ ఏడాది కూడా జనగణన వాయిదా పడ్డట్లేనని తెలుస్తోంది. 2021లో జనగణన చేపడితే రూ.8,754.23 కోట్లు అవసరం అవుతాయని ఊహించి అందుకు తగ్గప్రతిపాదనలకు 2019 డిసెంబర్ 24ననాటి కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర వేయడం తెల్సిందే.



మంత్రుల జీతభత్యాలు తదితరాలకు వేయి కోట్లు

న్యూఢిల్లీ: కేంద్ర మంత్రుల జీతభత్యాలు, కేబినెట్ సచివాలయం, ప్రధాన మంత్రి కార్యాలయం, ప్రభుత్వ ఆతిథ్యం పొందే విదేశాల అగ్రనేతల బస, ఇతరత్రా ఖర్చుల కోసం ఈసారి బడ్జెట్‌లో రూ.1,024.30 కోట్లు కేటాయించారు. ఇందులో కేవలం కేంద్ర మంత్రుల జీతభత్యాలకే కేటాయింపులు రూ.619.04 కోట్లు కావడం గమనార్హం. గత బడ్జెట్‌లో మంత్రుల జీతభత్యాలకు కేవలం రూ.540 కోట్లే కేటాయించారు. కేంద్ర కేబినెట్ మంత్రులు, సహాయక మంత్రుల జీతభత్యాలు, ఇతర అలవెన్సులు, ట్రావెల్ ఖర్చులు, మాజీ ప్రధాన మంత్రుల కోసం ఈ బడ్జెట్ కేటాయింపులు జరిపారు. వీవీఐపీల విమానప్రయాణ ఖర్చులనూ ఇందులో కలిపారు. జాతీయ భద్రతా మండలి సచివాలయం కోసం రూ.182.75 కోట్లు కేటాయించారు. ప్రధాన శాస్త్రీయ సలహాదారు కార్యాలయం కోసం రూ. 70 కోట్లు, కేబినెట్ సెక్రటేరియట్ కోసం రూ.75 కోట్లు, ప్రధాని కార్యాలయం కోసం రూ.70.91 కోట్లు కేటాయించారు.



పన్నుల ఆదాయం 42.70 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: స్థూల పన్ను వసూళ్లు వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26) 42.70 లక్షల కోట్లుగా ఉంటాయని బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.38.40 లక్షల కోట్లు పన్నుల ఆదాయం రావొచ్చని తొలుత అంచనా వేయగా, తాజాగా దీన్ని రూ.38.44 లక్షల కోట్లకు సవరించారు. ఒకవైపు వ్యక్తిగత ఆదాయపన్ను తగ్గించినప్పటికీ, వచ్చే ఆర్థిక సంవత్సరానికి మెరుగైన పన్నుల ఆదాయాన్ని ప్రభుత్వం అంచనా వేస్తున్నట్టు బడ్జెట్ ప్రతిపాదనలు స్పష్టం చేస్తున్నాయి. వ్యక్తిగత ఆదాయపన్ను ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2024-25) రూ.12.57 లక్షల కోట్లు వస్తుందని అంచనా వేసుకోగా, 2025-26లో 14.4 శాతం అధికంగా రూ.14.38 లక్షల కోట్లు వసూలు అవుతుందని ప్రతి పాదించారు. అలాగే, 2024-25లో కార్పొరేట్ పన్నుల ద్వారా రూ.9.80 లక్షల కోట్లు వస్తుందని అంచనా వేయగా, 2025- 26లో ఇది రూ.10.82 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా వేశారు.




మూలధన వ్యయం రూ.11.21 లక్షల కోట్లు

కొత్త బడ్జెట్ ఏప్రిల్‌తో ప్రారంభమయ్యే వార్షిక సంవత్సరంలో రూ.11.21 లక్షల కోట్ల మూలధన వ్యయాలను నిర్దేశించుకుంది. అయితే మార్చితో ముగిసే ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2024-25) సంబంధించి నిర్దేశించుకున్న లక్ష్యా లు రూ.11.21 లక్షల కోట్లను చేరలేదు. లక్ష్యంకన్నా రూ.93,000 కోట్లు వెనుకబడి ఉన్నట్లు గణాంకాలు వెల్లడించాయి. సవరించిన అంచ నాల ప్రకారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మూలధన వ్యయాలు రూ.10.18 లక్షల కోట్లకు పరిమితమయ్యాయి. ''రుణాలు కాకుండా, మొత్తం వసూళ్లు రూ.31.47 లక్షల కోట్లు. ఇందులో పన్నుల ద్వారా ఒనగూరింది రూ.25.57 లక్షల కోట్లు. వ్యయాలు రూ.47.16 లక్షల కోట్లు. ఇందులో రూ. 10.18 లక్షల కోట్లు మూలధన వ్యయాలు'' అని ఆర్థికమంత్రి తన ప్రసంగంలో పేర్కొన్నారు. నిజానికి మూలధన వ్యయాలు లక్ష్యాలను చేరకపోవడం వరుసగా ఇది రెండవ సంవత్సరం.

మొత్తం **7** ట్యాక్స్ శ్లాబులతో మధ్యతరగతి ప్రజలకు ఊరట

- న్యూట్యాక్స్ విధానంలో ట్యాక్స్ శ్లాబుల్లో భారీ మార్పులు
- ఈ మార్పులతో రూ.12 లక్షల ఆదాయం వారికి రూ.80,000 తగ్గనున్న పన్ను భారం
- రూ.18 లక్షల వారికి రూ.70,000, రూ.25 లక్షల పైన ఉన్న వారికి రూ.1.10 లక్షల పన్ను ప్రయోజనం
- సీనియర్ సిటిజన్స్ వడ్డీ టీడీఎస్ పరిమితిని రూ.50,000 నుంచి లక్షకు పెంపు
- టీడీఎస్, టీసీఎస్‌లో భారీ మార్పులు.. ఇక నుంచి పాన్ లేని వారికే భారీ టీడీఎస్ వర్తింపు
- పాత ఆదాయ పన్ను చట్టం స్థానంలో త్వరలో పార్లమెంటులో సరళమైన పన్ను చట్టం
- వచ్చేవారం పార్లమెంటుకు సమర్పిస్తామన్న ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్



లక్కీ భాస్కర్ లెక్కలివి..

రూ.12.75 లక్షల ఆదాయం వరకు పన్ను లేదు

(సాక్షి, అమరావతి)

ఏడాదికి వచ్చే ఆదాయం రూ.12 లక్షల లోపు ఉన్నవారెవరూ ఇక ఆదాయపు పన్ను చెల్లించాల్సిన పని లేదు. ఇప్పటిదాకా రూ.7 లక్షలుగా ఉన్న ట్యాక్స్ రిబేట్ పరిమితిని ఒక్కసారిగా 12 లక్షలకు పెంచటం ద్వారా... ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వేతన జీవులకు ఊహించని కానుకనిచ్చారు. మేమంతా 'లక్కీ భాస్కర్'లమే అని మధ్య తరగతి వేతన జీవులు సంబరపడేలా తాజా బడ్జెట్లో ప్రతిపాదనలు చేశారు. ఈ రకంగా చూస్తే.. ఏడాదికి రూ.12 లక్షలు ఆదాయం ఉన్న వాళ్లు ప్రస్తుతం చెల్లిస్తున్న సుమారు రూ.80,000 పన్ను ఇక్కపై వారికి మిగులుతుంది. దీనికి స్టాండర్డ్ డిడక్షన్ రూ.75,000ను కూడా కలిపితే రూ.12.75 లక్షల ఆదాయం వరకు ఉన్నవారు ఇకపై పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. అయితే మొత్తం ఆదాయం రూ.12.75 లక్షలకన్నా ఒక్క రూపాయి పెరిగినా... వారు వివిధ పన్ను శ్లాబుల ప్రకారం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. పైపెచ్చు ఇది వ్యక్తులు జీతం రూపంలో ఆర్జించే మొత్తానికే వర్తిస్తుందని, మూలధన లాభాలు (క్యాపిటల్ గెయిన్స్) వంటి ఇతర ఆదాయాలకు మాత్రం ఈ రిబేటు వర్తించదని ఆర్థికమంత్రి స్పష్టం చేశారు. అంటే మీరు ఒక ఏడాదిలో ఆర్జించిన మూలధన లాభాలు, జీతం కలిపి రూ.12 లక్షల లోపు ఉన్నా... మూలధన లాభాలపై మాత్రం పన్ను చెల్లించాల్సి ఉంటుందన్న మాట!!.

శనివారం లోక్‌సభలో బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి... త్వరలో కొత్త ఆదాయపు పన్ను చట్టాన్ని తీసుకురానున్నట్లు ప్రకటించారు. అత్యంత గజిబిజిగా ఉన్న ప్రస్తుత ఆదాయ పన్ను చట్టం స్థానంలో అత్యంత సరళంగా ఉండే కొత్త చట్టాన్ని తీసుకురానున్నట్లు ప్రకటించారు. అంతే కాకుండా పన్నుల శ్లాబులను మరింత సరళతరం చేస్తూ... అత్యధిక పన్నురేటు 30 శాతాన్ని ఇప్పటి దాకా రూ.15 లక్షలు దాటితే వర్తింపజేస్తుండగా... ఇకపై దాన్ని రూ.24 లక్షలు దాటితేనే వర్తింపజేస్తామని ప్రకటించారు. అంతేకాకుండా సీనియర్ సిటిజన్స్‌కు ఉపయోగపడేలా టీడీఎస్, కంపెనీలకు ప్రయోజనం కల్పించేలా టీసీఎస్ నిబంధనల్లో పలు మార్పులను ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనల వల్ల ప్రస్తుతం రిటర్నులు దాఖలు చేస్తున్న వారిలో 85 శాతానికి పైగా ప్రయోజనం పొందుతారని నిపుణులు అంచనా వేస్తున్నారు.

ట్యాక్స్ రిబేట్ పరిధి రూ.7 లక్షల నుంచి 12 లక్షలకు పెంపు

దీనికి స్టాండర్డ్ డిడక్షన్ రూ.75,000 అదనం

ఇకపై వార్షికాదాయం రూ. 24లక్షలు దాటితేనే 30శాతం పన్ను పరిధిలోకి..

ఇంటి అద్దె, అలవెన్సులు, పొదుపు పథకాలు, గృహరుణాలు, ఇతర వ్యయాల వంటి వాటిని చూపించి పన్ను భారం తగ్గించుకునే పాత పన్నుల విధానం స్థానంలో ఎటువంటి పొదుపు అవసరం లేని కొత్త పన్నుల విధానాన్ని 2020 బడ్జెట్ ద్వారా కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. ఆ తరువాతి సంవత్సరం నుంచి కొత్త పన్ను విధానం అమల్లోకి వచ్చింది. కొత్త, పాత విధానాల్లో ఏది ఎంచుకుంటారన్నది పన్ను చెల్లింపు దారుల ఇష్టమని మొదట్లో చెప్పినా... ప్రతి బడ్జెట్లో కొత్త పన్నుల విధానాన్ని ఎంచుకునే వారిని ప్రోత్సహించేలా... పాత పన్నుల విధానాన్ని అనుసరిస్తున్న వారిని నిరుత్సాహ పరిచేలా చర్యలు తీసుకుంటూ వస్తున్నారు. ఇక పాత విధానానికి స్వస్తి చెప్పాల్సిన

ఇక కొత్త పన్ను చట్టం

సమయం వచ్చిందని భావించారో ఏమో... ఈ బడ్జెట్లో కొత్త పన్ను విధానం కింద మినహాయింపు పరిమితిని భారీగా పెంచుతూ... దాదాపుగా ప్రతి ఒక్కరూ కొత్త విధానాన్నే ఎంచుకునే పరిస్థితిని కల్పించారు మంత్రి నిర్మల. వచ్చే వారం పార్లమెంటులో కొత్త పన్ను చట్టాన్ని ప్రవేశపెడతామని చెప్పటం ద్వారా ఇక పాత పన్ను చట్టానికి స్వస్తి చెబుతామని చెప్పకనే చెప్పారు. వాస్తవానికి ఇప్పటిదాకా పాత పన్ను విధానాన్ని ఎంచుకుంటున్న వారిలో ఒకటో అరో తప్ప అంతా రూ.12 లక్షల లోపు వార్షికాదాయం ఉన్నవారే. ఇప్పుడు వారందరికీ పూర్తిస్థాయి మినహాయింపు ఇవ్వటంతో.... ఇక వారికి రకరకాల సేవింగ్స్ చేయటం, బిల్లులు చూపించటం వంటివి తప్పిపోతాయి. నేరుగా పన్ను మినహాయింపు లభిస్తుంది. కాబట్టి వారంతా సహజంగానే కొత్త విధానంలోకి మారిపోతారు. అంటే.... దాదాపు ఎలాంటి ప్రతిఘటనా లేకుండానే పాత విధానాన్ని ప్రతి ఒక్కరూ వదిలిపెట్టి కొత్త విధానంలోకి మారిపోతారు. కొత్త చట్టం వచ్చినా వ్యతిరేకత ఉండదు.

రూ.80వేల నుంచి రూ.1.10 లక్షల దాకా లాభం

కొత్త పన్ను (2025-26 నుంచి అమలు) విధానం ప్రకారం... మినహాయింపు పరిమితిని రూ.7 నుంచి 12 లక్షలకు పెంచటమే కాదు. ప్రస్తుతం రూ.3 లక్షలుగా ఉన్న బేసిక్ లిమిట్‌ను రూ.4 లక్షలకు పెంచారు. దాంతో పాటు ప్రతి 4 లక్షలకు ఒక శ్లాబు రేటు చొప్పున మొత్తం 7 శ్లాబులను ప్రవేశపెట్టారు. దీంతో రూ.24 లక్షల లోపు ఆదాయానికి 30% పన్ను వర్తించదు. గతంలో 15 లక్షలు దాటితే 30% పన్ను రేటు చెల్లించాల్సి వచ్చేది. అలాగే రూ.20-24 లక్షల ఆదాయం ఉన్న వారికి 25% పేరుతో కొత్త శ్లాబు రేటును ప్రవేశపెట్టారు. ఈ మార్పుల వల్ల రూ.12 లక్షల ఆదాయం ఉన్న వారికి 80,000, రూ.18 లక్షల ఆదాయం ఉన్నవారికి రూ.70,000, రూ.25 లక్షలపైన ఆదాయం ఉన్న వారికి రూ.1.10 లక్షల వరకు ప్రయోజనం కలుగుతుంది.

సీనియర్ సిటిజన్లకు ఊరట

వడ్డీ ఆదాయంగా జీవించే సీనియర్ సిటిజన్స్ టీడీఎస్ పరిమితిని రెట్టింపు చేస్తున్నట్లు నిర్మలా సీతారామన్ ప్రకటించారు. టీడీఎస్ అంటే మూలం దగ్గర చెల్లించే పన్ను. అంటే వడ్డీ రూపంలో వచ్చే ఆదాయం గనక పరిమితిని దాటితే అందులో 10 శాతాన్ని టీడీఎస్ రూపంలో బ్యాంకులు, ఆర్థిక సంస్థలే కట్ చేస్తాయి.



ప్రస్తుతం ఈ వడ్డీ ఆదాయం టీడీఎస్ పరిమితి రూ.50,000. ఇకపై దీన్ని రూ.లక్ష చేస్తున్నట్లు నిర్మల ప్రకటించారు.

ఇంటద్దె రూపంలో వచ్చే వార్షికాదాయం గనక రూ.2.4 లక్షలు దాటితే ఇప్పటిదాకా టీడీఎస్ చెల్లించాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ పరిమితిని రూ.6 లక్షలకు పెంచారు.

బీమా కమీషన్లపై టీడీఎస్ రేటును 5 నుంచి 2 శాతానికి తగ్గించారు

రెమిటెన్స్‌లపై విధించే ట్యాక్స్ కలెక్ట్ ఎట్ సోర్స్ (టీసీఎస్) పరిమితిని రూ.7 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచడంతో పాటు... విదేశీ విద్యకోసం బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని చేసే రెమిటెన్స్‌లై టీసీఎస్‌ను ఎత్తివేస్తున్నట్లు ప్రకటించారు. ఇక నుంచి అధిక టీడీఎస్‌ను కేవలం పాన్ నెంబర్ లేని కేసులకు మాత్రమే పరిమితం చేస్తామని ప్రకటించారు. తప్పుగా ఆదాయం చూపించిన రిటర్నులు సవరించుకునే కాలపరిమితిని రెండేళ్ల నుంచి నాలుగేళ్లకు పెంచారు. నాలుగేళ్లలోపు స్వచ్ఛందంగా అధిక పన్ను చెల్లించడం ద్వారా సవరించిన రిటర్నులు తిరిగి దాఖలు చేసుకోవచ్చు.

కొత్త పన్నుల విధానంలో ప్రస్తుత శ్లాబులు ఇలా ఉన్నాయి

ఆదాయం	పన్ను రేటు
0-3 లక్షలు	లేదు
3-7 లక్షలు	5%
7-10 లక్షలు	10%
10-12 లక్షలు	15%
12-15 లక్షలు	20%
15 లక్షల పైన	30%

మారిన తర్వాత శ్లాబు రేటులు ఇలా ఉంటాయి

ఆదాయం	పన్ను రేటు
0-4 లక్షలు	లేదు
4-8 లక్షలు	5%
8-12 లక్షలు	10%
12-16 లక్షలు	15%
16-20 లక్షలు	20%
20-24 లక్షలు	25%
24 లక్షల పైన	30%

పన్ను చెల్లించక్కర్లేని ఆదాయ పరిమితి ఇలా పెరిగింది (రూ.లలో)

సంవత్సరం	ఆదాయ పరిమితి
2005	1 లక్ష
2012	2 లక్షలు
2014	2.5 లక్షలు
2019	5 లక్షలు
2023	7 లక్షలు
2025	12 లక్షలు

అసలు లాభం కోటి మందికేనా?

ఇపుడు యావద్దేశమూ బడ్జెట్లో పెంచిన ఆదాయపు పన్ను పరిమితి గురించే మాట్లాడుతోంది. తాము భారతదేశ మధ్య తరగతికి ఎనలేని మేలు చేశామని, యావత్తు మధ్య తరగతికీ ఊరటనిచ్చామని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. మరి ఇది నిజమేనా? వాస్తవానికి 145 కోట్ల మంది భారతదేశ జనాభాలో 2024-25లో ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేసినవారి సంఖ్య దాదాపుగా 8.09 కోట్లు. అందులో దాదాపుగా 6 కోట్ల మంది రూ.7 లక్షల లోపు వార్షికాదాయం ఉండి జీరో రిటర్నులు వేసినవారే. మిగిలిన వారిలో కోటి మంది రూ.12 లక్షలకన్నా ఎక్కువ వార్షికాదాయం ఉన్నవారు. అంటే మిగిలిన 1.09 కోట్ల మందికే తాజా నిర్ణయంతో ఎక్కువ మేలు కలుగుతుందన్న మాట. ఎందుకంటే వారు మాత్రమే ప్రస్తుతం రూ.7 లక్షల నుంచి రూ.12 లక్షల మధ్య ఆదాయం ఉండి పన్ను రిటర్నులు దాఖలు చేస్తున్నవారు. కాకుంటే.. శ్లాబుల మార్పు వల్ల రూ. 12 లక్షల నుంచి రూ. 24 లక్షల మధ్య ఆదాయం ఉండేవారికి కూడా కొంత ప్రయోజనం కలుగుతుండటం గమనార్హం. మరి ఈ 1.09 కోట్ల మందికి లబ్ధి కలిగించే నిర్ణయం తీసుకుని యావత్తు మధ్య తరగతికీ మేలు చేశామని చెప్పటం కరెక్టేనా? అసలు పన్ను పరిధిలోకే రాని 138 కోట్ల మంది సంగతేంటి? వారి బతుకు తెరువేంటి? అలాంటి వారందరినీ కూడా మధ్య తరగతిలోకో కనీసం ఆదాయపు పన్ను పరిధిలోకో తేవాలంటే వారందరికీ తగిన ఉద్యోగాలు, ఉపాధి ఉండాలి కదా? కాకపోతే ఆ దిశగా ఈ బడ్జెట్లో తీసుకున్న చర్యలేవీ కనిపించలేదు. కాకపోతే ఉద్యోగులంటేనే ఎక్కువగా



మాట్లాడేవాళ్లు. వివిధ వేదికలపై వినిపించేది వారి గొంతే. సమాజాన్ని ఎక్కువగా ప్రభావితం చేసేదీ వాళ్లే. అందుకే మోదీ వారిని లక్ష్యించారు. కాబట్టే ఇపుడు దేశమంతా బడ్జెట్లో మిగతా విషయాలు పక్కనబెట్టి ఆదాయపు పన్ను గురించి మాట్లాడుతోంది.

లక్ష కోట్లు నష్టపోయి మరీ... ఎందుకిలా?

ప్రభుత్వం తీసుకున్న తాజా చర్య వల్ల ఏడాదికి లక్ష కోట్లు నష్టపోవాల్సి వస్తుందని ఆర్థిక మంత్రి నిర్మల చెప్పారు. మామూలుగా ఎప్పుడూ ఇంతటి నష్టం వచ్చే చర్యలు తీసుకోరు. ఎందుకంటే ఇప్పటికే రుణాలు పెరిగిపోతున్నాయి. మరి లక్ష కోట్ల ఆదాయాన్ని కోల్పోవటమంటే మాటలు కాదు కదా? కాకపోతే ప్రభుత్వ ఉద్దేశం వేరు. తాత్కాలికంగా ఉద్యోగుల్ని సంతృప్తి పరచటం ద్వారా తక్షణ ప్రయోజనాలు పొందటమే కాక... పాత పన్ను విధానాన్ని పూర్తిగా తొలగించి, ప్రతి ఒక్కరినీ కొత్త పన్ను విధానంలోకి తేవటమన్నది ప్రభుత్వ అసలు లక్ష్యం. ఇందులో భాగంగానే ఈ పరిమితి పెంపు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో పాత పన్ను విధానం నిరర్థకమైపోతుంది. పన్ను కోసం చేసే సేవింగ్స్, అలవెన్సులు, పన్ను కోసం చేసే బీమా చెల్లింపుల వంటివన్నీ తెరమరుగైపోతాయి. మొత్తంగా అలవెన్సుల వ్యవస్థే కనిపించకుండా పోతుంది. దీనికితోడు మినహాయింపులేవీ ఉండవు కనక అత్యధిక శాతం మందికి పన్ను రిటర్నులు దాఖలు చేయటం అత్యంత సులభమైపోతుంది. రకరకాల ఆదాయాలుండి, వాటిని మేనేజ్ చేయాల్సిన పరిస్థితి ఉన్నవారికి తప్ప.. ఒక్క జీతంపైనే ఆధారపడ్డ వారెవ్వరికీ పన్ను రిటర్నులు వేయటానికి ట్యాక్స్ అసిస్టెంట్లు, ఆడిటర్ల అవసరం ఉండదు. ఇక ఆదాయపు పన్ను విభాగంలో కూడా రిఫండ్ల వంటి ప్రక్రియ ఉండదు. పన్నుల వ్యవస్థ సరళమైపోతుంది కనక ఆదాయపు పన్ను విభాగాన్ని మరింత సమర్థంగా వినియోగించుకునే అవకాశం ఉంటుంది. పైపెచ్చు సరళమైన పగడ్బందీ పన్ను విధానం అమల్లోకి వస్తుంది. రిబేట్ పరిమితి 12 లక్షల వరకూ ఉంటుంది కనక వృత్తి నిపుణులతో సహా ఎక్కువ మంది రిటర్నులు వేయటానికి ముందుకొస్తారు. ట్యాక్స్ బేస్ పెరుగుతుంది. మున్ముందు వీరంతా పన్ను చెల్లిస్తే ఆదాయ వృద్ధి చాలా ఎక్కువగా ఉంటుంది. ఇవన్నీ దృష్టిలో పెట్టుకునే మోదీ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని చెప్పాలి.

మార్పులతో ప్రయోజనం ఇలా.. (రూ. లో)

ఆదాయం	ప్రస్తుత పన్నుభారం	కొత్త విధానంలో ప్రయోజనం	చెల్లించాల్సిన పన్ను
8 లక్షలు	30,000	30,000	00
9 లక్షలు	40,000	40,000	00
10 లక్షలు	50,000	50,000	00
11 లక్షలు	65,000	65,000	00
12 లక్షలు	80,000	80,000	00
16 లక్షలు	1,70,000	50,000	1,20,000
20 లక్షలు	2,90,000	90,000	2,00,000
24 లక్షలు	4,10,000	1,10,000	3,00,000
50 లక్షలు	11,90,000	1,10,000	10,80,000



శనివారం బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ముందు రాష్ట్రపతి భవన్‌లో తనను కలసిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు సంప్రదాయంగా నోరు తీపి చేస్తున్న రాష్ట్రపతి ద్రౌపదీముర్ము

రూ.12.75 లక్షలకు ఒక్క రూపాయి మించినా..

నిజానికి పన్ను మినహాయింపు పరిమితిని రూ.7 లక్షల నుంచి రూ.12 లక్షలవరకూ పెంచుతున్నట్లు ఆర్థిక మంత్రి ప్రకటించటంతో... చాలామంది తమకు రూ.15 లక్షల వేతనం ఉన్నట్లయితే కేవలం రూ.3 లక్షలపై పన్ను చెల్లిస్తే చాలుననే అపోహల్లో ఉన్నారు. వాస్తవానికి ఆర్థిక మంత్రి పెంచింది పన్ను మినహాయింపు పరిమితిని కాదు. పన్ను రిబేట్ పరిమితిని. అంటే... 12 లక్షల లోపు ఆదాయం ఉన్న వారు రిబేట్ పరిధిలోకి వస్తారు. కాబట్టి వారికి పన్ను ఉండదు. దీనికి ఎలాగూ స్టాండర్డ్ డిడక్షన్‌గా పేర్కొనే రూ.75వేలను కలుపుతారు. అంటే రూ.12.75 లక్షల వరకూ వార్షిక వేతనం ఉన్నవారు రూపాయి కూడా పన్ను చెల్లించాల్సిన పనిలేదు. దీనిప్రకారం చూసుకుంటే నెలకు రూ.1,06,250 వేతనం అన్న మాట. అయితే దీనికన్నా ఒక్క రూపాయి దాటినా వారు రిబేట్ పరిధిని దాటిపోతారు. కాబట్టి సహజంగా పన్ను శ్లాబుల ప్రకారం పన్ను చెల్లించాల్సి ఉంటుంది.


ఉదాహరణకు...

మీ వార్షిక వేతనం రూ.12.80 లక్షలనుకోండి. మీరు రిబేట్ పరిధిలోకి రారు. కాబట్టి మీ వేతనం నుంచి రూ.75వేలు స్టాండర్డ్ డిడక్షన్ తీసేయగా... మిగిలిన రూ.12.05 లక్షలకు శ్లాబుల ప్రకారం పన్ను పడుతుంది. అంటే... దీన్లో రూ.4 లక్షలవరకూ జీరో... రూ.4 -8 లక్షల ఆదాయానికి 5 శాతం.. అంటే 20వేలు, రూ.8-12 లక్షల ఆదాయానికి 10 శాతం అంటే 40 వేలు, మిగిలిన 5వేలపై 15 శాతం... అంటే రూ.750. మొత్తంగా రూ.60,750 పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అంటే... రూ.12.75 లక్షలకన్నా 5వేలు ఎక్కువ ఉన్నందుకు రూ.60,750 పన్ను చెల్లించాల్సి వస్తోంది. అదే 12.75 లక్షల లోపుంటే... రూపాయి కూడా పన్ను చెల్లించాల్సిన అవసరం ఉండదు. ఇదీ లెక్క.

ఇది మరిచిపోకండి...

జీతం ఒక్కటే మీ ఆదాయంగా పరిగణించకూడదు. మీ బ్యాంకులోని సేవింగ్స్ ఖాతాలో ఉన్న సొమ్ముపై వచ్చే వడ్డీ కూడా మీ జీతం లెక్కలోకే వస్తుంది. అలాగే ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వచ్చే వడ్డీలు, ఇంటద్దె రూపంలో వచ్చే ఆదాయం అన్నీ కూడా జీతం లెక్కలోకే వస్తాయి. ఇక షేర్లు, క్యాపిటల్ మార్కెట్లో పెట్టుబడులపై వచ్చే రాబడులను జీతం కింద పరిగణించబోమని ఈ సారి బడ్జెట్లో నిర్మలా సీతారామన్ స్పష్టంగా చెప్పారు. వీటిపై వచ్చే ఆదాయంపై క్యాపిటల్ గెయిన్స్ తప్పనిసరిగా చెల్లించాల్సి ఉంటుంది. ఇలా వచ్చే ఆదాయం రూ.12.75 లక్షల లోపున్నా సరే... మీ మొత్తం ఆదాయానికి కలిపినా కూడా రూ.12.75 లక్షల లోపున్నా సరే... వీటిపై క్యాపిటల్ గెయిన్స్ పన్ను చెల్లించాల్సి ఉంటుంది.

ఈ దేశాలు అప్పుల కుప్పలు..! (జీడీపీలో అప్పుల శాతం)






దొంతు నర్సింహారెడ్డి
వ్యవసాయ రంగ నిపుణులు

ప్రతి రాష్ట్రంలో ఏ సీజన్‌లో ఏ పంటలు ఎంత విస్తీర్ణంలో పండుతాయో కేంద్రం వద్ద గణాంకాలున్నాయి. తదనుగుణంగా ఆయా రాష్ట్రాలకు నిధులు కేటాయించాలి. తెలంగాణకు కలిగే ప్రయోజనంపై స్పష్టత లేదు. కిసాన్ క్రెడిట్ కార్డుల రుణ పరిమితి పెంచుతున్నట్లు ప్రకటించినా రుణాలు సకాలంలో అందక వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. పంట నష్టపోయిన రైతులకు తెలంగాణలో పరిహారం అందడం లేదు.

EXPERT OPINION

గ్రామీణాభివృద్ధికి రూ.2,66,817 కోట్లు

న్యూఢిల్లీ: బడ్జెట్‌లో రక్షణ రంగం తరువాత గ్రామీణాభివృద్ధికి అత్యధికంగా రూ.2,66,817 కోట్లు కేటాయించారు. ఉపాధి హామీ పథకానికి రూ.86,000 కోట్లు కేటాయించారు. రాష్ట్రాల భాగస్వామ్యంతో గ్రామీణ ప్రాంతాల పురోభివృద్ధి కార్యక్రమాన్ని చేపడతామని ఆర్థిక మంత్రి తెలిపారు. వ్యవసాయ రంగంలో సాంకేతికత, పెట్టుబడులు, నైపుణ్యాల పెంపు ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత అవకాశాలను కల్పించడం ద్వారా వలసలను అరికడతామన్నారు. ప్రధానంగా గ్రామీణ మహిళలు, యువ రైతులు, యువత, సన్నకారు రైతులు, భూమి లేని కుటుంబాలపై ప్రధానంగా దృష్టి సారించనున్నట్లు చెప్పారు. 140 కోట్ల మంది భారతీయుల ఆకాంక్షలను ప్రతిబింబించిన ఈ బడ్జెట్ దేశం స్వయం సమృద్ధి సాధించేలా దోహదం చేస్తుందని గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రశంసించారు. దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన జాతీయ గ్రామీణ జీవనోపాధి పథకం అమలుకు రూ.19,005 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌లో ఈ పథకానికి రూ.15,047 కోట్లు కేటాయించారు.



ఎగుమతుల ప్రోత్సాహక మిషన్ ఏర్పాటు..

ఎగుమతులకు ఊతమిచ్చేందుకు కేంద్రం కొత్తగా ఎగుమతుల ప్రోత్సాహక మిషన్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీనికోసం రూ.2,250 కోట్లు కేటాయించింది. ఈ మిషన్‌ను వాణిజ్య, ఆర్థిక, సూక్ష్మ, చిన్న మాధ్యమిక సంస్థల శాఖలు సంయుక్తంగా నిర్వహిస్తాయి. దీని వల్ల ఎగుమతుల నిర్వహణ సులభతరం కావడంతోపాటు సరిహద్దుల్లో సహకారం, ఓవర్‌సీస్ మార్కెట్‌లో టారిఫ్ యేతర అంశాలను నియంత్రిస్తూ ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహకం కల్పించేందుకు దోహదపడుతుంది.



మైనార్టీ శాఖకు రూ.3,500 కోట్లు

మైనార్టీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు బడ్జెట్‌లో రూ.3,350 కోట్లు కేటాయించారు. ఇది 2024–25 బడ్జెట్ కన్నా రూ.166 కోట్లు ఎక్కువ కాగా, సవరించిన అంచనాల కన్నా రూ.1,481 కోట్లు ఎక్కువ. ఈసారి మైనారిటీ విద్యార్థుల సాధికారత కోసం రూ.678.03 కోట్లు కేటాయించారు. ఈ శాఖలోని ముఖ్య పథకాలకు రూ.1,237.32 కోట్లు ఇవ్వగా, మైనారిటీల అభివృద్ధికి రూ.1,913.98 కోట్లు ఇచ్చారు.



ఆహారం, ఎరువుల రాయితీకి రూ.3.71 లక్షల కోట్లు

ఆహారం, ఎరువులపై రాయితీకి బడ్జెట్‌లో కేంద్రం రూ.3.71 లక్షల కోట్లు కేటాయించింది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఆహార సబ్సిడీకి రూ.2.03 లక్షల కోట్లు, ఎరువుల సబ్సిడీకి రూ.1.67 లక్షల కోట్ల కేటాయించారు. సర్కారు ఖజానాపై రాయితీ భారం పెరిగిపోతోందని ప్రభుత్వ వర్గాలు చెప్పాయి.



ఎన్నికల ఖర్చులకు రూ.1400 కోట్లు

న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్‌లో న్యాయశాఖకు దాదాపు రూ.1,400 కోట్ల బడ్జెట్‌ను ప్రతిపాదించారు. అయితే, ఈ నిధులు లోక్‌సభ ఎన్నికల వ్యయం, కొత్త ఎలక్ట్రానిక్ యంత్రాల కొనుగోల, ఓటర్లకు ఐడీ కార్డుల జారీ తదితర అవసరాల కోసం క్యారీ ఫార్వర్డ్ కానున్నాయి. బడ్జెట్‌లో లోక్‌సభ ఎన్నికల వ్యయం కింద ఈ శాఖకు రూ.500 కోట్లు కేటాయించారు. ఓటర్ ఐడీ కార్డుల కోసం రూ.300 కోట్లు, ఇతర ఎన్నికల ఖర్చుల కోసం రూ.597.80 కోట్లు ప్రతిపాదించారు. ఈవీఎంల కొనుగోలు కోసం రూ.18.72 కోట్లు కేటాయించారు.



రూ. 1.45 లక్షల కోట్లు బడ్జెట్ కేటాయింపు ► వ్యవసాయం, అనుబంధ రంగాలకు కేంద్రం పెద్దపీట

- వ్యవసాయ ఉత్పాదకత పెంపు, గ్రామీణ ప్రగతి లక్ష్యంగా 6 కొత్త పథకాలు
- పప్పు ధాన్యాల్లో స్వయం సమృద్ధికి ఆరేళ్ల కార్యక్రమం
- సమగ్ర ఉద్యాన కార్యక్రమం.. ఐదేళ్ల మిషన్‌తో పత్తి సాగుకు ఊతం
- పలు పథకాలకు పెరిగిన కేటాయింపులు ..
- బిహార్‌లో మఖానా బోర్డు.. అసోంలో యూరియా ప్లాంటు
- సుస్థిర ఫిషింగ్ ఫ్రేమ్‌వర్క్‌ను ప్రకటించిన నిర్మలా సీతారామన్
- కిసాన్ క్రెడిట్ కార్డుల పరిమితి రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంపు
- 7.7 కోట్ల మంది రైతులు, మత్స్యకారులు, పాడిరైతులకు ప్రయోజనం



ధన ధాన్య కృషి రైతే మహర్షి

ప్రధానమంత్రి ధన ధాన్య కృషి యోజనతో 1.7 కోట్ల మంది రైతులకు లబ్ధి

..: న్యూఢిల్లీ :..

వ్యవసాయ రంగానికి కేంద్రం పెద్దపీట వేసింది. వ్యవసాయ ఉత్పాదకత పెంపు, గ్రామీణ ప్రగతి లక్ష్యంగా పథకాలు, కేటాయింపులు ప్రకటించింది. రైతాంగానికి లబ్ధి చేకూర్చేలా కొత్తగా ఆరు పథకాలను ప్రవేశపెట్టడంతో పాటు సబ్సిడీతో కూడిన కిసాన్ క్రెడిట్ కార్డుల పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచింది. ఆర్థికాభివృద్ధికి కీలకమైన రంగాల్లో వ్యవసాయం మొదటిదని పేర్కొన్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్..2025–26 బడ్జెట్‌లో వ్యవసాయం, దాని అనుబంధ రంగాలు, ఆహార శుద్ధి కార్యక్రమాలకు కలిపి రూ.1.45 లక్షల కోట్లు కేటాయించారు. అయితే కొత్త పథకాలకు కేటాయింపులపై స్పష్టత వచ్చిన తర్వాత ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సవరించిన అంచనాలు రూ.1.47 లక్షల కోట్లను తాజా బడ్జెట్ అధిగమించ వచ్చని భావిస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటే వ్యవసాయ మంత్రిత్వ శాఖకు 2.75 శాతం తక్కువ బడ్జెట్‌ను ప్రకటించినప్పటికీ, కేంద్రం కీలక పథకాలకు శ్రీకారం చుట్టడం గమనార్హం. అయితే అనుబంధ రంగాలకు, మత్స్య పరిశ్రమ, పశుసంవర్ధక శాఖ, పాడి పరిశ్రమకు 37 శాతం అధికంగా రూ.7,544 కోట్లు కేటాయించారు. అదేవిధంగా ఫుడ్ ప్రాసెసింగ్‌కు 56 శాతం అధికంగా రూ.4,364 కోట్లు కేటాయించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2024–25) మొత్తంగా రూ.1.57 లక్షల కోట్ల బడ్జెట్‌ను కేంద్రం ప్రతిపాదించింది.

ఆహార భద్రతపై దృష్టి ..

➤ తాజా బడ్జెట్‌లో ఆహార భద్రతపై ప్రధానంగా దృష్టి పెట్టిన కేంద్రం.. తక్కువ సాగు, ఉత్పాదకతతో వ్యవసాయంలో వెనుకబడిన దేశంలోని 100 జిల్లాలను లక్ష్యంగా చేసుకుని ప్రధానమంత్రి ధన ధాన్య కృషి యోజన పథకానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో అమలు చేసే ఈ పథకంతో..ధాన్యం ఉత్పాదకత పెంపు, పంటల్లో వైవిధ్యం, పంటల కోత అనంతర సదుపాయాలను మెరుగుపరచడం ద్వారా దేశవ్యాప్తంగా 1.7 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరుతుందని భావిస్తున్నారు.

పప్పు ధాన్యాల్లో స్వయం సమృద్ధి ..

➤ పప్పు ధాన్యాల్లో స్వయం సమృద్ధి (ఆత్మ నిర్భర్) లక్ష్యంగా ఆరేళ్ల పప్పు ధాన్యాల కార్యక్రమాన్ని (పల్సెస్ మిషన్) కేంద్రం ప్రకటించింది. కంది, మినప, ఎర్రపప్పు (మసూర్) ఉత్పత్తిని ప్రోత్సహించే ఈ కార్యక్రమానికి రూ.1,000 కోట్లు కేటాయించింది. ఈ కార్యక్రమంలో భాగంగా నాఫెడ్, ఎన్‌సీసీఎఫ్‌లు రైతులతో లాంఛనంగా ఒప్పందాలు కుదుర్చుకుని నాలుగేళ్ల పాటు ఈ పప్పు ధాన్యాలను సేకరిస్తాయి.

సుస్థిర ఫిషింగ్ ఫ్రేమ్‌వర్క్ ..

➤ రూ.60 వేల కోట్ల విలువైన సముద్ర ఉత్పత్తులు ఎగుమతి చేస్తూ. చేపలు, ఆక్వాకల్చర్ ఉత్పత్తిలో ప్రపంచంలోనే భారత్ రెండోస్థానంలో ఉంది. దీన్ని పరిగణనలోకి తీసుకున్న కేంద్రం.. ఓ సుస్థిర ఫిషింగ్ ఫ్రేమ్‌వర్క్‌ను ప్రకటించింది. ప్రపంచ సీఫుడ్ మార్కెట్‌లో భారత్ పోటీ తత్వాన్ని మెరుగుపరిచేందుకు వీలుగా..ఫ్రోజెన్ ఫిష్ పేస్ట్ (సురిమి)పై కనీస దిగుమతి సుంకాన్ని (బీసీడీ) 30% నుంచి 5 శాతానికి తగ్గించింది.



పండ్లు, కూరగాయలు.. పత్తికి ప్రత్యేక కార్యక్రమాలు

➤ కూరగాయలు, పండ్ల ఉత్పాదకతను పెంచే సమగ్ర ఉద్యాన కార్యక్రమానికి, అలాగే మంచి (పొడవైన పింజ) పత్తి రకాలను ప్రోత్సహించేందుకు ఐదేళ్ల కాల పరిమితితో కూడిన కాటన్ (పత్తి) మిషన్‌కు రూ.500 కోట్ల చొప్పున కేటాయించారు. ఇటీవల తెలంగాణలోని నిజామాబాద్‌లో పసుపు బోర్డును ప్రకటించిన కేంద్రం.. తాజా బడ్జెట్‌లో బిహార్‌కు రూ.100 కోట్లతో మఖానా (తామర గింజ (ఫాక్స్ నట్) బోర్డును మంజూరు చేసింది. అదేవిధంగా మరో రూ.100 కోట్లతో వివిధ వాతావరణ పరిస్థితులను తట్టుకోగలిగే విత్తనాల అభివృద్ధి లక్ష్యంగా ఓ పరిశోధనా వ్యవస్థను ప్రకటించింది. అసోంలోని నామ్‌రూప్‌లో 12.7లక్షల టన్నుల వార్షిక సామర్థ్యంతో ఓ యూరియా కర్మాగారాన్ని కూడా ప్రతిపాదించారు.

కృషి వికాస్ యోజనకు రూ.8,500 కోట్లు

➤ రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకానికి 41.66 శాతం పెంపుతో రూ.8,500 కోట్లు కేటాయించారు. కృషియోన్నతి (రూ.8వేల కోట్లు), నమో డ్రోన్ దీదీ, నేషనల్ మిషన్ ఫర్ నేచురల్ ఫార్మింగ్, ప్రధానమంత్రి, మత్స్య సంపద యోజన తదితర పథకాలకు నిధులు గణనీయంగా పెంచారు.

గ్రామీణ ప్రగతి కార్యక్రమం..

గ్రామీణ నిరుద్యోగితకు పరిష్కారంగా సమగ్ర 'గ్రామీణ ప్రగతి..స్థితి స్థాపకత' కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు నిర్మలా సీతారామన్ చెప్పారు. వలసలు అనేవి తప్పనిసరి కాకుండా ఓ ప్రత్యామ్నాయంగానే ఉండేలా గ్రామీణ ప్రాంతాల్లో తగినన్ని ఉపాధి అవకాశాలు కల్పించడమే దీని లక్ష్యమని ఆర్థికమంత్రి వివరించారు. గ్రామీణ మహిళలు, యువత, యువ రైతులు, సన్న చిన్నకారు రైతులు, భూముల్లేని కుటుంబాలపై ఈ కార్యక్రమం ప్రత్యేకంగా దృష్టి సారిస్తుందని చెప్పారు.





కిసాన్ క్రెడిట్ కార్డులతో మరింత రుణం

➤ రైతులకు రుణ భద్రతను మరింత పెంచాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. ఇందులో భాగంగానే కిసాన్ క్రెడిట్ కార్డు రుణ పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచినట్లు తెలిపారు. కిసాన్ క్రెడిట్ కార్డు పథకాన్ని కేంద్రం ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నాబార్డ్ కలిసి ప్రారంభించాయి. ఈ కార్డుపై ఇప్పటి దాకా రూ.3 లక్షల రుణ పరిమితి ఉండగా..దీన్ని తాజాగా రూ.5 లక్షలకు పెంచడంతో దేశవ్యాప్తంగా 7.7 కోట్ల మంది రైతులు, మత్స్యకారులు, పాడి రైతులు లబ్ధి పొందనున్నారు. పెంచిన పరిమితి మేరకు వీరు స్వల్పకాలిక రుణాలు పొందేందుకు అవకాశం ఉంది.

పరిశ్రమ వర్గాల హర్షం

➤ బడ్జెట్‌లో వ్యవసాయానికి ఇచ్చిన ప్రాధాన్యతపై పరిశ్రమ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్టర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఈఏ) అధ్యక్షుడు సంజీవ్ అస్థానా, ఫెడ రేషన్ ఆఫ్ సీడ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఐఐ)చైర్మన్ అజయ్ రాణా, అదాని విల్మార్ సీఈఓ అంగ్షు మాలిక్, బేయర్ క్రాప్ సైన్సెస్ ఎండీ సైమన్ వీ బుష్‌లు హర్షం వ్యక్తం చేశారు.



దూరదృష్టి బడ్జెట్..

➤ 'ఇది దూరదృష్టితో కూడిన బడ్జెట్. విశ్వాసం అనే పరిమళం ఇందులో ఉంది. అభివృద్ధి కోసం, అభివృద్ధి చెందిన భారత్ నిర్మాణం కోసం తపన ఇందులో ఉంది. స్వయం సమృద్ధి భారత్ దిశగా ప్రభుత్వ దార్శనికతలో వ్యవసాయం, రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత లభించింది..' అని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ పేర్కొన్నారు.

రైతు సంఘాల అసంతృప్తి.. 5న ధర్నా

➤ అన్ని పంటలకు చట్టబద్ధమైన గ్యారంటీతో కూడిన కనీస మద్దతు ధర కల్పించాలనే తమ దీర్ఘకాల డిమాండ్‌ను కేంద్రం పట్టించుకోక పోవడంపై రైతు సంఘాలు అసంతృప్తి వ్యక్తం చేశాయి. పంట రుణాలు మాఫీ చేయకపోవడం, రైతు, కార్మిక, పేదల వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల బడ్జెట్‌కు నిరసనగా ఈ నెల 5న ధర్నా నిర్వహిస్తామని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) తదితర సంఘాలు ప్రకటించాయి.

..: న్యూఢిల్లీ :..

మహిళా, శిశు అభివృద్ధి శాఖకు నిధుల కేటాయింపులు స్వల్పంగా పెరిగాయి. 2025–26 బడ్జెట్‌లో కేంద్రం రూ.26,889.69 కోట్లు కేటాయించింది. 2024–25లో సవరించిన అంచనా రూ.23,182.98 కోట్లు కాగా, తాజాగా బడ్జెట్‌లో మరో రూ.3,706.71 కోట్లు పెంచారు. మొత్తం కేటాయింపుల్లో రూ.21,960 కోట్లను 'సాక్షం అంగన్‌వాడీ', పోషణ్ 2.0 కార్యక్రమాలకు ఖర్చు చేయనున్నారు. చిన్నారులు, కౌమార దశలోని బాలికల్లో పోషకాహార లేమిని అరికట్టాలని, శిశు సంరక్షణను బలోపేతం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయబోతోంది. సాక్షం అంగన్‌వాడీ, పోషణ్ 2.0 కార్యక్రమాలతో ఈశాన్య రాష్ట్రాలతో పాటు దేశ వ్యాప్తంగా 8 కోట్ల మంది బాలలు, కోటి మంది గర్భిణులు, బాలింతలు, 20 లక్షల మంది కౌమార బాలికలు ప్రయోజనం పొందుతారని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పీఎం–జన్‌మన్)కు అదనంగా రూ.120 కోట్లు కేటాయించారు. ఈ నిధులను 75 గిరి జన జాతుల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి వ్యయం చేస్తారు. గిరిజనాభివృద్ధి కోసం ధార్తి అబా జనజాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్‌కు రూ.75 కోట్లు కేటాయించారు. బాలల రక్షణ సేవలకు గాను 'మిషన్ వాత్సల్య' కోసం గతేడాది రూ.1,391 కోట్లు కేటాయించగా, ఈసారి రూ.1,500 కోట్లు కేటాయించారు.



మహిళా, శిశు అభివృద్ధికి రూ.26,889 కోట్లు

మొత్తం కేటాయింపుల్లో రూ.21,960 కోట్లు అంగన్‌వాడీ, పోషణ్ 2.0కే..

మహిళా వ్యాపారవేత్తలకు రూ.2 కోట్ల రుణం

తొలిసారి వ్యాపారవేత్తలుగా మారిన మహిళలకు, ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం రూ.2 కోట్ల టర్మ్ లోన్ మంజూరు చేయనుంది. 5 లక్షల మందికి ఈ రుణాలు ఇవ్వనున్నారు. సూక్ష్మ, మధ్య తరహా, భారీ పరిశ్రమల కోసం 'మాన్యుఫాక్చరింగ్ మిషన్' నెలకొల్పనున్నట్లు వెల్లడించారు.

'మిషన్ శక్తి'కి రూ.3,150 కోట్లు

➤ మహిళా సాధికారతే ధ్యేయంగా 'మిషన్ శక్తి' అమలుకు రూ.3,150 కోట్లు కేటాయించారు. బేటీ బచావో.. బేటీ పడావో, వన్‌స్టాప్ సెంటర్లు, నారీ ఆదాలత్‌లు, ఉమెన్ హెల్ప్‌లైన్, మహిళా పోలీసు వాలంటీర్లకు రూ.629 కోట్లు ఖర్చు చేస్తారు. స్వధార్ గృహాలు, ప్రధాని మాతృ వందన యోజన, వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లు, నేషనల్ క్రెష్ స్కీమ్‌కు రూ.2,521 కోట్లు వెచ్చిస్తారు. నిర్భయ నిధికి రూ.30 కోట్లు, జాతీయ మహిళా కమిషన్‌కు రూ.28 కోట్లు, జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌కు రూ.25 కోట్లు కేటాయించారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ కో–ఆపరేషన్, చైల్డ్ డెవలప్‌మెంట్‌కు రూ.90 కోట్లు, సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ ఏజెన్సీ (సీఏఆర్ఏ)కు రూ.14.49 కోట్లు కేటాయించారు.



లక్ష్మీ కటాక్షం బిహార్‌కే

రాష్ట్రంలో త్వరలో మఖానా బోర్డు..

న్యూఢిల్లీ: త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బిహార్‌లో కేంద్ర బడ్జెట్‌లో అగ్రతాంబూలం దక్కింది. రాష్ట్రంలో ఓటర్ల మనసులు గెలుచుకొని, మరోసారి అధికారం దక్కించుకోవా లన్న తపన బడ్జెట్ కేటాయింపుల్లో కనిపించింది. బిహార్‌లో ప్రస్తుతం ఎన్డీయే పాలన సాగుతోంది. మఖానా బోర్డు నుంచి గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు దాకా పలు కీలక ప్రాజెక్టులను బిహార్‌కు ప్రకటించారు. మిథిలాంచల్ ప్రాంతంలోని వెస్టర్న్ కోశీ కెనాల్ ఈఆర్ఎం ప్రాజెక్టుకు ఆర్థిక సాయం అందించనున్నట్లు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించారు. పూర్వోదయ పథకంలో భాగంగా బిహార్‌లో 'నేషనల్ ఇనిస్టి ట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ మేనేజ్ మెంట్'ను స్థాపిస్తామన్నారు. తూర్పు భారతదేశంలో ఆహార శుద్ధికి ఇదొక ప్రధాన కేంద్రంగా మారుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఐఐటీ–పాట్నాలో హాస్టల్‌తోపాటు ఇతర మౌలిక సదుపాయాల సామర్థ్యాన్ని భారీగా పెంచుతామన్నారు. పాట్నా ఎయిర్‌పోర్టును మరింత విస్తరింపజేస్తామని, పాట్నా జిల్లాలో బ్రౌన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టును అభివృద్ధి చేస్తామని తెలిపారు. బిహార్‌లో ఫూల్ మఖానా సాగుకు మరింత ప్రోత్సాహం అందిస్తామన్నారు. ఇందుకోసం మఖానా బోర్డు ఏర్పాటు చేయబోతున్నామని వెల్లడించారు. దీనిద్వారా మఖానా ఉత్పత్తి, శుద్ధి, విలువ జోడింపు, మార్కెటింగ్ మరింత పెరుగుతుందన్నారు. మఖానా రైతులకు శిక్షణ ఇస్తామని తెలిపారు. వారితో రైతు ఉత్పత్తి సంస్థలు ఏర్పాటు చేస్తామన్నారు. బడ్జెట్‌లో బిహార్ మంచి ప్రాధాన్యం దక్కడం పట్ల ఎన్డీయే నేతలు హర్షం వ్యక్తంచేశారు. నరేంద్ర మోదీ ప్రభుత్వానికి కేంద్ర మంత్రి, లోక్ జనశక్తి(రామ్ విలాస్) నేత చిరాగ్ పాశ్వాన్ కృతజ్ఞతలు తెలియజేశారు. మఖానా బోర్డు ఏర్పాటుతో బిహార్ రైతులకు నూతన అవకాశాలు అందుబాటులోకి వస్తాయని జేడీ(యూ) వర్కింగ్ ప్రెసిడెంట్ సంజయ్ ఝా పేర్కొన్నారు. బిహార్‌లో మరికొన్ని నెలల్లో అసెంబ్లీ సమావేశాలు జరుగబోతున్నాయి. 2024 జూలైలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బిహార్‌కు కేంద్రం రూ.60,000 కోట్ల విలువైన పలు ప్రాజెక్టులను ప్రకటించింది.

'టాయ్' హబ్‌గా భారత్..


న్యూఢిల్లీ: ప్రపంచ ఆట వస్తువులు, బొమ్మల తయారీ కేంద్రంగా భారత్‌ను తీర్చిదిద్దడానికి కేంద్రం బడ్జెట్‌లో ఓ పథకాన్ని ప్రకటించింది. ఇందులో భాగంగా పలు ప్రాంతాల్లో క్లస్టర్లను అభివృద్ధి చేస్తారు. ఇందులో నైపుణ్యాల పెంపు, బొమ్మల తయారీ వంటి అంశాలపై దృష్టిసారిస్తారు. అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో వినూత్నంగా, సృజనాత్మకత ఉట్టిపడేలా మన్నికతో కూడిన ఆట బొమ్మలను 'మేడిన్ ఇండియా' బ్రాండ్‌తో ఈ క్లస్టర్లలో తయారు చేస్తారు. కాగా, ప్రపంచవ్యాప్తంగా ఆట బొమ్మలకు డిమాండ్ తగ్గడంతో 2021–22లో 177 మిలియన్ డాలర్లు ఉన్న భారత ఎగుమతులు, 2023–24లో 152 మిలియన్ డాలర్లకు పడిపోయాయి. కాగా, కేంద్రం నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించేలా చేయడం, బొమ్మల దిగుమతిపై కస్టమ్స్ సుంకాలను పెంచడం వంటి చర్యలు చేపట్టడంతో దేశీయ బొమ్మల తయారీ పరిశ్రమకు ఊతం లభించింది. గతంలో ఆట బొమ్మల దిగుమతిలో మన దేశం చైనాపై ఎక్కువగా ఆధారపడేది. అయితే ఈ రంగంలో కేంద్రం చేపట్టిన చర్యల కారణంగా చైనాపై ఆధారపడే పరిస్థితి క్రమంగా తగ్గుతోంది.






కేంద్ర సిబ్బంది, శిక్షణ శాఖకు రూ.334 కోట్లు

న్యూఢిల్లీ: బడ్జెట్‌లో కేంద్ర సిబ్బంది, శిక్షణ శాఖకు రూ.334 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో ప్రభుత్వ ఉద్యోగులకు, సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు. అలాగే శిక్షణకు సంబంధించిన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తారు. ఈ నిధుల్లో కార్యాలయాల ఆధునీకరణ, పైలట్ ప్రాజెక్టులకు రూ.100 కోట్లు ఖర్చు చేస్తారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ సెక్రటేరియట్ ట్రైనింగ్, మేనేజ్ మెంట్(ఐఎస్‌టీఎం), లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ శిక్షణ పథకాల కోసం రూ.118.46 కోట్లు వెచ్చించనున్నారు. 'మిషన్ కర్మయోగి'కి రూ.110 కోట్లు వ్యయం చేస్తారు. అధికార యంత్రాంగంలో సంస్కరణల కోసం మిషన్ కర్మయోగిని కేంద్రం ప్రారంభించింది. బడ్జెట్‌లో కేంద్ర పరిపాలనా ట్రిబ్యునల్(క్యాట్)కు రూ.164.62 కోట్లు, స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ)కి రూ.515.15 కోట్లు కేటాయించారు.



ఇండియా పోస్ట్.. పెద్ద లాజిస్టిక్ వ్యవస్థగా

న్యూఢిల్లీ: దేశంలో 1.5 లక్షలున్న గ్రామీణ పోస్టాఫీసుల వ్యవస్థను పెద్ద లాజిస్టిక్ వ్యవస్థగా రూపాంతరం చేస్తామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఇండియా పోస్ట్ కీలకం అవుతుందని చెప్పారు. అస్సాంలో 12.7 లక్షల టన్నుల సామర్థ్యంతో యూరియా ప్లాంట్‌ను ఏర్పాటుచేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.





చక్రధర్ బుద్ధా
లిబ్‌టెక్ ఇండియా

ఉపాధి హామీకి రూ. 86 వేల కోట్లు కేటాయించారు. అంటే గత రెండు బడ్జెట్‌లతో పోలిస్తే ఎలాంటి పెంపుదల జరగలేదు. ఫలితంగా ఈ ఏడాది బడ్జెట్‌లోని కొంత భాగం నుంచి 2024-25 బడ్జెట్‌కు సంబంధించిన బకాయిలు తీర్చేలా సర్దుబాటుకు అవకాశం ఉంది. దీనివల్ల కొత్త పనులు, కూలీలకు కూలి చెల్లింపులకు అందుబాటులో ఉండే నిధులు మరింతగా తగ్గుతాయి.

EXPERT OPINION

ఐదేళ్లలో 50 శాతానికి రుణ-జీడీపీ నిష్పత్తి తగ్గింపు

కేంద్రం రుణ-జీడీపీ (స్థూల దేశీయోత్పత్తి) నిష్పత్తిని తగ్గించడంపై దృష్టి సారించింది. 2031 మార్చి నాటికి ఈ నిష్పత్తిని 50 శాతానికి తగ్గించడానికి కొత్త రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేస్తున్నట్లు ఆర్థికమంత్రి ప్రకటించారు. ప్రస్తుతం ఈ నిష్పత్తి 57.1 శాతంగా ఉంది. ద్రవ్య బాధ్యత- బడ్జెట్ నిర్వహణ (ఎఫ్ఆర్‌బీఎం) చట్టం 2003 ప్రకారం , 2025-26 నాటికి ద్రవ్య లోటును 4.5 శాతం కంటే తక్కువకు తగ్గించాలి. ఈ లక్ష్యాన్ని సాధించగలమన్న భరోసా నేపథ్యంలో (2025-26లో 4.4 శాతానికి తగ్గుతుందని తాజా బడ్జెట్ భరోసా ఇచ్చిన సంగతి తెలిసిందే) తాజాగా కేంద్రం రుణ-జీడీపీ నిష్పత్తిపై దృష్టి పెట్టింది. తాజా ప్రణాళిక ప్రకారం, 2025-26లో ఈ నిష్పత్తిని 56 శాతానికి తగ్గించాలి. ఐదేళ్లలో ఈ నిష్పత్తిని 500 బేసిస్ పాయింట్లు (100 బేసిస్ పాయింట్లు 1%) తగ్గించడానికి కేంద్రం మరిన్ని చర్యలు తీసుకోనుంది.



‘భారత్‌లో తయారీ’కి కొత్త ఊపిరి

న్యూఢిల్లీ: భారత్‌ను తయారీ కేంద్రంగా మార్చే లక్ష్యంతో కేంద్ర సర్కారు ‘నేషనల్ మాన్యుఫాక్చరింగ్ మిషన్’ పేరుతో ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని ప్రకటించింది. దేశీయంగా తయారీని ప్రోత్సహించడం ఇందులోని ప్రధాన లక్ష్యం. ఈ కార్యక్రమంలో భాగంగా ఐదు విభాగాలపై దృష్టి సారించనుంది. సులభతర వ్యాపార నిర్వహణతోపాటు, వ్యాపార నిర్వహణ వ్యయాలు తగ్గించడం ఒకటి. డిమాండ్ ఉన్న విభాగాల్లో భవిష్యత్ అవసరాలకు అనుకూలమైన మానవవనరులను అభివృద్ధి చేయడం రెండోది. ఎంఎస్ఎంఈ రంగాన్ని చురుగ్గా, బలంగా మార్చడం. టెక్నాలజీలను అందుబాటులోకి తీసుకురావడం, నాణ్యమైన ఉత్పత్తులపై ఈ కార్యక్రమంలో భాగంగా ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఈ పథకం కింద చిన్న, మధ్య, భారీ పరిశ్రమలకు చేయూతనివ్వనున్నట్లు ఆర్థిక మంత్రి సీతారామన్ బడ్జెట్ సందర్భంగా ప్రకటించారు. విధానపరమైన మద్దతుకుతోడు, అన్ని కేంద్ర శాఖలు, రాష్ట్రాల తరఫున పర్యవేక్షణ ఉంటుందన్నారు. అంతర్జాతీయ సరఫరా వ్యవస్థతో దేశ ఆర్థిక వ్యవస్థ అనుసంధానానికి దేశీ తయారీ సామర్థ్యాలను అభివృద్ధి చేస్తామని చెప్పారు.



ర్యాపిడ్ రైల్ ప్రాజెక్ట్‌కు రూ.2,900 కోట్లు

న్యూఢిల్లీ: దేశంలోనే తొలి ప్రాంతీయ ర్యాపిడ్ రైల్ ప్రాజెక్ట్ అయిన ది నేషనల్ క్యాపిటల్ రీజియన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎన్‌సీఆర్‌టీసీ)కి 2025-26 బడ్జెట్‌లో రూ.2,900 కోట్లు కేటాయించారు. ఈ ప్రాజెక్ట్‌లో భాగమైన 13 కిలోమీటర్ల కారిడార్ గత నెల ఐదున ప్రధాని మోదీ ప్రారంభించారు. ఈ 13 కి.మీ.ల కారిడార్ ఢిల్లీలోని న్యూ అశోక్‌నగర్‌ను ఘజియాబాద్‌లోని సహిబాబాద్‌ను కలుపుతుంది. మిగతా కారిడార్లు నిర్మించాల్సి ఉంది. గత బడ్జెట్ సవరించిన అంచనాల్లో ఈ ప్రాజెక్ట్‌కు రూ.3,855 కోట్లు కేటాయించిన సంగతి తెల్సిందే. ఎన్‌సీఆర్‌టీసీ ఢిల్లీ సెక్షన్ ప్రారంభం తర్వాత ఢిల్లీ వాసులు దక్షిణ మీరట్‌కు కేవలం 40 నిమిషాల్లో చేరుకోవచ్చు.



రైల్వే వ్యవస్థను నిర్వీర్యం చేసే దిశగా బడ్జెట్

దేశంలో అత్యంత శక్తివంతమైన వ్యవస్థగా ఉన్న రైల్వే వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది. ఉద్యోగుల జీతభత్యాలు, పెన్షన్‌కు సంబంధించి రైల్వే యూనియన్ల నుంచి అందించిన అంశాల పట్ల కూడా కేంద్ర ఆర్థికశాఖ మంత్రి స్పందించకపోవడం విచారకరం. ఇంటరిమ్ రిలీఫ్, 8వ పే కమిషన్‌కు సంబంధించిన ప్రతిపాదనలపై కనీస ప్రకటన చేయకపోవడంతో రైల్వే వ్యవస్థను నిర్వీర్యం చేయడం కోసం ప్రభుత్వం అవలంబిస్తున్న తీరు స్పష్టమవుతోంది. రైల్వే బడ్జెట్‌ను సాధారణ బడ్జెట్‌లో విలీనం చేసి, రైల్వే అభివృద్ధికి, ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వడం లేదు.



– మర్రి రాఘవయ్య, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేస్ ప్రధాన కార్యదర్శి

- న్యూఢిల్లీ

గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించేలా మోదీ 3.0 సర్కారు తాజా బడ్జెట్లో పూర్తి అండదండలు అందించింది. కేంద్ర ప్రభుత్వం పల్లెల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పలు ఫ్లాగ్‌షిప్ పథకాలకు కేటాయింపులు జోరందుకున్నాయి. ముఖ్యంగా సామాన్యుల సొంతింటి కలను సాకారం చేసేందుకు పుష్కలంగా నిధులు కేటాయించారు. అలాగే, ఉపాధికి ఢోకా లేకుండా.. గ్రామీణ రోడ్లు పరుగులు తీసేలా.. బడ్జెట్లో ఫోకస్ చేశారు. ఇక తాగునీటి పథకం.. జల్ జీవన్ మిషన్‌ను 100% పూర్తి చేసేందుకు మరో మూడేళ్లు పొడిగించి, నిధుల వరద పారించారు. భారత్‌నెట్ గొడుగు కింద ఇకపై గ్రామాల్లో ప్రభుత్వ సెకండరీ స్కూళ్లు, పీహెచ్‌సీలకు సైతం హైస్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ సౌకర్యం దక్కనుంది.

గ్రామాలే మన బలగం



మోదీ 3.0... గ్రామాలకు మహర్దశ



సొంతింటికి రాచ ‘బాట’...
తాగునీటికి నిధుల ‘కుళాయి’...
స్కూళ్లు, పీహెచ్‌సీలకూ బ్రాడ్‌బ్యాండ్ యోగం...



సొంతింటికి ఫుల్ సపోర్ట్ (పీఎంఏవై)

2025-26 కేటాయింపులు:	రూ.74,626 కోట్లు
2024-25 కేటాయింపులు:	రూ.46,096 కోట్లు (సవరించిన అంచనా)

పేదలు, మధ్య తరగతి వర్గాలకు సొంతింటి కల నెరవేర్చేలా బడ్జెట్లో ఈ పథకానికి ఫుల్ సపోర్ట్ లభించింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వచ్చే ఐదేళ్లలో అదనంగా మరో 3 కోట్ల ఇళ్ల నిర్మాణాన్ని పీఎంఏవై 2.0 స్కీమ్ కింద చేపట్టనున్నట్లు గత బడ్జెట్లో ఆర్థిక మంత్రి ప్రకటించడం తెలిసిందే. పట్టణ పేదలు, మధ్య తరగతి కుటుంబాలకు అదనంగా కోటి ఇళ్లు అందించే పీఎంఏవై (అర్బన్)కు ఈ బడ్జెట్లో రూ.19,794 కోట్లు కేటాయించారు. 2025-26లో గృహ రుణం ద్వారా ఇల్లు కొనుగోలు చేసిన లబ్ధిదారులకు వడ్డీ సబ్సిడీ స్కీమ్ కింద 10 లక్షల మందికి ప్రయోజనం చేకూర్చనున్నారు. ఇందుకు మొత్తం రూ.3,500 కోట్లను కేటాయించారు. పీఎంఏవై (గ్రామీణ్)కు రూ.54,832 కోట్లు దక్కాయి. 2029 మార్చికల్లా రూ.3.06 లక్షల నిధులతో 2 కోట్ల అదనపు ఇళ్ల నిర్మాణం లక్ష్యం. 2024-25లో 40 లక్షల ఇళ్ల లక్ష్యానికి గాను డిసెంబర్ నాటికి 18 రాష్ట్రాల్లో 27.78 లక్షల ఇళ్లు మంజూరయ్యాయి.

గ్రామీణ రోడ్లు.. టాప్ గేర్

2025-26 కేటాయింపులు:	రూ.19,000 కోట్లు	2024-25 కేటాయింపులు:	రూ.14,500 కోట్లు (సవరించిన అంచనా)

గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం కోసం అమలు చేస్తున్న ఈ ఫ్లాగ్‌షిప్ స్కీమ్ (ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై)కు ఈసారి బడ్జెట్లో మరింత ప్రాధాన్యం లభించింది. ఈ స్కీమ్ నాలుగో దశను గత బడ్జెట్లో సీతారామన్ ప్రకటించగా.. ఇప్పుడు జోరందుకుంటోంది. 25,000 ప్రాంతాల్లో జనాభా పెరుగుదలకు దృష్టిపెట్టుకుని పక్కా రోడ్లతో అనుసంధానించనున్నారు. ఈ ఏడాది జనవరి నాటికి 17,570 ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం కోసం సర్వే పూర్తి చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో కొత్తగా 35,000 కిలోమీటర్ల పొడవైన పక్కా రోడ్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ‘గ్రీన్’టెక్నాలజీతో 18,000 కిలోమీటర్ల రోడ్లు వేయనున్నారు.



‘ఉపాధి’కి ఢోకా లేదు

గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధికి దన్నుగా నిలుస్తున్న మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి ఈసారీ నిధుల ‘హామీ’దక్కింది. అయితే, 2024-25 సవరించిన అంచనాల (రూ.86,000 కోట్లు)తో పోలిస్తే దాదాపు అదే స్థాయిలో కేటాయించారు. రాష్ట్రాల్లో లక్ష్యాలు, అవసరాలను బట్టి అవసరమైతే మరిన్ని నిధులను కేటాయించే అవకాశం ఉంది. 2023-24లో రూ.60,000 కోట్లు కేటాయించగా, వాస్తవ వ్యయం రూ.89,153 కోట్లు కావడం గమనార్హం.


2025-26 కేటాయింపులు:	రూ.86,000 కోట్లు	2024-25 కేటాయింపులు:	రూ.86,000 కోట్లు (సవరించిన అంచనా)

దేశంలో బహిరంగ మలమూత్ర విసర్జనను పూర్తిగా తుడిచిపెట్టడానికి (ఓడీఎఫ్) 2014లో ఆరంభమైన ఈ స్వచ్ఛ భారత్ మిషన్ కింద, గ్రామీణ ప్రాంతాల్లో ఓడీఎఫ్ స్టేటస్‌ను పూర్తిగా సాధించినట్లు కేంద్రం ప్రకటించింది. దీన్ని స్థిరంగా కొనసాగించడంతో

స్వచ్ఛ భారత్.. విస్తరణ

2025-26 కేటాయింపులు: రూ. 12,192 కోట్లు

2024-25 కేటాయింపులు: రూ. 9,351 కోట్లు (సవరించిన అంచనా)



పాటు అన్ని గ్రామాల్లోనూ ఘన వ్యర్థాల నిర్వహణ, మురుగు నీటి నిర్వహణను అమలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. స్వచ్ఛ భారత్ (అర్బన్) కింద పట్టణ ప్రాంతాల్లో 2025-26లో 2 లక్షల వ్యక్తిగత టాయిలెట్లు, 20,000 కమ్యూనిటీ టాయిలెట్లను నిర్మించనున్నారు. 98 శాతం వార్డుల్లో ఇంటింటికీ ఘన వ్యర్థాల సేకరణను అమలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో 89,000 గ్రామాలను ఘన వ్యర్థాల నిర్వహణలోకి తీసుకురానున్నారు. 60,000 గ్రామాల్లో మురుగునీటి నిర్వహణ వ్యవస్థను అమలు చేయనున్నారు. అలాగే 800 బ్లాక్‌లలో ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ యూనిట్లు నెలకొల్పనున్నారు. కాగా, స్వచ్ఛభారత్ 2.0 కింద తాగునీరు, మురుగునీటి శుద్ధి, ఘన వ్యర్థాల నిర్వహణ ప్రాజెక్టుల కోసం 100 నగరాలను గుర్తించే ప్రక్రియ జోరుగా సాగుతోంది.



జల్‌జీవన్ మిషన్... మరో మూడేళ్లు పొడిగింపు

2025-26 కేటాయింపులు:	రూ.67,000 కోట్లు
2024-25 కేటాయింపులు:	రూ.22,694 కోట్లు (సవరించిన అంచనా)

దేశంలో ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీటిని అందరికీ అందించేందుందుకు జల్ జీవన్ మిషన్ ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రామ్‌ను అమలు చేస్తున్నారు. 2024 నాటికి ఇది సాకారం కావాల్సి ఉండగా.. 100 శాతం లక్ష్యాన్ని సాధించేందుకు దీన్ని 2028 వరకు పొడిస్తున్నట్లు ఆర్థిక మంత్రి తాజా బడ్జెట్లో ప్రకటించారు. దీనికి అనుగుణంగానే ఏకంగా మూడు రెట్లు నిధులు పెంచారు. కాగా, ఇప్పటివరకు 15 కోట్ల కుటుంబాలకు తాగు నీటి సదుపాయం (కుళాయి కనెక్షన్లు) కల్పించినట్లు అంచనా. 2025-26లో 1.36 కోట్ల కనెక్షన్లు అందించాలనేది బడ్జెట్ లక్ష్యం. కాగా, ‘జన్ భాగీధారీ’ద్వారా నీటి సరఫరా మౌలిక సదుపాయాల నాణ్యత, నిర్వహణపై దృష్టి పెట్టున్నట్లు ఆర్థిక మంత్రి పేర్కొన్నారు.



కనెక్ట్ టు భారత్ నెట్..

2025-26 కేటాయింపులు:	రూ.22,000 కోట్లు
2024-25 కేటాయింపులు:	రూ. 6,500 కోట్లు (సవరించిన అంచనా)

దేశంలోని అన్ని గ్రామ పంచాయతీలను (దాదాపు 2.5 లక్షలు) హైస్పీడ్ బ్రాండ్‌బ్యాండ్ నెట్‌వర్క్‌తో కనెక్ట్ చేయాలనేది ఈ స్కీమ్ ఉద్దేశం. ఇప్పటిదాకా 2,14323 పంచాయితీలను కనెక్ట్ చేశారు. 6,92,676 లక్షల కి.మీ. పొడవైన ఆప్టికల్ ఫైబర్ కేబుల్స్ వేశారు. అదనంగా 1,04,574 వైఫై హాట్ స్పాట్స్, 12,21,014 ఫైబర్-టు-హోమ్ కనెక్షన్లు ఇచ్చారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 18,000 పంచాయతీలకు కొత్తగా బ్రాడ్‌బ్యాండ్ సౌకర్యం కల్పించనుండగా... 64,000 పంచాయతీల్లో కనెక్టివిటీని మరింత మెరుగుపరచనున్నారు.



రైల్వేలకు పాత పద్దే!

రూ.2.52 లక్షల కోట్ల నిధుల కేటాయింపు

న్యూఢిల్లీ: కొత్త బడ్జెట్‌లో రైల్వేశాఖ పద్దుల్లో పెద్దగా మార్పులేమీ రాలేదు. 2025-26 బడ్జెట్‌లో ఈ శాఖకు మొత్తం రూ.2.52 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రతిపాదించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రైల్వేలు మొత్తం రూ.3,02,100 కోట్ల ఆదాయం ఆర్జిస్తాయని అంచనా వేశారు. మరో 200 వందేభారత్ రైళ్లు, 100 అమృత్ భారత్ రైళ్లు, 50 నమోభారత్ రైళ్లు ప్రవేశపెట్టేందుకు అనుమతి ఇచ్చారు. వచ్చే నాలుగేళ్లలో మొత్తం రైల్వే మౌలిక వసతుల కల్పన కోసం రూ.4.5 లక్షల కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించినట్లు బడ్జెట్ ప్రకటన అనంతరం శనివారం రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియా సమావేశంలో వెల్లడించారు.

ఆదాయ అంచనా రూ.3 లక్షల కోట్లు

2025-26 ఆర్థిక సంవత్సరంలో రైల్వే శాఖ అన్ని మార్గాల ద్వారా రూ.3,02,100 కోట్ల ఆదాయం ఆర్జిస్తుందని అంచనా వేశారు. 2024-25 బడ్జెట్‌లో సవరించిన అంచనా ప్రకారం ఇది రూ.2,79,000 కోట్లుగా ఉంది. గత బడ్జెట్‌లో ప్రయాణికుల చార్జీల ఆదాయం 2024-25లో రూ.80,000 కోట్లు ఉండగా, 2023-24లో రూ.70,693 కోట్లు వచ్చింది. 2024-25 బడ్జెట్‌లో సరుకు రవాణా ద్వారా రూ.1,80,000 కోట్ల ఆదాయం వస్తుందని సవరించిన అంచనాల్లో పేర్కొన్నారు. 2023-24లో ఇది 1,68,199 కోట్లుగా ఉంది. రైల్వేల్లో భద్రతాపరమైన చర్యల కోసం 2024-25 ఆర్థిక సంవత్సరంలో సవరించిన అంచనాల ప్రకారం రూ.1,14,062 కోట్లు ఉండగా, 2025-26 బడ్జెట్‌లో దీనిని రూ.1,16,514 కోట్లుగా అంచనా వేశారు. అయితే, ఇంతగా నిధులు ఖర్చు చేస్తున్నప్పటికీ రైల్వేలకు వస్తున్న ఆదాయంలో మాత్రం పెద్దగా పెరుగుదల ఉండటం లేదని ఇండియన్ రైల్వేస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిగ్నల్ ఇంజినీరింగ్, టెలి కమ్యూనికేషన్స్ మాజీ డీజీ శైలేంద్రకుమార్ గోయెల్ చెప్పారు.

2025-26లో రైల్వే మూలధన వ్యయ నిధుల సమీకరణ (రూ.కోట్లలో)	
సాధారణ ఆదాయ మార్గాల ద్వారా	2,52,000
నిర్భయ ఫండ్ నుంచి	200
అంతర్గత ఆదాయ మార్గాల నుంచి	3,000
అదనపు బడ్జెటరీ మార్గాల ద్వారా	10,000
మొత్తం మూలధన వ్యయం	2,65,200

మరో 200 వందేభారత్ రైళ్లు: రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్

దేశవ్యాప్తంగా మరో 200 వందేభారత్ రైళ్లను ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. తక్కువ దూరంగల పట్టణాల మధ్య ప్రయాణించే అమృత్ భారత్ రైళ్లను మరో 100 ప్రారంభిస్తామని చెప్పారు. 17,500 కొత్త కోచ్‌ల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లు వివరించారు.



హౌసింగ్‌కు స్వామీ-2 బూస్ట్

న్యూఢిల్లీ: నిలిచిపోయిన హౌసింగ్ ప్రాజెక్టులకు బూస్ట్ నిచ్చేందుకు తాజా బడ్జెట్‌లో స్వామీ(ఎస్‌డబ్ల్యూఏఎంఐహెచ్) ఫండ్-2ను ప్రతిపాదించారు. ఇందుకు రూ.15,000 కోట్లు కేటాయించనున్నారు. దీంతో నిలిచిపోయిన లక్ష యూనిట్లను పూర్తి చేసేందుకు దారి చూపనున్నారు. తద్వారా చిక్కుకుపోయిన గృహ వినియోగదారుల పెట్టుబడులకు ఉపశమనాన్ని కల్పించనున్నారు. 2019 నవంబర్‌లో కేంద్రం ‘అందుబాటు ధరల, మధ్యాదాయ హౌసింగ్‌కు స్పెషల్ విండో(స్వామీ)’ పేరుతో కొత్త పథకానికి తెరతీసిన విషయం విదితమే. స్వామీ-1 విజయం తదుపరి ఆర్థిక శాఖ తాజాగా ఫండ్-2కు ప్రతిపాదించింది. స్వామీ-1లో భాగంగా 50,000 యూనిట్లను పూర్తిచేసి కొనుగోలుదారులకు అందించారు. 2025లో మరో 40,000 యూనిట్లను పూర్తి చేయనున్నారు. తద్వారా ఈఎంఐలు, అద్దెలు చెల్లిస్తున్న మధ్యతరగతికి చేయూతనివ్వనున్నట్లు పేర్కొన్నారు. బ్యాంకులు, ప్రభుత్వం, ప్రయివేట్ ఇన్వెస్టర్ల కలయికతో స్వామీ-2 ద్వారా ఫైనాన్స్ సౌకర్యాలు అందనున్నాయి.

పట్టణ సదుపాయాలకు రూ.లక్ష కోట్ల నిధి



న్యూఢిల్లీ: పట్టణాల్లో మౌలిక సదుపాయాల విస్తరణకు వీలుగా రూ.లక్ష కోట్లతో ‘అర్బన్ చాలెంజ్ ఫండ్’ను ఏర్పాటు చేయనున్నట్లు కేంద్రం బడ్జెట్‌లో భాగంగా ప్రకటించింది. పట్టణాల పునరాభివృద్ధి, పట్టణాలను వృద్ధి కేంద్రాలుగా మార్చడం, తాగునీరు, మురుగునీటి పారుదల సదుపాయాలకు ఈ నిధులు కేటాయించనున్నారు. ప్రాజెక్టు వ్యయంలో 50 శాతం నిధులను బ్యాంక్ రుణాలు లేదా బాండ్ల రూపంలో సమకూర్చుకునేవి.. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం (పీపీఈ)తో నడిచే ప్రాజెక్టులకు 25 శాతం మేర సాయాన్ని ఈ ఫండ్ కింద పొందొచ్చని ఆర్థిక మంత్రి సీతారామన్ ప్రకటించారు. రూ.లక్ష కోట్ల నిధిలో రూ.10,000 కోట్లను 2025-26 ఆర్థిక సంవత్సరం కోసం కేటాయించారు.



రహదారుల శాఖకు రూ.2.87 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: ఈసారి బడ్జెట్‌లో రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖకు రూ.2,87,333.16 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌లో రూ. 2,80,518.80 కోట్లు కేటాయించగా, 2025-26 బడ్జెట్‌లో రూ.2.41 శాతం నిధులను పెంచారు. జాతీయ రహదారుల అధీకృత సంస్థ (ఎన్‌హెచ్ఏఐ)కు రూ. 1,87.803 కోట్లు కేటాయించారు. కాగా, ఎన్‌హెచ్ఏఐ రుణాలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వరకు రూ.3.35 లక్షల కోట్లు ఉండగా, 2025 మూడో త్రైమాసికం వరకు రూ.2.76 లక్షల కోట్లకు తగ్గనున్నాయి. ఎన్‌హెచ్ఏఐ రుణ భారం తగ్గించేందుకు వచ్చే ఆర్థిక సంవత్సరంలో కొత్త రుణాలను ప్రతిపాదించకపోవడం గమనార్హం.


హౌసింగ్, పట్టణ వ్యవహారాలకు రూ.96,777 కోట్లు



న్యూఢిల్లీ: హౌసింగ్, పట్టణ వ్యవహారాల శాఖకు ఈ విడత బడ్జెట్‌లో 18 శాతం అధిక కేటాయింపులు దక్కాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.82,576 కోట్లు కేటాయించగా, 2025-26 సంవత్సరానికి 18 శాతం అధికంగా రూ.96,777 కోట్లను ప్రతిపాదించారు.

పీఎం స్వనిధి..: పీఎం వీధి వర్తకుల స్వావలంబన నిధి (పీఎం స్వనిధి) పథకం కింద బ్యాంక్‌లు, యూపీఐ లింక్ క్రెడిట్ కార్డుల ద్వారా ఒక్కో వర్తకుడికి రూ.30,000 రుణ సదుపాయం అందించనున్నట్టు బడ్జెట్ సందర్భంగా మంత్రి సీతారామన్ ప్రకటించారు. ఈ పథకం కోసం బడ్జెట్‌లో రూ.373 కోట్లకు కేటాయించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.326 కోట్లను కేటాయించడం గమనార్హం. అసంఘటిత రంగంలో అధిక వడ్డీ రుణాల స్థానంలో ఈ పథకం కింద 68 లక్షల వీధి వర్తకులకు ప్రయోజనం లభించినట్టు చెప్పారు.

- ప్రధాన మంత్రి ఆవాస్ యోజన రెండో దశకు రూ.3,500 కోట్లను కేటాయించారు.
- పట్టణ పునరుజ్జీవ మిషన్ కోసం వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.10,000 కోట్ల నిధులు దక్కాయి. దేశవ్యాప్తంగా 500 పట్టణాల పరిధిలో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కేటాయింపులు రూ.8,000 కోట్లతో పోల్చితే 25 శాతం పెంచారు.
- పీఎం ఈ-బస్ సేవా పథకానికి బడ్జెట్‌లో రూ.1,310 కోట్ల కేటాయింపులు లభించాయి. స్వచ్ఛ భారత్ మిషన్ కోసం రూ.5,000 కోట్లు కేటాయించారు. మెట్రో, నాన్ మెట్రో ప్రాజెక్టుల ప్రణాళికల కోసం రూ.133 కోట్లు లభించాయి. ఈ ఏడాది జూన్‌తో ముగుస్తున్న స్మార్ట్ సిటీస్ మిషన్ కార్యక్రమానికి ఎలాంటి కేటాయింపులు చేయలేదు.





ప్రొ. జగదీశ్‌కుమార్
యూజీసీ చైర్మన్

కేంద్ర బడ్జెట్‌లో ఉన్నత విద్యకు, నైపుణ్యాభివృద్ధికి కేంద్రం పెద్దపీట వేసింది. 2024-25లో ఉన్నత విద్యకు రూ.46,482.35 కోట్లు కేటాయిస్తే, 2025-26 బడ్జెట్‌లో రూ.50,077.95 కోట్లు కేటాయించారు. కేంద్ర వర్సిటీలకు రూ.16,146.11 కోట్లు ప్రతిపాదించారు. పరిశోధనల్లో కేంద్ర ప్రయోజిత పథకాలకు రూ.1,815 కోట్లు కేటాయించారు. సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఏఐకి రూ.500 కోట్లు కేటాయించడం ప్రయోజనకరమే.

EXPERT OPINION

లోక్‌పాల్ కోసం రూ.44.32 కోట్లు

న్యూఢిల్లీ: లోక్‌పాల్ నిర్వహణ, నిర్మాణం తదితరాల కోసం 2025-26 బడ్జెట్‌లో రూ.44.32 కోట్లు కేటాయించారు. 2024-25 బడ్జెట్‌లో రూ.67.65 కోట్లు కేటాయించగా ఈసారి దాదాపు 34 శాతం తక్కువ నిధులిచ్చారు. ప్రధాని మొదలు కేంద్ర ప్రభుత్వ శాఖలు, కార్యాలయాలు, సంస్థల్లో అధికారులు, సిబ్బంది అవినీతికి పాల్పడితే విచారణ చేపట్టడం లోక్‌పాల్ విధి. సెంట్రల్ విజిలెన్స్ కమిషన్(సీవీసీ)కి 2025-26 బడ్జెట్‌లో రూ.52.07 కోట్లు కేటాయించారు. 2024-25 బడ్జెట్‌లో రూ.51.31 కోట్లు కేటాయించారు.



సుప్రీంకోర్టు భవన విస్తరణకు రూ.123 కోట్లు సర్వోన్నత న్యాయస్థానం భవన విస్తరణ కోసం 2025-26 బడ్జెట్‌లో రూ.123.75 కోట్లు కేటాయించారు.

వికసిత్ భారత్‌కు రోడ్ మ్యాప్

దేశంలోని 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడానికి ప్రధాని నరేంద్ర మోదీ రూపొందించిన వికసిత్ భారత్ లక్ష్యం చేరుకోవడానికి ఈ బడ్జెట్ రోడ్ మ్యాప్ లాంటిది. వ్యవసాయం, ఎమ్మెస్‌ఎంఈలు, పెట్టుబడులు, ఎగుమతుల పేరిట నాలుగు ఇంజన్లతో ప్రధానమంత్రి దేశాన్ని ముందుకు తీసుకువెళ్లడానికి సంకల్పించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధికి బాటలు వేసేలా ఈ బడ్జెట్‌ను రూపొందించారు.



- జేపీ నడ్డా,
బీజేపీ జాతీయ అధ్యక్షుడు

రాజకీయ ప్రయోజనాలకే పెద్దపీట

రాజకీయ ప్రయోజనాలకే పెద్దపీట వేసినట్లుగా ఈ బడ్జెట్ ఉంది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన విధంగానే ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం చేస్తోంది. దేశం గురించికానీ ప్రజల సంక్షేమం గురించికానీ పెద్దగా పట్టించుకున్నట్లు లేదు. తీవ్రమైన ద్రవ్యోల్బణం కారణంగా దేశంలో పేదరికం, నిరుద్యోగం పెద్ద సమస్యగా మారాయి. రోడ్లు, తాగునీరు, విద్య వంటి కనీస అవసరాలు తీర్చే విషయంలో తగిన చర్యలు తీసుకోలేదు.



- మాయావతి,
బహుజన్ సమాజ్ పార్టీ అధినేత

రాష్ట్రపతి కార్యాలయానికి రూ.141 కోట్లు

న్యూఢిల్లీ: రాష్ట్రపతి కార్యాలయంలో రాష్ట్రపతికి ఇచ్చే అలవెన్సులతోపాటు అక్కడ పనిచేసే సిబ్బంది, పనివాళ్లకు జీతభత్యాల కోసం మొత్తంగా 2025-26 బడ్జెట్‌లో రూ.141.83 కోట్ల కేటాయింపులు చేశారు. రాష్ట్రపతికి జీత భత్యాలు, అలవెన్సుల కోసం రూ.60 లక్షలు కేటాయించారు. ఈ మొత్తం గత బడ్జెట్‌లోనూ ఇంతే ఉంది. రాష్ట్రపతిభవన్ ప్రాంగణంలోని డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ కేంద్రీయ విద్యాలయ నిర్వహణ వ్యయాలనూ మొత్తం కేటాయింపుల్లో కలిపేశారు.

పర్లేదు సార్

విద్యా రంగానికి రూ.1.28 లక్షల కోట్లు

ప్రాంతీయ భాషల్లో డిజిటల్ పాఠ్య పుస్తకాలు

- ఐఐటీలు, ఐఐఎస్సీలో ఐదేళ్లలో పది వేల ఫెలోషిప్స్
- కొత్తగా ఐదు నేషనల్ సెంటర్స్ ఫర్ ఎక్సలెన్స్ ఫర్ స్కిల్లింగ్
- 50 వేల అటల్ టింకరింగ్ ల్యాబ్స్
- రూ.500 కోట్లతో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్

.: న్యూఢిల్లీ :.

కేంద్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి రూ.1.28 లక్షల కోట్లను కేటాయించారు. ఇందులో ఉన్నత విద్యకు రూ.50,067 కోట్లు, పాఠశాల విద్యకు రూ.78,572 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ఐఐటీలు, వైద్య విద్య, పాఠశాల విద్య, స్కిల్లింగ్‌కు బడ్జెట్‌లో కేటాయింపులు చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా విద్యా రంగాన్ని బలోపేతం చేసేందుకు రూ.500 కోట్లతో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నెలకొల్పనున్నట్లు బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. 2024-25 బడ్జెట్‌లో విద్యా రంగం సవరించిన అంచనాలు రూ.1.14 లక్షల కోట్లుగా ఉన్నాయి. మానవ వనరుల అభివృద్ధి దిశగా కేటాయింపులు చేశారని, ఉద్యోగాల ఆధారిత అభివృద్ధి బ్రాండ్ ఇండియా సామర్థ్యాన్ని పెంపొందిస్తుందని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బడ్జెట్‌ను స్వాగతించారు.



భారతీయ భాషా పుస్తక్ స్కీమ్..



ఈ ఏడాది కొత్తగా భారతీయ భాషా పుస్తక్ స్కీమ్‌ను ప్రకటించారు. దీని ద్వారా పాఠశాల విద్య, ఉన్నత విద్యలో ప్రాంతీయ భాషల్లోని పుస్తకాలను డిజిటలైజ్ చేయనున్నారు. దీనివల్ల విద్యార్థులు సులభంగా అన్ని అంశాలను అవగతం చేసుకునే వీలుంటుంది.

ఐఐటీల విస్తరణ..



2014 తర్వాత ఏర్పాటు చేసిన ఐదు ఐఐటీల్లో మౌలిక వసతులు విస్తరించి మరో 6,500 మంది విద్యార్థులకు సరిపడా సదుపాయాలు కల్పించనున్నారు. ఐఐటీ పాట్నాను పూర్తి స్థాయిలో విస్తరిస్తారు. గత పదేళ్లలో దేశంలోని 23 ఐఐటీల్లో విద్యార్థుల సంఖ్య 65 వేల నుంచి 1.30 లక్షలకు చేరిందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. మొత్తంగా ఐఐటీలకు రూ.11,349 కోట్లు కేటాయించారు. ఐఐటీలు, ఐఐఎస్సీ-బెంగళూరులో టెక్నాలజీ రీసెర్చ్ అభ్యర్థుల కోసం ప్రైమ్ మినిస్టర్ రీసెర్చ్ ఫెలోషిప్స్‌ను వచ్చే ఐదేళ్లలో పది వేల మందికి అందిస్తారు.

నైపుణ్యాల పెంపు..



విద్యార్థులకు ఆయా వృత్తులు, విభాగాల్లో క్షేత్ర నైపుణ్యాలు అందించేలా గ్లోబల్ నైపుణ్యాలు, పార్ట్‌నర్‌షిప్స్ కోసం కొత్తగా ఐదు నేషనల్ సెంటర్స్ ఆఫ్ ఎక్స లెన్స్ ఫర్ స్కిల్లింగ్‌ను ఏర్పాటు చేయనున్నారు. పాఠశాల స్థాయిలో ప్రభుత్వ స్కూళ్లలో 50 వేల అటల్ టింకరింగ్ ల్యాబ్స్‌ను నెలకొల్పనున్నారు. సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించేలా గ్రామీణ ప్రాంతాల్లోని సెకండరీ పాఠశాలల్లో బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీ కల్పిస్తారు.

ఐఐఎంలకు పెరిగిన కేటాయింపులు..



ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)లకు గతేడాది రూ.227 కోట్లు కేటాయించగా ఈదఫా రూ.251 కోట్లను కేటాయించారు. ఐఎస్సీ, ఐఐఎస్ఈఆర్‌లకు కేటాయింపుల్లో రూ.137 కోట్ల మేర కోత విధించడం గమనార్హం. అంతర్జాతీయ స్థాయి కలిగిన ఇతర ఉన్నత విద్యా సంస్థలకు కేటాయింపుల్లో 50 శాతం మేర కోత పడింది.

ఏఐ ఆవశ్యకతకు గుర్తింపు

విద్యా రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆవశ్యకతను గుర్తించినట్లు తాజా బడ్జెట్ స్పష్టం చేస్తోంది. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ ఏఐ ఏర్పాటుతో విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుంది.

- వి. రాజన్న, టీసీఎస్ వైస్ ప్రెసిడెంట్ (టెక్నాలజీ - సాఫ్ట్‌వేర్ సర్వీసెస్)

రీసెర్చ్ ఔత్సాహికులు పెరుగుతారు

ఐఐటీలు, ఐఐఎస్సీలో రీసెర్చ్ ఫెలోషిప్స్‌ను పెంచడం వల్ల పీహెచ్‌డీ ఔత్సాహికుల సంఖ్య పెరుగుతుంది. మరిన్ని పరిశోధనలకు, ఆవిష్కరణలకు ఆస్కారం ఉంటుంది.

- ప్రొఫెసర్. బి.ఎస్.మూర్తి
ఐఐటీ-హైదరాబాద్ డైరెక్టర్

స్పష్టత ఇవ్వాల్సింది

సర్వ శిక్ష అభియాన్, రీసెర్చ్ ఫెలోషిప్స్‌కు కేటాయింపులు పెంచడం హర్షణీయం. ఐఐటీల్లో సీట్ల పెంపు, మెడికల్ సీట్ల పెంపు విషయంలో స్పష్టత లేదు. బీటెక్ స్థాయిలో ఎన్ని సీట్లు, వైద్య విద్యలో ఎంబీబీఎస్ సీట్ల పెంపులో ప్రైవేట్, ప్రభుత్వ సీట్ల సంఖ్యను వేర్వేరుగా స్పష్టం చేస్తే బాగుండేది. ఉన్నత విద్యకు కేటాయింపులు తగ్గాయి. ఐఐఎస్సీ, ఐఐఎస్ఈఆర్‌లకు బడ్జెట్ కేటాయింపులు తగ్గించడం సరికాదు.

- మహేశ్వర్ పేరి, ఫౌండర్, కెరీర్స్360

జాతి వృద్ధికి ఊతం

ప్రభుత్వ పాఠశాలలకు బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీ, 50 వేల అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ఏర్పాటుతో ప్రతి విద్యార్థికి ఇన్నోవేషన్ దిశగా ప్రోత్సాహం లభిస్తుంది.

- నిపుణ్ గోయెంక, ఎండీ,
జీడీ గోయెంక గ్రూప్

ఏటా కుదింపులు..

ఇది మరోసారి ప్రభుత్వ విద్యారంగాన్ని బలహీన పరిచే చర్యే. రూ.50.65 లక్షల కోట్ల బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయించిన నిధులు రూ.1,28,650 కోట్లు మాత్రమే. ఇది మొత్తం బడ్జెట్‌లో 2.53 శాతం. గత పదేళ్లలో 3.16 నుంచి 2.53 శాతానికి నిధులు తగ్గాయి.

- ముత్యాల రవీందర్
టీపీటీఎఫ్ అదనపు ప్రధాన కార్యదర్శి

ఈశాన్య ప్రాంతాల అభివృద్ధికి రూ.5,915 కోట్లు



న్యూఢిల్లీ: ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి మంత్రిత్వ శాఖకు ఈసారి బడ్జెట్‌లో రూ.5,915 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌లో కేటాయింపులతో పోలిస్తే ఈసారి 47 శాతం అధికంగా కేటాయింపులు చేయడం విశేషం. ఉడాన్ ప్రాజెక్ట్ ద్వారా ఈశాన్య రాష్ట్రాల్లో కొత్తగా 120 ప్రాంతాలకు విమానసర్వీసులను విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వచ్చే పదేళ్లలో నాలుగు కోట్ల మంది ప్రయాణికుల రాకపోకలే లక్ష్యంగా చిన్న విమానాశ్రయాలు, హెలిప్యాడ్‌లపై ప్రభుత్వం దృష్టిసారించనుంది. మరోవైపు ఈశాన్య రాష్ట్రాల్లో యూరియా లభ్యతను పెంచేందుకు అస్సాంలోని నామ్‌రూప్‌లో 12.7 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పాదక సామర్థ్యంతో యూరియా తయారీ కర్మాగారాన్ని నెలకొల్పనున్నారు. ల్యాండ్ రికార్డుల నవీకరణ, జియోస్పాటికల్ సాంకేతికతతో మౌలికసదుపాయాల కల్పన వ్యూహాలను రచించనున్నారు.

సాంస్కృతిక శాఖకు పెరిగిన కేటాయింపులు



న్యూఢిల్లీ: కేంద్ర సాంస్కృతిక శాఖకు బడ్జెట్‌లో రూ.3,360.96 కోట్లు కేటాయించారు. 2024-25లో సవరించిన అంచనా కంటే ఈసారి రూ.100 కోట్లు అధికంగా కేటాయించడం విశేషం. ఈ మొత్తం నిధుల్లో రూ.1,278.49 కోట్లు ఏఎస్ఐ కోసం ఖర్చు చేస్తారు. వార్షికోత్సవాలకు, సంస్మరణ కార్యక్రమాలకు 2024-25లో రూ.110 కోట్లు ఇవ్వగా, ఈసారి రూ.35 కోట్లు మాత్రమే ఇచ్చారు. అంతర్జాతీయ సాంస్కృతిక ఒప్పందాలు, భాగస్వామ్యాలకు నిధుల కేటాయింపులు రూ.10.50 కోట్ల నుంచి రూ.4.65 కోట్లకు తగ్గిపోయాయి. అలాగే జాతీయ లైబ్రరీలు, ఆర్కైవ్స్‌కు రూ.156.55 కోట్లు ఖర్చు చేయనున్నారు. నేషనల్ మ్యూజియం, నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడ్రన్ ఆర్ట్‌కు రూ.126.63 కోట్లు, కళా సంస్కృతి వికాస్ యోజనకు రూ.198.50 కోట్లు కేటాయించారు. సంగీత నాటక అకాడమీ, సాహిత్య అకాడమీ, నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా, ఇందిరాగాంధీ సెంటర్ ఫర్ ద ఆర్ట్స్ వంటి స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థలకు బడ్జెట్‌లో రూ.411.42 కోట్లు కేటాయించారు. ప్రదర్శనశాలలకు రూ.379.58 కోట్లు కేటాయించారు.



విదేశాంగ శాఖకు రూ.20,516 కోట్లు

న్యూఢిల్లీ: ''పొరుగుదేశానికి ప్రాధాన్యం'' విధానంలో భాగంగా భారత్ విదేశాలకు సాయాన్ని మరింత పెంచనుంది. ఈసారి బడ్జెట్‌లో విదేశాంగ శాఖకు రూ.20,516 కోట్లు కేటాయించారు. ఈ నిధుల్లో అత్యధికంగా భూటాన్‌కు రూ.2,150 కోట్లను అభివృద్ధిసాయంగా ఇవ్వనుంది. నేపాల్‌కు రూ.700 కోట్లు, మాల్దీవులకు రూ.600 కోట్లు ఇవ్వనుంది. భారత్, ఇరాన్ సంయుక్తంగా నిర్మించిన ఛాబహార్ పోర్ట్ కోసం రూ.100 కోట్లు కేటాయించారు. విదేశాల్లో అభివృద్ధి భాగస్వామ్య ప్రాజెక్టుల కోసం రూ.6,750 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌తో పోలిస్తే ఈసారి విదేశాల్లో అభివృద్ధి సాయం కోసం నిధులను 20 శాతం (రూ.5,667 కోట్లు) పెంచారు. జలవిద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లు, విద్యుత్ సరఫరా లైన్లు, గృహ, రోడ్లు, వంతెన ప్రాజెక్టులు, సమీకృత చెక్‌పోస్టుల ఏర్పాటుసహా పలు రకాల కార్యక్రమాల కోసం నిధులను ఖర్చుచేయనున్నారు. బంగ్లాదేశ్‌కు రూ.120 కోట్లు, శ్రీలంకకు రూ.300 కోట్లు, మయన్మార్‌కు రూ.350 కోట్లు, మారిషస్‌కు రూ.500 కోట్లు కేటాయించారు.

గిగ్ వర్కర్లకు గుడ్ న్యూస్

ఈ-శ్రమ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్.. పీఎం-జాయ్ పథకంలో వైద్య సౌకర్యాలు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా రాత్రనకా పగలనకా కాలంతో పోటీపడి పనిచేస్తున్న గిగ్ వర్కర్లకు బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఇప్పటివరకు ఏ విధమైన గుర్తింపు లేని గిగ్ వర్కర్లకు ఐడీ కార్డులు జారీచేస్తామని శనివారం పార్లమెంటులో 2025-26 బడ్జెట్ ప్రసంగంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ ప్రకటించారు. ఈ- శ్రమ్ పోర్టల్‌లో గిగ్ వర్కర్లు రిజిస్ట్రేషన్ చేసుకొనే అవకాశం కల్పించనున్నట్లు ప్రకటించారు. దేశంలోని దాదాపు కోటిమంది గిగ్ వర్కర్లకు ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన (పీఎం-జాయ్) పథకం కింద వైద్య సౌకర్యాలు కల్పిస్తామని వెల్లడించారు. 'కొత్తతరం సేవలరంగ ఆర్థిక వ్యవస్థలో ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లలో పనిచేసే గిగ్ వర్కర్లు గొప్ప చైతన్యాన్ని తీసుకొస్తున్నారు. వారి సేవలను మా ప్రభుత్వం గుర్తిస్తోంది. గిగ్ వర్కర్లకు ఐడీ కార్డులు ఇవ్వాలని నిర్ణయించాం. ఈ-శ్రమ్ పోర్టల్‌లో వారికి రిజిస్ట్రేషన్ అవకాశం కల్పిస్తాం' అని మంత్రి వెల్లడించారు. ఈ కామర్స్ వెబ్‌సైట్లు, ఫుడ్ డెలివరీ యాప్స్‌లో పనిచేసే డెలివరీ బాయ్స్, క్యాబ్ డ్రైవర్లు తదితర వర్కర్లను గిగ్ వర్కర్లు అంటారు. దేశంలో ఆన్‌లైన్ వ్యాపారం వేగంగా పెరుగుతుండటంతో గిగ్ వర్కర్ల సంఖ్య కూడా భారీగా పెరుగుతోంది. అయితే, అధిక పనిగంటలు, విశ్రాంతి లేని పని, తక్కువ వేతనాలు, స్థిరత్వం లేని ఉద్యోగాలు తదితర కారణాల వల్ల వీరు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంఘటిత కార్మికులకు ఉన్నట్లుగా ఇప్పటివరకు వీరికి అధికారిక గుర్తింపు కూడా లేదు. ప్రభుత్వం ప్రకటించినట్లు ఐడీ కార్డులు జారీచేస్తే వీరికి కూడా ప్రభుత్వ గుర్తింపు లభిస్తుంది. అవ్యవస్థీకృత కార్మికుల సమాచారాన్ని క్రోడీకరించేందుకు తెచ్చిన డిజిటల్ ప్లాట్‌ఫామ్ ఈ-శ్రమ్. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద కార్మిక డేటాబేస్‌గా గుర్తింపు పొందింది. ఈఎస్ఐసీ, ఈపీఎఫ్ఓ, ఎన్‌పీఎస్‌లలో సభ్యత్వం లేని కార్మికులు ఇందులో రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అర్హులు.



5 ఏళ్లలో 75 వేల సీట్లు

- ఏటా 10 వేల మెడికల్ సీట్లు పెంపు
- కేంద్ర ఆర్థిక మంత్రి ప్రకటన
- అన్ని జిల్లా ఆసుపత్రుల్లో డే కేర్ కేన్సర్ సెంటర్ల ఏర్పాటు
- ఈ సంవత్సరంలో 200 సెంటర్లు
- కేన్సర్, దీర్ఘకాల రోగాల ఔషధాల చికిత్సకు వాడే 36 మందులపై కస్టమ్స్ డ్యూటీ మినహాయింపు
- ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖకు రూ.99,858.56 కోట్ల కేటాయింపు



సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖకు ఈసారి బడ్జెట్‌లో రూ.99,858.56 కోట్లను కేటాయించారు. గత బడ్జెట్‌లో రూ.89,974.12 కోట్లు కేటాయించగా, ఈసారి 11 శాతం మేర పెంచినట్లు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. అలాగే దేశంలో వచ్చే ఏడాది నుంచి మెడికల్ కాలేజీలు, ఆసుపత్రుల్లో అదనంగా పదివేల సీట్లను పెంచనున్నట్లు తెలిపారు. ఈ పెంచిన సీట్ల ద్వారా వైద్య విద్యను అభ్యసించాలనుకునే వారి కల సాకారమైనట్లేనన్నారు. కాలేజీల్లో మెడికల్ సీట్ల కొరతను దృష్టిలో ఉంచుకుని కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రతి ఏటా వేలాది మంది విద్యార్థులు మెడికల్ సీటు రాక.. మరో ఏడాదిపాటు వేచి ఉండాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. వీటన్నింటికీ చెక్ పెట్టేందుకు ఏడాదికి 10 వేల సీట్ల చొప్పున ఐదేళ్లలో 75 వేల సీట్లు పెంచుతున్నట్లు శనివారం నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన 2025-26 వార్షిక బడ్జెట్‌లో ప్రకటించారు. తమ ప్రభుత్వం గత పదేళ్లలో 1.1 లక్షల అండర్ గ్రాడ్యుయేట్, పీజీ మెడికల్ సీట్లను అందుబాటులోకి తెచ్చిందన్నారు.

కేటాయింపులు ఇలా...

- వైద్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖకు మొత్తం రూ.99,858.56 కోట్లను కేటాయించగా, ఇందులో వైద్య, కుటుంబ సంక్షేమ విభాగానికి రూ.95,957 కోట్లు, ఆరోగ్య పరిశోధనల విభాగానికి రూ.3,900.69 కోట్లు కేటాయించారు.
- ఆయుష్ మంత్రిత్వ శాఖకు రూ.3,992.90 కోట్ల కేటాయింపు. గత బడ్జెట్‌లో రూ.3,497 కోట్లను కేటాయించారు.. ఇప్పుడు 14.15 శాతం పెంపు.
- జాతీయ ఆరోగ్య మిషన్‌కు రూ.37,226.92 కోట్ల కేటాయింపు. గత బడ్జెట్‌లో రూ.36,000 కోట్లు.
- ఆయుష్మాన్ భారత్ ప్రధాన్ మంత్రి జన్ ఆరోగ్య యోజనకు (ఏబీపీఎం-జేఏవై) రూ.9,406 కోట్లు.
- స్వయంప్రతిపత్తి గల సంస్థలకు రూ.20,046.07 కోట్లు కేటాయించారు. 2024-25లో రూ.18,978.72 కోట్లు కేటాయించారు.

జిల్లా ఆసుపత్రుల్లో డే కేర్ కేన్సర్ సెంటర్లు

ఇటీవల కాలంలో కేన్సర్ బారిన పడుతూ ఎంతోమంది రోగులు ఆసుపత్రుల్లో బారులుతీరుతున్నారు. ఈ సమస్యను గుర్తించిన కేంద్రం.. ఆ రోగులకు ఉపశమనం కలిగించేందుకు మరో అడుగు ముందుకేసింది. ఇందులోభాగంగా దేశవ్యాప్తంగా డే కేర్ కేన్సర్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు నిర్మలా సీతారామన్ ప్రకటించారు. వచ్చే మూడేళ్లలో దేశంలోని అన్ని జిల్లా ఆసుపత్రుల్లో డే కేర్ కేన్సర్ సెంటర్లను అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు. 2025-26లో సుమారు 200 సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

36 మందులకు సుంకం మినహాయింపు

- కేన్సర్, అరుదైన వ్యాధులు, ఇతర దీర్ఘకాలిక రోగాలతో బాధపడేవారికి ఉపశమనం అందించేందుకు వారు వాడే మందులపై బేసిక్ కస్టమ్స్ డ్యూటీ (బీసీడీ)ని పూర్తిగా మినహాయించనున్నారు. వారు చికిత్సకు వినియోగించే 36 రకాల జీవ ఔషధాలపై ఈ మినహాయింపు వర్తిస్తుందని బడ్జెట్‌లో ప్రతిపాదించారు. అలాగే, ఫార్మాకంపెనీలు పేషెంట్ అసిస్టెన్స్ ప్రోగ్రామ్స్ కింద రోగులకు అందించే మరో 37 రకాల మందులతోపాటు 13 కొత్త ఔషధాలకు బీసీడీని మినహాయించనున్నారు. దీంతో ఆయా మందులను రోగులకు ఉచితంగా పంపిణీ చేయనున్నారు.
- ప్రైవేట్ రంగం భాగస్వామ్యంతో దేశంలో మెడికల్ టూరిజం, 'హీల్ ఇన్ ఇండియా'ను ప్రోత్సహించడంతోపాటు, సులభతర వీసా విధానాన్ని తెస్తామని చెప్పారు.
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు, ప్రభుత్వ మాధ్యమిక స్కూళ్లకు బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీని అందుబాటులోకి తెస్తామని బడ్జెట్‌లో ప్రతిపాదించారు.




మెరుగైన ఆరోగ్య జీవితం కోసం...

ఈ బడ్జెట్ మెరుగైన ఆరోగ్య జీవితాన్ని అందించేందుకు దోహదపడుతుంది. దేశంలో 200 డేకేర్ కేన్సర్ సెంటర్ల ఏర్పాటు, కేన్సర్, దీర్ఘకాల వ్యాధుల చికిత్సకు ఉపయోగించే మందులపై కస్టమ్స్ డ్యూటీని మినహాయించడం ఆహ్వానించదగ్గ పరిణామం. ఈ చర్యలు సంక్రమణేతర వ్యాధులపై పోరాటానికి, రోగుల జేబులపై భారం తగ్గించేందుకు దోహదపడతాయి. కొత్త విద్యావకాశాలతోపాటు ఉపాధి కల్పనకు కూడా ఈ బడ్జెట్ ఊతమిస్తుంది.

- అపోలో హాస్పిటల్స్







రక్షణ రంగానికి మూలధన కేటాయింపుల్లో స్వల్ప పెరుగుదల మాత్రమే కనిపించింది. మొత్తం రక్షణ బడ్జెట్‌లో ఎప్పట్లాగే జీతాలు, పెన్షన్లకు సింహభాగం పోతోంది. దీనివల్ల ఆయుధ సంపత్తి ఆధునీకరణ ఆశించిన స్థాయిలో వేగం పుంజుకోవడం కష్టమే. అయితే ఈ కేటాయింపులను ప్రభుత్వం తర్వాత సవరించే అవకాశం ఉంది. అయినప్పటికీ వాటిని పూర్తిస్థాయిలో ఖర్చు చేయడం సాధ్యంకాదని భావిస్తున్నా. ఎన్నో ఏళ్లుగా మనకు ఈ ఇబ్బంది ఎదురవుతున్నదే.

లక్ష్మణ్ బెహెరా
రక్షణరంగ నిపుణుడు

EXPERT OPINION

నిధుల్లో మేజర్



గత బడ్జెట్‌తో పోలిస్తే అదనంగా **9.53%** నిధులు

- బలగాల ఆధునీకరణ, అత్యాధునిక ఆయుధాల కొనుగోళ్లకు ప్రాధాన్యం
- రక్షణ రంగంలో స్వయం సమృద్ధి దిశగా బడ్జెట్ అడుగులు
- మూలధన వ్యయంలో 75శాతం దేశీయంగానే ఖర్చు చేస్తామన్న కేంద్ర ఆర్థిక మంత్రి
- దేశంలోని ప్రైవేటు రక్షణ, పరిశోధన సంస్థల నుంచి కొనుగోళ్లకు రూ.26,817 కోట్లు కేటాయింపు

..: న్యూఢిల్లీ :..

గణతంత్ర వజ్రోత్సవాలు జరుపుకొంటున్న మన దేశాన్ని ఆధునిక రణతంత్రం దిశగా నడిపించేందుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌లో రక్షణ రంగానికి భారీగా కేటాయింపులు చేశారు. గత బడ్జెట్‌లో కేటాయించిన రూ.6.22 లక్షల కోట్లతో పోలిస్తే... సుమారు 9.53 శాతం అదనంగా ఈసారి రూ.6.81 లక్షల కోట్లు ప్రతిపాదించారు. ఇది మొత్తం బడ్జెట్‌లో 13.45 శాతం, మన దేశ జీడీపీలో ఇది 1.91 శాతం కావడం గమనార్హం. రక్షణ సామర్థ్యాన్ని పెంపొందించుకునేందుకు వీలుగా మూలధన వ్యయం కింద రూ.1,92,387 కోట్లను చూపారు. ఇందులో అత్యాధునిక యుద్ధ విమానాలు, నౌకలు, ఆయుధాలు, పరికరాల కొనుగోళ్లకు రూ.1,48,722 కోట్లను.. దేశీయంగా ఆయుధాలు, రక్షణ సాంకేతికతల అభివృద్ధి కోసం రూ.31,277 కోట్లను.. డిఫెన్స్ సర్వీసెస్ కోసం రూ.12,387 కోట్లను కేటాయించారు. గత బడ్జెట్ సవరించిన అంచనాల ప్రకారం.. మూలధన వ్యయం రూ.1.59 లక్షల కోట్లు. దానితో పోలిస్తే ఈసారి రూ.21 వేల కోట్లు అదనంగా ఇవ్వనున్నారు.

బడ్జెట్‌లో రక్షణ రంగానికి 6,81,210 కోట్లు కేటాయింపు

ఆధునీకరణ కోసం..

మూలధన వ్యయం కింద చేసిన కేటాయింపులను రక్షణ రంగం ఆధునీకరణ కోసం వినియోగించనున్నారు. ఇందులో రూ.48,614 కోట్లను యుద్ధ విమానాలు, వాటి ఇంజన్ల కొనుగోలు, అభివృద్ధి కోసం కేటాయించారు. నౌకా దళంలో కొనుగోళ్లు, అభివృద్ధి కోసం రూ.24,390 కోట్లు, నావికాదళ డాక్‌యార్డుల ప్రాజెక్టుల కోసం అదనంగా రూ.4,500 కోట్లు ఇచ్చారు. ఇతర ఆయుధాలు, క్షిపణుల కొనుగోలు, అభివృద్ధి కోసం రూ.63,099 కోట్లు కేటాయించారు. ప్రపంచవ్యాప్తంగా మారుతున్న పరిణామాల నేపథ్యంలో.. దేశ సరిహద్దుల రక్షణతోపాటు యుద్ధాలు, దాడులకు సంబంధించి వ్యూహాత్మక సన్నద్ధత దిశగా బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

జీతాలు, పెన్షన్లకు అధిక వ్యయం..



రక్షణ రంగానికి చేసిన కేటాయింపులలో ఈసారి కూడా పెద్ద మొత్తంలో రక్షణ బలగాల వేతనాలు, పెన్షన్లు, రోజువారీ నిర్వహణ వ్యయమే అధికంగా ఉన్నాయి. మొత్తం కేటాయింపుల్లో రూ.4,88,822 కోట్లు అంటే 71శాతానికిపైగా వీటికే ఖర్చుకానున్నాయి. ఇందులో రూ.1,60,795 కోట్లు పెన్షన్ల కోసమే వ్యయం కానున్నాయి.

సరిహద్దుల్లో రోడ్ల నిర్మాణానికి రూ.7,146.5 కోట్లు

దేశ సరిహద్దుల్లో వ్యూహాత్మక రోడ్ల నిర్మాణానికి బడ్జెట్‌లో రూ.7,146.5 కోట్లు కేటాయించారు. చైనా, పాకిస్తాన్ సరిహద్దుల వెంట భద్రతా దళాల కదలికలు సులువుగా సాగేందుకు వీలుగా రోడ్లు, సొరంగాలు, వంతెనల నిర్మాణానికి ఈ నిధులను వినియోగిస్తారు.



మొత్తం బడ్జెట్‌లో **13.45%**

మన దేశ జీడీపీలో **1.91%**

ఆయుధాల కొనుగోళ్లు, అభివృద్ధికి **1,92,387** కోట్లు

వేతనాలు, రోజువారీ వ్యయానికి రూ. **4,88,822** కోట్లు (ఇందులో పెన్షన్లకు 1,60,795 కోట్లు)

దేశీయంగానే రక్షణ కొనుగోళ్లకు పెద్దపీట

రక్షణ రంగంలో స్వయం సమృద్ధి సాధించడంలో భాగంగా మూలధన వ్యయంలో 75 శాతాన్ని దేశీయంగానే ఖర్చు చేయనున్నట్టు బడ్జెట్‌లో పేర్కొన్నారు. దేశంలోని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల నుంచే రక్షణ పరికరాలు, ఆయుధాలను కొనుగోలు చేస్తారు. ఈ మేరకు రూ.1,11,544 కోట్లను దేశీయంగా ఖర్చు చేయనున్నట్టు బడ్జెట్‌లో వెల్లడించారు. ఈ వ్యయంలో రూ.27,886 కోట్ల (25 శాతం)ను మన దేశంలోని ప్రవేటు రక్షణ, పరిశోధన సంస్థల నుంచి కొనుగోళ్ల కోసం వినియోగించనున్నట్టు తెలిపారు.

డీఆర్‌డీవోకు రూ.26,817 కోట్లు..

కీలకమైన 'రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో)'కు ఈ బడ్జెట్‌లో రూ.26,817 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్ కేటాయింపులు రూ.23,856 కోట్లతోపోలిస్తే సుమారు రూ.3 వేల కోట్లు అదనంగా ఇచ్చారు. దేశీయంగా రక్షణ పరికరాలు, ఆయుధాలపై పరిశోధన, అభివృద్ధి కోసం ఈ నిధులను వినియోగించనున్నారు.


జమ్మూ కశ్మీర్‌కు రూ.41,000 కోట్లు

న్యూఢిల్లీ: జమ్మూ కశ్మీర్‌కు కేంద్ర ప్రభుత్వం 2025–26 బడ్జెట్‌లో రూ.41,000.07 కోట్లను కేటాయించింది. గత బడ్జెట్‌లో సవరించిన అంచనాలకు దాదాపు సమానంగా తాజా కేటాయింపులు ఉన్నాయి. కాగా, ఈ కేటాయింపులకు అదనంగా రాష్ట్ర పోలీసు విభాగానికి కేంద్రం మరో రూ.9,325.73 కోట్లను ప్రకటించింది. కశ్మీర్‌ను విభజించడం, 370 అధికరణం రద్దు నేపథ్యంలో కేంద్ర హోంశాఖ, జమ్ము, కశ్మీర్ పోలీసు విభాగాన్ని నేరుగా నియంత్రిస్తోంది. గత బడ్జెట్‌తో పోలిస్తే సుమారు 659 కోట్లు పెరగడం గమనార్హం. ఇక లడఖ్‌కు రూ.4,692 కోట్లు, అండమాన్ నికోబార్ దీవులకు రూ.6,212 కోట్లు, చండీగఢ్‌కు రూ.6,187 కోట్లు, లక్షదీవులకు రూ.3,432 కోట్లు దాద్రా నగర్ హవేలీ–డయ్యూ డామన్‌లకు కలిపి రూ.2,780 కోట్లు, లక్షదీవులకు రూ.1,586 కోట్లు ఇచ్చారు.



ఈ-కోర్టుల ప్రాజెక్టుకు రూ.1,500 కోట్లు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా న్యాయస్థానాల్లో డిజిటల్, ఆన్‌లైన్, పేపర్‌లెస్ విధానాలు పూర్తి స్థాయిలో తీసుకురావాలని కేంద్రం సంకల్పించింది. ఇందులో భాగంగా మూడో దశ ఈ-కోర్టుల ప్రాజెక్టుకు బడ్జెట్‌లో రూ.1,500 కోట్లు కేటాయించింది. నేషనల్ ఈ-గవర్నెన్స్ ప్లాన్‌లో భాగంగా ఈ-కోర్టుల ప్రాజెక్టు 2007లో ప్రారంభమైంది. ఇందులో రెండో దశ 2023లో పూర్తయి మూడో దశ ప్రారంభమైంది. మొత్తం కోర్టు రికార్డులను డిజిటలైజ్ చేయాలని నిర్ణయించారు. మూడో దశలో ఏకీకృత సాంకేతిక వేదికను తీసుకురాబోతున్నారు. వివిధ కోర్టుల మధ్య డిజిటల్ అనుసంధానం పెరగబోతోంది. కోర్టుల్లో కాగిత రహిత కార్యకలాపాలు జరగబోతున్నాయి. టెక్నాలజీ అందుబాటులో లేనివారికోసం ఈ-సేవా కేంద్రాలు ఏర్పాటయ్యాయి. డిజిటల్, ఆన్‌లైన్ విధానాలతో న్యాయ వ్యవస్థపై ఆర్థిక భారం తగ్గుతుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. కక్షిదారులు కోర్టు ఫీజులు, నిందితులు జరిమానాలు ఇకపై ఎక్కడి నుంచైనా చెల్లించవచ్చు.



మావోయిస్టు ప్రాంతాల్లో భద్రతకు రూ.3,481 కోట్లు

దేశంలో 2026 మార్చినాటికి మావోయిస్టులను అంతం చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్న కేంద్ర ప్రభుత్వం.. తాజా బడ్జెట్‌లో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో భద్రత కోసం రూ.3,481 కోట్లను కేటాయించింది. గత బడ్జెట్‌లో దీనికి కేటాయింపులు రూ.2,463 కోట్లు మాత్రమే. మావోయిస్టు ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లు, ప్రత్యేక మౌలిక సదుపాయాల కల్పన పేరిట ఈ నిధులను కేటాయించారు. మావోయిస్టుల అణచివేతపై కేంద్రం మరింత దూకుడుగా ముందుకు వెళ్లనుందని ఈ కేటాయింపులతో స్పష్టమవుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సీబీఐకి రూ.1,071 కోట్లు

కేంద్ర ప్రభుత్వం 2025–26 బడ్జెట్‌లో సీబీఐకి 1,071.05 కోట్లను కేటాయించింది. గత బడ్జెట్‌తో పోలిస్తే రూ. 84.12 కోట్లను పెంచింది. సీబీఐ శిక్షణ కేంద్రాల ఆధునీకరణ, సాంకేతిక, ఫోరెన్సిక్ యూనిట్ల ఏర్పాటుకు ఈ నిధులను ఖర్చు చేస్తారు.



ఏఐ ఆధారిత లెర్నింగ్ కోసం ఎక్సలెన్స్ సెంటర్లు

సాక్షి, న్యూఢిల్లీ: విద్యా రంగానికి సంబంధించి కృత్రిమ మేధ (ఏఐ) అభివృద్ధి కోసం రూ.500కోట్లు కేటాయిస్తున్నట్టు నిర్మలా సీతారామన్ తెలిపారు. ఏఐలో భారత్ అగ్రగామి కావాలనే ఆలోచనతో ఈ రంగానికి పెద్దపీట వేస్తున్నట్టు చెప్పారు. ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ద్వారా.. అధునాతన పరిశోధన, ఏఐ ఎనేబుల్డ్ లెర్నింగ్ టూల్స్‌తో విద్యార్థుల్లో నైపుణ్యాలను అభివృద్ధి చేస్తామన్నారు. డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, స్కిల్ డెవలప్‌మెంట్, ఎడ్యుకేషన్ సెక్టార్‌లలో ఏఐ ఆధారిత ఆవిష్కరణలకు ప్రాధాన్యమిస్తున్నట్టు వివరించారు. ఏఐ నమూనాలను అభివృద్ధి చేయడానికి ప్రముఖ విద్యాసంస్థలు, పరిశోధన సంస్థలు, ప్రైవేటు సంస్థలతో ఎక్సలెన్స్ సెంటర్లు భాగస్వామ్యం అవుతాయని తెలిపారు.



సముద్రయాన పరిశ్రమ కోసం రూ.25,000 కోట్లతో మూలనిధి

న్యూఢిల్లీ: రూ. 25,000 కోట్లతో సముద్రయాన అభివృద్ధి మూలనిధిని ఏర్పాటుచేస్తున్నట్టు మంత్రి నిర్మల చెప్పారు. సముద్రమార్గంలో రవాణాకు సంబంధించి వస్తూత్పత్తుల సంస్థలకు మద్దతు పలకడం, వాటి మధ్య పోటీని ప్రోత్సహించడం కోసం ఈ మూలనిధిని వినియోగిస్తామని మంత్రి పేర్కొన్నారు. ''సముద్రయాన పరిశ్రమ అభివృద్ధి కోసం అయ్యే వ్యయంలో కేంద్రప్రభుత్వం తన వాటాగా 49 శాతం నిధులిస్తుంది. మిగతా నిధులను నౌకాశ్రయాలు, ప్రైవేట్ రంగం నుంచి సమీకరిస్తాం. నౌకారంగం నుంచి 2030 ఏడాదికల్లా రూ.1.5 లక్షల కోట్ల పెట్టుబడులను సమీకరించే లక్ష్యంతో మేరిటైమ్ డెవలప్‌మెంట్ ఫండ్(ఎండీఎఫ్) పనిచేయనుంది. మరో పదేళ్లపాటు నౌకల తయారీలో వాడేందుకు విదేశాల నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై కస్టమ్స్ డ్యూటీని ఎత్తేస్తున్నాం. రాష్ట్రాల మధ్య నదీజలాల్లో తిరిగే చిన్ననౌకలకూ టోనేజ్ పన్ను ప్రయోజనాలను అందిస్తాం. దీంతో అంతర్గత నదీ జలాల్లో రవాణా పెరుగుతుంది''అని మంత్రి అన్నారు. భారతీయ షిప్‌యార్డ్‌లకు నేరుగా ఆర్థిక సబ్సిడీ దక్కేలా షిప్‌బిల్డింగ్ ఫైనాన్స్ అసిస్టెంట్ పాలసీ 2.0ను తీసుకొచ్చామని మంత్రి నిర్మల చెప్పారు. నిర్వహణ ఖర్చులను బడ్జెట్ ద్వారా ప్రభుత్వమే ఇవ్వడం ద్వారా విదేశీ రవాణా ఆర్డర్‌లను పెంచుకునేందుకు ప్రభుత్వం సాయపడుతోంది. ఇందుకోసం బడ్జెట్‌లో రూ.18,090 కోట్లు కేటాయించారు.




మరో 120 ప్రాంతాలకు విమానాలు

న్యూఢిల్లీ: దేశీయ పౌర విమానయాన రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రారంభించిన 'ఉడే దేశ్ కా ఆమ్ నాగరిక్' (ఉడాన్) పథకంలో భాగంగా దేశంలోని మరో 120 ప్రాంతాలకు విమాన కనెక్టివిటీని విస్తరిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. 2025–26 వార్షిక బడ్జెట్‌లో ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ ఈ మేరకు ప్రతిపాదించారు. వచ్చే పదేళ్లలో దేశీయ విమాన ప్రయాణికులను 4 కోట్లకు పెంచటమే లక్ష్యమని ప్రకటించారు. ఈ పథకం కింద ప్రస్తుతం 88 విమానాశ్రయాలు అనుసంధానమై ఉన్నాయి. 619 మార్గాల్లో విమానాలు రాకపోకలు సాగిస్తున్నాయి.



సివిల్ ఏవియేషన్‌కు రూ.2,400 కోట్లు

పౌర విమానయాన రంగానికి 2025–26 బడ్జెట్‌లో రూ.2,400.31 కోట్ల నిధులు ప్రతిపాదించారు. 2024–25 బడ్జెట్‌లో ఈ రంగానికి రూ.2,658.68 కోట్లు కేటాయించగా, తాజా బడ్జెట్‌లో దాదాపు 10 శాతం నిధుల కోత పెట్టారు. గత బడ్జెట్లో ఉడాన్ పథకానికి రూ.800 కోట్లు కేటాయించగా, తాజా బడ్జెట్లో 32 శాతం కోతపెట్టి.. రూ.540 కోట్లతో సరిపెట్టారు. డీజీసీఏతో పాటు బీసీఏఎస్‌కు రూ.330 కోట్లు కేటాయించారు. ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా కార్గో లాజిస్టిక్స్ అండ్ అలైడ్ సర్వీస్ కంపెనీ లిమిటెడ్ (ఏఏఐసీఎల్ఏఎస్)కు రూ.142.75 కోట్లు, ఎయిర్ ఇండియా అసెట్ హోల్డింగ్ లిమిటెడ్‌కు రూ.1,025.51 కోట్లు ప్రతిపాదించారు.



కొత్త టెక్నాలజీలకు రాచబాట

కొత్త పరిశోధనలు, అభివృద్ధి కోసం శాస్త్ర-సాంకేతిక శాఖకు రూ.20 వేల కోట్లు
భవిష్యత్తు తరం స్టార్టప్‌లకు ప్రోత్సాహమిచ్చేలా 'డీప్ టెక్' ఫండ్ ఆఫ్ ఫండ్స్

న్యూఢిల్లీ: దేశంలో సరికొత్త టెక్నాలజీలకు రాచబాట వేసేలా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రతిపాదనలను సమర్పించారు. ప్రైవేటు రంగంలో వినూత్న ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు చర్యలను ప్రకటించారు. ఇందుకోసం రూ.20 వేల కోట్లను కేటాయించారు. మొత్తంగా శాస్త్ర, సాంకేతిక రంగానికి సంబంధించి వివిధ విభాగాలకు మొత్తంగా రూ. 55,679 కోట్లను బడ్జెట్‌లో కేటాయించారు.

పెద్ద ఎత్తున పరిశోధనలకు ప్రోత్సాహం

దేశంలో ప్రైవేటు రంగంలో భారీ ఎత్తున పరిశోధనలను ప్రోత్సహించేందుకు రూ.లక్ష కోట్లతో కార్పస్ ఫండ్ ఏర్పాటు చేస్తామని గత బడ్జెట్ సమయంలోనే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. డీప్ టెక్, సోలార్, ఇతర శాస్త్ర సాంకేతిక రంగాల్లో పరిశోధనలు, అభివృద్ధికి ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. ఆ కార్పస్ ఫండ్ ఏర్పాటు కోసం తొలి విడతగా తాజా బడ్జెట్‌లో రూ.20 వేల కోట్లు కేటాయిస్తున్నట్టు నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఇందులో భవిష్యత్తు తరం స్టార్టప్‌లకు ప్రోత్సాహమిచ్చేలా రూ.10 వేల కోట్లతో 'డీప్ టెక్'ఫండ్ ఆఫ్ ఫండ్స్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

ద్వితీయ శ్రేణి నగరాల్లో జీసీసీలు

దేశవ్యాప్తంగా ద్వితీయ శ్రేణి నగరాల్లో గ్లోబల్ కేపబులిటీ సెంటర్ల ఏర్పాటును ప్రోత్సహించేందుకు జాతీయ స్థాయిలో ఫ్రేమ్ వర్క్‌ను ఏర్పాటు చేస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో సరఫరా వ్యవస్థలతో ఆర్థిక వ్యవస్థ అనుసంధానాన్ని బలోపేతం చేస్తామన్నారు. దేశంలో ఉత్పత్తి రంగాన్ని బలోపేతం చేసేందుకు చర్యలు చేపడతామని ప్రకటించారు. అంతర్జాతీయ వాణిజ్యాన్ని సులభతరం చేసేలా 'భారత్ ట్రేడ్ నెట్'ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు తెలిపారు.

ప్రధాన విభాగాలకు గణనీయంగా కేటాయింపులు..

- కార్పస్ ఫండ్‌కు ఉద్దేశించిన నిధులు సహా తాజా బడ్జెట్‌లో శాస్త్ర, సాంకేతిక విభాగానికి రూ.28,508 కోట్లు కేటాయించారు.
- బయోటెక్నాలజీ విభాగానికి ఈసారి రూ.3,446 కోట్లు కేటాయించారు. ఇది గత బడ్జెట్ కేటాయింపులు రూ.2,275 కోట్లతో పోలిస్తే.. రూ.1,171 కోట్లు అదనం. ఇక పారిశ్రామిక పరిశోధనల విభాగానికి రూ.6,657 కోట్లు ఇచ్చారు.
- అణుశక్తి విభాగానికి గతంలో (రూ.24,968 కోట్లు) కన్నా స్వల్పంగా తగ్గించి రూ.24,049 కోట్లు కేటాయించారు.
- అంతరిక్ష పరిశోధనల విభాగానికి రూ.13,416 కోట్లు కేటాయించారు. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) స్పేస్ సెంటర్లలో కొనసాగుతున్న స్పేస్ ఫ్లైట్, లాంచ్ వెహికల్, శాటిలైట్ ప్రాజెక్టుల కోసం రూ.10,230 కోట్లను కేటాయించారు.



న్యూక్లియర్ ఎనర్జీ మిషన్‌కు రూ.20,000కోట్లు

న్యూఢిల్లీ: వాతావరణ మార్పులను కట్టడిచేయడంతోపాటు పర్యావరణహిత సౌరవిద్యుత్ వంటి ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వైపు మళ్లేందుకు కొత్త పథకాలను ప్రారంభిస్తామని ఆర్థిక మంత్రి నిర్మల చెప్పారు. ''2047కల్లా 100 గిగావాట్ల అణు విద్యుత్ సామర్థ్యం లక్ష్యంగా పనిచేస్తున్నాం. దేశీయంగా సోలార్ ప్యానెళ్లు, సోలార్ పీవీ సెల్స్, ఈవీ బ్యాటరీలు, పవన విద్యుత్ టర్బైన్లు, హై ఓల్టేజీ ట్రాన్స్‌మిషన్ పరికరాలు, ఎలక్ట్రోలైజర్ల తయారీ కర్మాగారాలను ప్రోత్సహిస్తాం. చిన్న రియాక్టర్ల పరిశోధన, అభివృద్ధి కోసం కొత్త న్యూక్లియర్ ఎనర్జీ మిషన్‌ను తెస్తాం. ఇందుకోసం రూ.20,000 కోట్లు కేటాయిస్తాం. 2033 ఏడాదికల్లా ఐదు చిన్న మాడ్యులార్ రియాక్టర్లను ఏర్పాటుచేస్తాం''అని మంత్రి అన్నారు. ''కోబాల్ట్ పొడి, లిథియం అయాన్ బ్యాటరీల వ్యర్థాలు, లెడ్, జింక్‌లతోపాటు అదనంగా 12 అరుదైన ఖనిజాలపై కస్టమ్స్ డ్యూటీని ఎత్తేస్తున్నాం'' అని ప్రకటించారు.

హోంశాఖకు 2.33 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: బడ్జెట్‌లో కేంద్ర హోం శాఖకు రూ.2,33,210 కోట్లు కేటాయించారు. గత ఏడాది కేటాయించిన రూ. 2,19,643 కోట్లతో పోలిస్తే ఇది సుమారు రూ.13.4 వేల కోట్లు అదనం. ఇందులో దేశ అంతర్గత రక్షణ, ఉగ్రవాదులు, మావోయిస్టులతో పోరాటంలో కీలకమైన సీఆర్పీఎఫ్‌తోపాటు బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్ తదితర పారామిలటరీ బలగాలకు రూ.1,60,391 కోట్లను కేటాయించారు. కేంద్ర ఇంటెలిజెన్స్ బ్యూరోకు రూ.3,893 కోట్లు, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ఉండే ఢిల్లీ పోలీసు వ్యవస్థకు రూ.11,931 కోట్లు.. రాష్ట్రపతి, ప్రధాని వంటి వీవీపీల రక్షణకు ఉద్దేశించిన స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్పీజీ)కి రూ.489 కోట్లు, ఎన్డీఆర్ఎఫ్‌కు రూ.1,922 కోట్లు కేటాయించారు. దేశంలో పోలీసు బలగాల ఆధునీకరణ కోసం రూ.4,069 కోట్లు ఇచ్చారు. పోలీసు మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.4,379 కోట్లు, మహిళల భద్రతకు సంబంధించిన పథకాలకు రూ.960 కోట్లు కేటాయించారు. దేశంలో జైళ్ల ఆధునీకరణ కోసం కేంద్ర హోంశాఖ బడ్జెట్‌లో రూ.300 కోట్లు కేటాయించారు.




50 పర్యాటక స్థలాల అభివృద్ధి

న్యూఢిల్లీ: దేశీయ పర్యాటకానికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. దేశంలోని 50 ప్రముఖ పర్యాటక ప్రాంతాలను రాష్ట్రాల సహకారంతో అభివృద్ధి చేయనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. గత బడ్జెట్‌లో ఈ శాఖకు రూ.850.36 కోట్లు ఇవ్వగా, ఈసారి రూ.2,541.06 కోట్లు కేటాయించారు. ఇందులో మౌలిక వసతుల అభివృద్ధి పథకం 'స్వదేశ్ దర్శన్'కు రూ.1,900 కోట్లు ఇచ్చారు. పర్యాటక ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, దేశంలో అంతర్జాతీయంగా భారీగా ప్రచారంతో పర్యాటకులను ఆకర్షించటం, రవాణా సదుపాయాలు పెంచడంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఎంపిక చేసే పర్యాటక ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు భూమిని రాష్ట్ర ప్రభుత్వాలే సమకూర్చాల్సి ఉంటుందన్నారు. దేశీయ పర్యాటక రంగాన్ని ఉపాధి, ఉద్యోగ కల్పనకు ప్రధాన చోదకంగా మారుస్తామని ప్రకటించారు. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల ద్వారా యువతకు శిక్షణ ఇచ్చి పర్యాటక రంగంలో ఉపాధి కల్పిస్తామని నిర్మల తెలిపారు. అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేందుకు ఈ-వీసా, ఫీజు రహిత వీసా కార్యక్రమాలు కూడా ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. దేశంలో హెల్త్ టూరిజాన్ని ప్రోత్సహించేందుకు ప్రారంభించిన 'హీల్ ఇన్ ఇండియా'కార్యక్రమాన్ని మరింత ప్రోత్సహిస్తామని చెప్పారు.

విద్యుత్ పీఎస్‌యూల పెట్టుబడులు రూ.86,138కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ విద్యుత్ సంస్థలు 2025–26లో 21 శాతం అధికంగా రూ.86,138 కోట్లను పెట్టుబడిగా పెట్టనున్నట్టు బడ్జెట్ 2025లో ప్రతిపాదించారు. 9 విద్యుత్ పీఎస్‌యూలు 2024–25లో రూ.67,286 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్టు గత బడ్జెట్‌లో పేర్కొనగా, తాజాగా దీన్ని రూ.71,278 కోట్లకు సవరించారు. విద్యుత్ శాఖకు 2025–26 కోసం రూ.21,847 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌కు సంబంధించి సవరించిన కేటాయింపులు రూ.19,845 కోట్లుగా చూపారు.







కోదండరెడ్డి
రైతు కమిషన్ చైర్మన్

కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయానికి రూ.1,71,437 కోట్లు ఇచ్చినట్లే ఇచ్చి.. అందులో మత్స్య శాఖను కూడా కలిపారు. వాస్తవానికి రూ.1,27,290 కోట్లు మాత్రమే వ్యవసాయ రంగానికి కేటాయించారు. గత బడ్జెట్ కన్నా కేవలం రూ.5 వేల కోట్లు మాత్రమే పెంచారు. మొత్తం బడ్జెట్‌లో వ్యవసాయానికి కేవలం 2.51 శాతమే కేటాయింపులు జరిగాయి. పప్పులు, వంట నూనెలు, చక్కెర, మసాలా దినుసులతో పాటు పసుపు పంటల విస్తీర్ణం పెంచేందుకు ఎలాంటి ప్రోత్సాహకాలు ఇవ్వలేదు.



పి.మోహన్‌రావు
- రిటైర్డ్ ప్రొఫెసర్

నిర్మలా సీతారామన్ ఇప్పటి వరకు ప్రవేశపెట్టిన 8 బడ్జెట్‌లలో ఈ బడ్జెట్ ఎంతో మెరుగైనది. వ్యవసాయానికి ప్రాముఖ్యతనిచ్చి రైతు పక్షపాతిగా అనిపించుకోవడానికి ప్రధాని మోదీ ప్రభుత్వం ప్రయత్నించింది. కిసాన్ క్రెడిట్ కార్డులపై పరిమితిని రూ.5 లక్షలకు పెంచడం హర్షదాయకమైన విషయం. వైద్య విద్యలో మెడికల్ సీట్లు పెంచడం సకారాత్మక చర్య. అన్ని ప్రభుత్వ పాఠశాలలకు బ్రాడ్‌బ్యాండ్ సౌకర్యాన్ని కల్పించడాన్ని పూర్తిగా స్వాగతిస్తున్నాం. జల్‌జీవన్ మిషన్ పథకాన్ని 2028 వరకు పొడిగించడం మంచి విషయం. చిన్న, సూక్ష్మ పరిశ్రమల అభివృద్ధికి బడ్జెట్‌లో పేర్కొన్న చర్యలు అభినందనీయం.



పేదలు, మధ్యతరగతి ప్రజలు, రైతుల సంక్షేమానికి బాటలు వేస్తూనే.. అన్ని వర్గాలకు సమన్యాయం చేసే 'డ్రీమ్ బడ్జెట్' ఇది. వికసిత్ భారత్ లక్ష్యాలను చేరుకునేలా రూపొందించారు. వ్యక్తిగత ఆదాయపు పన్ను పరిధిని రూ.12 లక్షలకు పెంచడం చాలా పెద్ద నిర్ణయం. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, చిన్న పరిశ్రమలకు ఆపన్నహస్తాన్ని అందించే బడ్జెట్.

- బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి



తెలంగాణ ఎదుర్కొంటున్న కీలక సమస్యల పరిష్కారంలో కేంద్ర బడ్జెట్ విఫలమైంది. రాష్ట్రాన్ని కేంద్రం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. నిధుల కేటాయింపులో వివక్ష, రాష్ట్ర సాగు నీటి ప్రాజెక్టుల పట్ల నిర్లక్ష్యం వహించింది. రాష్ట్రాల ప్రత్యేక అవసరాలు, అభివృద్ధి ప్రాధాన్యాలను విస్మరించింది.

- డిప్యూటీ సీఎం, భట్టి విక్రమార్క



ఇది కేంద్ర బడ్జెట్‌లా లేదు..బిహార్ బడ్జెట్‌లా ఉంది. తెలంగాణకు ఒక్క పైసా కూడా ప్రత్యేక కేటాయింపు చేయలేదు. దేశమంటే మట్టి కాదోయ్ అంటూ గురజాడ సూక్తిని బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి ఉటంకించారు.. మరి తెలంగాణలో ఉన్న ప్రజలు మనుషులు కారా?

- టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్



కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ పట్ల వివక్ష స్పష్టంగా కన్పించింది. 8 లోక్‌సభ స్థానాలు బీజేపీ ఎంపీలు గెలిచినా రాష్ట్రానికి సాధించింది సున్నా. పదకొండేళ్లవుతున్నా విభజన హామీలను ఇప్పటికీ పూర్తి స్థాయిలో అమలు చేయలేదు. బీజేపీకి అండగా ఉన్న బిహార్, ఏపీలకే ప్రత్యేకంగా నిధులు కేటాయించారు.

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



బడ్జెట్ బడా కార్పొరేట్ల ప్రయోజనాలను కాపాడేదిగా ఉంది. ఈ బడ్జెట్‌లో సామాన్యులకు నేరుగా లబ్ధి చేకూరే ఎలాంటి పథకమూ లేదు. బడ్జెట్‌ను నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు తెల్పాలని సీపీఎం తెలంగాణ రాష్ట్రకమిటీ పిలుపు నిస్తోంది. సీసీఐ ఫ్యాక్టరీ, రైల్వేకోచ్ ఫ్యాక్టరీ, ఉక్కు ఫ్యాక్టరీ ఊసే లేదు.

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ఓం భీమ్ తుస్..

రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలను పట్టించుకోని కేంద్ర ప్రభుత్వం

రూ.1.65 లక్షల కోట్లు ఇవ్వాలని కోరినా.. బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా ప్రత్యేక కేటాయింపు లేని తీరు

- ట్రిపుల్ ఆర్, మెట్రో రైలు, ఫ్యూచర్ సిటీ, రేడియల్ రోడ్లు, ఐఐఎంల ఊసెత్తని నిర్మలమ్మ
- గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు, హైవే.. సీవరేజీ.. డ్రైనేజీ.. అన్నీ వినతులూ హుళక్కే
- పన్నుల వాటాలో స్వల్ప పెరుగుదల.. మౌలిక వసతుల్లో భాగంగానే రాష్ట్రానికి నిధులు



సాక్షి, హైదరాబాద్:

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మరోమారు మొండి చెయ్యే మిగిలింది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పలు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరమని, రూ.1.65 లక్షల కోట్లు సాయం చేయాలని సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు, ఎంపీలు చేసిన విజ్ఞప్తులన్నింటినీ కేంద్ర ప్రభుత్వం బుట్టదాఖలు చేసింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో.. అన్ని రాష్ట్రాలకు ఇచ్చినట్లుగానే కేంద్ర పన్నుల్లో వాటా మినహా తెలంగాణకు ఎలాంటి ప్రత్యేక కేటాయింపులు ఇవ్వలేదు. అటు రాష్ట్ర పునర్విభజన హామీలు, ఇటు పెండింగ్ బకాయిలు, మరోవైపు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలు.. ఇలా దేనిని కూడా పట్టించుకోకుండా నిరాశనే మిగిల్చారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ అంశంపై సీఎం రేవంత్‌రెడ్డి శనివారం మంత్రులు, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శితో సుదీర్ఘంగా చర్చించారు కూడా.

ఎన్నో విజ్ఞప్తులు చేసినా..

తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం నుంచి గణనీయంగా సాయం అవసరమని రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు విజ్ఞప్తి చేసింది. రాష్ట్రం చేపట్టే ప్రతిష్టాత్మక ప్రాజెక్టులకు సహకరించాలని ప్రతిపాదనలు పంపింది. తగినన్ని నిధులిస్తే కేంద్రం పెట్టుకున్న 5 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యంలో ఒక ట్రిలియన్ మేర తెలంగాణ రాష్ట్రమే సాధిస్తుందని సీఎం రేవంత్ పేర్కొన్నారు కూడా. రీజనల్ రింగు రోడ్డు, మూసీ ప్రాజెక్టు, మెట్రో విస్తరణ, హైదరాబాద్‌లో సీవరేజీ మాస్టర్‌ప్లాన్, వరంగల్‌లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, రేడియల్ రోడ్లు, గ్రీన్‌ఫీల్డ్ హైవే, ఇండస్ట్రియల్ హబ్‌లు, లాజిస్టిక్స్, రిక్రియేషన్ పార్కులు, ఫ్యూచర్ సిటీలో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు, పారిశ్రామిక కారిడార్ల ఏర్పాటు, కరీంనగర్, జనగామ జిల్లాల్లో లెదర్ పార్కులు, తెలంగాణలోని గోదావరి వ్యాలీ బొగ్గు బ్లాక్‌లు సింగరేణికి కేటాయింపు, సెమీకండక్టర్ మిషన్ కేంద్రంగా హైదరాబాద్ అభివృద్ధి, కొత్త కేంద్రీయ విద్యాలయాలు, జిల్లాకో నవోదయ పాఠశాల, పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదాతోపాటు రాష్ట్రంలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరింది. 2019–20 నుంచి ఇప్పటివరకు బకాయి ఉన్న వెనుకబడిన జిల్లాల అభివృద్ధి నిధులు (బీఆర్‌జీఎఫ్) రూ.1,800 కోట్లను, ఇతర బకాయిలను చెల్లించాలని విజ్ఞప్తి చేసింది. మొత్తమ్మీద రూ.1.65 లక్షల కోట్ల మేర కేటాయింపులు చేయాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఇలా దాదాపు 15 అంశాల్లో ఒక్కదానికి కూడా కేటాయింపులు చూపెట్టలేదు. దేశంలో రెండు స్కిల్ యూనివర్సిటీలు ఏర్పాటు చేస్తామని చెప్పిన కేంద్రం.. తెలంగాణలో ప్రారంభమైన స్కిల్ వర్సిటీకి సాయమేదీ ప్రకటించలేదు. ఇతర రాష్ట్రాల్లో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినా.. తెలంగాణలో వరంగల్, కొత్తగూడెం ఎయిర్‌పోర్టుల ఊసెత్తలేదు. ఎప్పటి నుంచో అడుగుతున్న మిర్చిబోర్డు మాటలేదు.

'గురజాడ' తప్ప మరో మాట లేదు

తెలుగింటి కోడలు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం ప్రవేశపెట్టిన 2025–26 కేంద్ర బడ్జెట్‌లో తెలుగు కవి గురజాడ అప్పారావు రచించిన 'దేశమంటే మట్టికాదోయ్.. దేశమంటే మనుషులోయ్'అన్న పద్యం తప్ప తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఒక్క ప్రకటన కనిపించలేదు. ''తెలుగు మహా కవి, నాటక రచయిత గురజాడ అప్పారావు, 'దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్'అన్నారు. దేశం అంటే దాని నేల మాత్రమే కాదు, దేశమంటే దాని ప్రజలు. దీనికి అనుగుణంగా వికసిత్ భారత్ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం..''అని నిర్మలా సీతారామన్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. ఆ తర్వాత ఎక్కడా తెలంగాణ, ఏపీలకు సంబంధించి కానీ, ఆయా రాష్ట్రాలకు నిధులు, అభివృద్ధి కార్యక్రమాలపై గానీ మాట మాత్రం ప్రస్తావన చేయలేదు.

అందరితో పాటు.. అరకొర లబ్ధి..

కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన కొన్ని విధానాల కారణంగా.. అందరితోపాటు తెలంగాణ ప్రజలకు కూడా ప్రయోజనం కలగనుంది. కొత్త ఆదాయ పన్ను మినహాయింపు రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, ఐటీ ఉద్యోగులకు లబ్ధి చేకూర్చనుంది. ఎంఎస్‌ఎంఈలకు, స్టార్టప్‌లకు రుణ పరిమితి పెంపు రాష్ట్రంలో పారిశ్రామిక రంగానికి ఊతమివ్వనుంది. ఉపాధి హామీకి పెద్దగా నిధుల పెంపు లేకపోవడంతో గత ఏడాది తరహాలోనే ఈ పథకం అమలు కానుంది. రూ.లక్ష కోట్లతో ఏర్పాటు చేస్తామని ప్రకటించిన అర్బన్ చాలెంజ్ ఫండ్ నుంచి రాష్ట్రంలోని ట్రిపుల్ ఆర్, మెట్రో రైలు విస్తరణ వంటి ప్రాజెక్టులు నిధులు రావాలంటే... నిర్దేశిత సంస్కరణలు అమలు చేయాల్సి ఉంటుందని ఆర్థిక నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఇక కేంద్ర పన్నుల్లో రాష్ట్రానికి అందే వాటా ఈసారి స్వలంగా పెరిగింది. గత ఏడాది రూ.25వేల కోట్లకుపైగా ఉన్న ఈ వాటా.. ఈసారి రూ.29 వేల కోట్లకు చేరనున్నట్టు అంచనా. గ్రాంట్లు, కేంద్ర ప్రాయోజిత పథకాల రూపంలో కొన్ని నిధులు సమకూరుతాయి. మొత్తమ్మీ విజ్ఞప్తులు హరీ.. ఊరటతోనే సరి అనే రీతిలో ఈసారి కేంద్ర బడ్జెట్ ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఇది బిహార్ బడ్జెట్

దేశమంటే మట్టి కాదోయ్. దేశమంటే మనుషులోయ్ అంటూ ప్రసంగించిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. దేశం అంటే కొన్ని రాష్ట్రాలు కాదు.. 29 రాష్ట్రాలు అని మర్చిపోయారు. ఇది దేశ బడ్జెట్ కాదు. బిహార్ బడ్జెట్. భారత రాజ్యాంగాన్ని తుంగలో తొక్కే విధంగా కేంద్ర బడ్జెట్ ఉంది. బడే భాయ్ అని ప్రధాని మోదీని రేవంత్ రెడ్డి మెచ్చుకుంటున్నారు. కానీ చోటే భాయ్‌ను బడే భాయ్ పట్టించుకోవడం లేదు. రాజకీయ అవసరాల కోసమే 2025–26 వార్షిక బడ్జెట్‌ను బీజేపీ ఉపయోగించుకుంది. తెలంగాణతో తమకు బంధం లేదని బడ్జెట్ ద్వారా బీజేపీ ప్రభుత్వం మరోసారి నిరూపించింది. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం ట్రైబల్ యూనివర్సిటీకి ఇవ్వాల్సిన నిధులివ్వకపోవడం బాధాకరం.



- మాజీ మంత్రి హరీశ్‌రావు


అందుబాటు గృహాలకు నిరాశ!



సాక్షి, హైదరాబాద్: బడ్జెట్ మరోసారి సామాన్య, మధ్య తరగతి ప్రజలను నిరాశ పరిచింది. అందుబాటు గృహాలకు ప్రత్యేక కేటాయింపులు లేకపోవడంపై కొనుగోలు, పెట్టుబడిదారులు పెదవి విరుస్తున్నారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఎంఎస్‌ఎంఈ, భవిష్యత్ నగ రాల వృద్ధి కోసం బడ్జెట్‌లో కేటాయింపులతో రియల్ ఎస్టేట్ రంగానికి ప్రత్యక్ష, పరోక్ష ప్రయోజనాలు అందుతాయి. తాజా బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి వార్షికంగా రూ.12 లక్షల వరకు సంపాదిస్తున్న వారికి జీరో ఆదాయపు పన్ను ప్రకటించింది. దీంతో వినియోగ వ్యయం పెరుగుతుంది. దీంతో సరసమైన గృహాలకు డిమాండ్ ఏర్పడుతుంది. పెట్టుబడిదారులు ఇప్పుడు కేవలం ఒకటి కాకుండా రెండు స్వీయ–ఆక్రమిత ఆస్తులకు నిల్ వాల్యుయేషన్‌ను క్లెయిమ్ చేయొచ్చు. అద్దెపై సరళీకృత టీడీఎస్ భారాన్ని తగ్గించడంతోపాటు భూ యజమానులకు లిక్విడిటీని పెంచుతుంది. ముఖ్యంగా మెట్రో నగరాల్లో అద్దె గృహాల మార్కెట్‌పై సానుకూల ప్రభావం చూపుతుంది. గతంలో గృహ యజమానులు ఒక స్వీయ ఆక్రమిత ఆస్తిని మాత్రమే పన్ను రహితంగా క్లెయిమ్ చేసే వీలు ఉండేది. తాజా బడ్జెట్‌లో రెండు క్లెయిమ్‌లకూ వీలు కల్పించారు. దుకోవచ్చు.

దేశ గతినే మార్చే అద్భుతమైన బడ్జెట్

దేశ గతినే మార్చే అద్భుతమైన బడ్జెట్. పేద, మధ్య తరగతి, యువత, రైతు సంక్షేమ బడ్జెట్. మధ్యతరగతి ఉద్యోగుల, వ్యాపారులకు ఈ బడ్జెట్ ఓ వరం. ఉద్యోగులకు రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపు విప్లవాత్మక నిర్ణయం. తెలంగాణలో 50 లక్షల మందికిపైగా రైతులకు రూ.5 లక్షల దాకా రుణం పొందే అవకాశం లభించనుంది. కిసాన్ క్రెడిట్ కార్డుల కోసం రైతులంతా దరఖాస్తు చేసుకోవాలి. పలు రకాల పంట ఉత్పత్తులను పెంచి రైతులకు అధిక ఆదాయం వచ్చేలా నూతనంగా 'ధన ధాన్య కృషి యోజన పథకం'ను ప్రవేశపెట్టడం హర్షణీయం.



- బండి సంజయ్ కేంద్రమంత్రి

కేంద్ర బడ్జెట్‌పై సీఎం అసంతృప్తి!

- రాష్ట్రం పెట్టిన ప్రతిపాదనలు, బడ్జెట్ కేటాయింపులపై ఆర్థికశాఖ అధికారులతో సమీక్ష
- సమావేశంలో పాల్గొన్న మంత్రులు, ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి రామకృష్ణారావు
- బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై లేఖ రాసే యోచన
- రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ రూపకల్పనపైనా చర్చ



సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం 2025–26 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్ పట్ల సీఎం రేవంత్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. రాష్ట్రానికి ఆర్థిక సాయం అందించాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర మంత్రులను కలిసి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకుండా పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేసినట్టు సమాచారం. శనివారం లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టిన నేపథ్యంలో హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఆర్థికశాఖ ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో భాగంగా రాష్ట్రం నుంచి కేంద్రానికి చేసిన ప్రతిపాదనలు, బడ్జెట్‌లో కేంద్రం చేసిన కేటాయింపులపై ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సీఎంతో పాటు మంత్రులకు వివరించారు. రాష్ట్రానికి ప్రత్యేక కేటాయింపులు ఏమీ లేవని, కేంద్ర పన్నుల్లో వాటా, గ్రాంట్లు, సీఎస్‌ఎస్ పథకాల ద్వారా నిధులు, అన్ని రాష్ట్రాలతోపాటు మౌలిక సౌకర్యాల కల్పనలో భాగంగా వచ్చే నిధులు మాత్రమే కేంద్ర బడ్జెట్ ద్వారా రాష్ట్రానికి వస్తాయని ఆయన వివరించినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసే అంశాన్ని పరిశీలించాలని సీఎం కోరినట్టు సమాచారం. రాష్ట్రానికి ఏ ఒక్క పథకానికి నిధులు ప్రత్యేకంగా లేని అంశంపై పార్లమెంట్ సభ్యులు లోక్‌సభలో గట్టిగా నిలదీసే అంశాన్ని కూడా చర్చించినట్టు తెలిసింది. రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులుగా ఉన్న ఏ ఒక్క ప్రాజెక్టుకు నిధులు సమకూరేలా చర్యలు తీసుకోకపోవడంపై సీఎం రేవంత్‌రెడ్డి తన అసంతృప్తి వ్యక్తం చేసినట్టు చెబుతున్నారు. సమావేశాలు ముగిసేలోగా రాష్ట్రానికి న్యాయం జరిగేలా లోక్‌సభలో ఎంపీలు పోరాటం సాగించాలన్న అభిప్రాయాన్ని సీఎం వ్యక్తం చేశారంటున్నారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై కేంద్రానికి లేఖ రాసే అంశాన్ని కూడా పరిశీలించినట్టు తెలిసింది.వచ్చే ఆర్థిక సంవత్సరానికిగాను రాష్ట్ర ప్రభుత్వం తయారు చేయాల్సిన బడ్జెట్ ప్రతిపాదనలు, ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఖర్చుల వివరాలను కూడా సీఎం, మంత్రులు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర బడ్జెట్‌ను వాస్తవానికి అనుగుణంగా తయారు చేయాలని, సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా తయారు చేయాలని సీఎం ఆర్థికశాఖ అధికారులను ఆదేశించారు.

తెలంగాణకు చిల్లిగవ్వ కూడా తీసుకురాలేదు

కేంద్ర బడ్జెట్ నుంచి తెలంగాణకు చిల్లిగవ్వ కూడా తీసుకురాలేకపోయిన సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రులు, రాష్ట్రం నుంచి ఎన్నికైన కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు తెలంగాణ సమాజానికి క్షమాపణలు చెప్పాలి. జాతీయ పార్టీలు ఎప్పటికీ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడలేవని మరోసారి కేంద్ర బడ్జెట్‌తో రుజువైంది. కాంగ్రెస్, బీజేపీ నుంచి చెరో ఎనిమిది మంది ఎంపీలను గెలిపించి పార్లమెంట్‌కు పంపిస్తే, 16 మంది ఎంపీలు తెలంగాణకు తెచ్చింది అక్షరాలా గుండుసున్నా. సీఎంగా ఉంటూ బీజేపీకి గులాంగిరీ చేస్తున్న బడేభాయ్- చోటేభాయ్ అనుబంధంతో తెలంగాణకు నయాపైసా లాభం లేదని తేలిపోయింది. తెలంగాణ ప్రయోజనాల కోసం కొట్లాడే బీఆర్‌ఎస్‌కు పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం లేకుంటే జరిగే నష్టం ఏమిటో ప్రజల గమనిస్తున్నారు. పార్లమెంట్‌లో ప్రాంతీయ పార్టీలకు బలమున్న బిహార్, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలకు దక్కిన ప్రాధాన్యం చూసిం జాతీయ పార్టీలను గెలిపిస్తే తెలంగాణను నిండా ముంచారని ప్రజలకు అర్థమైంది. కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ అంటే ఎంత చిన్నచూపో మరోసారి పార్లమెంట్ సాక్షిగా ఈ బడ్జెట్ రుజువు చేసింది. దేశఖజానా నింపే దక్షిణాది రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సమాఖ్య స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధం. సీఎం రేవంత్ 30 మార్లు ఢిల్లీకి వెళ్లింది నిధుల కోసం కాదని, ఢిల్లీకి మూటలు మోసేందుకు వెళ్లారని బడ్జెట్ ప్రతిపాదనలతో తేటతెల్లమైంది. రాష్ట్రం నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు గెలిచి, అందులో ఇద్దరు కేంద్ర మంత్రులున్నా తెలంగాణకు నయా పైసా తీసుకురాలేకపోయారు.



- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ఇది బడ్జెట్ కాదు.. బీజేపీ మేనిఫెస్టో

రాష్ట్రానికి తీరని అన్యాయం : టీ కాంగ్రెస్ ఎంపీలు



సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది బడ్జెట్ కాదని...అది బీజేపీ మేనిఫెస్టో అని తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు విమర్శించారు. రూ.50 లక్షల కోట్ల బడ్జెట్‌లో తెలంగాణ ఊసేలేదని, రాష్ట్రానికి తీరని నష్టం జరిగిందని మండిపడ్డారు. శనివారం ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో కాంగ్రెస్ ఎంపీలు విలేకరులతో మాట్లాడారు.

పాలమూరు-రంగారెడ్డి ఊసే లేదు

కేంద్ర బడ్జెట్‌లో బిహార్ గురించి ఐదుసార్లు మాట్లాడారు. కానీ.. తెలంగాణ ఊసేలేదు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని చాలాసార్లు కేంద్రాన్ని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. కానీ ఆ ప్రస్తావన కూడా లేదు.

- మల్లు రవి

అడిగింది ఏదీ ఇవ్వలేదు

తెలంగాణకు మిర్చి బోర్డు, ఎయిర్‌పోర్టులు ఇవ్వాలని, సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నోసార్లు నిర్మలా సీతారామన్, కేంద్ర మంత్రులను కలిశారు. కానీ బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు లేవు.

- రామసహాయం రఘురామిరెడ్డి

ఇవి ఎన్నికల ప్రచార బడ్జెట్ సమావేశాలు

ఇవి ఎన్నికల ప్రచార బడ్జెట్ సమావేశాలు. రాజకీయ లబ్ధి, బీజేపీకి ప్రయోజనం చేకూర్చేలా బడ్జెట్ ఉంది. విభజన హామీలు, రాష్ట్ర ప్రయోజనాలు, రైతులు, పేదలు, మహిళలు, నిరుద్యోగులను పూర్తిగా విస్మరించారు.

- చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

కేంద్ర పన్నుల్లో పెరిగిన రాష్ట్ర వాటా నిధులు

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా కింద 2025–26 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణకు రూ.29,899.77 కోట్ల నిధులు రానున్నాయి. కార్పొరేషన్ పన్ను కింద రూ.8,349.04 కోట్లు, ఆదాయపు పన్ను రూ.11,140.06 కోట్లు, సెంట్రల్ జీఎస్టీ రూ.8,704.59 కోట్లు, కస్టమ్స్ రూ.1,376.22 కోట్లు, కేంద్ర ఎక్సైజ్ డ్యూటీ రూ.285.91 కోట్లు, సర్వీస్ ట్యాక్స్ రూ.0.86 కోట్లు, ఇతర పన్నుల కింద రూ.43.09 కోట్లు రానున్నాయి. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సవరించిన బడ్జెట్‌లో ఈ పద్దు కింద తెలంగాణకు రూ.27,050.25 కోట్లు కేంద్రం కేటాయించింది. దీనితో పోలిస్తే వచ్చే ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా కింద రూ.2,849.52 కోట్లు అదనంగా రానున్నాయన్న మాట.


రాష్ట్రంలోని సంస్థలకు నిధులిలా..

ప్రధానమంత్రి స్వాస్థ్య సురక్ష యోజనలో భాగంగా బీబీనగర్ ఎయిమ్స్, మంగళగిరి ఎయిమ్స్ సహా ఇతర ఎయిమ్స్‌లు అన్నింటికీ కలిపి రూ.2,200 కోట్లు కేంద్రం కేటాయించింది. గిరిజన యూనివర్సిటీకి కూడా దేశంలోని కేంద్రీయ విశ్వవిద్యాలయాలతో కలిపే కేటాయింపులు చేశారు. హైదరాబాద్ ఐఐటీ (ఎక్స్‌టర్నల్లీ ఎయిడెడ్ ప్రాజెక్టులు)కు నిధుల కేటాయింపులో మొండి చెయ్యి చూపించారు. సింగరేణి కేలరీస్ సంస్థకు రూ.1,700 కోట్లు, హైదరాబాద్‌లోని అటామిక్ మినరల్స్ డైరెక్టరేట్ ఆఫ్ ఎక్స్‌ప్లొరేషన్ అండ్ రీసెర్చ్ సంస్థకు రూ.387.50 కోట్లు, హైదరాబాద్ సహా దేశంలోని 7 నైపర్ సంస్థలకు కలిపి రూ.200.07 కోట్లు కేంద్రం కేటాయించింది. హైదరాబాద్‌లోని ఇన్‌కాయిస్‌కు రూ.29 కోట్లు, హైదరాబాద్ సహా మరో మూడు ప్రాంతాల్లో ఉన్న డైరెక్టరేట్ ఆఫ్ హిందీ సంస్థలకు రూ.25.25 కోట్లు, హైదరాబాద్ సహా 12 నగరాల్లో ఉన్న సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్(సీ–డాక్)కు రూ.275 కోట్లు, నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డుకు రూ.18 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారు.

సమర యోధులకు, ఎన్‌పీఏకి..: స్వాతంత్ర్య సమరయోధులకు, నిజాం సంస్థాన విలీనం కోసం పోరాడిన యోధులకు (పెన్షన్లు) రూ.588 కోట్లు, హైదరాబాద్ జాతీయ పోలీసు అకాడమీ సహా పోలీసు విద్య, ట్రైనింగ్, పరిశోధనలకు రూ.1,114.47 కోట్లు ప్రతిపాదించారు. హైదరాబాద్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్‌కు కేటాయింపుల్లో కోత విధించారు. తాజాగా నామమాత్రంగా రూ.0.01 కోట్లు కేటాయించింది. మణుగూరుతో పాటు కోటాలోని భార జల ప్లాంట్లకు రూ.1,733.07 కోట్లు ప్రతిపాదించారు.

మరిన్ని బడ్జెట్ వార్తలు సాక్షి ప్లస్‌లో..

బ్యాటరీల తయారీకి దన్ను



ఈవీ బ్యాటరీల తయారీకి సంబంధించి మరో 35 యంత్రపరికరాలు, మొబైల్ ఫోన్ బ్యాటరీ తయారీ విషయంలో అదనంగా 28 యంత్రపరికరాలను సుంకాల మినహాయింపు జాబితాలోకి చేర్చినట్లు మంత్రి తెలిపారు. దీనితో దేశీయంగా లిథియం అయాన్ బ్యాటరీల (మొబైల్ ఫోన్లకు, ఎలక్ట్రిక్ వాహనాలకు) తయారీకి ఊతం లభించనుంది. ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న ఎలక్ట్రిక్ వాహనాల రంగానికి ఇది ప్రయోజనకరంగా ఉంటుందని గ్రాంట్ థార్న్‌టన్ భారత్ పార్ట్‌నర్ సాకేత్ మెహ్రా తెలిపారు. స్థానికంగా తయారీ వ్యయాలు తగ్గడంతో పాటు కార్యకలాపాలు విస్తరించేందుకు కంపెనీలకు ప్రోత్సాహంగా కూడా ఉంటుందని రివ్యాంప్ మోటో సహవ్యవస్థాపకుడు ప్రీతేష్ మహాజన్ చెప్పారు.

స్టాక్ మార్కెట్లో పెట్టుబడులకు ఊతం

పన్ను ప్రతిపాదనలు క్యాపిటల్ మార్కెట్లోకి పెట్టుబడులు వెల్లువెత్తేందుకు ఊతం ఇస్తాయి. ఉద్యోగులు రూ.12.75 లక్షల వరకు వేతనంపై రూపాయి కూడా పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. ఇది వినిమయం పెరిగేందుకు సహాయపడుతుంది. వినియమం పెరిగితే షేర్లలో పెట్టుబడులు సైతం పెరుగుతాయి. మూలధన వ్యయంలో 10 శాతం వృద్ధితో అధిక పెట్టుబడులు పెట్టడం ద్వారా వృద్ధికి ఊతమివ్వడమే బడ్జెట్ లక్ష్యం.



ఆశిష్ కుమార్ చౌహాన్
ఎండీ, సీఈవో, ఎన్ఎస్ఈ

EXPERT OPINION

బలమైన అడుగులు..


క్యాన్సర్ డే సెంటర్స్, వైద్య విద్య ద్వారా ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలలో పెరిగేందుకు బడ్జెట్‌లో కేటాయింపులు జరిగాయి. ప్రాణాధార ఔషధాలకు కస్టమ్స్ డ్యూటీ మినహాయింపులతోపాటు మెడికల్ టూరిజం, హీల్ ఇన్ ఇండియా కార్యక్రమాల ద్వారా ప్రోత్సాహం ప్రకటించారు. సాంకేతికత, మౌలిక రంగంలో పెట్టుబడి, పన్ను స్లాబ్‌లు, సుంకాల సరళీకరణ వంటి నిర్మాణాత్మక సంస్కరణలు దేశ నిర్మాణం వైపు బలమైన అడుగులు వేస్తుంది.



– సతీష్ రెడ్డి, చైర్మన్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్.

వైద్య సంరక్షణ కేంద్రంగా..


ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో ప్రపంచ నాయకత్వం వహించేలా ఎదగడానికి ఈ బడ్జెట్ ప్లాట్‌ఫామ్‌గా నిలవనుంది. ప్రైవేట్ రంగ భాగస్వామ్యాల ద్వారా మెడికల్ టూరిజాన్ని ప్రోత్సహించాలనే ప్రకటన ప్రపంచ రోగులను ఆకర్షించే స్థాయిలో సామర్థ్యాన్ని పెంపొందిస్తుంది. హీల్ ఇన్ ఇండియా మిషన్ కింద అందుబాటులో ప్రపంచ స్థాయి వైద్య సంరక్షణ కేంద్రంగా భారత్‌ను ఉంచుతుంది.



– ప్రతాప్ సి రెడ్డి, ఫౌండర్, అపోలో హాస్పిటల్స్.

పెట్టుబడులకు ఊతం..

వినియోగ ఆధారిత వృద్ధిని మధ్యతరగతి ప్రజలు నడిపిస్తారని మంత్రి విశ్వాసం ఉంచారు. వినియోగ డిమాండ్ పుంజుకోవడం మధ్యస్థ కాలంలో పెట్టుబడులను ప్రోత్సహిస్తుంది. పర్యాటకం, టెక్స్‌టైల్, హస్తకళలు, పాదరక్షలు, బొమ్మల వంటి ఉపాధి ఆధారిత రంగాలు తదుపరి స్థాయికి చేరేందుకు తక్షణ ప్రేరణనిచ్చారు.



– సంజయ్ నాయర్, ప్రెసిడెంట్, అసోచామ్.

వృద్ధికి ఇంధనం..


తయారీ, గ్రీన్ మొబిలిటీ, గ్రామీణ సాధికారతకు వెన్నుదన్నుగా భారత వృద్ధి వేదికలకు ఇంధనం ఇస్తుంది. ఆవిష్కరణ, ఉద్యోగ సృష్టి, ప్రపంచ నాయకత్వానికి బాటలు పరుస్తుంది. గ్రీన్ ఎనర్జీలో గణనీయ పెట్టుబడులు, ఇంధన నిల్వ పరిష్కారాలకు మద్దతు ఇచ్చే స్పష్ట విధానాలతో ఆటోమొబైల్ రంగం పురోగతికి సిద్ధంగా ఉంది. క్లీన్ మొబిలిటీ భవిష్యత్తు పరివర్తనను వేగవంతం చేస్తాయి. స్థిరత్వం, సాంకేతిక ఆవిష్కరణలకు దేశ నిబద్ధతను బలోపేతం చేస్తాయి.



– పవన్ ముంజాల్, ఎగ్జిక్యూటివ్ చైర్మన్, హీరో మోటోకార్ప్.

కస్టమర్లకు ఉపశమనం లేదు..

విడిభాగాలపై దిగుమతి సుంకం తగ్గింపు ప్రతిపాదన, అలాగే తయారీ రంగం వాడే యంత్ర పరికరాలపై (క్యాపిటల్ గూడ్స్) పన్ను మినహాయింపు దేశీయ మొబైల్ తయారీ వ్యయాన్ని తగ్గిస్తుంది. వినియోగదారులకు పెద్ద ఉపశమనం లభించే అవకాశం లేదు. బడ్జెట్‌లో ప్రకటించిన మొత్తం చర్యలు భారతదేశంలో పోటీతత్వాన్ని పెంచుతాయి.



పంకజ్ మొహింద్రూ, చైర్మన్, ఇండియా సెల్యులార్, ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్.


ఇంధన శక్తిలో అగ్రగామిగా..

ఇంధన పరివర్తనను వేగవంతం చేయడానికి ప్రైవేట్ రంగం నుండి ఆవిష్కరణలను పెంచుతూ.. స్థిర ఇంధన శక్తిలో దేశాన్ని ప్రపంచ అగ్రగామిగా ఉంచాలనే ప్రభుత్వ ఆశయాన్ని నొక్కి చెబుతోంది. విద్యుత్ పంపిణీ రంగాన్ని బలోపేతం చేయడం, స్థిర ఇంధన భవిష్యత్తును రూపొందించడానికి అవసరమైన స్మార్ట్ మీటరింగ్ వంటి క్లిష్ట సంస్కరణల అమలుకు రాష్ట్రాలను ప్రోత్సహించడం సానుకూలాంశం.



– నారా విశ్వేశ్వర రెడ్డి, సీఎండీ, షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్.

బాహుబలికి కళ్లెం..!



- నిరాశపరిచిన మూలధన వ్యయ కేటాయింపులు
- కలిసొచ్చిన వ్యక్తిగత ఆదాయ పన్ను మినహాయింపు
- రోజంతా ఒడిదుడుకుల ట్రేడింగ్
- చివరికి ఫ్లాటుగా ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

ముంబై: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలమ్మ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై స్టాక్ మార్కెట్ 'కొంచెం ఇష్టం కొంచెం కష్టం' అన్న చందంగా స్పందించింది. శనివారం జరిగిన ప్రత్యేక ట్రేడింగ్ సెషన్‌లో స్టాక్ సూచీలు తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొని... చివరికి ఫ్లాటుగా ముగిశాయి. వినియోగంపైనే దృష్టి సారిస్తూ.., మూలధన వ్యయాల కేటాయింపు ఆశించిన స్థాయిలో లేకపోవడం మార్కెట్ వర్గాలను నిరాశపరిచింది. సెన్సెక్స్ అయిదు పాయింట్ల స్వల్ప లాభంతో 77,506 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 26 పాయింట్లు కోల్పోయి 23,482 వద్ద నిలిచింది.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- కొత్తగా ఆరు వ్యవసాయ పథకాల ప్రకటనతో పాటు కిసాన్ కార్డుల రుణ పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచడంతో పాటు అగ్రికల్చర్ షేర్లకు భారీ డిమాండ్ లభించింది. కావేరీ సీడ్స్ , పారదీప్ పాస్ఫేట్, మంగళం సీడ్స్, నాథ్ బయో–జీన్స్, బేయర్ క్రాప్‌సైన్సెస్, పీఐ ఇండస్ట్రీస్ షేర్లు 7% నుంచి అరశాతం పెరిగాయి. మరోవైపు కెమికల్స్ రంగానికి సంబంధించి ఎలాంటి ప్రోత్సాహక చర్యలు లేకపోవడంతో చంబల్ ఫెర్టిలైజర్స్, ధమాకా అగ్రిటెక్, టాటా కెమికల్స్, కోరమాండల్ షేర్లు 3% నుంచి అరశాతం నష్టపోయాయి.
- ఒక వ్యక్తి గరిష్టంగా రెండు ఇళ్లనూ సొంతానికి వినియోగిస్తున్నట్లు ప్రకటించడం ద్వారా ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదంటూ బడ్జెట్‌లో ప్రతిపాదనతో రియల్టీ రంగ షేర్లు పరుగులు పెట్టాయి. ప్రస్తుతం ఒక ఇంటికే ఈ ప్రయోజనం అమల్లో ఉంది. ఫినిక్స్ మిల్స్, మాక్రోటెక్, ప్రెస్టేజ్ ఎస్టేట్స్ ప్రాపర్టీస్, శోభ షేర్లు 7% నుంచి 4 శాతం లాభపడ్డాయి. సిగ్నేచర్ గ్లోబల్, డీఎల్ఎఫ్, ఒబెరాయ్ రియల్టీ, గోద్రేజ్ ప్రాపర్టీస్ షేర్లు 3 నుంచి ఒకశాతం పెరిగాయి.
- లెదర్ రంగంలో ఉత్పత్తి, నాణ్యత, పోటీతత్వాన్ని పెంచేందుకు త్వరలో ఒక ప్రత్యేక పథకాన్ని ప్రవేశపెడతామంటూ కేంద్ర ఆర్థిక మంత్రి ప్రకటనతో ఫుట్‌వేర్ షేర్లు పరుగులు తీశాయి. మీర్జా ఇంటర్నేషనల్ 20% ఎగసి అప్పర్ సర్క్యూట్ తాకింది. క్యాంపస్ ఆక్టివేర్ 7%, బాటా ఇండియా 6%, మెట్రో బ్రాండ్స్ 4%, లెహర్ ఫుట్‌వేర్స్ 3%, రిలాక్సో ఫుట్‌వేర్స్ ఒకశాతం పెరిగాయి.

ట్రేడింగ్ సాగిందిలా...

స్టాక్ సూచీలు ఉదయం సానుకూలంగా మొదలయ్యాయి. సెన్సెక్స్ 136 పాయింట్లు పెరిగి 77,501 వద్ద, నిఫ్టీ 21 పాయింట్ల లాభంతో 23,529 వద్ద మొదలయ్యాయి. బడ్జెట్‌పై భారీ ఆశలతో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రసంగం ప్రారంభమయ్యే వరకు లాభాల్లోనే కదలాడింది. ఒక దశలో సెన్సెక్స్ 400 పాయింట్లు లాభపడి 77,899 వద్ద, నిఫ్టీ 124 పాయింట్లు ఎగసి వద్ద గరిష్టాలు తాకాయి. బడ్జెట్ ప్రసంగం మొదలైన కొద్ది సేపటికి నష్టాల్లోకి జారుకున్నాయి. సెన్సెక్స్ గరిష్టం నుంచి ఏకంగా దాదాపు 893 పాయింట్లు కోల్పోయి 77,006 వద్దకు చేరింది. నిఫ్టీ ఇంట్రాడే గరిష్టం 314 పాయింట్లు పతనమై 23,318 వద్ద కనిష్టాలు తాకాయి. ప్రసంగం పూర్తయిన తర్వాత తిరిగి కొనుగోళ్లు నెలకొనడంతో నష్టాలు భర్తీ చేసుకున్న సూచీలు మిశ్రమంగా ముగిశాయి.

వినిమయ షేర్లు పరుగులు



ప్రజల వినియోగ శక్తి పెంపు లక్ష్యంలో భాగంగా కేంద్రం వేతన జీవుల వ్యక్తిగత ఆదాయపన్ను రూ.12 లక్షల వరకు మినహాయింపు ఇచ్చింది. దీంతో వినిమయ సంబంధిత రంగాలైన రియల్టీ, టూరిజం, ఎఫ్ఎంసీజీ, కన్జూమర్ డ్యూరబుల్, మీడియా, రవాణా–లాజిస్టిక్స్, ఆటో, ఈవీ–కొత్త తరం ఆటోమోటివ్ షేర్లు పరుగులు పెట్టాయి.

- వినిమయ సంబంధిత రంగాల్లో కన్జూమర్ డ్యూరబుల్స్ షేర్లలో అత్యధికంగా బ్లూ స్టార్ 13% పెరిగింది. క్రాంప్టన్ గ్రీవ్స్ 8%, హావెల్స్ 6%, వోల్టాస్ 5%, లాభపడ్డాయి. ఏబీ ఫ్యాషన్, వర్ల్‌పూల్ 3% చొప్పున, టైటాన్ 2% ఎగిశాయి.
- ఎఫ్ఎంసీజీ షేర్లలో ఐటీసీ, టాటా కన్జూమర్, హెచ్‌యూఎల్, డాబర్, మారికో, ఐటీసీ హోటల్స్, బ్రిటానియా షేర్లు 5% వరకు రాణించాయి.
- ఆటో రంగ షేర్లలో మారుతీ సుజుకీ 5%, టీవీఎస్ మోటార్స్ 4%, ఐషర్ మోటార్స్ 3.50%, బజాజ్ ఆటో, మహీంద్రా షేర్లు 3% చొప్పున పెరిగాయి.

మౌలిక రంగ షేర్లు డీలా



ప్రతిసారి మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తూ వచ్చిన ఎన్‌డీఏ ప్రభుత్వం ఈసారి బడ్జెట్‌లో కేటాయింపులు పరిమితం చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.11.21 లక్షల కోట్లు ఖర్చు చేయాలని ప్రతిపాదించారు. మూలధన వ్యయ కేటాంపులు అంచనాల కంటే తక్కువగా ఉండటంతో రైల్వేలు, రక్షణ, మౌలిక, ఇంధన ఆయిల్‌అండ్‌గ్యాస్, మెటల్, హౌసింగ్, ఫార్మా, బ్యాంక్ షేర్లు డీలాపడ్డాయి. .

- రైల్వే రంగ షేరైన టెక్స్‌మాకో రైల్ ఇంజనీరింగ్స్, జుపిటర్ వేగన్స్ , టిటాఘర్ రైల్ సిస్టమ్స్ షేర్లు 6–10% క్షీణించాయి. ఇర్కాన్ ఇంటర్నేషనల్, ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్, రైల్ వికాస్ నిగమ్ షేర్లు 7–10% పతనమయ్యాయి. ఐఆర్‌సీటీసీ, రీట్స్ షేర్లు 3% నష్టపోయాయి.
- రోడ్లు, కన్‌స్ట్రక్షన్ షేర్లు ఎన్‌సీసీ 8%, ఎన్‌బీసీసీ, పీఎన్‌సీ ఇన్‌ఫ్రాటెక్, జీఆర్ ఇన్‌ఫ్రా, ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా షేర్లు 2–5% పడ్డాయి. క్యాపిటల్ గూడ్స్ విభాగంలో ఏబీబీ, సిమెన్స్, భెల్, ఎల్ అండ్‌టీ, అజాద్ ఇంజనీరింగ్స్ షేర్లు 3–6% క్షీణించాయి.

ఎన్‌పీఎస్ వాత్సల్యకూ పన్ను ఊరట

రూ.50,000 పెట్టుబడికి మినహాయింపు • పాత విధానానికే పరిమితం



న్యూఢిల్లీ: చిన్నారుల రిటైర్మెంట్‌కు గణనీయమైన నిధిని సమకూర్చుకునే ఉద్దేశ్యంతో తీసుకొచ్చిన పీఎం వాత్సల్య ఎన్‌పీఎస్ పథకానికి తాజా బడ్జెట్‌లో రూ.50,000 పెట్టుబడులపై పన్ను ఆదా ప్రయోజనం కల్పించారు. తొలిసారిగా 2024–25 బడ్జెట్‌లో ఈ పథకాన్ని ప్రకటించడం గుర్తుండే ఉంటుంది. మైనర్ల పేరిట తల్లిదండ్రులు లేదా సంరక్షకులు ఎన్‌పీఎస్ వాత్సల్య ఖాతా ప్రారంభించి ఇన్వెస్ట్ చేయవచ్చు. చిన్నారులు 18 ఏళ్లు నిండిన తర్వాత రెగ్యులర్ ఖాతా కింద మార్చుకుని, అప్పుడు వారు స్వయంగా ఇన్వెస్ట్ చేసుకోవడానికి వెసులుబాటు ఉంది. దీని కింద ఇప్పటికే రూ.89,475 ఖాతాలు ప్రారంభమయ్యాయి. వీటి పరిధిలో రూ.62 కోట్ల పెట్టుబడులు సైతం సమకూరాయి. ఈ పథకానికి మరింత ఆదరణ కల్పించే ఉద్దేశ్యంతో తాజాగా పన్ను మినహాయింపు ప్రయోజనాన్ని ఆర్థిక మంత్రి కల్పించారు. సాధారణ ఎన్‌పీఎస్ ఖాతాకు ఉన్నట్టుగానే ఎన్‌పీఎస్ వాత్సల్యకు ఒకే విధమైన పన్ను విధానాన్ని ప్రతిపాదిస్తున్నట్టు చెప్పారు. కాకపోతే చట్టం పరిధిలో ప్రస్తుతమున్న గరిష్ఠ ప్రయోజనాల పరిధిలోనే ఇది ఉంటుందన్నారు. సెక్షన్ 80 సీసీడీ(1బి) కింద సాధారణ ఎన్‌పీఎస్‌కు ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.50 వేల జమలపై పన్ను మినహాయింపు ప్రయోజనం ప్రస్తుతం పాత పన్ను విధానం కింద అమల్లో ఉంది.

విలీనాలకు వేగంగా అనుమతులు

ఫాస్ట్‌ట్రాక్ విలీనాల ప్రాసెస్ సరళతరం



న్యూఢిల్లీ: కంపెనీల మధ్య విలీనాలకు మద్దతుగా ప్రభుత్వం ఇకపై వేగవంత అనుమతులకు తెరతీయనుంది. ఇందుకు అనుగుణంగా నిబంధనలు, విధానాలను క్రమబద్ధీకరించేందుకు తాజా బడ్జెట్‌లో ఆర్థిక శాఖ ప్రతిపాదించింది. తద్వారా సులభతర వ్యాపార నిర్వహణకు దారి చూపనుంది. దీంతో ఫాస్ట్‌ట్రాక్ విలీనాలకు అధిక అవకాశాలు ఏర్పడనున్నాయి. కంపెనీల మధ్య విలీనాలకు అవసరమయ్యే నిబంధనలు, విధానాలను క్రమబద్ధీకరించడం ద్వారా ప్రభుత్వం వేగంగా అనుమతులు మంజూరు చేయనుంది. ఈ బాటలో ఫాస్ట్‌ట్రాక్ విలీనాలకు సైతం విధానాలను సరళతరం చేసేందుకు బడ్జెట్‌లో ప్రతిపాదించింది.

కీలక ఖనిజాలపై సుంకాల రద్దు

36 ప్రత్యేక ఔషధాలపై కూడా

న్యూఢిల్లీ: కీలకమైన 12 ఖనిజాలు, లిథియం అయాన్ బ్యాటరీల స్క్రాప్, సీసం, కొబాల్ట్ ఉత్పత్తులు, జింకు మొదలైన వాటితో పాటు క్యాన్సర్, ఇతరత్రా అరుదైన వ్యాధుల చికిత్సలో ఉపయోగించే 36 ఔషధాలపై దిగుమతి సుంకాలను రద్దు చేస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌లో ప్రకటించారు. కీలక ఖనిజాలపై సుంకాల తగ్గింపుతో వాటి ప్రాసెసింగ్, రిఫైనింగ్‌కి ఊతం లభిస్తుందని, వాటిపై ఆధారపడిన రంగాలకు సదరు ఖనిజాల లభ్యత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. సెస్సు వర్తించే 82 ఉత్పత్తుల కేటగిరీలపై సామాజిక సంక్షేమ సర్‌చార్జీని తొలగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఒకటికి మించి సెస్సు లేదా సర్‌చార్జీని విధించకుండా ప్రతిపాదన చేశారు. నౌకా నిర్మాణ సంబంధిత ప్రయోజనాలు అందడానికి సుదీర్ఘ సమయం పడుతుంది కాబట్టి ముడి వస్తువులు, విడిభాగాలపై ప్రాథమిక కస్టమ్స్ డ్యూటీ (బీసీడీ) మినహాయింపును మరో పది సంవత్సరాలు పొడిగించారు. క్యాన్సర్, అరుదైన వ్యాధులు, ఇతర తీవ్ర వ్యాధులతో సతమతమవుతున్న పేషంట్లకు ఊరటనిచ్చేలా బీసీడీ నుంచి పూర్తిగా మినహాయింపు ఉండే ఔషధాల జాబితాలోకి 36 ఔషధాలను చేరుస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ డిస్‌ప్లేపై బీసీడీని 10 శాతం నుంచి 20 శాతానికి పెంచగా, ఓపెన్ సెల్ మొదలైన వాటిపై అయిదు శాతానికి తగ్గించారు.



బీమాకు 100% దన్ను

ఎఫ్‌డీఐలకు తలుపులు బార్లా

త్వరలో డ్రాఫ్ట్ బిల్లు



న్యూఢిల్లీ: ఆర్థిక మంత్రి సీతారామన్ తాజా బడ్జెట్‌లో బీమా రంగానికి పూర్తిస్థాయిలో మద్దతిచ్చారు. బీమా రంగంలో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల(ఎఫ్‌డీఐలు)ను అనుమతించేందుకు ప్రతిపాదించారు. ప్రస్తుతం బీమాలో 74 శాతంవరకూ ఎఫ్‌డీఐలకు అనుమతి ఉంది. ఆధునికతరం ఫైనాన్షియల్ రంగ సంస్కరణలలో భాగంగా ఇందుకు తెరతీశారు. అయితే మొత్తం ప్రీమియంను దేశీయంగా ఇన్వెస్ట్ చేసే కంపెనీలకు మాత్రమే పెంచిన పరిమితి వర్తించనున్నట్లు సీతారామన్ పేర్కొన్నారు. వెరసి విదేశీ పెట్టుబడుల పరిమితులను సమీక్షించడంతోపాటు సరళతరం చేసినట్లు వెల్లడించారు. ఎఫ్‌డీఐ పరిమితి పెంపునకు వీలుగా ప్రభుత్వం బీమా చట్టం 1938, జీవిత బీమా చట్టం 1956, బీమా నియంత్రణ, అభివృద్ధి అధీకృత చట్టం 1999లకు సవరణలు చేయనుంది. మరిన్ని సంస్థలు ప్రవేశించడం ద్వారా బీమా విస్తృతి పెరగడంతోపాటు భారీ ఉద్యోగ అవకాశాలకు తెరలేవనుంది. కొన్ని నిబంధనలు, విధానాలను సరళతరం చేసే ముసాయిదా బిల్లు త్వరలో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం 25 జీవిత బీమా, 34 సాధారణ బీమా కంపెనీలు దేశీయంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. కాగా.. ఇంతక్రితం 2021లో బీమా రంగంలో ఎఫ్‌డీఐల పరిమితిని 49 శాతం నుంచి 74 శాతానికి ప్రభుత్వం హెచ్చించింది. అంతకుముందు 2015లో 26 శాతం నుంచి 49 శాతానికి పెంచేందుకు అనుమతించింది.

చిన్న సంస్థలకు.. భారీ బూస్ట్



- పెట్టుబడులు, టర్నోవరు పరిమితుల్లో మార్పులు
- వృద్ధి, ఉద్యోగ కల్పనకు ఊతం

న్యూఢిల్లీ: దేశానికి వెన్నెముకగా ఉంటున్న సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలకు (ఎంఎస్ఎంఈ) మరింత ఊతమిచ్చే విధంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌లో పలు సంస్కరణలను ప్రతిపాదించారు. ఎంఎస్ఎంఈల వర్గీకరణకు సంబంధించి పెట్టుబడి, టర్నోవరు పరిమితులను పెంచడం, రుణ హామీ పథకం కవరేజీని పెంచడం, ఉద్యమ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న సూక్ష్మ సంస్థలకు కస్టమైజ్ చేసిన క్రెడిట్ కార్డులు అందించడం మొదలైనవి వీటిలో ఉన్నాయి. వర్గీకరణకు సంబంధించి పెట్టుబడి, టర్నోవరు పరిమితులను వరుసగా రెండున్నర రెట్లు, రెండు రెట్లు పెంచుతూ బడ్జెట్‌లో మంత్రి ప్రతిపాదనలు చేశారు. వీటి ప్రకారం రూ. 2.5 కోట్ల వరకు పెట్టుబడులు, రూ. 10 కోట్ల వరకు టర్నోవరు ఉన్న సంస్థలను 'సూక్ష్మ' సంస్థలుగా వర్గీకరిస్తారు. రూ. 25 కోట్ల వరకు పెట్టుబడి, రూ. 100 కోట్ల వరకు టర్నోవరు ఉన్నవి 'చిన్న' తరహా సంస్థలుగా, రూ. 125 కోట్ల వరకు పెట్టుబడులతో రూ. 500 కోట్ల లోపు టర్నోవరు ఉన్న సంస్థలను 'మధ్య' తరహా సంస్థలుగా వ్యవహరిస్తారు. ఎంఎస్ఎంఈల విషయంలో ప్రకటించిన చర్యలను పరిశ్రమ స్వాగతించింది. దేశ ఎకానమీలో తయారీ రంగ వాటాను పెంచే దిశగా ఇది కీలకమైన అడుగని జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ సీఎండీ సజ్జన్ జిందాల్ తెలిపారు.

కీలకమైన రెండో ఇంజిన్..

దేశాభివృద్ధికి కీలకమైన రెండో ఇంజిన్‌గా ఎంఎస్ఎంఈలను నిర్మలా సీతారామన్ అభివర్ణించారు. ఉత్పత్తి సామర్థ్యాలను పెంచుకునేందుకు, టెక్నాలజీని మెరుగుపర్చుకునేందుకు, మరింతగా పెట్టుబడులను సమకూర్చుకునేందుకు తాజా ప్రతిపాదనలు ఉపయోగపడతాయని మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. కార్యకలాపాలను విస్తరించేందుకు, యువతకు మరిన్ని ఉద్యోగాలు కల్పించేందుకు లఘు సంస్థలకు ధీమా లభిస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం కోటి పైగా ఉన్న రిజిస్టర్డ్ ఎంఎస్ఎంఈలు, సుమారు 7.5 కోట్ల మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. తయారీ రంగంలో వీటి వాటా 36 శాతంగాను, ఎగుమతుల్లో దాదాపు 45%గా ఉంది.

మరిన్ని విశేషాలు..

- 5 లక్షల మంది మహిళలు, షెడ్యూల్డ్ కులాలు, తెగల ఎంట్రప్రెన్యూర్లకు ప్రయోజనం చేకూర్చేలా మంత్రి కొత్త ప్రతిపాదన ప్రకటించారు. వచ్చే అయిదేళ్లలో రూ.2 కోట్ల వరకు టర్మ్ లోన్‌లు అందించేందుకు తోడ్పడుతుంది.
- లఘు, చిన్న సంస్థలకు రుణ హామీ కవరేజీని రూ. 5 కోట్ల నుంచి రూ. 10 కోట్లకు పెంచారు. దీనితో వచ్చే అయిదేళ్లలో రూ. 1.5 లక్షల కోట్ల అదనపు రుణాలు లభిస్తాయి.
- స్టార్టప్‌లకు క్రెడిట్ గ్యారంటీ కవరేజీని రూ. 10 కోట్ల నుంచి రూ. 20 కోట్లకు పెంచారు.
- ఉద్యమ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న సూక్ష్మ సంస్థలకు రూ. 5 లక్షల పరిమితితో కస్టమైజ్డ్ క్రెడిట్ కార్డులు అందించనున్నారు. తొలి ఏడాదిలో 10 లక్షల కార్డులు జారీ చేస్తారు.
- మేడిన్ ఇండియా ఆటబొమ్మలకు గ్లోబల్ హబ్‌గా భారత్‌ను తీర్చిదిద్దే దిశగా ఇంటర్నేషనల్ మాన్యుఫాక్చరింగ్ మిషన్ ఏర్పాటు.





వచ్చే ఐదేళ్లలో 75,000 మెడికల్ సీట్లు పెంచనున్నట్టు ప్రకటించడం స్వాగతించదగిన నిర్ణయం. వైద్య విద్య, ఆరోగ్య సంరక్షణలో పరిశోధన, మౌలిక వసతుల అభివృద్ధిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. తద్వారా విద్యార్థులు నాణ్యమైన ఆరోగ్య సంరక్షణను అందించడానికి అవసరమైన నైపుణ్యాలు అందుకుంటారు. అప్పుడే పెరిగిన మెడికల్ సీట్ల ప్రయోజనాలను నిజంగా పొందగలం.

కామినేని శశిధర్
ఎండీ, కామినేని హాస్పిటల్స్

EXPERT OPINION

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సూచీ		మార్పు	ముగింపు
సెన్సెక్స్	▲	5	77,560
నిఫ్టీ	▼	26	23,482

విదేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)

నాస్‌డాక్	19,627	▼	54
డోజోన్స్	44,545	▼	337
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,674	▲	27
డాక్స్	21,732	▲	5
షాంఘై	3,251	▼	2
నికాయ్	39,514	▲	99

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	86.05	87.07
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	105.20	108.00
€	యూరో	ఎస్‌బీఐ	88.77	91.39
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.62	55.98
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.19	55.39
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	60.95	65.62
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.13	23.69
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.19	23.74
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.01	12.83

సిమెంట్ రంగ వృద్ధికి..


హౌసింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులపై పెరిగిన కేటాయింపులు నిర్మాణ సామగ్రికి డిమాండ్‌ను పెంచుతాయి. అలాగే సామర్థ్య విస్తరణకు దారితీస్తుంది. రాష్ట్రాల్లో మౌలిక సదుపాయాలపై పెరిగిన పెట్టుబడులతో సిమెంట్ రంగ వృద్ధికి అవకాశాలు విస్తరిస్తాయి. సవాళ్లు ఉన్నప్పటికీ సిమెంట్ పరిశ్రమ స్థాపిత తయారీ సామర్థ్యం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 6 శాతం కంటే ఎక్కువ స్థిర వార్షిక వృద్ధి రేటును సాధించడానికి ఈ చర్యలు మద్దతు ఇస్తాయి.



– నీరజ్ అఖౌరీ, ప్రెసిడెంట్, సిమెంట్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్.

మెడికల్ టూరిజంకు బూస్ట్..

దేశీయంగా ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలను పటిష్టం చేసే దిశగా బడ్జెట్‌లో ప్రతిపాదనలు ఉన్నాయి. మెడికల్ టూరిస్టులకు వీసా–ఆన్–అరైవల్ సదుపాయాన్ని ప్రవేశపెట్టడంతో హెల్త్‌కేర్ గమ్యస్థానంగా భారత్ బలోపేతం అవుతుంది. ప్రజారోగ్యం, ఆర్థిక వృద్ధిపై చిత్తశుద్ధిని ప్రతిబింబించేలా బడ్జెట్ ఉంది.



– బి. భాస్కర్ రావు, సీఎండీ, కిమ్స్

పోటీతత్వాన్ని పెంచడానికి..

ప్రైవేట్ రంగంలో మూలధనాన్ని సానుకూల దిశలో కేటాయించడాన్ని ప్రోత్సహిస్తుంది. ప్రపంచం కోసం మేక్ ఇన్ ఇండియా అనే అంశం ఈ బడ్జెట్‌లో కీలకంగా ఉంది. తయారీ ఖర్చులను తగ్గించే ప్రయత్నాలు దేశం యొక్క ప్రపంచ పోటీతత్వాన్ని గణనీయంగా పెంచడానికి సిద్ధంగా ఉన్నాయి.



– అనీష్ షా, సీఈఓ, ఎండీ, మహీంద్రా గ్రూప్.

ఈవీల ఉత్పత్తికి బాసట..

బ్యాటరీ తయారీకి కీలక ముడిపదార్థాలపై దిగుమతి సుంకాలు తొలగించడం దేశీయంగా ఎలక్ట్రిక్ వాహనాల ఉత్పత్తిని పెంచుతుంది. స్థిర పర్యావరణ వ్యవస్థను ప్రోత్సహిస్తుంది. పర్యావరణ అనుకూల ఆర్థిక వ్యవస్థకు భారతదేశాన్ని మార్చడానికి ఒక వ్యూహాత్మక చర్య.



– గిరీష్ వాఘ్, ఈడీ, టాటా మోటార్స్.

ఉద్యోగాలను సృష్టించడానికి..

వృద్ధిని పెంపొందించడానికి, ఉద్యోగాలను సృష్టించడానికి బలమైన, నమ్మకమైన వేదికను అందిస్తుంది. రాష్ట్రాల సహకారంతో ఆరు విభాగాలలో సంస్కరణల ద్వారా వ్యవసాయం, ఎంఎస్ఎంఈ, పెట్టుబడి, ఎగుమతుల వంటి శక్తివంతమైన ఇంజిన్లను పటిష్టం చేయడానికి చేసిన విధాన ఎంపికలు స్వాగతించదగినవి.



– సంజీవ్‌పురి, ప్రెసిడెంట్, సీఐఐ

పట్టణ సంస్కరణలకు.. ఊతం

ప్రతి మంత్రిత్వ శాఖకు 3 సంవత్సరాల పైప్‌లైన్ ప్రాజెక్ట్‌లను రూపొందించడం ద్వారా పబ్లిక్–ప్రైవేట్ భాగస్వామ్యాలకు ప్రాధాన్యత ఇవ్వడం మౌలిక సదుపాయాల అభివృద్ధిలో ప్రైవేట్ రంగ ప్రమేయాన్ని ప్రభావితం చేసే స్పష్టమైన ఉద్దేశాన్ని ప్రతిబింబిస్తుంది. దీనికి ఇండియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్ ఫండ్ మరింత మద్దతునిస్తుంది. రూ. లక్ష కోట్ల అర్బన్ ఛాలెంజ్ ఫండ్ పట్టణ సంస్కరణలకు అంకితం.



– వై.ఆర్.నాగరాజా, ఎండీ, రామ్‌కీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్.

అద్దె చెల్లింపులపై ఊరట

టీడీఎస్ ఖుషి



రూ.6 లక్షలకు పరిమితి పెంపు

- వ్యాపార సంస్థలకు ప్రయోజనం
- విదేశీ రెమిటెన్స్‌లపై టీసీఎస్‌లో ఉపశమనం
- విదేశీ విద్యకు టీసీఎస్ పూర్తిగా తొలగింపు

న్యూఢిల్లీ: వ్యక్తిగత ఆదాయపన్ను పరంగా భారీ ఊరటనిచ్చిన కేంద్ర సర్కారు, మరోవైపు అద్దె చెల్లింపులపై టీడీఎస్, విదేశీ రెమిటెన్స్‌ల్లోనూ ఊరట కల్పించింది. ఆదాయపన్ను చట్టంలోని సెక్షన్ 194–ఐ కింద ఒక ఆర్థిక సంవత్సరంలో సంస్థల మధ్య అద్దె చెల్లింపులు రూ.2.40 లక్షలు మించితే కిరాయిదారు మూలం వద్దే పన్ను (టీడీఎస్) మినహాయించాల్సి ఉంటుంది. తాజాగా ఈ పరిమితిని రూ.6 లక్షలకు (నెలవారీ అయితే రూ.50,000) పెంచుతున్నట్టు ఆర్థిక మంత్రి సీతారామన్ ప్రకటించారు.

ఎవరికి ప్రయోజనం..?

తాజా ప్రతిపాదన ప్రధానంగా వ్యాపార **సంస్థలకు ఊరట**గా చెప్పుకోవాలి. ప్రస్తుతం వ్యక్తులు, హెచ్**యూఎఫ్‌లకు** కిరాయి చెల్లింపులు నెలవారీ రూ.50,000 (**వార్షికంగా** రూ.6లక్షలు) మించినప్పుడు 5 శాతం టీడీఎస్ **అమ**లవుతోంది. అదే వ్యాపార సంస్థలు/ట్రస్ట్‌లు/**ఎన్**జీవోలు తదితర వర్గాలకు వార్షిక అద్దె రూ.2.**4** లక్షలు మించినప్పుడే టీడీఎస్ అమలవుతోం**ది**. ఇప్పుడు వ్యక్తులు, హెచ్‌యూఎఫ్‌ల మాదిరే సంస్థలకూ టీడీఎస్ అమలు పరిమితిని నెలవారీ రూ.50,000కు పెంచారు. మరింత స్పష్టత, ఏకరూపత కోసం ఈ చర్య తీసుకున్నట్టు మంత్రి సీతారామన్ తెలిపారు. ''భూమి లేదా మెషినరీని కొన్ని నెలల కోసం అద్దెకు ఇచ్చినప్పుడు, నెలవారీ అ**ద్దె** రూ.50,000 మించితే టీడీఎస్‌లు అమ**లు** చేయాల్సి వస్తుంది''అని డెలాయిట్ ఇండియా **ఆర్తి** రాటే తెలిపారు. తక్కువ పన్ను చెల్లించే **వారు**, భూ/భవన యజమానులకు ఈ పెంపు **ప్రయోజనం** కల్పిస్తుందని క్రెడాయ్–ఎంసీహెచ్ఐ ప్రెసిడె**ంట్ డొమినిక్** రామెల్ అభిప్రాయపడ్డారు.

ఆర్‌బీఐ లిబరలైజ్డ్ రెమిటెన్స్ స్కీమ్ కింద విదేశాలకు పంపుకునే నిధుల(రెమిటెన్స్/చెల్లింపులు)పై టీసీఎస్‌లో మార్పు చోటుచేసుకుంది. ఏడాదిలో రూ.7లక్షలు మించితే మూలం వద్దే పన్ను వసూలు (టీసీఎస్) ప్రస్తుతం అమల్లో ఉండగా, దీన్ని రూ.10 లక్షలకు పెంచుతున్నట్టు ఆర్థిక మంత్రి ప్రకటించారు. నిర్దేశిత ఫైనాన్షియల్ ఇనిస్టిట్యూషన్ నుంచి రుణం తీసుకుని విదేశీ విద్య కోసం పంపుకునే రెమిటెన్స్‌లపై టీసీఎస్‌ను తొలగిస్తున్నట్టు చెప్పడం విద్యార్థుల తల్లిదండ్రులకు మరింత ఊరటనిచ్చేదే. విదేశాల్లో చదువు కోసం, ఇతర అవసరాల కోసం వెళ్లిన వారికి నిధుల అవసరం ఏర్పడొచ్చు. అలాంటప్పుడు స్వదేశం నుంచి వారికి సులభంగా నిధులు పంపుకునేందుకు ఆర్‌బీఐ లిబరలైజ్డ్ రెమిటెన్స్ స్కీమ్ వీలు కల్పిస్తుంది.

రూ.10 లక్షలు మించితేనే రెమిటెన్స్‌లపై టీసీఎస్

కోటి మంది పన్ను కట్టక్కర్లేదు: సీతారామన్

ఐటీ శ్లాబుల్లో మార్పులు చేయడం ద్వారా ప్రజల చేతుల్లో పెద్ద ఎత్తున **ఆదాయాన్ని** మిగిల్చినట్టు ఆర్థిక మంత్రి సీతారామన్ వ్యాఖ్యానించారు. ''**రూ.12** లక్షలకు ఆదాయపన్ను మినహాయింపును పెంచడం వల్ల **మరో** కోటి మంది ప్రజలు పన్ను చెల్లించాల్సిన అవసరం ఉం**డదు**. ప్రజల డిమాండ్లకు ప్రభుత్వం స్పందన ఇది. మధ్య తర**గతి**కి ప్రయోజనం కల్పించేందుకు పన్ను రేట్లను తగ్గించాం ''అని మంత్రి ప్రకటించారు.

కొత్తగా సులభతర ఆదాయపన్ను చట్టం

కొత్త ఆదాయపన్ను బిల్లును వచ్చే వారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నట్టు మంత్రి సీతారామన్ తెలిపారు. ప్రస్తుతమున్న ఆరు దశాబ్దాల క్రితం నాటి 'ఆదాయపన్ను చట్టం 1961' స్థానంలో దీన్ని తీసుకొస్తున్నట్టు చెప్పారు. 'ముందు విశ్వసించండి. తర్వాత పరిశీలించండి' అన్న **భా**వనతో 'న్యాయ' స్ఫూర్తితో ఈ బిల్లు ఉంటుందన్న సం**కే**తం ఇచ్చారు. ''కొత్త బిల్లు చాలా స్పష్టతతో, చాప్టర్లు, **పదా**ల పరంగా ప్రస్తుత చట్టంతో పోల్చి చూసినప్పుడు సగం **పరిమా**ణంలోనే ఉంటుంది. పన్ను చెల్లింపుదారులు, పన్ను అధికా**రులు అర్థం** చేసుకునేంత సరళంగా ఉంటుంది. ఫలితంగా పన్నుల **స్పష్టత ఏర్పడి**, వివాదాలు తగ్గిపోతాయి''అని మంత్రి వివరించారు. కొత్త **ఆదాయపన్ను బిల్లు**ను స్టాండింగ్ కమిటీ పరిశీలనకు పంపిస్తామని చెప్పారు.

జీఎస్‌టీలో కొత్త సవరణలు..



పన్నులు ఎగవేసేందుకు ఆస్కారమున్న ఉత్పత్తులను ట్రాక్ చేసేందుకు ఉపయోగపడేలా 'ట్రాక్ అండ్ ట్రేస్' నిబంధన సహా వస్తు, సేవల పన్నుల (జీఎస్‌టీ) విధానంలో కేంద్ర బడ్జెట్ పలు సవరణలు ప్రతిపాదించింది. ఈ నిబంధన అమలు కోసం విశిష్ట గుర్తింపు మార్కింగ్‌కు నిర్వచనం ఇస్తూ సెంట్రల్ జీఎస్‌టీ చట్టంలో కొత్త నిబంధన చేర్చింది. ప్రత్యేకమైన, సురక్షితమైన, తొలగించడానికి వీలుకాని విధంగా ఉండే డిజిటల్ స్టాంప్, డిజిటల్ మార్క్ లేదా ఆ కోవకు చెందిన ఇతరత్రా గుర్తులు 'విశిష్ట గుర్తింపు మార్కింగ్' కిందికి వస్తాయి. సరఫరా వ్యవస్థను మెరుగ్గా పర్యవేక్షించడానికి, వ్యాపారవర్గాలను డిజిటైజేషన్ వైపు మళ్లించడానికి ఇలాంటి చర్యలు దోహదపడగలవని ఏఎంఆర్‌జీ అండ్ అసోసియేట్స్ సీనియర్ పార్ట్‌నర్ రజత్ మోహన్ తెలిపారు.

ఐఎఫ్‌ఎస్‌సీలో కార్యకలాపాలకు ఊతం..



ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్‌లో (ఐఎఫ్ఎస్‌సీ) కార్యకలాపాలకు ఊతమిచ్చే విధంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌లో పలు ప్రతిపాదనలు చేశారు. షిప్ లీజింగ్ యూనిట్లు, అంతర్జాతీయ కంపెనీలు ఏర్పాటు చేసే బీమా ఆఫీసులు, ట్రెజరీ కార్యాలయాలకు ప్రయోజనాలను కల్పించే ప్రణాళికలు వీటిలో ఉన్నాయి. పలు పన్ను మినహాయింపుల గడువును 2030 మార్చి వరకు వరకు పొడిగించారు. వాస్తవానికి కొన్ని మినహాయింపులు ప్రస్తుత, వచ్చే ఆర్థిక సంవత్సరంలో ముగిసిపోనున్నాయి. మరోవైపు, ఐఎఫ్‌ఎస్‌సీలోని ట్రెజరీ సెంటర్లకు సంబంధించి డివిడెండ్ నిర్వచనం క్రమబద్ధీకరణ, ఫండ్ మేనేజర్లకు సరళతరమైన విధానాలను కూడా బడ్జెట్‌లో కేంద్రం ప్రతిపాదించింది. అంతర్జాతీయంగా ఆర్థిక సేవల రంగంలో భారత్ పురోగమించేందుకు ఇవి దోహదపడగలవని గిఫ్ట్ సిటీ ఎండీ తపన్ రే తెలిపారు. పన్ను ప్రయోజనాల గడువు పొడిగించడం వల్ల ఇన్వెస్టర్లకు దీర్ఘకాలికంగా ఒక స్పష్టత లభిస్తుందని ధ్రువ అడ్వైజర్స్ పార్ట్‌నర్ ఆదిత్య హన్స్ చెప్పారు.

కస్టమ్స్ టారిఫ్‌లు ఇక 'ఎనిమిదే'

గందరగోళానికి తెర



బేసిక్ కస్టమ్స్ డ్యూటీలను కేవలం 'ఎనిమిదింటికి' పరిమితం చేస్తున్నట్టు బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి సీతారామన్ ప్రతిపాదించారు. అయినప్పటికీ సెస్సును సర్దుబాటు చేయడం ద్వారా చాలా వస్తువులపై నికర సుంకాలను ప్రస్తుతం మాదిరే కొనసాగించే విధంగా ఈ మార్పులు చేయడం గమనార్హం. 2025–26 బడ్జెట్‌లో మొత్తం మీద ఏడు టారిఫ్‌లను తొలగించారు. 2023–24లోనూ ఇదే మాదిరిగా ఏడు టారిఫ్‌లను ఎత్తివేశారు. దీంతో ఇప్పుడు 'సున్నా' రేటు సహా మొత్తం ఎనిమిది రేట్లే మిగిలాయి. ఇది సులభతర వ్యాపార నిర్వహణకు అనుకూలిస్తుందన్నది ప్రభుత్వ ఉద్దేశ్యంగా ఉంది. దీంతో పెద్ద సంఖ్యలో ఉన్న టారిఫ్‌ల గందరగోళానికి తెరదించినట్టయింది. డెలాయిట్ ఇండియా పార్ట్‌నర్ హర్‌ప్రీత్ సింగ్ స్పందిస్తూ.. బడ్జెట్‌లో 25 శాతం, 30 శాతం, 35 శాతం, 40 శాతం టారిఫ్‌లను విలీనం చేసి 20 శాతానికి మార్చినట్టు.. సబ్బులు, ప్లాస్టిక్, కెమికల్స్, పాదరక్షలకు ఇది వర్తిస్తుందని చెప్పారు. అలాగే 100 శాతం, 125 శాతం, 150 శాతం టారిఫ్‌లను 70 శాతం టారిఫ్‌లో విలీనం చేసినట్టు తెలిపారు. లేబరేటరీ కెమికల్స్, ఆటోమొబైల్స్‌కు ఇది అమలవుతుందన్నారు.

ప్రైవేట్ రంగానికి పీఎం గతి శక్తి డేటా..



చివరి అంచె వరకు డెలివరీ సేవలు అందేలా చూసేందుకు, మౌలిక సదుపాయాల ఆధారిత యాప్‌లను రూపొందించేందుకు ఉపయోగపడేలా పీఎం గతి శక్తి పోర్టల్‌లోని నిర్దిష్ట డేటా, మ్యాప్‌లను ప్రైవేట్ రంగానికి అందించే దిశగా బడ్జెట్‌లో కేంద్రం ప్రతిపాదన చేసింది. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యాన్ని పటిష్టం చేసేందుకు, ప్రాజెక్ట్ ప్లానింగ్‌లో ప్రైవేట్ రంగానికి తోడ్పడేందుకు ఇది ఉపయోగపడుతుందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. వివిధ శాఖలు అందించే రైల్వే స్టేషన్లు, గూడ్‌షెడ్లు, జాతీయ.. రాష్ట్ర రహదారులు, గిడ్డంగులు, విమానాశ్రయాలు, ఎంఎంఎల్‌పీలు (మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్కులు) మొదలైన డేటా, ప్రైవేట్ రంగం లాస్ట్ మైల్ డెలివరీ సేవలను మెరుగ్గా అందించేందుకు ఉపయోగపడనుంది. అలాగే, స్మార్ట్ సిటీ సొల్యూషన్స్‌ను రూపకల్పన, టెక్ ఆధారిత లాజిస్టిక్స్ నిర్వహణ తదితర అవసరాలకు కూడా ఈ వివరాలు ఉపయోగపడతాయి.

స్టార్టప్‌లకు జోష్

రూ.10 వేల కోట్ల కార్పస్‌తో ఎఫ్ఎఫ్ఎస్ పథకం

దేశంలో స్టార్టప్‌లను ప్రోత్సహించే దిశగా బడ్జెట్‌లో కేంద్రం పలు కార్యక్రమాలు ప్రకటించింది. ఇందులో భాగంగా రూ.10 వేల కోట్ల కార్పస్‌తో నిధుల నిధి (ఫండ్ ఆఫ్ ఫండ్స్ (ఎఫ్ఎఫ్ఎస్) పథకాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. అర్హత కలిగిన స్టార్టప్‌లకు పన్ను రాయితీలు కల్పించేందుకు సంబంధించిన విలీన కాలపరిమితిని (ఇన్‌కార్పొరేషన్ పీరియడ్) ఐదేళ్లు పొడిగిస్తున్నట్లు పేర్కొంది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. 2016లో కూడా కేంద్రం రూ.10 వేల కోట్ల కార్పస్‌తో ఎఫ్ఎఫ్ఎస్ తరహా పథకాన్ని ప్రారంభించింది. వెంచర్ మూలధన పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో దీనిని నెలకొల్పారు. సెక్యూరిటీ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ)లో రిజిస్టర్ అయిన ప్రత్యామ్నాయ పెట్టుబడి నిధులకు (ఏఐఎఫ్‌లకు) పెట్టుబడి సమకూర్చే చిన్న పరిశ్రమల అభివృద్ధి బ్యాంకు (సిడ్బీ) దీనిని నిర్వహిస్తుంది. కాగా ఈ ఏఐఎఫ్‌లు తిరిగి స్టార్టప్‌లలో పెట్టుబడి పెడతాయి. స్టార్టప్‌ల కోసం ఉద్దేశించిన ఈ ఏఐఎఫ్‌లు రూ.91 వేల కోట్లకు పైగా విలువైన ఒప్పందాలను కలిగి ఉన్నట్లు కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. రూ.10 వేల కోట్ల ప్రభుత్వ కార్పస్‌తో కూడిన నిధుల నిధి పథకం వీటికి దన్నుగా నిలుస్తుందని తెలిపారు. తాజాగా మరో రూ.10 వేల కోట్ల సహాయంతో ఓ కొత్త నిధుల నిధి పథకాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆర్థిక మంత్రి ప్రకటించారు. పరిశ్రమలను, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం (డీపీఐఐటీ)తో భేటీలో ఏఐఎఫ్‌లు ఈ పథకం కింద మరిన్ని నిధుల కోసం డిమాండ్ చేశాయి. ఎఫ్ఎఫ్ఎస్ సహకారం పొందుతున్న ప్రముఖ స్టార్టప్ పెట్టుబడి సంస్థల్లో చిరాటే వెంచర్స్, ఇండియా కోషియెంట్, బ్లూమ్ వెంచర్స్, ఐవై క్యాప్ తదితరాలున్నాయి. ఎఫ్ఎఫ్ఎస్ కింద ప్రయోజనం పొందే ఏఐఎఫ్‌లు..తాము అంగీకరించిన మొత్తానికి కనీసం రెండింతలు స్టార్టప్‌లలో పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. 2024 అక్టోబర్ నాటికి ఏఐఎఫ్‌లు రూ.20,572 కోట్ల మేర స్టార్టప్‌లలో పెట్టుబడులు పెట్టాయి.



కంపెనీల హర్షం

ఎఫ్ఎఫ్ఎస్ పథకంపై పలు కంపెనీలు హర్షం వ్యక్తం చేశాయి. బడ్జెట్ భారత్‌ను ప్రపంచ ఆవిష్కరణల పవర్‌హౌస్ గా నిలబెడుతుందని పేర్కొన్నాయి. రూ.10 వేల కోట్ల తాజా కార్పస్‌తో స్టార్టప్‌లకు అవసరమైన పెట్టుబడులు అందుబాటులోకి వస్తాయని భారత్ పే వ్యవస్థాపకుడు శాశ్వత్ నకరాని చెప్పారు. కొత్త స్టార్టప్‌లకు తాజా ఎఫ్ఎఫ్ఎస్ పథకం కీలకమైన ఆర్థిక మద్దతును అందజేస్తుందని స్టార్టప్ పాలసీ ఫోరం (ఎస్‌పీఎఫ్) అధ్యక్షుడు, సీఈఓ రాజ్‌పాల్ కోహ్లి పేర్కొన్నారు.




డివిడెండ్ @ రూ.2.56 లక్షల కోట్లు

2025–26కు అంచనాలు

కేంద్ర బ్యాంకు ఆర్‌బీఐసహా ప్రభుత్వ రంగ ఫైనాన్షియల్ సంస్థల నుంచి కేంద్ర ప్రభుత్వానికి వచ్చే ఆర్థిక సంవత్సరం (2025–26)లో రూ. 2.56 లక్షల కోట్లు డివిడెండ్‌గా అందనున్నట్లు తాజా బడ్జెట్ అంచనా వేసింది. ప్రస్తుత ఏడాది(2024–25)లో డివిడెండ్, మిగులు ద్వారా రూ. 2.34 లక్షల కోట్లమేర లభించనున్నట్లు అభిప్రాయపడింది. గత అంచనాల కంటే ఇది రూ. 1,410 కోట్లు ఎక్కువకాగా.. వచ్చే ఏడాది ఇవి మరింత బలపడనున్నట్లు ఆర్థిక శాఖ భావిస్తోంది. ఇక ప్రభుత్వ రంగ సంస్థలు, ఇతర పెట్టుబడుల ద్వారా కేంద్ర ప్రభుత్వానికి అందనున్న మొత్తం వసూళ్లు రూ. 3.25 లక్షల కోట్లను తాకనున్నట్లు అంచనా. గతంలో నమోదైన రూ. 2.89 లక్షల కోట్లను దాటనున్నాయి.

ఎలక్ట్రానిక్స్ ప్రాజెక్టులకు కేటాయింపులు.. రూ. 18,000 కోట్లు

వచ్చే ఆర్థిక సంవత్సరంలో కీలకమైన టెక్నాలజీ ప్రాజెక్టులకు కేటాయింపులను 84 శాతం అధికంగా రూ. 18,000 కోట్లకు పెంచినట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. మొబైల్ ఫోన్లు, ఐటీ హార్డ్‌వేర్, సెమీకండక్టర్లు మొదలైన వాటి తయారీని ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకం, ఇండియాఏఐ మిషన్ మొదలైనవి వీటిలో ఉన్నాయి. మొత్తం మీద ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖకు కేటాయింపులు 48 శాతం పెరిగి రూ. 17,566 కోట్ల నుంచి రూ. 26,026 కోట్లకు చేరాయి. అత్యధికంగా మొబైల్ ఫోన్ల తయారీకి సంబంధించిన లార్జ్ స్కేల్ ఎలక్ట్రానిక్స్ మాన్యుఫాక్చరింగ్ పీఎల్ఐకి రూ. 8,885 కోట్లు కేటాయించారు. యాపిల్ ఉత్పత్తుల తయారీ సంస్థలు ఫాక్స్‌కాన్, టాటా ఎలక్ట్రానిక్స్ మొదలైనవి ఈ పథకం లబ్ధిదార్లుగా ఉన్నాయి. మరోవైపు, సెమీ కండక్టర్ ప్రాజెక్టులకు కేటాయింపులు, సవరించిన అంచనాలకు దాదాపు రెట్టింపై, దాదాపు రూ. 2,500 కోట్లకు చేరాయి. ఇండియాఏఐ మిషన్‌కి కేటాయింపులు 11 రెట్లు పెరిగి రూ. 2,000 కోట్లకు చేరాయి. డిజైన్ ఆధారిత ప్రోత్సాహక పథకానికి రెట్టింపు స్థాయిలో రూ. 200 కోట్లు కేటాయించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఎలక్ట్రానిక్ రంగ ప్రాజెక్టులకు కేటాయింపులను రూ. 9,766 కోట్లకు సవరించారు.






డిజిన్వెస్ట్‌మెంట్ @ రూ.47,000 కోట్లు

కేంద్ర ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో వచ్చే ఆర్థిక సంవత్సరానికి డిజిన్వెస్ట్‌మెంట్ ద్వారా రూ. 47,000 కోట్ల సమీకరణ లక్ష్యాన్ని ప్రతిపాదించింది. అయితే డిజిన్వెస్ట్‌మెంట్, ఆస్తుల మానిటైజేషన్ తదితర మూలధన వసూళ్లకింద ఈ మొత్తాన్ని అంచనా వేసింది. వెరసి రూ. 47,000 కోట్ల మిస్‌లేనియస్ క్యాపిటల్ రిసీప్ట్స్ లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. వెరసి పీఎస్‌యూలలో వాటాల విక్రయం ద్వారా నిధుల సమీకరణ(డిజిన్వెస్ట్‌మెంట్)ను ప్రత్యేకంగా ప్రస్తావించకుండా ఏడాది మూలధన సమీకరణగా పేర్కొంది. 2024–25లో ప్రభుత్వం వార్షిక డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యాల నుంచి దూరం జరిగింది. పీఎస్‌యూలలో వాటాల విక్రయం, ఆస్తుల మానిటైజేషన్ తదితర మిస్‌లేనియస్ క్యాపిటల్ రిసీప్ట్స్ ద్వారా రూ. 50,000 కోట్ల లక్ష్యాన్ని ప్రకటించింది. దీనిలో భాగంగా ఎంఎస్‌టీసీసహా పలు ప్రభుత్వ రంగ సంస్థల ఐపీవోలకు దీపమ్ ప్రణాళికలు వేసింది. పీఎస్‌యూ దిగ్గజాలు హెచ్ఏఎల్, కోల్ ఇండియా, ఆర్‌వీఎన్ఎల్, ఎస్‌జేవీఎన్, హడ్కోలలో మైనారిటీ వాటాల విక్రయం(ఓఎఫ్ఎస్)ను సైతం చేపట్టింది. తద్వారా రూ. 13,728 కోట్లు సమకూర్చుకుంది. అయితే ఐడీబీఐ బ్యాంక్ ప్రయివేటైజేషన్‌సహా వ్యూహాత్మక వాటాల విక్రయం పట్టాలెక్కలేదు. 2021 అక్టోబర్‌లో టాటా గ్రూప్‌నకు విమానయాన దిగ్గజం ఎయిరిండియా విక్రయం తదుపరి ప్రధాన డీల్స్‌కు చెక్‌పడింది.

2025–26లో ద్రవ్యలోటు 4.4 శాతానికి కట్టడి @ రూ.15,68,936 కోట్లు



ప్రభుత్వ ఆదాయాలు–వ్యయాలకు మధ్య నికర వ్యత్యాసం–ద్రవ్యలోటును 2024–25లో అనుకున్న ప్రకారం 4.8% వద్ద (జీడీపీ విలువలో) కేంద్రం కట్టడి చేయగలిగింది. విలువల్లో ఇది రూ. 15,68,936 కోట్లు. 2025–26లో 4.4%కి తీసుకురావాలని నిర్దేశించుకుంది. గణాంకాల్లో చూస్తే, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రూ.15.70 లక్షల కోట్ల ద్రవ్యలోటు అంచనా వేయగా, అంతకన్నా తక్కువగా రూ.15.69 లక్షల కోట్లకు చేరడం గమనార్హం. తాజా ద్రవ్యలోటును పూడ్చుకోడానికి రూ.11.54 లక్షల కోట్ల మార్కెట్ రుణాన్ని సమీకరించాలని కొత్త బడ్జెట్ లక్ష్యంగా పెట్టుకుంది. మిగిలిన మొత్తాలను చిన్న తరహా పొదుపు మార్గాల ద్వారా సమీకరించాలని బడ్జెట్ నిర్దేశించింది. స్థూలంగా రూ.14.82 లక్షల కోట్ల మార్కెట్ రుణాలను స్వీకరించాలన్నది లక్ష్యం.

క్లుప్తంగా...

కాంగ్రెస్ అసలు రంగు బయటపడింది

వేముల ప్రశాంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 14 నెలల్లోనే ఆ పార్టీ మూడు రంగుల జెండా అసలు రంగు బయట పడిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. సొంత డబ్బా కొట్టుకోవడం, వెకిలి విమర్శలు మానుకుని హామీల అమలుపై దృష్టి పెట్టాలన్నారు. తెలంగాణభవన్‌లో పార్టీ నేతలు పల్లె రవికుమార్, తుంగ బాలు, కిశోర్, గాంధీ నాయక్‌తో కలిసి వేముల శనివారం మీడియాతో మాట్లాడారు. సామాజిక మాధ్యమ వేదికలు ట్విట్టర్, టిక్‌టాక్‌కు తేడా తెలియని సీఎం రేవంత్ అచ్చోసిన ఆంబోతులా ఊరేగుతుండటం తెలంగాణ ప్రజల దురదృష్టమని ప్రశాంత్‌రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పార్టీ సొంత సర్వేలోనే రేవంత్‌పై వ్యతిరేకత వ్యక్తం కావడంతో సీఎం మెదడు స్తంభించి కేసీఆర్‌పై సంస్కార హీనంగా విమర్శలు చేస్తున్నారన్నారు. రుణ మాఫీ విషయంలో అనేక గడువులు పెట్టినా చివరకు 20 లక్షల మంది రైతులకు వర్తించలేదన్నారు.

టికెట్లు ఇతరులకు ఇస్తూ బీసీ కులగణన ఎందుకు చేసినట్టు?

కాంగ్రెస్ పార్టీపై జాజుల శ్రీనివాస్ గౌడ్ ఫైర్



సాక్షి, హైదరాబాద్: బీసీ కులగణన చేసి ఎవరి వాటా వారికి ఇస్తామని గల్లీ నుంచి ఢిల్లీ దాకా చెబుతున్న కాంగ్రెస్ నాయకుల మాటలు నీటి మీద మూటలేనని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెడ్లకు టికెట్లు ఇవ్వడమే ఇందుకు ఉదాహరణ అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ చెప్పేది ఒకటి, చేసేది మరొకటని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్ని హామీలిచ్చినా దాని వైఖరి కుక్కతోక వంకరే అన్నట్టు రుజువైందని ఆరోపించారు. మెదక్–నిజామాబాద్–కరీంనగర్–ఆదిలాబాద్ పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థిగా కార్పొరేట్ కాలేజీల అధినేత నరేందర్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ప్రకటించడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. బీసీ కులగణన చేసి, పీసీసీ అధ్యక్షుడిని చేసి టికెట్లు మాత్రం అగ్రకులాలకు ఇవ్వడం అత్యంత దారుణమని మండిపడ్డారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బీసీల తడాఖా చూపిస్తామని జాజుల హెచ్చరించారు.

సీఎం భాషకు తెలంగాణ తల్లి కన్నీరు

మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి భాష తీరు చూసి తెలంగాణ తల్లి కన్నీరు పెడుతోందని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. ఆయన శనివారం తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. శుక్రవారం రవీంద్రభారతిలో జరిగిన గద్దర్ జయంతి సభలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరమన్నారు. గద్దర్ జయంతి సభ కాంగ్రెస్ ఉత్సవ సభగా మారిందని ధ్వజమెత్తారు. దీన్నిబట్టి చూస్తే హంతకులే సంతాప సభ పెట్టినట్లు ఉందని విమర్శించారు. ప్రపంచానికి గద్దర్‌ను తామే పరిచయం చేసినట్లు ప్రభుత్వ పెద్దలు మాట్లాడటం చాలా దుర్మార్గమన్నారు. గద్దర్ ఏనాడైనా అవార్డులకు పాకులాడారా? అని ప్రశ్నించారు. పద్మశ్రీ అవార్డులపై వ్యతిరేక భావనతో ఉన్న గద్దర్ పేరును.. అదే అవార్డుకు రేవంత్ ఎలా సిఫారసు చేస్తారని నిలదీశారు. గద్దర్ గతంలో నంది అవార్డు తిరస్కరించారని గుర్తు చేశారు. అవార్డు తిరస్కరించిన గద్దర్ పేరు మీద సినిమా అవార్డులు ఎలా ఇస్తారని బాలకిషన్ ప్రశ్నించారు.

అభయారణ్యంలో అరుదైన జింక



అంతరించిపోతున్న అరుదైన జంతువులు లంకమల్లేశ్వర అభయారణ్యంలో దర్శనమిస్తున్నాయి. వైఎస్సార్‌జిల్లా అట్లూరు మండలం మచ్చాయికుంట ఏరియాలోని కలివికోడి ఆవాస ప్రాంతంలో కలివికోడి ఉనికిని కనుగొనేందుకు అమర్చిన కెమెరాల్లో ఇంత వరకు కనిపించని అరుదైన జింక దర్శనమిచ్చిందని రేంజ్ అధికారి కళావతి తెలిపారు. అలాగే ఈ కెమెరాల్లో అందమైన పక్షులు, రక రకాల జంతువులు కూడా దర్శనమిస్తున్నట్లు ఆమె తెలిపారు.

- అట్లూరు

వేదిక్ వర్సిటీలో చిరుత సంచారం



తిరుపతిలోని వేదిక్ వర్సిటీ పరిపాలనా భవనం ఎదుట శుక్రవారం రాత్రి చిరుత హల్‌చల్ చేసింది. అక్కడ ఓ శునకంపై దాడి చేసి పొదల్లోకి తీసుకెళ్లటాన్ని కొందరు విద్యార్థులు చూశారు. ఆ దృశ్యాలను సెల్‌ఫోన్లలో రికార్డు చేశారు. ఆ దృశ్యాలు సీసీ కెమెరాలలోనూ రికార్డయ్యాయి. తిరుపతిలోని ఎస్వీయూ, వేదిక్, వెటర్నరీ వర్సిటీల్లో చిరుత సంచరిస్తున్నట్టు సీసీ కెమెరాల్లో స్పష్టంగా రికార్డవుతున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విద్యార్థులు వాపోతున్నారు. ఇటు వర్సిటీ అధికారులు, అటవీశాఖ అధికారులు కేవలం సీసీ కెమెరాలు అమర్చి, హెచ్చరిక బోర్డులతో సరిపెడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. వర్సిటీల ప్రాంగణంలో వెంటనే బోన్లను ఏర్పాటు చేయాలని ఉద్యోగులు, విద్యార్థులు కోరుతున్నారు.

- తిరుపతి సిటీ

అంతర్వేదిలో కల్యాణోత్సవాలు



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది క్షేత్రంలో కొలువైన శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి వార్షిక దివ్య తిరు కల్యాణ మహోత్సవాలు ఈ నెల 4–13 వరకు జరగనున్నాయి. రథసప్తమి పర్వదినమైన 4న ముద్రికాలంకరణ (స్వామివారిని పెండ్లి కుమారునిగా, అమ్మవారిని పెండ్లి కుమార్తెగా అలంకరించడం), 7న రాత్రి 12.55 గంటలకు మృగశిరా నక్షత్ర యుక్త వృశ్చిక లగ్నంలో స్వామివారి తిరు కల్యాణం, 8న మధ్యాహ్నం రథోత్సవం, 12న చక్రవారీ సముద్రస్నానం, 13న అంతర్వేదిలో హంస వాహనంపై స్వామి, అమ్మవార్ల తెప్పోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ తెలిపారు.

- సఖినేటిపల్లి

అదరహో.. అరకు చలి ఉత్సవాలు



అరకు చలి ఉత్సవాలకు పర్యాటకులు పోటెత్తడంతో శనివారం పర్యాటక ప్రాంతాలన్నీ కిటకిటలాడాయి. హెలీరైడ్, పారా గ్లైడింగ్, హాట్ ఎయిర్ బెలూన్‌లకు విశేష స్పందన లభించింది. పద్మాపురం ఉద్యాన వనంలో ఏర్పాటు చేసిన ఫ్లవర్ షో ఆకట్టుకుంది. సైక్లింగ్ పోటీల్లో మధ్యప్రదేశ్‌కు చెందిన ఓపీ అగర్వాల్ ప్రథమ స్థానం, అరకులోయ మండలం దండపాడుకు చెందిన పాంగి అజయ్ ద్వితీయ స్థానం, విశాఖకు చెందిన ప్రియదర్శిని తృతీయస్థానంలో నిలిచారు. కాగా, బొర్రా గుహల నుంచి అరకులోయ వరకు నిర్వహించిన సైక్లింగ్‌లో అపశ్రుతి చోటుచేసుకుంది. విజయనగరానికి చెందిన అభిషేక్ ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొట్టాడు. వెంటనే అతడిని 108లో అనంతగిరి ఆస్పత్రికి తరలించారు.

-అరకులోయ టౌన్/ డుంబ్రిగుడ

ఆశల పల్లకీలో ఎంఎస్‌ఎంఈలు

- మారిన నిర్వచనంతో సూక్ష్మ, చిన్న పరిశ్రమల పరిధి విస్తృతం
- కొల్లేటరల్ సెక్యూరిటీ లేకుండా రూ.10 కోట్ల వరకు రుణాలు



సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వ 2025–26 బడ్జెట్ ప్రతిపాదనలు రాష్ట్రంలోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో (ఎంఎస్ఎంఈ) ఆశలు రేకెత్తిస్తున్నాయి. ఎంఎస్ఎంఈల పరిధిని కొత్తగా నిర్వచించడంతోపాటు రుణ పరిమితిని రెట్టింపు చేశారు. దీంతో వచ్చే ఐదేళ్లలో ఎంఎస్ఎంఈలకు దేశవ్యాప్తంగా రూ.లక్షన్నర కోట్లు అదనంగా రుణాలు లభించే అవకాశం ఏర్పడింది. తెలంగాణలోనూ రుణ లభ్యత పెరగడంతోపాటు కొత్తగా అనేక సంస్థలు ఎంఎస్ఎంఈల పరిధిలోకి రానున్నాయి. రాష్ట్రంలో 2015 నాటికి 26.05లక్షల ఎంఎస్ఎంఈలు ఉండగా, టీజీ ఐపాస్ పోర్టల్‌లో నమోదవుతున్న వివరాల ప్రకారం వీటి వృద్ధి రేటు 11 నుంచి 15 శాతం వరకు ఉంటోంది. రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈల్లో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లోనే 40శాతం మేర ఉన్నాయి. ఎంఎస్ఎంఈలతో సుమారు 33లక్షల మంది ఉపాధి పొందుతుండగా, సేవలు, ఫుడ్ ప్రాసెసింగ్, ఖనిజాధారిత పరిశ్రమల్లోనే ఎక్కువ మంది పనిచేస్తున్నారు. తెలంగాణలోని ఎంఎస్ఎంఈలు భూమి, నిధులు, ముడి సరుకులు, కార్మికులు, సాంకేతికత, సరైన మార్కెటింగ్ వసతులు లేకపోవడం వంటి సమస్యలు ఎదుర్కొంటున్నాయి. నిధుల కోసం బ్యాంకుల వద్దకు వెళ్లే ఎంఎస్ఎంఈలు కొల్లేటరల్ సెక్యూరిటీ సమస్యను ఎదుర్కొంటున్నాయి. ఎంఎస్ఎంఈ రుణాల కోసం డిమాండ్ ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ దేశంలో మూడో స్థానంలో ఉంది. నిర్వహణ వ్యయం కోసం బ్యాంకులను ఆశ్రయిస్తున్నా సరైన సమాచారం లేకపోవడం, ఇతర నిబంధనలతో సకాలంలో ఎంఎస్ఎంఈలకు నిధులు అందుబాటులోకి రావడం లేదు. కొల్లేటర్ సెక్యూరిటీ లేకుండా రుణపరిమితిని రెట్టింపు చేసి రూ.10 కోట్లకు పెంచారు.

ప్రగతిశీల, పురోగామి బడ్జెట్

ప్రజలు, ఉద్యోగులు, పారిశ్రామిక అనుకూల ప్రగతిశీల, పురోగామి బడ్జెట్ ఇది. టారిఫ్ రేట్ల విధానంలో మార్పులతో దేశీయంగా తయారీ రంగానికి ఊతం లభిస్తుంది. బడ్జెట్‌లో ప్రతిపాదించిన 'జాతీయ క్రిటికల్ మినరల్ మిషన్'ద్వారా లిథియం, కోబాల్ట్ వంటి అనేక ఖనిజాలు దేశ ఆర్థిక పురోగతిలో కీలకంగా మారడంతో పాటు కాలుష్యాన్ని తగ్గించేందుకు దోహదం చేస్తాయి. తద్వారా లిథియం, ఎలక్ట్రిక్ వాహన బ్యాటరీల తయారీని ప్రోత్సహిస్తుంది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఈ బడ్జెట్ ఎంతో ఉపయోగకరం. నైపుణ్య శిక్షణ రంగానికి కూడా బడ్జెట్‌లో పెద్ద పీట వేశారు.

–సురేశ్ కుమార్ సింఘాల్, ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు

నిధుల లభ్యత పెరుగుతుంది

ఎంఎస్ఎంఈల్లో సులభతర విధానాలకు బాటలు వేసేలా బడ్జెట్ ఉంది. రుణ లభ్యత పెరగడంతో రూ.5 లక్షల విలువ చేసే క్రెడిట్ కార్డులను 10 లక్షల మందికి జారీ చేయాలనే నిర్ణయాన్ని ఆహ్వానిస్తున్నాం. ఇది ఎంఎస్ఈలకు నిర్దేశిత వడ్డీపై ఎప్పుడైనా రుణ మొత్తాన్ని ఉపయోగించుకునే వెసులుబాటును కల్పిస్తుంది. ఔషధాల తయారీలో ఉపయోగించే ముడి సరుకుల దిగుమతి సులభతరమవుతుంది. స్టార్టప్‌ల రుణ పరిమితి కూడా రూ.10లక్షల నుంచి రూ.20 లక్షల వరకు పెంచడాన్ని ఆహ్వానిస్తున్నాం.

– కొండవీటి సుధీర్‌రెడ్డి, తెలంగాణ పారిశ్రామికవేత్తల సమాఖ్య అధ్యక్షుడు

జాతీయ స్థాయిలో తెలంగాణ పోలీసులు భేష్

ఏటా క్రీడాపోటీలు జరిగేలా చర్యలు: డీజీపీ జితేందర్ • ముగిసిన 3వ రాష్ట్ర స్థాయి పోలీసు క్రీడలు

కరీంనగర్ స్పోర్ట్స్ / కొండగట్టు (చొప్పదండి): జాతీయ స్థాయిలో జరిపిన ఓ సర్వేలో తెలంగాణ పోలీసులు ముందంజలో ఉన్నారని, ఆలిండియా పోలీస్ డ్యూటీ మీట్‌పోటీల్లో రాష్ట్ర పోలీసులు మొదటి స్థానంలో నిలిచారని డీజీపీ డాక్టర్ జితేందర్ పేర్కొన్నారు. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కేంద్రంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న 3వ రాష్ట్ర స్థాయి పోలీసు క్రీడాపోటీలు శనివారంతో ముగిశాయి. ముఖ్యఅతిథిగా హాజరైన డీజీపీ జితేందర్ ముందుగా సాయుధ బలగాల గౌరవ వందనం స్వీకరించారు. ఇటీవలే ఆధునీకరించిన పోలీస్ పరేడ్ గ్రౌండ్‌ను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ, రానున్న రోజుల్లో జాతీయ స్థాయిలో జరిగే క్రీడల్లో తెలంగాణ పోలీసులు మొదటి స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. ఏటా రాష్ట్ర పోలీసులకు క్రీడా పోటీలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. పోటీలు అద్భుతంగా నిర్వహించినందుకు స్పోర్ట్స్ ఐజీ రమేశ్‌రెడ్డి, కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతిని అభినందించారు. స్పోర్ట్స్ ఐజీ రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. పోటీల్లో 2,380 మంది క్రీడాకారులు పాల్గొనగా, 296 మంది మహిళలు, 12 మంది ఐపీఎస్ అధికారులు కూడా పాల్గొన్నారన్నారు. 28 క్రీడాంశాల్లో 236 బంగారు పతకాలు, 236 వెండి పతకాలు, 396 కాంస్య పతకాలను క్రీడాకారులు గెలుచుకున్నట్లు తెలిపారు. ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, కోఆర్డినేషన్ డీఐజీ గజరావు భూపాల్, కరీంనగర్ రూరల్ ఏసీపీ శుభం ప్రకాశ్, ట్రైనీ ఐపీఎస్ వసుంధర, కరీంనగర్ అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

చాంపియన్ హైదరాబాద్

3వ రాష్ట్ర పోలీసు క్రీడా పోటీల చాంపియన్‌గా హైదరాబాద్ కమిషనరేట్ నిలిచింది. టీజీఎస్పీ రేంజ్– 1 ద్వితీయ స్థానంలో నిలిచింది. అథ్లెటిక్స్ విభాగంలో రాచకొండ కమిషనరేట్, స్విమ్మింగ్‌లో ఆర్‌బీవీఆర్‌ఆర్ టీజీపీఏ, ఆర్చరీలో టీజీఎస్పీ రేంజ్–1, బాక్సింగ్‌లో హైదరాబాద్ కమిషనరేట్ విజేతలుగా నిలిచాయి.



కొండగట్టులో ఆలయంలో డీజీపీ జితేందర్

అంజన్నను దర్శించుకున్న డీజీపీ

డీజీపీ జితేందర్ శనివారం కుటుంబ సభ్యులతో కలిసి జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీఆంజనేయస్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, అధికారులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. అంతకుముందు జగిత్యాల జిల్లా పోలీసుల నుంచి డీజీపీ గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వామిని దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ఎస్పీ అశోక్‌కుమార్ డీజీపీకి పూల మొక్క అందించారు. జిల్లా స్థితిగతులు, శాంతిభద్రతలపై జిల్లా పోలీస్ శాఖ తీసుకుంటున్న చర్యలను ఆయనకు వివరించారు. డీఎస్పీ రఘుచందర్, ఆర్ఐ కిరణ్ కుమార్, మల్యాల సీఐ రవి ఉన్నారు.

జూనియర్ కాలేజీల అనుమతుల్లో పొరపాట్లు నిజమే!

- వచ్చే విద్యా సంవత్సరం పునరావృతం కాకుండా చర్యలు
- 3 నుంచి 22 వరకు 10 రోజులు ప్రాక్టికల్ పరీక్షలు
- సమస్యల పరిష్కారానికి 92402 05555 టోల్‌ఫ్రీ నంబర్
- ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య వెల్లడి



సాక్షి, హైదరాబాద్: జూనియర్ కాలేజీలకు అనుమతుల జారీలో నిబంధనలు పక్కాగా పాటిస్తామని ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరంలో కొన్ని కాలేజీలకు అనుమతుల జారీలో పొరపాట్లు జరిగింది నిజమేనని అంగీకరించారు. నిబంధనలకు విరుద్ధంగా గృహ, వాణిజ్య భవనాల్లో నిర్వహిస్తున్న 207 ప్రైవేటు జూనియర్ కాలేజీల్లో 180 కాలేజీలకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. మిగిలిన 27 కాలేజీల్లో జీరో ఎన్‌రోల్‌మెంట్ ఉందని వివరించారు. శనివారం ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 2025–26 విద్యా సంవత్సరంలో కాలేజీల్లో వసతులపై మరింత లోతుగా పరిశీలించి నిర్ధారించుకున్న తర్వాతే అనుమతులు జారీ చేస్తామన్నారు.

3,246 కాలేజీలకు అనుబంధ గుర్తింపు

ప్రస్తుత విద్యా సంవత్సరంలో 3,246 జూనియర్ కాలేజీలకు అనుమతులు ఇచ్చామని కృష్ణ ఆదిత్య చెప్పారు. ఇందులో 424 ప్రభుత్వ కాలేజీలు, 1,346 ప్రభుత్వ రంగ కాలేజీలు, 1,476 ప్రైవేటు అన్ ఎయిడెడ్ కాలేజీలున్నాయని వివరించారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 4,88,336 మంది, రెండో సంవత్సరంలో 5,07,956 మంది విద్యార్థులు పరీక్ష ఫీజులు చెల్లించారని తెలిపారు. సోమవారం (3వ తేదీ) నుంచి 22వ తేదీ వరకు ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఈ పరీక్షల కోసం 1,812 కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. బైపీసీ నుంచి 98,952 మంది, ఎంపీసీ నుంచి 2,34,853 మంది కలిపి మొత్తం 3,33,805 మంది ప్రాక్టికల్ పరీక్షలకు హాజరు కానున్నట్లు వివరించారు. వొకేషనల్ కేటగిరీకి సంబంధించి 463 కేంద్రాల్లో 95,247 మంది విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు హాజరవుతారని పేర్కొన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, బోర్డు కార్యాలయం నుంచి పరిశీలిస్తామని తెలిపారు. ఈసారి కొత్తగా ప్రతి జిల్లాకు ఒక డిస్ట్రిక్ట్ ఎగ్జామినేషన్ కమిటీని ఏర్పాటు చేశామని చెప్పారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ (ఐవీఆర్) విధానాన్ని తీసుకొచ్చినట్లు వివరించారు. సమస్యలు, సందేహాల నివృత్తి కోసం విద్యార్థులు 92402 05555 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

ఢిల్లీలో హోం ఓటింగ్‌కు 7,552 మంది అర్హులు

ఎన్నికల కమిషన్ వెల్లడి

న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీకి ఈనె 5వ తేదీన జరిగే పోలింగ్ సందర్భంగా హోం ఓటింగ్ వెసులుబాటుకు మొత్తం 7,552 మంది అర్హులైన ఓటర్లున్నారని ఎన్నికల కమిషన్ తెలిపింది. 85 ఏళ్లు పైబడిన వయోవృద్ధులతోపాటు దివ్యాంగులకు ఇంటి వద్ద నుంచే ఓటుహక్కు వినియోగించుకునే సౌకర్యాన్ని ఈసీ కల్పించింది. జనవరి 31వ తేదీనాటికి వీరిలో 92 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని, ఇందులో 5,982 మంది సీనియర్ సిటిజన్లు, 998 మంది దివ్యాంగులు ఉన్నట్లు వివరించింది. దేశ రాజధాని ప్రాంతంలోని 70 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 11 జిల్లాల వ్యాప్తంగా 206 పోలింగ్ అధికారుల బృందాలను అందుబాటులో ఉంచామని, వీరు పోలింగ్ ప్రక్రియను సజావుగా జరిగేలా చూస్తారని తెలిపింది.



ఇల్లీగల్ యాప్స్ ప్రమోట్ చేస్తే కఠిన చర్యలు

ఇన్‌ఫ్లుయెన్సర్లను హెచ్చరించిన పోలీసులు

సాక్షి, హైదరాబాద్: రాత్రికి రాత్రి రీల్స్, షార్ట్స్‌తో ఫేమస్ అయిపోయి, సోషల్ మీడియాలో హల్‌చల్ చేసేవారికి కొదవే లేదు. తమలోని ప్రత్యేకశైలిని ప్రదర్శిస్తూ సామాజిక మాధ్యమాల్లో లక్షల్లో వ్యూస్, షేర్స్ సంపాదించుకుని సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లుగా మారుతున్నారు. ఒకసారి సోషల్ మీడియాలో ఫేమస్ అయితే చాలు.. ఇన్‌ఫ్లుయెన్సర్లు ఏది చెబితే అది ఫాలో అయ్యేందుకు వీక్షకులు ఆసక్తి చూపుతున్నారు. సరిగ్గా ఇదే వాడుకుని కొందరు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు పెద్దమొత్తాల్లో సంపాదించేందుకు దారులు వెతుక్కుంటున్నారు. ఇదే అదనుగా వీరితో ప్రకటనలు ఇప్పించి..తమ ఉత్పత్తులు, వ్యాపారాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఇన్‌ఫ్లుయెన్సర్లకు యాడ్స్ ఇచ్చేవారు కూడా పెరుగుతున్నారు. అయితే ఇందులో కొన్ని మోసపూరితమైన సంస్థలు, అంశాలకు సంబంధించినవి కూడా ఉంటున్నాయి. ఇకపై ఇలాంటి మోసపూరిత యాప్స్, సంస్థల గురించి ప్రమోట్ చేస్తే సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరిస్తున్నారు. డబ్బుల కోసం కక్కుర్తిపడి బెట్టింగ్ యాప్స్, ఫేక్ ట్రేడింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేయవద్దని తెలంగాణ పోలీస్ ఎక్స్ ఖాతాలో ఈ మేరకు సూచించింది. ఫేక్ లోన్‌యాప్స్, బెట్టింగ్ యాప్స్‌పై సోషల్ మీడియాలో జరిగే ప్రచారంపై నిరంతర నిఘా పెడుతున్నట్టు వారు వెల్లడించారు. ఆర్థిక మోసాలకు పాల్పడుతున్న సైబర్ నేరగాళ్లకు ఊతం ఇచ్చేలా ఇలాంటి చర్యలకు పాల్పడవద్దని పేర్కొన్నారు.

'నదీ వాక్యం' కవితా సంకలనం ఆవిష్కరణ



కవితా సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న బండారు దత్తాత్రేయ. చిత్రంలో నేమాని భాస్కర్, వల్లీశ్వర్, అమర్, రచయిత రెహానా, శ్రీనివాస్‌రెడ్డి, కొమ్మినేని, యాకూబ్

పంజగుట్ట (హైదరాబాద్): సీనియర్ జర్నలిస్ట్ రెహానా.. తన కవితా సంకలనంలో రాజకీయాలపై రాసిన కవితలను నేటితరం రాజకీయ నాయకులు ఆదర్శంగా తీసుకోవాలని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సీనియర్ జర్నలిస్ట్ దేవులపల్లి అమర్ అధ్యక్షతన, రెహానా రచించిన 'నదీ వాక్యం' కవితా సంకలనం పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన బండారు దత్తాత్రేయ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవరికైతే ధైర్యం, బుద్ధి, శక్తి, పరాక్రమం ఉంటాయో వారివెంట దేవుడు ఎప్పుడూ ఉంటాడని, అవన్నీ ఉన్న మహిళ రెహానా అని అన్నారు. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఎవరూ సాహసించని విధంగా శ్రీనగర్‌లో, కశ్మీర్ సరిహద్దుల్లో, భూకంపాలు వచ్చిన చోటికి వెళ్లి రిపోర్టింగ్ చేయడాన్ని చూసి తాను రెహానా అభిమానిని అయ్యానన్నారు. ఏపీ మీడియా అకాడమీ మాజీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రెహానా కవిత్వం శ్రీశ్రీ కవిత్వాన్ని గుర్తుకు తెస్తుందన్నారు. దేవులపల్లి అమర్ మాట్లాడుతూ.. ఎలక్ట్రానిక్ మీడియాలో ఉంటూ రెహానా ఇంత మంచి కవిత్వం రాయడం అభినందనీయమన్నారు. రచయిత రెహానా మాట్లాడుతూ.. విభిన్నమైన వ్యక్తులు, అనేక సమస్యలను దగ్గరగా చూడడం వల్ల తాను కవిత్వానికి ఆకర్షితురాలయ్యానని తెలిపారు.

ప్రైవేటు స్కూళ్లలో 'ఉచిత'మెప్పుడు?

- విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు స్కూళ్లలో 25 శాతం సీట్లు ఉచితం
- పేదలు, వికలాంగులు, అనాథలకు ఇవ్వాలని నిబంధన
- వచ్చే ఏడాది నుంచి అమలు చేస్తామని హైకోర్టుకు తెలిపిన సర్కారు
- అధ్యయనం చేస్తున్నామంటున్న విద్యాశాఖ
- ఫీజు రీయింబర్స్ చేస్తే సీట్లిస్తామంటున్న ప్రైవేటు స్కూళ్లు



సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు విద్యా సంస్థల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు ఉచితంగా కేటాయించాలన్న చట్ట నిబంధన అమలుపై సందిగ్ధత నెలకొంది. విద్యా హక్కు చట్టంలోని ఈ నిబంధన అమలుచేస్తామని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలిపినప్పటికీ.. అందుకోసం ఇంకా కార్యాచరణ ప్రణాళిక మాత్రం రూపొందించలేదు. దీనిని ఎలా అమలు చేయాలనే అంశంపై అధ్యయనం చేస్తున్నామని విద్యాశాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు. మరోవైపు కొన్ని కార్పొరేట్ స్కూళ్లు వచ్చే విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు మొదలు పెట్టాయి. సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ స్కూళ్లలో అడ్మిషన్లు ముగింపు దశకు చేరాయి. 25 శాతం ఉచితంపై తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదని ఆ సంస్థలు అంటున్నాయి. ప్రభుత్వం ఫీజులను రీయింబర్స్ చేస్తే పేదలకు ఉచితంగా సీట్లు ఇవ్వడానికి తమకు అభ్యంతరం లేదని యాజమాన్యాలు చెబుతున్నాయి.

ఎవరికి ఉచితం?

రాష్ట్రంలో దాదాపు 10 వేలకుపైగా ప్రైవేటు స్కూళ్లు ఉన్నాయి. వీటిల్లో 38 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం అనాథలు, వికలాంగులకు 5 శాతం, ఎస్సీలకు 10, ఎస్టీలకు 4, బీసీ, మైనార్టీ, అల్పాదాయ వర్గాల పిల్లలకు 6 శాతం కలిపి మొత్తం 25 శాతం సీట్లను ఉచితంగా ఇవ్వాలి. అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఏటా ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ నిబంధన అమలు తీరును విద్యాశాఖ పర్యవేక్షించాలి. స్థాయిని బట్టి ప్రైవేటు స్కూళ్లలో ప్రస్తుతం రూ.40 వేల నుంచి రూ.20 లక్షల వరకు వార్షిక ఫీజు వసూలు చేస్తున్నారు. రూ.40 వేల లోపు ఫీజులుండే ప్రైవేటు స్కూళ్లల్లో ఆశించిన మేర అడ్మిషన్లు జరగవు. కాబట్టి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్ చేస్తే ఈ పథకం అమలుకు సిద్ధమేనని చెబుతున్నారు. కార్పొరేట్ స్కూళ్లు మాత్రం రూ.20 లక్షల ఫీజు లావాదేవీలను రికార్డుల్లో చూపించకుండా, స్కూల్ డెవలప్‌మెంట్ ఫీజుగా వసూలు చేస్తున్నాయి. వీటికి ఎలాంటి రసీదులు ఇవ్వడం లేదు. ఉచిత సీట్లిస్తే ప్రభుత్వం ఫీజు రీయింబర్స్ చేసినా ట్యూషన్ ఫీజుగా వసూలు చేసే రూ.2 లక్షల లోపే వస్తుందని ఆ సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కేంద్ర సిలబస్‌తో నడిచే సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ వంటి స్కూళ్లపై రాష్ట్రానికి అంతగా ఆధిపత్యం ఉండదని అధికారులు అంటున్నారు.

కొన్ని రాష్ట్రాల్లో అమలు

పశ్చిమ బెంగాల్, తమిళనాడు, తెలంగాణ, మరో మూడు రాష్ట్రాల్లో మాత్రమే 25 శాతం ఉచిత సీట్ల కేటాయింపు అమలు జరగడం లేదని అధికారులు తెలిపారు. మిగతా రాష్ట్రాల్లో ఈ పథకం వివిధ మార్గాల్లో అమలవుతోంది. కొన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వం ఫీజు రీయింబర్స్ చేస్తోంది. మరికొన్ని రాష్ట్రాల్లో ప్రైవేటు స్కూళ్లే స్వచ్ఛందంగా అమలు చేస్తున్నాయి. కాగా, విద్యాహక్కు చట్టం ప్రకారం ఆవాసాలకు కిలోమీటర్ దూరంలో ప్రాథమిక పాఠశాల, మూడు కిలోమీటర్ల పరిధిలో ఉన్నతపాఠశాల లేకపోతే ఆయా విద్యార్థులకు ప్రైవేట్ బడుల్లో 25 శాతం సీట్లను కేటాయించాల్సి ఉంటుందని కొన్ని ప్రైవేటు స్కూళ్లు వాదిస్తున్నాయి. అయితే, ఈ నిబంధనతో పనిలేదని విద్యాశాఖ చెబుతోంది. పథకం అమలుపై ఇటీవల ప్రభుత్వం నివేదిక కోరడంతో అధికారులు సమర్పించారు. 38 లక్షల్లో 25 శాతం మందికి ఉచితంగా సీట్లిస్తే దాదాపు 9 లక్షల మందికిపైగా విద్యార్థులు సీట్లు పొందుతారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేస్తే ఈ మొత్తాన్ని ప్రభుత్వం చెల్లించాలి. ఇది ఆర్థికంగా గుదిబండ అవుతుందనే భావనతో ప్రభుత్వం ఉన్నదని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. ఫీజు రీయింబర్స్ చేయకుండా, ప్రైవేటు స్కూళ్ల సామాజిక బాధ్యతగా 25 శాతం ఉచితం అమలు చేసేలా చూడాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది.



ప్రజారోగ్యానికి ప్రాధాన్యం
నగర అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణ, ప్రజా ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి అన్నారు.
-16లో



వైద్యం.. పర్యాటకం
కొంత కాలంగా నగరంలో వైద్య పర్యాటకం ఊపందుకుంటోంది. ప్రపంచస్థాయి వైద్య సేవలతో నగరం శరవేగంగా హెల్త్ టూరిజం హబ్ దిశగా దూసుకుపోతోంది.
- సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
34.0/19.0
నగరంలో ఆదివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం పొగమంచు అలుముకుంటుంది. గరిష్ఠంగా 34, కనిష్ఠంగా 19 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.



పార్లమెంటులో శనివారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నగరానికి ప్రాధాన్యం కాసింతే దక్కింది. హైదరాబాద్ మెట్రోరైల్ రెండో దశపై కేంద్రం ఊరించి ఉసూరుమనిపించింది. మెట్రోపై ఎలాంటి ప్రస్తావన లేకపోవడం అన్ని వర్గాలను తీవ్ర నిరాశకు గురిచేసింది. మూసీ ఊసే లేదు. కాగా.. దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించిన మందులపై కస్టమ్స్ డ్యూటీ తగ్గించడంతో ధరలు తగ్గే అవకాశం ఉంది. సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలకు ఊతం లభించింది. గిగ్‌వర్కర్స్‌కు ఆరోగ్య బీమా కల్పనతో గ్రేటర్‌లో 3 లక్షల మందికి పైగా ప్రయోజనం చేకూరనుంది. కేంద్ర బడ్జెట్‌లో ఈసారి కొత్తగా ప్రవేశపెట్టిన అర్బన్ చాలెంజ్ ఫండ్‌తో హైదరాబాద్ నగరంలో చేపట్టే పనులకు ప్రయోజనం కలిగే అవకాశాలుండవచ్చు. ఎలక్ట్రిక్ వాహనాలపై జీవిత కాల పన్ను మినహాయింపుతో గ్రేటర్‌లో ఈ– వాహనాల దూకుడు పెరగనుంది. అమృత్– 2.0 కింద హైదరాబాద్ సీవరేజీ ఎస్టీపీ ప్రాజెక్టులకు స్థానం దక్కినట్లు తెలుస్తోంది.

– సాక్షి, సిటీబ్యూరో

మెట్రో రెండో దశ.. నిరాశ!

కేంద్ర సర్కారు అనుమతి లేనట్టేనా?

- ఈవీలకు స్వర్ణయుగం..
- జీవితకాల పన్ను మినహాయింపు
- అమృత్– 2 కింద సీవరేజీ, ఎస్టీపీలు?
- గిగ్ వర్కర్స్‌కు ఆరోగ్య బీమా
- గ్రేటర్‌లో 3 లక్షల మందికి ప్రయోజనం
- అర్బన్ చాలెంజ్ ఫండ్‌తో ఆసరా?
- చిన్న తరహా పరిశ్రమలకు ఊతం
- తగ్గనున్న ఔషధాల ధరలు
- కేంద్ర బడ్జెట్‌లో నగరానికి కాసింత ఊరట

హైదరాబాద్ మెట్రోరైల్ రెండో దశపై కేంద్రం ఊరించి ఉసూరుమనిపించింది. శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రెండో దశ ప్రస్తావన లేకపోవడం గమనార్హం. గత బడ్జెట్‌లో చెన్నై మెట్రో విస్తరణకు నిధులు కేటాయించారు. ఈసారి అదే తరహాలో హైదరాబాద్‌కు నిధుల కేటాయింపుతో పాటు అనుమతులు కూడా లభించవచ్చని నగరవాసులు ఆశించారు. కానీ.. కనీసం మెట్రోపై ఎలాంటి ప్రస్తావన లేకపోవడం అన్ని వర్గాలను తీవ్ర నిరాశకు గురిచేసింది. నగరంలోని వివిధ ప్రాంతాలకు మెట్రోరైల్‌ను విస్తరించేందుకు ప్రభుత్వం 74.6 కిలోమీటర్ల కారిడార్‌లతో డీపీఆర్‌ను రూపొందించిన సంగతి తెలిసిందే. అనంతరం ఫోర్త్‌సిటీ, నార్త్‌సిటీ ప్రాజెక్టులను కూడా రెండో దశలో భాగంగా చేర్చి సుమారు 161.4 కిలోమీటర్ల వరకు నిర్మించేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రణాళికలను రూపొందించింది. మొదటి ఐదు కారిడార్‌లకు సుమారు రూ.24 వేల కోట్లకు పైగా అంచనాలు సిద్ధం చేశారు.కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్‌గా చేపట్టనున్న ఈ ప్రాజెక్టుకు కేంద్రం సావరిన్ గ్యారంటీతో పాటు రూ. 4230 కోట్లు తన వాటాగా కేటాయించవలసి ఉంది. కానీ రెండో దశ ప్రాజెక్టుకు కేంద్రం నుంచి ఇప్పటి వరకు ఆమోదం లభించలేదు. నిధులు కూడా కేటాయించలేదు.కేంద్రం వైఖరి పట్ల కాంగ్రెస్ వర్గాలు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. గతంలో చెన్నైకు అడగకుండానే నిధులు కేటాంచిన కేంద్ర ప్రభుత్వం తెలంగాణ విషయంలో తీవ్రమైన వివక్షను చూపుతుందని పేర్కొంటున్నాయి.

బడ్జెట్‌లోనే ప్రస్తావించాల్సిన అవసరం లేదు...

మరోవైపు మెట్రోపైన బడ్జెట్‌లోనే ప్రస్తావించాల్సిన అవసరం లేదని, కేంద్రం విడిగా కూడా ప్రకటన చేయవచ్చని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఒకసారి కేంద్రం నుంచి ఆమోదం లభిస్తే నిధులు సైతం ఆటోమేటిక్‌గా విడుదలవుతాయని పేర్కొంటున్నారు. మెట్రో రెండోదశకు నిధుల కొరత ఎట్టిపరిస్థితుల్లోనూ సమస్య కాదని, సావరిన్ గ్యారంటీ లభించడమే ప్రధానమని మెట్రోరైల్ అధికారి ఒకరు చెప్పారు.

అర్బన్ చాలెంజ్ ఫండ్‌తో నగరానికి ఆసరా?

కేంద్ర బడ్జెట్‌లో ఈసారి కొత్తగా ప్రవేశపెట్టిన అర్బన్ చాలెంజ్ ఫండ్‌తో నగరంలో చేపట్టే పనులకు ప్రయోజనం కలిగే అవకాశాలుండవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నగరాలను వృద్ధి కేంద్రాలుగా మార్చేందుకు,సృజనాత్మక అభివృద్ధి, పారిశుద్ధ్యం తదితర కార్యక్రమాలు అమలు చేసేందుకు పంపే ప్రతిపాదనలకు ఈ ఫండ్ నుంచి 25 శాతం నిధులివ్వనుండటంతో నగరానికి ఉపకరించవచ్చనే ఆశలు నెలకొన్నాయి. సదరు ప్రాజెక్టులకు అవసరమైన నిధుల్ని బాండ్ల ద్వారా సేకరించాల్సి ఉండటంతో బాండ్ల ద్వారా ఇదివరకే నిధుల పొందిన జీహెచ్‌ఎంసీకి అదేం కష్టం కాదని భావిస్తున్నారు. ట్రాన్సిట్ ఓరియెంటెడ్ డెవలప్‌మెంట్ కింద 30 లక్షల జనాభా మించిన పెద్ద నగరాలకు ఆర్థిక సహాయం ఇవ్వనున్నందున వాటిల్లో హైదరాబాద్‌కు కూడా అవకాశం ఉండవచ్చనే అంచనాలున్నాయి. ఎంపిక చేసిన నగరాల్లో రాబోయే ఐదేళ్లలో ఏడాదికి వంద వీక్లీ స్ట్రీట్‌ఫుడ్ హబ్స్‌కు సహకారం అందించనున్నట్లు పేర్కొన్నందున వాటిలోనూ నగరానికి అవకాశం ఉండేందుకు వీలుందనే ఆశలున్నాయి. అర్బన్ స్టేట్‌గా ఉన్న తెలంగాణకు రూ.10 వేల కోట్లు రానున్నట్లు నగరానికి చెందిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రాధాన్యమిస్తున్న మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్‌కు మాత్రం కేంద్ర బడ్జెట్‌లో నిధులూ కనిపించలేదు. జీహెచ్‌ఎంసీ చేపట్టే పనుల కోసం రూ.10వేల కోట్లకుపైగా కోరినప్పటికీ, ఏ మేరకు వస్తాయో తెలియని పరిస్థితి.



ఔషధాల ధరలు తగ్గుతాయ్

కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వైద్య రంగానికి కాస్త ఊరట కలిగించినట్లు కనిపిస్తోంది. దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించిన మందులపై కస్టమ్స్ డ్యూటీ తగ్గించడంతో ధరలు తగ్గే అవకాశం ఉంది. మధుమేహం, రక్తపోటు, గుండె జబ్బులు, కిడ్నీ, లివర్, పక్షవాతం, ఫైలేరియా తదితర దీర్ఘకాలిక వ్యాధులకు వినియోగించే 36 రకాల లైఫ్‌సేవింగ్ మెడిసిన్స్‌పై దీని ప్రభావం కనిపిస్తుంది. ఫలితంగా భాగ్యనగరంలో లక్షలాది మందికి ఉపశమనం కలిగించినట్లవుతుంది. నగరంలో సుమారుగా 18 లక్షల నుంచి 22 లక్షల మంది మధుమేహం, సుమారు 22 లక్షలకుపైగా రక్తపోటు బాధితులు ఉంటారని అంచనా. ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రికి రోజుకు సుమారు 1500 మంది వస్తున్నారు. గాంధీ, నిమ్స్, ఉస్మానియా, ఫీవర్ ఆసుపత్రి, ఇతర ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులకు నిత్యం వేలాది మంది బాధితులు వస్తుంటారు. కిడ్నీ బాధితులు 7,686, లివర్ ఫెయిల్యూర్‌తో 7,175 మంది బాధపడుతున్నారు. అలాగే పక్షవాతం, ఫైలేరియా తదితర వ్యాధులతో బాధపడుతున్న వారి మందుల ఖర్చులు తగ్గనున్నాయి. ఎక్స్‌రే నుంచి సిటీ స్కాన్, ఎమ్మారై తదితర పెద్ద మొత్తంలో ఖర్చయ్యే చికిత్సల వరకు అన్నింటిపైనా దీని ప్రభావం కనిపిస్తుందని వైద్య నిపుణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



అటల్ టింకరింగ్ ల్యాబ్‌లపై ఆశలు

కేంద్ర బడ్జెట్‌లో సుమారు 50 వేల ప్రభుత్వ పాఠశాలలో అటల్ టింగరింగ్ ల్యాబ్ (ఏటీఎల్)లను ఏర్పాటు ప్రకటన ఆశలు రేకెత్తిస్తున్నాయి. ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్‌లో సుమారు 40 పాఠశాలలో టింకరింగ్ ల్యాబ్‌లు కొనసాగుతున్నాయి. తాజాగా ల్యాబ్‌ల మంజూరుతో మహా నగర పరిధిలో మరో 50 వరకు వచ్చే అవకాశాలున్నట్లు విద్యాశాఖ అంచనా వేస్తోంది

గిగ్‌వర్కర్స్‌కు ఆరోగ్య బీమా

గ్రేటర్‌లో 3 లక్షల మందికి పైగా ప్రయోజనం

ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్‌పై తాత్కాలిక ప్రాతిపదికన పనిచేసే గిగ్‌వర్కర్స్‌కు కేంద్రం తాజా బడ్జెట్‌లో ఆరోగ్యబీమా సదుపాయాన్ని కల్పించింది. పీఎం జన్ ఆరోగ్య యోజన పథకంలో భాగంగా ఈ సదుపాయం లభించనుంది. దీంతో గ్రేటర్ హైదరాబాద్‌లో వివిధ యాప్ ఆధారిత సేవలను అందజేస్తున్న సుమారు 3 లక్షల మందికి ప్రయోజనం కలగనుంది. ఓలా, ఉబెర్, రాపిడో వంటి క్యాబ్‌లు నడిపే డ్రైవర్‌లతో పాటు స్విగ్గి, జొమోటో, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, మంత్ర వంటి పలు యాప్ ఆధారిత డెలివరీబాయ్స్‌కు ఈ పథకం వర్తించనుంది. ఆరోగ్యబీమా పథకం కోసం తాము చేపట్టిన ఉద్యమానికి కేంద్రం నుంచి స్పందన లభించిందని ఫోర్‌వీలర్‌డ్రైవర్స్, గిగ్‌రవర్కర్స్ యూనియన్ ప్రతినిధి సలావుద్దీన్ తెలిపారు.

అమృత్-2 కింద సీవరేజీ, ఎస్టీపీలు ?

కేంద్ర బడ్జెట్‌లో అమృత్ -2.0 కింద హైదరాబాద్ సీవరేజీ ఎస్టీపీ ప్రాజెక్టులకు స్థానం దక్కినట్లు తెలుస్తోంది. అమృత్ -2.0 కింద దేశంలోని వంద మహా నగరాలను గుర్తించగా అందులో హైదరాబాద్ ఉంటుందని జలమండలి అధికారుల అంచనా. గ్లోబల్ సిటీగా విస్తరిస్తున్న మహా హైదరాబాద్ పరిధిలో మురుగు నీటి నెట్‌వర్క్, కొత్త సీవరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నిర్మాణాల ప్రాజెక్టు నిర్మాణాల కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు సమర్పించింది. సమగ్ర సీవరేజీ మాస్టర్ ప్లాన్ ప్రాజెక్టు కోసం సుమారు రూ.17,212.69 కోట్లు, మూసీ ప్రక్షాళనలో భాగంగా నదిలో మురుగు నీరు చేరకుండా ఇరువైపులా కాల్వల ట్రంక్ సీవర్స్ మెయిన్స్, లార్జ్ సైజ్ బాక్స్ డ్రైయిన్స్ కోసం మరో రూ.4 వేల కోట్లు కేటాయించేందుకు రెండు పథకాలను అమృత్ పథకం -2.0 కి చేర్చాలని విజ్ఞప్తి చేసింది.

చిన్న తరహా పరిశ్రమలకు ఊతం

కేంద్ర బడ్జెట్‌లో సూక్ష్మ,చిన్న తరహా పరిశ్రమలకు ఊతం లభించింది. ఎంఎస్ఎంఈలకు రుణాలు రూ. 5 కోట్ల నుంచి 10 కోట్లకు, స్టార్టప్‌లకు రుణాలను రూ.10 కోట్ల నుంచి రూ.20 కోట్ల పెంపు పట్ల ఆశలు చిగిరిస్తున్నాయి. మహా నగర పరిధిలో సుమారు 55 వేలకుపైగా చిన్న, మధ్య తరహా పరిశ్రమలున్నాయి. ప్రధానంగా నగర పరిధిలో సనత్‌నగర్, ఆజామాబాద్, చందూలాల్ బారాదరి పారిశ్రామిక వాడలు ఉండగా, శివార్లలో ఉప్పల్, మౌలాలి, జీడిమెట్ల, కాటేదాన్, నాచారం, గాంధీనగర్, బాలానగర్, పటాన్‌చెరు, వనస్థలిపురం తదితర పారిశ్రామిక వాడల్లో పెద్దసంఖ్యలో స్మాల్‌స్కేల్ ఇండస్ట్రీలు విస్తరించి ఉన్నాయి. వాటి పరిధిలో సుమారు మూడు లక్షల మంది వరకు కార్మికులు ఉపాధి పొందుతున్నారు.

రుణ పరిమితి పెంపు హర్షణీయమే: జహంగీర్, బాలానగర్ స్మాల్ స్కేల్ ఇండ్రస్టీస్, బాలానగర్

రుణాల పరిమితి పెంపు హర్షణీయం. ఇది చిన్న తరహా పరిశ్రమలకు ఎంతో ఊతం ఇస్తోంది. కానీ.. ఎలాంటి చిక్కులు లేకుండా రుణ పరిమితి పెంపు అమలు చేయాల్సి అవసరం ఉంది. గతంలో పరిశ్రమరంగ సంక్షోభ సమయంలో సవాలక్ష కొర్రీలతో మొక్కుబడిగా రుణాలు అందించి చేతులు దులుపుకొన్నారు. అలాంటి ఘనలు పునరావృత్తం కాకుండా రుణ పరిమితి పెంపు అమలు చేయాలి.

18 లక్షల మంది వేతన జీవులకు ఊరట

కేంద్ర బడ్జెట్‌లో మధ్యతరగతి, వేతన జీవులకు ఊరట లభించింది. ఫలితంగా హైదరాబాద్ మహా నగరంలో సుమారు 18 లక్షల మంది వేతన జీవులకు లబ్ధి చేకూర నుంది కొత్త ఇన్‌కమ్ ట్యాక్స్ శ్లాబ్స్ రూ.12 లక్షల లోపు ఆదాయం కలిగిన వారికి పన్ను నుంచి మినహాయింపు లభించింది. ఆపై ఆదాయం ఉంటే మాత్రం రూ.0 నుంచి రూ.4 లక్షలు ఆదాయం ఉంటే రూపాయి కట్టనక్కర్లేదు. రూ.4–రూ.8 లక్షల ఆదాయం మీద 5 శాతం, రూ.8–రూ.12 లక్షల ఆదాయంపై 10 శాతం, రూ.12–రూ.16 లక్షల ఇన్‌కమ్‌పై 15 శాతం, రూ.16 నుంచి రూ.20 లక్షల ఇన్‌కమ్ మీద 20 శాతం, రూ.20 లక్షల నుంచి రూ.24 లక్షల ఆదాయంపై 25 శాతం.. రూ.24 లక్షల కంటే అధిక ఆదాయం కలిగిన వారికి 30 శాతం ట్యాక్స్ విధిస్తామని కేంద్రం స్పష్టం చేసింది. రిబేట్ రూపంలో పలు శ్లాబ్‌ల వారికి డబ్బులు రిటర్న్ వస్తాయి. అయితే.. ప్రభుత్వ ఉద్యోగుల మాత్రం దీనిపై పెదవి విరిస్తున్నారు. పాత సీసాలో కొత్త సారా మాదిరిగా ఆదాయ పన్ను శ్లాబ్ ఉందని హైదరాబాద్ టీజీఓ అధ్యక్షుడు కృష్ణ యాదవ్ అన్నారు. ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని స్వల్పంగా పెంచి భారీ ఊరట అనడం తగదన్నారు.

ఎలక్ట్రిక్ వాహనాల దూకుడు



గ్రేటర్‌లో ఎలక్ట్రిక్ వాహనాల దూకుడు పెరగనుంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఈవీలపై జీవితకాల పన్ను మినహాయించింది. దీంతో కొంతకాలంగా నగరంలో ఎలక్ట్రిక్ బైక్‌లు, ఆటోలు, కార్ల అమ్మకాలు ఊపందుకున్నాయి. తాజాగా కేంద్రం ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రోత్సాహన్నిచ్చేలా రాయితీలను ప్రకటించింది. ఈ వాహనాలకు వినియోగించే బ్యాటరీలకు వాడే 35 రకాల ముడి పదార్థాలపై పన్ను మినహాయించారు. దీంతో ఎలక్ట్రిక్ వాహనాల ధరలు తగ్గుతాయని రవాణారంగం నిపుణులు పేర్కొంటున్నారు. 15 శాతం నుంచి 20 శాతం ధరలు తగ్గే అవకాశం ఉన్నట్లు అంచనా. బైక్‌లపై గరిష్ఠంగా రూ.10 వేల వరకు, కార్లు, ఇతర వాహనాలపై రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు ధరలు తగ్గవచ్చని ఆటో మైబైల్ డీలర్లు సైతం అంచనా వేస్తున్నారు. మరోవైపు 15 ఏళ్ల దాటిన వాహనాలను స్వచ్ఛందంగా తుక్కుగా మార్చుకొంటే వాటి స్థానంలో కొనుగోలు చేసేవాటిపై సబ్సిడీ లభించనుంది. కాలపరిమితి ముగిసిన వాటిను తుక్కు చేసి కొత్తగా ఈవీలను కొనుగోలు చేస్తే మరింత ప్రయోజనం కలగనుంది.

లగ్జరీ వాహనాల ధరలు తగ్గుముఖం..

మరోవైపు కేంద్రం తాజా బడ్జెట్‌లో దిగుమతి చేసుకొనే వాహనాలపై కస్టమ్స్ సుంకాన్ని తగ్గించనున్నట్లు స్పష్టం చేసింది. దీంతో హైఎండ్ వాహనాల ధరలు కూడా తగ్గుముఖం పట్టనుంది. లగ్జరీ బైక్‌లు, కార్లు, బస్సులు, ఇతర వాహనాల ధరలు కూడా 12 శాతం నుంచి 25 శాతం వరకు తగ్గనున్నట్లు ఆటోమొబైల్ వర్గాలు అంచనా వేస్తున్నాయి



ఈవీలకు ఇది ప్రోత్సాహకరం

ఈవీ ధరలు నేరుగా తగ్గకపోయినా బ్యాటరీ ముడి పదార్థాలపై పన్ను మినహాయించడం వల్ల ఈవీ ఉత్పత్తులకు ప్రోత్సాహం లభిస్తుంది. దీంతో ధరలు తగ్గుముఖం పడతాయి. బ్యాటరీల తయారీకి వినియోగించే 35 రకాల పదార్థాలపై కేంద్రం పన్ను మినహాయింపునివ్వడం ఎంతో సంతోషించదగ్గ అంశం. ఇది ఆటోమేటిక్‌గా ఎలక్ట్రిక్ వాహనాల ధరల తగ్గింపునకు దోహదం చేస్తుంది. – సంధ్య, ఎలక్ట్రిక్ వాహన డీలర్

చదువు శక్తిమంతమైన ఆయుధం లాంటిది

మలబార్ గ్రూపు చేయూత అభినందనీయం
మంత్రి సీతక్క



మలబార్ గ్రూప్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేస్తున్న మంత్రి సీతక్క

సనత్‌నగర్: బాలికలకు విద్య అనేది శక్తిమంతమైన ఆయుధం లాంటిదని, ఏ స్థితిలోనూ జ్ఞానాన్ని పొందడం ఆపవద్దని మంత్రి సీతక్క అన్నారు. శనివారం మలబార్ గ్రూప్ ఆధ్వర్యంలో బేగంపేటలోని ఐఏఎస్ ఆఫీసర్స్ ఇనిస్టిట్యూట్‌లో విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. 2024–25 సంవత్సరానికి రాష్ట్రంలోని 116 కళాశాలల్లో చదువుతున్న 3,900 మంది బాలికల విద్యకు స్కాలర్‌షిప్‌ల కోసం రూ.3.14 కోట్లను మలబార్ గ్రూప్ కేటాయించింది. ఈ సందర్భంగా స్కాలర్‌షిప్పుల పంపిణీకి ముఖ్య అతిథిగా హాజరైన సీతక్క మాట్లాడుతూ.. అన్నిటి కంటే శక్తిమంతమైనది చదువేనన్నారు. తాను పదో తరగతి వరకు చదివి మానేశానని, పదేళ్ల తర్వాత మళ్లీ కొనసాగించి ఎంఏ, ఎల్ఎల్‌బీ చేశానని గుర్తు చేశారు. తాజాగా ఓయూ నుంచి ఎల్ఎల్ఎం పూర్తి చేసినట్లు చెప్పారు. విలువలతో కూడిన విద్య సంస్కారాన్ని అలవరుస్తుందన్నారు. ఏ స్థాయిలో ఉన్నా అహంకారం మంచిది కాదని, అది మనిషి విలువను తగ్గిస్తుందని పేర్కొన్నారు. ప్రగతిని సాధించిన కార్పొరేట్ సంస్థలు అట్టడుగున ఉన్న సమాజం వైపు కూడా చూడాలని సీతక్క సూచించారు. మలబార్ గ్రూపు విద్యతో పాటు హంగర్ ఫ్రీ వరల్డ్ ప్రాజెక్టు కింద 17 రాష్ట్రాల్లోని 81 నగరాల్లో రోజుకు 60,000 ఆహార ప్యాకెట్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. మైక్రో లెర్నింగ్ సెంటర్లు, మొబైల్ మెడికల్ సేవలు, ఓల్డేజ్ హోమ్‌లకు చేయూత అందించి సీఎస్ఆర్‌లో స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో మలబార్ గ్రూప్ ఇండియా ఆపరేషన్స్ ఎండీ ఆషర్ ఓ, రెస్ట్ ఆఫ్ ఇండియా మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ రీటైల్ హెడ్ సిరాజ్, జోనల్ హెడ్స్ మహ్మద్ షరీజ్, షానిబ్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు సర్వం సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మార్చి 5 నుంచి ప్రారంభమయ్యే ఈ వార్షిక పరీక్షలకు అత్యంత ప్రాధాన్యమిస్తూ.. పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశం మందిరంలో ఇంటర్ పరీక్షలపై సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్చి 5వ తేదీ నుంచి ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే ఇంటర్మీడియట్ పరీక్షలకు చేపట్టవలసిన పనులను సమన్వయంతో ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇంటర్ పరీక్షల కోసం 185 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఫస్ట్ ఇయర్‌లో 77,863 మంది, సెకండ్ ఇయర్‌లో 69,348 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు స్పష్టం చేశారు. సమావేశంలో కందుకూరు ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్ రెడ్డి, చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంక్యా నాయక్, విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

మేడిపల్లిలో కారు బీభత్సం

- గుడిసెలోకి దూసుకెళ్లిన కారు
- బాలుడికి తీవ్ర గాయాలు
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి



అక్షిత్ (ఫైల్)

మేడిపల్లి: మద్యం మత్తులో ఓ వ్యక్తి కారు నడిపి బీభత్సం సృష్టించాడు. గుడిసెపైకి కారు దూసుకెళ్లడంతో అందులోని బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా పెద్దగూడూరు మండలం తేజావత్ రాంసింగ్ తండాకు చెందిన వాంకుడోత్ అశోక్, అనూష దంపతులు. అశోక్ మేడిపల్లి సీపీఆర్ఐ ప్రధాన రోడ్డులో నిర్మాణంలో ఉన్న ఓ భవనం వద్ద వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. పక్కనే గుడిసె వేసుకుని నివాసం ఉంటున్నారు. శుక్రవారం రాత్రి మేడిపల్లి శ్రీనివాస నగర్‌కు చెందిన శివ కారులో అతివేగంగా అశోక్‌కు చెందిన గుడిసెపైకి దూసుకెళ్లాడు. ఆ సమయంలో గుడిసెలో నిద్రిస్తున్న అశోక్ కుమారుడు అక్షిత్‌ని (4) కారుతో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బాలుడి తలకు తీవ్రగాయాలు కావడంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. బాలుడు చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాద సమయంలో బాలుడి తల్లిదండ్రులు గుడిసెలో లేకపోవడంతో వారికి ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొన్నారు. కాగా.. ప్రమాదానికి కారకుడైన శివకు సైతం గాయాలు కావడంతో అతడు ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు.

యువ వైద్యుడి ప్రాణం తీసిన అతివేగం

- మరో మహిళా డాక్టర్‌కు తీవ్ర గాయాలు
- డివైడర్ మధ్యలోని హోర్డింగ్ స్తంభాన్ని ఢీకొన్న కారు



డాక్టర్ జస్వంత్ మృతదేహం



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

మణికొండ: అతివేగంతో దూసుకువచ్చిన కారు అదుపు తప్పి రోడ్డు మధ్యలోని హోర్డింగ్ స్తంభాన్ని ఢీకొన్న ప్రమాదంలో ఓ యువ వైద్యుడు అక్కడికక్కడే మృతి చెందారు. మరో మహిళా డాక్టర్ గాయాల పాలయ్యారు. నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఖానాపూర్ గ్రామం వద్ద శనివారం తెల్లవారుజామున ఈ రోడ్డు ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఎల్‌బీ నగర్‌లోని కామినేని ఆస్పత్రిలో వి.జస్వంత్ (25), భూమిక హౌస్ సర్జన్‌లుగా పని చేస్తున్నారు. శుక్రవారం రాత్రి వీరు కారులో రంగారెడ్డి జిల్లాలోని శంకర్‌పల్లికి ఓ వివాహానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో తెల్లవారు జామున ఖానాపూర్ వద్ద రోడ్డు మలుపును గమనించకుండా వేగంగా రావడంతో కారు అదుపు తప్పింది. రోడ్డు మధ్యలో డివైడర్‌పై ఉన్న హోర్డింగ్ స్తంభాన్ని ఢీకొట్టింది. డ్రైవింగ్ చేస్తున్న జస్వంత్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. పక్క సీటులో కూర్చున్న భూమికకు తీవ్ర గాయాలు కావటంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

నగరంలో నేడు

- నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజా లో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో నర్సరీ ఉత్సవ మేళా ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుంది
- పెటెక్స్ ఇండియా ఆధ్వర్యంలో మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో 11 గంటలకు పెట్ ఎక్స్, హైదరాబాద్ కిడ్స్ ఫెయిర్ జరుగుతాయి.
- కేంద్ర సాంస్కృతిక శాఖ, శంకరానంద కళాక్షేత్ర సంయుక్త ఆధ్వర్యంలో మాదాపూర్‌లోని సీసీఆర్‌టీ క్యాంపస్‌లో రామాయణ కల్పవృక్షం ఫెస్టివల్ జరుగుతుంది.
- నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో రివైవింగ్ ది రూట్స్ చిత్ర ప్రదర్శన ఉదయం 10.30గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- సేవా భారతి ఆధ్వర్యంలో గచ్చిబౌలి స్టేడియంలో ఉదయం 5 గంటలకు రన్ ఫర్ గర్ల్ చైల్డ్ 2025 కార్యక్రమం జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

పెరుగుతున్న ఉష్ణోగ్రత

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రత క్రమంగా పెరుగుతోంది. శనివారం పగటి గరిష్ఠ ఉష్ణోగ్రత 33.4 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 17.7 డిగ్రీలు నమోదైంది. అప్పుడే వేసవి ప్రారంభమైనట్లు కనిపిస్తోంది. తెల్లవారు జామున మాత్రం పొగమంచుతో చలి పుట్టిస్తోంది.గరిష్ఠ ఉష్ణోగ్రత ఈ నెల చివరి నాటికి మరింత పెరిగే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం

- నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి
- మల్లాపూర్‌లో కలర్స్ థీమ్ పార్క్ ప్రారంభం



పార్కులో మొక్కను నాటుతున్న మేయర్



మల్లాపూర్‌లో కలర్స్ థీమ్ పార్కును ప్రారంభిస్తున్న నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి

మల్లాపూర్: నగర అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణ, ప్రజా ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి అన్నారు. శనివారం ఆమె మల్లాపూర్‌లో రూ.3 కోట్లతో ఏర్పాటు చేసిన కలర్స్ థీమ్ పార్కును ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతారెడ్డి, స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కలర్స్ థీమ్ పార్కును ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం ఆనందంగా ఉందన్నారు. పార్క్‌లో ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటేన్ ప్లే కోర్ట్, సెల్ఫీ వాల్, పిల్లల ఆటస్థలం తదితర సౌకర్యాలు కల్పించామన్నారు. పార్క్‌లో 107 వివిధ రకాల మొక్కలు మనసుకు ఆహ్లాదాన్ని అందిస్తాయన్నారు. పార్కును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. మల్లాపూర్ ప్రాంతం చిరకాల కోరిక తీరిందన్నారు. ఈ పార్క్ కేవలం పిల్లలకే కాకుండా పెద్దలకు, యువతకు కూడా వినోదం, ఆరోగ్య సాధనంగా ఉపయోగపడుతుందన్నారు. కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ చెత్త డంపింగ్‌యార్డు తొలగించి పార్కును ఏర్పాటు చేయాలని 11 ఏళ్ల పోరాటం, ధర్నాలు చేశామని గుర్తుచేశారు. పార్క్‌లో ఓపెన్ జిమ్, లైటింగ్ షోను ఏర్పాటు చేయాలని మేయర్‌ను కోరారు. పార్క్ నిర్వాహణకు కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, కాప్రా డిప్యూటీ కమిషనర్ జగన్, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కస్వరాజు చిక్కాడు!

- పరారీలో ఉన్న ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్ కేసు నిందితుడు
- ఎట్టకేలకు చిక్కిన కేటుగాడు
- క్లీనింగ్ లిక్విడ్‌లు సరఫరా చేస్తానని మోసం



సాక్షి, సిటీబ్యూరో: లాభదాయకమైన వ్యాపార అవకాశాలను కల్పిస్తానని నమ్మించి భారీ మొత్తంలో పెట్టుబడి పెట్టించి వ్యాపారవేత్తలను మోసగించిన కేటుగాడు కస్వరాజు హిరణ్మహీ హైదరాబాద్ పోలీసులకు చిక్కాడు. పోలీసుల కథనం మేరకు వివరాలా ఉన్నాయి. సుభాష్ అనే వ్యాపారికి కస్వరాజు హిరణ్మహీ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. రేషన్ బయో ప్రొడక్ట్స్ కంపెనీ నుంచి రసాయనాలు ఉపయోగించకుండా బయో ఎంజైమ్‌ల ఆధారిత ఫ్లోర్, వాష్‌రూమ్ క్లీనింగ్ లిక్విడ్‌లను సరఫరా చేసే వ్యాపారి చేస్తున్నట్లు చెప్పాడు. 2024 మార్చి నాటికి కంపెనీ రూ.100 కోట్ల టర్నోవర్‌కు చేరుకుంటుందని తన సంస్థలో పెట్టుబడులు పెడితే 40 శాతం వాటా ఇస్తానని చెప్పాడు. దీంతో సుభాష్ రేషన్ బయో ఉత్పత్తుల్లో పెట్టుబడి పెట్టాడు. ఇదే తరహాలో నోవై టెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో స్వరూప్ రూ.30 లక్షలు, ఎకో నెక్సస్ క్లీనర్ సంస్థలో మెహ్రా రూ.50 లక్షలు పెట్టుబడిగా పెట్టారు. అయితే అతను ఎక్స్‌పైరీ డేట్ పూర్తయిన ఉత్పత్తులను సరఫరా చేసి పెట్టుబడిదారులను మోసం చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు శనివారం నిందితుడు కస్వరాజును అరెస్టు చేసి, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

బస్సులో ప్రయాణిస్తూ.. వృద్ధుడి మృతి



బాలరాజు (ఫైల్)

మణికొండ: వ్యక్తిగత పని నిమిత్తం నగరానికి వచ్చిన ఓ వృద్ధుడు గ్రామానికి తిరిగి వెళుతూ ఆర్టీసీ బస్సులో మృతి చెందిన సంఘటన శనివారం నార్సింగిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శంకర్‌పల్లి మండలం, జన్వాడ గ్రామానికి చెందిన బాలరాజు(75) శనివారం మెహిదీపట్నం వెళ్లాడు. మధ్యాహ్నం ఆర్టీసీ బస్సులో ఇంటికి తిరుగు ప్రయాణమయ్యాడు. బస్సు నార్సింగికి చేరుకోగా గండిపోటు రావడంతో అతను సీట్‌లోనే కుప్పకూలాడు. దీనిని గుర్తించిన తోటి ప్రయాణికులు కండక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో అతను నార్సింగి పోలీసులకు సమాచారం అందించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

'బౌరంపేట్' భూ వివాదాన్ని పరిష్కరించండి

- మేడ్చల్ జిల్లా కలెక్టర్, దుండిగల్ కమిషనర్‌కు హైకోర్టు ఆదేశం
- పలు సూచనలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన న్యాయమూర్తి

సాక్షి, హైదరాబాద్: మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, గండిమైసమ్మ దుండిగల్ మున్సిపాలిటీ పరిధి బౌరంపేట్‌లోని భూ వివాదంపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని హైకోర్టు జిల్లా కలెక్టర్, కమిషనర్‌ను ఆదేశించింది. ఈ మేరకు పలు సూచనలు కూడా చేసింది. కుత్బుల్లాపూర్ మండలం, వాణీనగర్ కాలనీకి చెందిన సీహెచ్ యాదగిరిపై గాయత్రి గార్డెన్స్ జీపీఆర్ లే అవుట్ ప్లాట్ ఓనర్స్ వేల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి టి. జయచంద్ర మోహన్ లేవనెత్తిన ఆరోపణలపై విచారణ చేపట్టాలని స్పష్టం చేసింది. భూ టైటిల్ వివాద అంశాన్ని పరిశీలించాలని చెప్పింది. ఈ ఆర్డర్ వెలువరించిన నాటి నుంచి మూడు నెలల్లోపు దర్యాప్తు పూర్తి చేసిన నిర్ణయం తీసుకోవాలని పేర్కొంది. ఎలాంటి అనుమతి లేకుండా భారీ వాహనాలను నిలిపేందుకు అసోసియేషన్ పరిధిలోని స్థలంలో యాదగిరి అనుమతి ఇస్తూ, వాహనదారుల నుంచి ఫీజు వసూలు చేస్తున్నారని పేర్కొంటూ జయచంద్రమోహన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అలాగే 19 ఎకరాల భూ టైటిల్ వివాదాన్ని పరిష్కరించాలని కోరారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. పలు సూట్‌లు, రిట్ పిటిషన్లు, సీఎంఏ, రెండవ అప్పీల్.. లాంటి పెండింగ్ కేసులను పరిగణనలోకి తీసుకుని, పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.

ఫిల్లింగ్ టైమ్ తగ్గితే.. మెరుగైన సేవలు

- జలమండలి ఎండీ అశోక్ రెడ్డి
- అయ్యప్ప సొసైటీ ఫిల్లింగ్ స్టేషన్ తనిఖీ



సాక్షి,సిటీబ్యూరో: వాటర్ ఫిల్లింగ్ టైమ్ తగ్గితే మరింత మెరుగైన సేవలు అందించవచ్చునని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన మాదాపూర్, అయ్యప్ప సొసైటీలోని ఫిల్లింగ్ స్టేషన్‌ను సందర్శించారు. ట్యాంకర్ ఫిల్లింగ్, టోకెన్ జనరేషన్ వివరాలు తనిఖీ చేశారు. ఇక్కడ ప్రస్తుతం ఉన్న 3 ఫిల్లింగ్ స్టేషన్లతో మరో 3 ఫిల్లింగ్ పాయింట్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. డిమాండ్‌ను బట్టి ట్యాంకర్ల సంఖ్యను సైతం పెంచుకోవాలని సూచించారు. గతేడాది లాగే భూగర్భ జలాలు అడుగంటడంతో ట్యాంకర్లకు డిమాండ్ పెరిగే అవకాశం ఉందని, దానికి అనుగుణంగా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు సిద్ధంగా ఉండాలన్నారు. ఒక ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్ లోపలికి వచ్చి.. నీటిని నింపుకొని బయటికి వెళ్లేందుకు దాదాపు 8–10 నిమిషాలు పడుతుందని అంచనా వేసినట్లు చెప్పారు. ఈ సమయాన్ని 5 నిమిషాలకు తగ్గిస్తే ఒక రోజులో రెట్టింపు ట్రిప్పులను డెలివరీ చేసే అవకాశం ఉంటుందన్నారు. ఈ సమయాన్ని తగ్గించుకునేందుకు అన్ని ఫిల్లింగ్ స్టేషన్లలో మార్పులు చేర్పులు చేపట్టాలని సూచించారు. ఇందులో భాగంగా అంతర్గత రోడ్లను నిర్మించుకోవాలని, ఫిల్లింగ్ బే (ట్యాంకర్లలో నీరు నింపే ప్రాంతం) సరైన విధంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఎక్కువ ట్యాంకర్లు బుక్ అయ్యే ఫిల్లింగ్ స్టేషన్ లో అదనపు ఫిల్లింగ్ పాయింట్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పగటి వేళల్లో గృహ వినియోగదారులకు, రాత్రి వేళల్లో హాస్టళ్లు, హోటళ్ల వంటి వాణిజ్య వినియోగదారులకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలన్నారు. దీని వల్ల వెయిటింగ్ పీరియడ్, పెండెన్సీ తగ్గించవచ్చన్నారు. ట్యాంకర్ బుకింగ్ లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎండీ హెచ్చరించారు. ప్రతి ట్యాంకర్ టోకెన్ పై బార్ కోడ్ ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. దీని వల్ల ప్రతి ట్రిప్పుల లెక్కలు పక్కాగా ఉంటాయన్నారు. మరుగుదొడ్లు, వెయిటింగ్ రూమ్‌లు లేని ఫిల్లింగ్ స్టేషన్లలో వాటిని ఏర్పాటు చేయాలన్నారు. రాత్రి సమయంలో లైటింగ్ సరిగ్గా ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రతి ఫిల్లింగ్ స్టేషన్ లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు, ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయానికి అనుసంధానమై ఉంటాయన్నారు. దీని వల్ల ప్రతి కదలికను పర్యవేక్షిస్తున్నట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో జీఎం బ్రిజేష్, డీజీఎం, మేనేజర్, తదితరులు పాల్గొన్నారు.

పార్ట్ టైం జాబ్ పేరుతో టోకరా

ఐదుగురు నిందితుల అరెస్టు



సాక్షి, సిటీబ్యూరో: పార్ట్ టైం ఉద్యోగాలను ఇప్పిస్తామని నిరుద్యోగులను మోసం చేసిన ఐదుగురు వ్యక్తులను హైదరాబాద్ పోలీసులు శనివారం అరెస్టు చేసి, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పాలడుగుల దేవకృప, వీవీ శివ శంకర్, బేతం బాలరాజు, మంత్రి ఎస్ఎస్ ప్రజ్వల్ రెడ్డి, సీ విజయ్ సాగర్ అనే యవకులు ముఠాగా ఏర్పడి జాబ్ పోర్టల్స్, సామాజిక మాధ్యమాల ద్వారా నిరుద్యోగుల సమాచారాన్ని సేకరించేవారు. వారిని ఫోన్ ద్వారా సంప్రదించి నౌకరీ.కామ్ అధికారులుగా పరిచయం చేసుకుంటారు. పార్ట్ టైం జాబ్ ద్వారా అధిక రాబడిని అందిస్తామని ఆశ చూపిస్తారు. హోటళ్లకు రివ్యూలు రాయడం వంటి టాస్కుల ద్వారా పార్ట్‌టైమ్ జాబ్‌లు ఉంటాయని వివరిస్తారు. ఈ క్రమంలో నగరానికి చెందిన వ్యక్తి నుంచి రూ.1,93,760 వసూలు చేసి మోసం చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సాంకేతిక ఆధారాలతో ఐదుగురు నిందితులను పట్టుకున్నారు. వారి నుంచి సెల్‌ఫోన్లు, కౌంటింగ్ మెషీన్, 11 బ్యాంక్ పాస్ పుస్తకాలు, 6 చెక్ బుక్కులు, మూడు డెబిట్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు.

16 కిలోల గంజాయి పట్టివేత

ఇద్దరు వ్యక్తుల అరెస్ట్..



పోలీసుల అదుపులో నిందితులు

కుత్బుల్లాపూర్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న మేడ్చల్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది వారి నుంచి 16 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. మేడ్చల్ జిల్లా ఎక్సైజ్ అధికారి షేక్‌ఫయాజుద్దీన్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఒడీశా రాష్ట్రం, గంజాం జిల్లాకు చెందిన కృష్ణమూర్తి, రవీందర్‌రెడ్డి శనివారం సూట్ కేసుల్లో గంజాయిని తీసుకువచ్చి సుచిత్ర పరిసర ప్రాంతాల్లో విక్రయించేందుకు యత్నిస్తున్నారు. దీనిపై సమాచారం అందడంతో మేడ్చల్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ నర్సిరెడ్డి, సబ్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో దాడులు చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి సూట్‌కేసును స్వాధీనం చేసుకుని సోదా చేయగా 16 కిలోల గంజాయిని గుర్తించారు. గత కొంత కాలంగా వీరు కొంపల్లి, దూలపల్లి, సుచిత్ర పరిసర ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయన్నారు. నిందితులను తదుపరి విచారణ నిమిత్తం కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. దాడుల్లో సిబ్బంది వెంకటేశ్వరరావు, సత్తార్, శ్రీనివాస్, సంజయ్, చెన్నయ్య, జ్యోతి, మునాఫ్ లు పాల్గొన్నారు.

డబ్బులు తీసుకుని ఇవ్వడం లేదని..

మనస్తాపంతో గృహిణి ఆత్మహత్య



లావణ్య (ఫైల్)

జీడిమెట్ల: డబ్బులు తీసుకున్న వ్యక్తి తిరిగి ఇవ్వకపోవడం , ఈ విషయమై ఇంట్లో గొడవలు జరుగుతుండటంతో మనస్తాపానికి లోనైన ఓ మహిళ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జీడిమెట్ల టీఎస్ఐఐసీ కాలనీలో నివాసం ఉంటున్న చందు భార్య లావణ్య(35) స్థానికంగా టైలరింగ్ షాప్ నిర్వహిస్తోంది. కొద్ది నెలల క్రితం ఆమెకు శివరాం అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. లావణ్యతో స్నేహంగా ఉండే శివరాం తన వ్యాపార నిమిత్తం రూ.5లక్షలు అప్పుగా ఇవ్వాలని కోరాడు. దీంతో ఆమె తన నగలు తాకట్టు పెట్టి రూ.5 లక్షలు ఇచ్చింది. నెలలు గడుస్తున్నా శివరాం డబ్బులు చెల్లించకపోవడంతో ఆమె ఈ విషయాన్ని తన భర్త దృష్టికి తీసుకెళ్లింది. దీంతో చందు శుక్రవారం శివరాంను ఇంటికి పిలిచి డబ్బుల విషయమై నిలదీయగా ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో లావణ్య శివరాంకు ఫోన్‌చేసి నువ్వు డబ్బులు ఇవ్వనందునే తమ కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయని నీ కారణంగానే తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు చెప్పింది. దీంతో ఆందోళనకు గురైన శివరాం, చందు ఇంటికి వెళ్లి చూడగా లావణ్య చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించింది. ఇద్దరూ కలిసి ఆమెను కిందికి దింపి సమీపంలోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రథోత్సవాలకు పెద్దమ్మతల్లి ఆలయం ముస్తాబు



బంజారాహిల్స్: రథోత్సవాలకు జూబ్లీహిల్స్ శ్రీపెద్దమ్మతల్లి ఆలయం ముస్తాబైంది. ఆదివారం అమ్మవారి రథోత్సవ వేడుకలు పారరంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఆలయాన్ని రంగురంగుల పూలదండలు, విద్యుద్దీపాలతో అందంగా తీర్చిదిద్దారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఆలయ వెలుపల నుంచి గర్భగుడి ప్రాంగణం వరకు రంగురంగుల పూలహారాలతో అలంకరించిన తీరు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

3న కేన్సర్‌పై డ్రోన్ షో

పంజగుట్ట: కామినేని ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈనెల 3న 200 డ్రోన్లతో కేన్సర్‌పై అవగాహన కల్పించనున్నట్లు కామినేని ఆసుపత్రి రేడియేషన్ అంకాలజిస్ట్ డాక్టర్ కిరణ్ కుమార్ అన్నంరాజు తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ జి.అవినాష్ రెడ్డి, మెడికల్ అంకాలజిస్ట్ డాక్టర్ ఎస్.జయంతి, హెమటో అంకాలజిస్ట్ పి.వెంకటసింహతో కలిసి కార్యక్రమ బ్రోచర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 4న ప్రపంచ కేన్సర్ డేను పురస్కరించుకుని ఎల్బీనగర్‌లోని రాక్‌టౌన్ రెసిడెంట్స్ కాలనీ, జీడీ గోయెంకా పాఠశాలలో 200 డ్రోన్లతో 65 అడుగుల నుంచి 300 అడుగుల ఎత్తున ఈ డ్రోన్లు ఎల్ఈడీ లైట్ల కాంతితో కేన్సర్ గుర్తు, కేన్సర్ వ్యాధిని ఎలా గుర్తించాలి అన్న విషయాలపై అవగాహన కల్పిస్తామన్నారు. ఎయిర్ బాటిక్స్ సంస్థ సహకారంతో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

భూగర్భ జలాలను కాపాడాలి



పంజగుట్ట: భూగర్భ జలాల తవ్వకాలపై నియంత్రణ లేదని, దీనివల్ల భవిష్యత్‌లో భూమి గట్టితనాన్ని కోల్పోయి భూకంపాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలంగాణ రిజిస్టర్ హైడ్రోజియాలజిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రమావత్ హరి అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'భూగర్భ జలాల అన్వేషణ భవిష్యత్తు పరిణామాలు' అనే అంశంపై శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విపరీతంగా బోర్లు వేస్తుండడంతో భూగర్భ జలాలు ఎండిపోతున్నాయన్నారు. ప్రభుత్వం ఇకనైనా మేల్కొని వాటర్, ల్యాండ్, ట్రీస్ యాక్ట్ (వాల్టా యాక్ట్) కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అసోసియేషన్ సలహాదారులు మురళీధర్, డాక్టర్ రాము మాల్యాల, సుమన్, డాక్టర్ సైదులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



వెంగళరావునగర్ : యూసుఫ్‌గూడ డివిజన్ వెంకటగిరిలోని శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా కుంభమేళా, అయోధ్య బాలరాముడి దర్శనం, అన్నపూర్ణ, విశాలాక్షి, కాశీవిశ్వనాథ్ తదితర ఆలయాలను సందర్శించి నగరానికి చేరుకున్న ఆలయ కమిటీ కార్యదర్శి బడుగు సతీశ్‌ను కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు పులి రామ్, కార్యదర్శి బలిగెల జ్ఞానేశ్వర్, సోషల్ వర్కర్ బుచ్చయ్య, రాజు యాదవ్, ఆలయ ప్రధాన అర్చకులు సంతోష్‌శర్మ, అంజనమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

అన్వేషికి ఓయూ డాక్టరేట్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీ జర్నలిజం విభాగం విద్యార్థిని రిని అన్వేషికి పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం విభాగం విశ్రాంత అధ్యాపకులు ప్రొ.నరేందర్ పర్యవేక్షణలో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను ప్రచారం విషయంలో మీడియా పాత్ర అనే అంశం పై పరిశోధనకు డాక్టరేట్ డిగ్రీ లభించినట్లు తెలిపారు.

అందని అల్పాహారం!

- పదో తరగతి విద్యార్థులకు జాడ లేని స్నాక్స్ • ఈనెల1 నుంచే అమలుకు ప్రభుత్వం శ్రీకారం
- ఖైరతాబాద్ జోన్ పరిధిలో ఎక్కడా ప్రారంభించని వైనం • పట్టించుకోని ప్రజాప్రతినిధులు • నిఘా లేని విద్యాశాఖ అధికారులు



బంజారాహిల్స్: ఖైరతాబాద్ జోన్ పరిధిలోని పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం అందడం లేదు. టెన్త్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు ఈనెల 1 నుంచి మార్చి 20 వరకు ప్రతిరోజూ సాయంత్రం 4–5 గంటల మధ్య నిర్వహించే ప్రత్యేక తరగతుల్లో అల్పాహారం అందించాలని ప్రభుత్వం గత నెల 28న ఉత్తర్వులు జారీ చేసింది. అయితే విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్ పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వేంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్, షేక్‌పేట, యూసుఫ్‌గూడ, బోరబండ, ఎర్రగడ్డ, వెంగళరావునగర్, రహమత్‌నగర్, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్ల పరిధిలోని 17 ప్రభుత్వోన్నత పాఠశాలల్లో శనివారం పథకాన్ని అమలుచేయాల్సి ఉండగా సంబంధిత అధికారులు పెద్దగా పట్టించుకున్నట్లు కనిపించలేదు. గతేడాది నవంబర్‌లో పదో తరగతిలో మెరుగైన ఫలితాల సాధనకు విద్యాశాఖ స్పెషల్ క్లాసులు ప్రారంభించింది. అయితే 60 రోజులుగా అల్పాహారం అందక విద్యార్థులు అర్ధాకలితోనే తరగతులు వింటున్నారు. ఫిర్యాదులు అందుకున్న విద్యాశాఖ అధికారులు ఫిబ్రవరి 1 నుంచి మార్చి 20 వరకు అల్పాహారం అందించాలని నిర్ణయించి ఒక్కో విద్యార్థికి రూ.15 ఖర్చు చేయాలని నిర్ణయించారు. మార్చి 21 నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ప్రత్యేక తరగతులు కొనసాగిస్తున్నారు. గతేడాది కూడా అరకొరగానే అల్పాహారం అందించారనే ఆరోపణలు వినిపించాయి. ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు సైతం అల్పాహారం కోసం ఇస్తున్న డబ్బులు సక్రమంగా అమలవుతున్నాయో లేదో పర్యవేక్షించాలనే ధ్యాస కొరవడిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అల్పాహారానికి అయ్యే ఖర్చును ప్రధానోపాధ్యాయుల ఖాతాలో జమ చేస్తున్నారు. అయితే ఈ పథకం సక్రమంగా అమలుకు నోచుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నెల 1న పథకం ప్రారంభం కావాల్సి ఉండగా ఎక్కడా కూడా విద్యార్థులకు పంపిణీ చేసినట్లుగా కనిపించలేదు. ఆదివారం, సోమవారం సెలవుల పేరుతో తప్పించుకోనున్నారు. కనీసం మంగళవారం నుంచైనా ఈ పథకం అమలుకు నోచుకుంటుందో లేదో చూడాల్సి ఉంది. గవర్నర్ పర్యవేక్షణలో ఉన్న రాజ్‌భవన్ హైస్కూల్‌లో 116 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. ఇక్కడ కూడా ఈ పథకం అమలుకు నోచుకోలేదంటే ఇక మిగతా పాఠశాలల పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. బంజారాహిల్స్ రోడ్డునంబర్–12లోని ఎన్‌బీటీనగర్, బంజారాహిల్స్ రోడ్డునంబర్–7లోని గతి ప్రభుత్వ పాఠశాల, యూసుఫ్‌గూడ హైస్కూల్, ఫిలింనగర్ రౌండ్‌టేబుల్ హైస్కూల్, ఎర్రమంజిల్ స్కూల్ తదితర పాఠశాలల్లో పెద్ద సంఖ్యలో విద్యార్థులు చదువుతున్నారు. ఈసారి నిధులు పక్కదారి పట్టకుండా ఎమ్మెల్యేలు నిఘా పెడితే విద్యార్థులకు ఎంతగానో ప్రయోజనం చేకూరనున్నది.

విద్యాశాఖ నిర్దేశించిన మెనూ..

పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల్లో ఆకలి తీర్చేలా అల్పాహారం అందించేందుకు రోజుకో రకం వంటకాన్ని ఇవ్వాలని నిర్ణయించారు. ఇందులో ఉడకబెట్టిన పెసర్లు, బెల్లం–పల్లీలు, చిరుధాన్యాలతో చేసిన బిస్కెట్లు, ఉల్లిపాయ పకోడి, ఉడకబెట్టిన శెనగలు ఇవ్వాలని నిర్ణయించారు.

తెలంగాణ త్రోబాల్ జట్ల ఎంపిక



బంజారాహిల్స్: మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఈనెల 4 నుంచి 7 వరకు జరగనున్న 46వ సీనియర్ నేషనల్ త్రోబాల్ చాంపియన్‌షిప్ కోసం తెలంగాణ త్రోబాల్ అసోసియేషన్ అధికారికంగా పురుషులు, మహిళల జట్లను ప్రకటించింది. శనివారం జరిగిన కార్యక్రమంలో తెలంగాణ త్రోబాల్ అసోసియేషన్ కన్వీనర్ డాక్టర్ సుభీర్‌ఖాన్, వ్యవస్థాపకుడు నరేందర్‌రెడ్డి క్రీడాసామగ్రిని పంపిణీ చేశారు. అలాగే అధికారిక జెర్సీని ఆవిష్కరించి జట్టు కెప్టెన్లను ప్రకటించారు. పురుషుల జట్టుకు కెప్టెన్‌గా కార్తీక్, మహిళల జట్టుకు లావణ్య నాయకత్వం వహిస్తారు. కార్యక్రమంలో తెలంగాణ త్రోబాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కిరణ్‌చారి, కోశాధికారి వెంకట్ కోము హాజరై జట్లకు శుభాకాంక్షలు తెలిపారు.

పురుషుల జట్టు..

సాయికుమార్, భరత్‌కుమార్, ధీరజ్, నితీన్, బాలాజీ, లిథిన్, కార్తీక్ (కెప్టెన్), అబ్బాస్, ప్రణీత్, ప్రణయ్, విష్ణు, సాగర్, రాకేశ్, వెంకటేశ్‌నాయక్, అభిరామ్. వీరికి కోచ్‌గా పీబీ చక్రపాణి, మేనేజర్‌గా మల్లికార్జున సిద్దు వ్యవహరిస్తారు.

మహిళల జట్టు..

కనిక, ధర్నా, ఆకాంక్ష, ముక్తా, హరిప్రియ, వైష్ణవి, మెరిన్, సింధు, లావణ్య (కెప్టెన్), అన్నపూర్ణ, శైలు, ఉజ్జయిని, క్రిస్టియానా, నేహస్నిక, పూజిత. వీరికి కోచ్‌గా శివకుమార్‌యాదవ్, మేనేజర్‌గా స్మిత బాధ్యతలు చేపట్టనున్నారు.

బ్లడ్ డోనర్ లైఫ్ సేవర్ ఫౌండేషన్ చేయూత



బంజారాహిల్స్: శిశువు గుండె శస్త్ర చికిత్స కోసం బ్లడ్ డోనర్ లైఫ్ సేవర్ ఫౌండేషన్ వారు చేయూతనందించారు. ఫౌండేషన్ వారు విరాళాలు సేకరించి అందించగా శస్త్రచికిత్స విజయవంతంగా జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. విశాఖపట్నం జిల్లా నర్సీపట్నంకు చెందిన నవీన్ బట్టల షాపులో సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. 3 నెలల క్రితం ఆయనకు బాబు జన్మించాడు. పుట్టిన వెంటనే బాబు గుండెలో రంధ్రం (9ఎంఎం) ఉందని వైద్యులు గుర్తించారు. తక్షణ శస్త్రచికిత్స అవసరమని సూచించారు. దీంతో బంజారాహిల్స్‌లోని రెయిన్‌బో చిల్డ్రన్స్ హార్ట్ ఇనిస్టిట్యూట్‌లో శస్త్ర చికిత్స చేయించాల్సి వచ్చింది. అయితే ఆపరేషన్ ఖర్చులను భరించే స్తోమత లేకపోవడంతో నవీన్ కుటుంబం బ్లడ్ డోనర్ లైఫ్ సేవర్ ఫౌండేషన్‌ను సంప్రదించారు. వారు కేవలం రెండు రోజుల్లోనే రూ.40,000 విరాళాలు సేకరించి అందించి ఆపరేషన్ విజయవంతంగా జరిగేలా చూశారు. ప్రస్తుతం బాలుడి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సునీల్ ధూల్‌పేట, సభ్యులు సికిందర్, నాగరాజు తెలిపారు.

'లక్షగొంతులు-వేయిగొంతుకలు'కు తరలిరావాలి



రహమత్‌నగర్‌లో డప్పులు వాయిస్తున్న మాదిగ నాయకులు

రహమత్‌నగర్ : ట్యాంక్‌బండ్‌పై ఫిబ్రవరి 7న నిర్వహించనున్న 'లక్షగొంతులు–వేయిగొంతుకలు' కార్యక్రమానికి తరలిరావాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం నిర్వహించిన సన్నహక సభకు వివిధ పార్టీలకు చెందిన మాదిగ నాయకులు రహమత్‌నగర్ నుంచి బైక్ ర్యాలీగా బయలుదేరారు. అంతకుముందు అరుణ్ మాదిగ, గ్యార నాగరాజు మాదిగ, రవికిరణ్ మాదిగ, శివ మాదిగ, శాంతికుమార్ మాదిగ, మురళి మాదిగ, పల్లె మాదిగ తదితరులు అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి డప్పులు వాయించారు. దళిత నాయకులు విశాల్ మాదిగ, ప్రభు, సాయి మాదిగ, రామకృష్ణ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎంను కొల్లగొట్టారు

ఫిలింనగర్: ఏటీఎంలో వివిధ రకాల కార్డులతో పెద్ద ఎత్తున నగదు విత్‌డ్రా చేసిన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. ఓయూకాలనీ ఎస్‌బీఐ బ్రాంచ్ ఏటీఎం షేక్‌పేట కరాచీ బేకరీ వెనుకాల ఉంది. గురువారం రాత్రి ఇద్దరు వ్యక్తులు ఏటీఎంలోకి ప్రవేశించి 20 సార్లు నగదు డ్రా చేశారు. అలాగే ఏటీఎం నుంచి డబ్బులు రావడం లేదని ఎస్‌బీఐ ఓయూకాలనీ బ్రాంచ్ మేనేజర్ సుగుణకు పలువురు ఖాతాదారులు ఫిర్యాదు చేశారు. దీంతో ఏటీఎంకు వెళ్లి పరిశీలించగా ఇద్దరు వ్యక్తులు వివిధ రకాల బ్యాంక్ కార్డులతో వేర్వేరుగా 20 సార్లు రూ.1.80 లక్షలు డ్రా చేసినట్లుగా సీసీ ఫుటేజీలో తేలింది. బ్రాంచ్ మేనేజర్ సుగుణ ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సీసీ ఫుటేజీలను పరిశీలించారు. అంతర్రాష్ట్ర ముఠా పని అయి ఉంటుందని ప్రాథమిక అంచనాకు వచ్చారు.

ఆకట్టుకున్న సంగీత విభావరి



పాటలు పాడుతున్న గాయకులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నంబర్–1లోని జలగం వెంగల్‌రావు పార్కులో జీహెచ్‌ఎంసీ నిర్మించిన యాంఫీ థియేటర్‌లో తొలిసారిగా సంగీత విభావరి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. దస్తక్ బ్యాండ్ ఆధ్వర్యంలో రజత్, రిషి, అరుణ్‌దేవ్ పాడిన పాటలు అలరించాయి. సందర్శకులతో పాటు, సంగీత ప్రియులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి హాజరై కళాకారులను సన్మానించారు. కార్యక్రమంలో సర్కిల్–18 డీఎంసీ ప్రశాంతి పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థి ప్రతిభ



భవిష్‌రెడ్డి

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ ఆరో తరగతి విద్యార్థి దేవరపల్లి భవిష్‌రెడ్డి యూసీఓ (యునిఫైడ్ సైబర్ ఒలింపియాడ్), యూనిఫైడ్ కౌన్సిల్ ఆధ్వర్యంలో గతేడాది సెప్టెంబర్ 20న నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో 8వ ర్యాంక్ సాధించాడు. అంతేగాక భవిష్‌రెడ్డికి రీజనింగ్ ట్రైనర్ విత్ సొల్యూషన్స్ పుస్తకం, రూ.3,996ల విలువైన ఒలింపియాడ్ కోచ్ ఆన్‌లైన్ సబ్‌స్క్రిప్షన్‌తో పాటు మెడల్, సర్టిఫికెట్‌ను ప్రదానం చేశారు. అదేవిధంగా గతేడాది నవంబర్ 19న బ్రెయిన్‌ఫీడ్ నిర్వహించిన 'మీ–చాంప్స్ ఆల్ ఇండియా చాలెంజ్ మ్యాథ్' ఎగ్జామ్‌లో 38/40 మార్కులతో ఆల్ ఇండియా మొదటి ర్యాంక్ సాధించాడు. ఈ సందర్భంగా భవిష్‌రెడ్డిని పాఠశాల ప్రిన్సిపాల్ కాంచనవల్లి, డైరెక్టర్ వరలక్ష్మి అభినందించారు.

వాహనం అపహరణ

వెంగళరావునగర్ : పార్కింగ్ చేసిన వాహనం చోరీకి గురైన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రహమత్‌నగర్‌కు చెందిన పి.సాంబయ్య తన గూడ్స్ వాహనాన్ని జవహర్‌నగర్ నివాసి రాజేందర్‌కు అద్దెకు ఇచ్చి రోజువారీ కిరాయి తీసుకుంటున్నాడు. రాజేందర్ తన పని ముగిశాక రాత్రి కృష్ణకాంత్‌పార్క్ వద్ద దానిని పార్క్ చేసి ఇంటికి వెళ్తుంటాడు. ఈ క్రమంలో ఈనెల 31న వాహనాన్ని నిలిపి వెళ్లి ఉదయం వచ్చి చూడగా కనిపించలేదు. దాంతో రాజేందర్ సాంబయ్యకు విషయాన్ని తెలియజేశాడు. చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో యజమాని సాంబయ్య మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సేవాలాల్ జయంతికి సెలవు ప్రకటించాలి

రహమత్‌నగర్ : లంబాడా గిరిజనుల ఆరాధ్యదైవం సంత్‌సేవాలాల్ జయంతికి ప్రభుత్వం సెలవు ప్రకటించాలని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి వాంకాడోత్ కుమార్ పవార్ నాయక్ సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. బోరబండ డివిజన్ బంజారానగర్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఫిబ్రవరి 15 న సంత్‌సేవాలాల్ జయంతిని పురస్కరించుకుని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలన్నారు. అలాగే జిల్లాల్లో జరిగే సేవాలాల్ జయంతి వేడుకల్లో మంత్రులు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని మాగంటికాలనీ శ్రీ విజయ కనకదుర్గా దేవి 18వ వార్షికోత్సవ వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చకులు అమ్మవారికి పలు పూజలు అనంతరం 108 లీటర్ల పాలతో అమ్మవారికి విశేష అభిషేకం చేశారు. అలాగే అమ్మవారికి 21 రకాల పండ్ల రసాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం నవగ్రహ, దుర్గ, శాంతి హోమాలు చేశారు. భక్తులు, బస్తీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బ్రహ్మానందంకు సన్మానం



బంజారాహిల్స్: ప్రముఖ హాస్యనటుడు బ్రహ్మానందం జన్మదినం సందర్భంగా సినీ కార్యక్రమ, సినీ అవార్డుల సంస్థ అయిన ఫాస్ ఫిలీం సొసైటీ అధ్యక్షుడు, సంస్కృతి రత్న డాక్టర్ కే ధర్మారావు శనివారం బ్రహ్మానందంను ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి వేంకటేశ్వర స్వామి కేలండర్‌ను అందజేశారు.

నగదు తీసుకుని మోసం

వెంగళరావునగర్ : నష్టపరిహారం ఇప్పిస్తానని నగదు తీసుకుని మోసం చేసిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లాకు చెందిన వెంకటేశ్ రహమత్‌నగర్‌లో ఉంటూ కృష్ణకాంత్‌పార్క్ వద్ద టీ, స్నాక్స్ బండి పెట్టుకుని జీవిస్తున్నాడు. గతేడాది మే నెలలో ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా జీహెచ్‌ఎంసీ తన దుకాణాన్ని కూల్చివేసింది. దాంతో జీవనోపాధి కోసం బంగారం షాపులో పని చేస్తున్నాడు. ఈ సమయంలో యాదగిరినగర్‌లో నివాసం ఉండే శ్రీకాంత్ అనే వ్యక్తి తన ఫ్రెండ్ రవితో వచ్చి తనకు రూ.3 లక్షల విలువైన గోల్డ్ ఇప్పిస్తే జీహెచ్‌ఎంసీ నుంచి నష్టపరిహారం ఇప్పిస్తానని నమ్మించాడు. దీంతో వెంకటేశ్ అంత డబ్బు తన వద్ద లేదని, తన వాహనాన్ని విక్రయించి రూ.లక్ష తీసుకుని శ్రీకాంత్‌కు ఇచ్చాడు. తర్వాత ఎన్నిసార్లు ఫోన్ చేసినా తప్పించుకుని తిరుగుతున్నాడు. సెప్టెంబర్‌లో నిలదీయగా చెక్ ఇవ్వగా దానిని బ్యాంక్‌లో వేయగా అది చెల్లలేదు. దీంతో బాధితుడు శనివారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాపారంలో సీఏల పాత్ర కీలకం

పంజగుట్ట: వ్యాపార రంగంలో చార్టెర్డ్ అకౌంటెంట్స్ (సీఏ)ల పాత్ర ఎంతో కీలకమని కొడంగల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి అనుముల తిరుపతి రెడ్డి అన్నారు. ఖైరతాబాద్ ఆనంద్‌నగర్ కాలనీలోని బెల్లి అసోసియేట్స్ నూతన కార్యాలయాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, సంస్థ సీఎండీ చార్టర్డ్ అకౌంటెంట్ బెల్లి శ్రీధర్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత, కామిశెట్టి అనిల్, ఉప్పల శ్రీనివాస్, ఉప్పల శివ, రాంబాబు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

10న మున్నూరు కాపు సంఘం ఎన్నికలు



వెంగళరావునగర్ : శ్రీకృష్ణానగర్ మున్నూరుకాపు సంఘం ఎన్నికలు ఈనెల 10న నిర్వహించనున్నట్లు సంఘం నాయకులు తెలిపారు. మున్నూరుకాపు సంఘం భవనంలో శనివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 2 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుందన్నారు. 4న పరిశీలన, 5న విత్‌డ్రా ఉంటుందన్నారు. 10న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్, అదేరోజు ఫలితాలు వెలువడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ మంగళారపు లక్ష్మణ్, కమిటీ నేతలు పెద్దబాలయ్య, టి.బాలయ్య, వాసాల రాజు, ప్రస్తుత అధ్యక్షుడు రవి, ప్రధాన కార్యదర్శి తిరుపతి, సతీశ్, మాజీ అధ్యక్షులు శివకుమార్, పంతం రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



శ్రీనగర్‌కాలనీ: శ్రీనగర్‌కాలనీకి చెందిన అమ్మ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ నందగోపాల్ సముద్రాలకు గౌరవ డాక్టరేట్ దక్కింది. ఏసియా వేదిక్ ఇంటర్నేషనల్ కల్చర్ అండ్ రీసెర్చ్ స్ఫూర్తి అకాడమీ పేద విద్యార్థుల చదువుతో పాటు వివిధ సామాజిక సేవలు చేసినందులకు నందగోపాల్‌కు అకాడమీ ప్రతినిధులు శనివారం గౌరవ డాక్టరేట్‌తో సత్కరించారు.

అలరించిన 'కిండర్ గార్టెన్ గ్రాడ్యుయేషన్ డే'

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్–45లోని భారతీయ విద్యాభవన్ ఆత్మకూరి రామారావు స్కూల్‌లో కిండర్ గార్టెన్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు వివిధ రకాల దృశ్యాలతో దుస్తులు ధరించి సంగీతం, నృత్యం కార్యక్రమాలతో అలరించారు. అలాగే పిల్లలు గ్రాడ్యుయేషన్ రోబ్‌లు, క్యాప్‌లతో వేదికపైకి నడుచుకుంటూ వెళ్లి సర్టిఫికెట్లను అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీలతానాయర్ మాట్లాడుతూ.. విద్యతో పాటు సాంస్కృతిక అంశాలపై ఆసక్తిని పెంపొందించేలా కృషి చేస్తున్నట్లు చెప్పారు.









గత కొంత కాలంగా నగరంలో వైద్య పర్యాటకం ఊపందుకుంటోంది. వైద్య ఖర్చులు తక్కువగా ఉండడం, ప్రపంచ స్థాయి వైద్య సేవలు అందుబాటులో ఉండడం తదితర కారణాలతో నగరం శరవేగంగా హెల్త్ టూరిజం హబ్ దిశగా దూసుకుపోతోంది. ఈ నేపథ్యంలో వైద్య రంగంతో పాటు, వైద్య పర్యాటకానికి సైతం మరింత ఊపుని అందించే ప్రకటనలు తాజా బడ్జెట్‌లో ఉండడంతో నగర వైద్య ప్రపంచం సంబరపడుతోంది. పలు ఆస్పత్రుల అధిపతులు ఈ సందర్భంగా 'సాక్షి'తో తమ ఆనందాన్ని పంచుకున్నారిలా..

– సాక్షి సిటీబ్యూరో

వైద్యం.. పర్యాటకం..

వైద్య రంగానికి మరింత ఊపు

- ఐటీ సవరింపులతో ఖర్చులకు వెసులుబాటు
- వైద్యరంగానికి మేలు చేసే బడ్జెట్
- నగరంలోని ఆస్పత్రుల యాజమాన్యాల అభిప్రాయం

ప్రతి ఒక్కరూ చేనేతను ప్రోత్సహించాలి

సెలబ్రిటీ సీక్రెట్స్ ఫౌండర్ డాక్టర్ మాధవి చౌదరి



బంజారాహిల్స్ : చేనేత ఉత్పత్తులను విరివిగా వినియోగిస్తూ చేనేత కళాకారులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని సెలబ్రిటీ సీక్రెట్స్ ఫౌండర్ డాక్టర్ మాధవి చౌదరి అన్నారు. బంజారాహిల్స్ రోడ్ నెంబర్–12 లోని కళింగ కల్చరల్ హాల్లో శనివారం ఏర్పాటు చేసిన జాతీయ చేనేత పట్టు వస్త్ర ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. ప్రదర్శన హాల్లో కొలువుదీరిన చేనేతకారులు వస్త్రోత్పత్తులు తిలకిస్తూ, నేతకారులతో విభిన్న రకాల హ్యాండ్ లూమ్ చీరల తయారీ విధానం, ప్రత్యేకత తెలుసుకున్నారు. భారతీయ సంస్కృతిలో పట్టు, హ్యాండ్లూమ్ వస్త్ర ఉత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. ఈ ఉత్పత్తులకు నేటికీ వన్నె తగ్గలేదని అన్నారు. నేటి యువత హ్యాండ్ లూమ్ ఉత్పత్తులను ఎంతో ఆదరిస్తున్నారని, ప్రతి ఒక్కరూ చేనేతకారులను మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. నిర్వాహకులు జయేష్ గుప్తా మాట్లాడుతూ, ఈ నెల 9 వరకూ కొనసాగుతున్న ప్రదర్శనలో దేశంలోని 14 రాష్ట్రాల నుండి చేనేత కారులు, చేతిపని బృందాలు తమ హ్యాండ్ లూమ్ సిల్క్ చీరలు, డ్రెస్ మెటీరియల్స్ వంటి 75 వేల రకాల వస్త్రోత్పత్తులను అందుబాటులో ఉంచారని వివరించారు.

వైద్య పర్యాటకానికి ఊపు..



'హీల్ ఇన్ ఇండియా' కార్యక్రమం ద్వారా గ్లోబల్ మెడికల్ టూరిజంలో దేశాన్ని అగ్రగామిగా నిలిపేలా ఆర్థిక మంత్రి దూరదృష్టితో పెట్టిన బడ్జెట్‌ను అభినందిస్తున్నా. ప్రైవేట్ సెక్టార్‌తో సహకారం ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న రోగులకు ప్రపంచ స్థాయి ఆరోగ్య సంరక్షణ సేవలను అందిస్తుంది. కెపాసిటీ బిల్డింగ్, స్ట్రీమ్‌లైన్డ్ వీసా నిబంధనలు ప్రయాణ సౌలభ్యంపై వ్యూహాత్మక ప్రాధాన్యత వైద్య పర్యాటకాన్ని విస్తరిస్తుంది. ఇది ఆరోగ్య సంరక్షణ నిపుణులు, ఆస్పత్రులు సంబంధిత పరిశ్రమలకు అవకాశాలను పెంపొందిస్తుంది. తద్వారా ఉపాధి ఆర్థిక వృద్ధిని ప్రేరేపిస్తుంది. మెడికల్ టూరిజం హబ్‌గా హైదరాబాద్, ఇండియాను మార్చడానికి అవసరమైన అన్ని సహాయ సహకారాలూ అందిస్తాం.

– డాక్టర్ గాయత్రి కామినేని ఎండీ, కామినేని హాస్పిటల్స్

మా కృషికి ఊతం..



మన నగరం ఇప్పటికే వైద్య పర్యాటకానికి దేశంలోనే కీలకంగా మారింది. తాజా బడ్జెట్ దీనికి మరింత ఊపునిస్తుంది. మా ఆస్పత్రి గత కొంత కాలంగా వైద్య పర్యాటకం అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తోంది. మా ప్రయత్నాలకు ఇది మరింత బలాన్ని అందిస్తుంది. అలాగే దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో 200 డే కేర్ క్యాన్సర్ కేంద్రాలను ఏర్పాటు చేయడం ఈ రోజు ఆర్థిక మంత్రి ప్రకటించిన మంచి కార్యక్రమం. ఇది క్యాన్సర్ వ్యాధులపై అవగాహన పెంచడానికి, కొన్ని రకాల క్యాన్సర్ల వ్యాప్తిని నిరోధించడంలో కూడా సహాయపడుతుంది. ఆరోగ్య సంరక్షణ వైపు బలమైన పుష్ ఆవిష్కరణలు, వైద్య పరిశోధనలు డిజిటల్ ఆరోగ్య పరివర్తన దేశవ్యాప్తంగా ఆరోగ్య సంరక్షణ సేవల సౌలభ్యం, స్థోమత నాణ్యతను పెంపొందించే లక్ష్యంతో ముందుకు సాగే విధానాన్ని ప్రతిబింబిస్తుంది.

– డా.కిషోర్ బి రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్, అమోర్ హాస్పిటల్



సంతోషకరమైన బడ్జెట్..



వార్షిక ఆదాయం రూ.12 లక్షల వరకు ఎటువంటి పన్నూ విధించరాదనే నిర్ణయం చాలా స్వాగతించదగిన చర్య. ఇది జనం చేతుల్లో అదనపు ధనం ఉండేందుకు దోహదం చేస్తుంది. తద్వారా ఆరోగ్య సంరక్షణతో సహా వ్యక్తిగత అవసరాలకు ఖర్చు చేసేందుకు వారికి మరింత వెసులుబాటు కలుగుతుంది. బడ్జెట్‌లో వైద్య పర్యాటకానికి ఊపుని అందించే ప్రకటనలు ఉన్నాయి. మొత్తంగా ఆర్థిక మంత్రి సమర్పించిన బడ్జెట్ సంతోషాన్ని కలిగించింది.

– మహేంద్ర పాల, గ్రూప్ సీఓఓ, ఒమేగా హాస్పిటల్స్.

వీసా ఆన్‌లైన్‌తో.. వెలుగులు..



ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడంలో ఇది మైలురాయి దశ. వైద్య పర్యాటకులకు వీసా–ఆన్–అరైవల్ పరిచయం భారత దేశాన్ని, మరీ ముఖ్యంగా మన హైదరాబాద్‌ను కూడా ప్రపంచ ఆరోగ్య సంరక్షణ గమ్యస్థానంగా మారుస్తుంది. రోగులకు ప్రయోజనం చేకూరుస్తుంది. వైద్య సీట్ల పెరుగుదల డే కేర్ క్యాన్సర్ కేంద్రాలు అందుబాటులోకి వస్తే చికిత్స నాణ్యత గణనీయంగా పెరుగుతుంది. ప్రాణాలను రక్షించే ఔషధాలపై మినహాయింపులు క్రిటికల్ కేర్‌ను మరింత సరసమైనవిగా చేస్తాయి. సక్షం అంగన్‌వాడీ కింద మాతా శిశు సంరక్షణ కోసం మెరుగైన కేటాయింపులు మొత్తంగా సమాజ ఆరోగ్యాన్ని మెరుగుపరిచే దిశగా ప్రశంసనీయమైన చర్య. ఇది భారతదేశంలో ఆర్థిక వృద్ధి మరింత స్థితిస్థాపకంగా మరియు సమగ్రమైన ఆరోగ్య సంరక్షణ పర్యావరణ వ్యవస్థకు మార్గం సుగమం చేస్తుంది.

– డాక్టర్ బి. భాస్కర్ రావు, సీఎండీ, కిమ్స్ హాస్పిటల్స్



పేదలకు మేలు..



గ్రామీణ ప్రాంతాల్లో క్యాన్సర్ సెంటర్‌లను ప్రారంభిస్తామని ప్రభుత్వం ప్రకటించినందుకు సంతోషిస్తున్నాను. ఇది మెట్రోయేతర ప్రాంతాల్లోని పేదలకు ఉపయుక్తంగా ఉంటుంది. జీవితాన్ని కాపాడే పలు రకాల మందులపై కస్టమ్స్ డ్యూటీని తగ్గించడం, 75,000 మెడికల్ సీట్లు జోడించడం కూడా భవిష్యత్తు మేలుకు సంబంధించిన మంచి వ్యూహం. అంగన్‌వాడీ రంగాన్ని బలోపేతం చేయడం కోసం నిధులు ఖర్చు చేయడం కూడా మంచి విషయమే. ఇలాంటి మంచి వెన్నో అందించిన బడ్జెట్ ప్రవేశపెట్టినందుకు అభినందిస్తున్నాను.

– డాక్టర్ మల్లికార్జున ఎండీ
ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ–యూరాలజీ

సాధికారతే లక్ష్యంగా..

- షాహిన్ ఉమెన్స్ రిసోర్స్ అండ్ వేల్ఫేర్ అసోసియేషన్ కృషి
- పాతబస్తీలో 2002లో ఐదుగురితో ఏర్పాటు
- 23 ఏళ్లుగా మహిళలకు అండగా నిలుస్తూ..
- ఇప్పటి వరకూ 17 వేల మందికి స్వయం ఉపాధిలో శిక్షణ



యాకుత్‌పురా : పాతబస్తీ సుల్తాన్‌షాహిలోని షాహిన్ ఉమెన్స్ రిసోర్స్ అండ్ వేల్ఫేర్ అసోసియేషన్ మహిళ స్వచ్ఛంద సంస్థ మహిళా సాధికారతకు 23 ఏళ్లుగా కృషి చేస్తోంది. ఇందులో భాగంగా అనేక మంది మహిళలకు స్వయం ఉపాధిలో ఉచిత శిక్షణ అందిస్తూ మహిళా లోకానికి చేయూతను అందిస్తోంది. మొదట ఐదుగురితో ప్రారంభమైన ఈ సంస్థ సుల్తాన్‌షాహితో పాటు నషేమన్ నగర్, పహాడిషరీఫ్, షాహిన్‌నగర్, హసన్‌నగర్ ప్రాంతాల్లో శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేవారు. ప్రస్తుతం 22 మంది సభ్యుల సిబ్బందితో ఇప్పటి వరకూ 17 వేల మంది మహిళలకు టైలరింగ్, మెహందీ, జర్దోసీ, కంప్యూటర్, బ్యూటీషియన్, డ్రైవింగ్, సాఫ్ట్ స్కిల్స్ కోర్సుల్లో ఉచిత శిక్షణను అందించారు.

షాహిన్ సంస్థ స్థాపన..



సమాజంలో స్త్రీ, పురుషుల సమానత్వం, మతకలహాల నిర్మూలన, బాలికలు, మహిళల పట్ల జరుగుతున్న గృహహింస, లైంగిక దాడులను అరికట్టేందుంకు నడుం బిగించారు. 2002లో షాహిన్ ఉమెన్స్ అండ్ వేల్ఫేర్ అసోసియేషన్ మహిళ స్వచ్ఛంద సంస్థను స్థాపించారు. అప్పటి నుంచి మహిళలకు టైలరింగ్, మెహందీ, ఇతర ఉపాధి అంశాలపై ఉచిత శిక్షణను అందిస్తున్నారు.

వ్యక్తిగత భద్రత, వ్యక్తిత్వ వికాసం..

బాలికలు, మహిళలకు మానసిక వ్యక్తిత్వ వికాసం, వ్యక్తిగత భద్రత, న్యాయ సలహాలు, పలు సమాజిక అంశలపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జమీలా నిషాత్ సేవలకు గానూ జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డులు అందుకున్నారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ దేవి అవార్డు, మార్తా ఫేరల్ అవార్డు పొందారు. దీంతో పాటు మహిళా శక్తి విశిష్ట మహిళా పురస్కారాలతో పాటు ప్రముఖ సంస్థలు అవార్డులు అందుకున్నారు.


సామాజిక అంశాలపై అవగాహన..



సంస్థ అందిస్తున్న సేవా కార్యక్రమాలను తెలుసుకుని 2014లో చేరాను. ఏడో తరగతితో చదువు ఆపేశాను. జమీలా మేడం ప్రోత్సాహంతో ఇంటర్ పూర్తి చేసి వాలటీర్‌గా స్థానిక బస్తీలో బాలికలు, మహిళలకు బాల్య వివాహాలు, మహిళా హక్కులు వంటి సామాజిక అంశాలపై అవగాహన కల్పిస్తున్నా.

– పూజా, షాహిన్ వాలంటీర్, వాల్మీకీనగర్

లైంగిక దాడుల పరిష్కారానికి..



పాతబస్తీలో బాలికలు, మహిళలపై వారి ఇళ్లల్లో జరుగుతున్న లైంగిక దాడుల పరిష్కారానికి అవగాహనా సమావేశాలు నిర్వహిస్తుంటా. 2002 నుంచి సంస్థలో కొనసాగుతున్నా. 50 మందితో సమావేశం నిర్వహించగా 48 మంది తమ ఇళ్లలో ఎదుర్కొంటున్న లైంగిక పరమైన సమస్యలకు పరిష్కార చర్యలు తీసుకున్నాం.

– షాహేదా, షాహిన్ సభ్యురాలు, నషేమన్ నగర్

ఉపాధి అంశాల్లో శిక్షణ..



ఇంట్లో ఉండే నేను స్వయం ఉపాధి పొందేందుకు బట్టలు కుట్టడం నేర్చుకుంటున్నాం.. ఎలాంటి ఖర్చూ లేకుండా ఉచితంగా మహిళలు, చిన్నారులు ధరించే డ్రెస్సుల కట్టింగ్, అత్యాధునిక మిషన్లతో కుట్టడం చూపిస్తున్నారు.

– శ్రవంతి, గృహిణి, గౌలిపురా

మహిళా సాధికారత కోసం..



మహిళా సాధికారత సాధనకు 23 ఏళ్లుగా సంస్థను నడుపుతున్నాం. బాలికలు, మహిళలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను వివరిస్తూ చైతన్యపరుస్తున్నాం. లాభాపేక్ష లేకుండా 17 వేల మందికి స్వయం ఉపాధిలో శిక్షణ అందించాం.

– జమీలా నిషాత్, వ్యవస్థాపకురాలు, షాహిన్ ఉమెన్స్ రిసోర్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్

మహిళా చట్టాలపై అవగాహన..



గృహ హింస, వరకట్నం, మెంటల్ హెల్త్‌తో పాటు మహిళా చట్టాలపై 11 ఏళ్లుగా అనేక సదస్సులు నిర్వహించాం. లీగల్ సెల్ సహకరంతో న్యాయపరమైన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం..కుటుంబ కలహాలు, ఆరోగ్య సమస్యలపై ప్రత్యేక కౌన్సిలింగ్ అందిస్తున్నాం.

– దేవకి, వ్యక్తిత్వ వికాస నిపుణురాలు, షాహిన్

సిటీ ఐటీ.. హ్యాపీ..



సాక్షి, సిటీబ్యూరో: తాము కొత్తవారికి సైతం రూ.4 లక్షల నుంచి రూ.12లక్షల లోపు జీతాలు అందిస్తామని ఐటీ సంస్థ కాగ్నిజెంట్ ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ ఒక్క సంస్థ మాత్రమే కాదు నగరంలోని పలు సంస్థల్లో పనిచేసే ఐటి ఉద్యోగుల్లో అత్యధికులకు ఎంట్రీ దశలో దాదాపు అంతే వార్షిక జీతం అందుతుంది. ఈ నేపథ్యంలో నగరంలో ఉన్న లక్షల సంఖ్యలోని ఐటీ ఉద్యోగులకు తాజా ఆదాయపు పన్ను శ్లాబ్స్ సవరింపులు గొప్ప ఊరటనిస్తున్నాయి. ఉద్యోగంలో ప్రవేశించిన కొత్తలోనే పన్నులు, శ్లాబులు, చెల్లింపులతో కుస్తీ పట్టే దురవస్థ నుంచి వీరికి వెసులుబాటు కలుగుతుందనే ఆశలు చిగురిస్తున్నాయి. దీంతో నగరానికి చెందిన పలువురు ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఊపిరి పీల్చుకున్నాం..

నాకు ఇప్పటి వరకూ ఆదాయపు పన్ను, దాని విధి విధానాల గురించి అవగాహన లేదు. ఈ ఏడాదే నేను ఉద్యోగంలో చేరాను. ఇటీవలే ఆదాయపు పన్ను, టీడీఎస్ వగైరాల గురించి సహోద్యోగులు మాట్లాడుకుంటుంటే నాతో సహా మా కంపెనీలోని ఫ్రెషర్స్ అందరికీ ఆందోళనగా అనిపించింది. ఈ పరిస్థితుల్లో తాజా బడ్జెట్‌లో ఐటీ మినహాయింపులు చూశాక ఊపిరి పీల్చుకున్నాం.

– మనోజ్, ఐటీ ఉద్యోగి, బంజారాహిల్స్

తిప్పలు తప్పాయి..

ఉద్యోగంలో చేరి రెండేళ్లు అవుతోంది. వచ్చే జీతం అప్పటి దాకా చదువుల గురించి ఖర్చులు, ఉద్యోగాన్వేషణలో భాగంగా అయిన వ్యయం, అప్పులు వాటికి తిరిగి చెల్లింపులకే సరిపోతుంది. అప్పటి దాకా మా గురించి ఖర్చు చేసిన తల్లిదండ్రులకు కూడా పెద్దగా సహకరించలేని పరిస్థితి.. వీటికి తోడు ఆదాయపు పన్ను కూడా తోడై చాలా ఇబ్బంది పడ్డాం.

– లాస్య, కార్పొరేట్ ఉద్యోగి, మాదాపూర్

విద్యార్థులకు ఏఐ ఆధారిత లెర్నింగ్..

సాక్షి, సిటీబ్యూరో: స్మార్ట్ టీవీలు–స్మార్ట్ మానిటర్లకు సంబంధించి తమ ఎడ్యుకేషన్ హబ్ యాప్‌లో ఎంబైబ్ ఏఐ పవర్డ్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్‌ను సామ్‌సంగ్ అనుసంధానం చేసింది. ఈ విషయాన్ని సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. దీని ద్వారా సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ, ఐబీ, కేంబ్రిడ్జ్, అన్ని రాష్ట్ర బోర్డులు, జేఈఈ, నీట్ విద్యార్థులకు వ్యక్తిగతీకరించిన అభ్యాస అనుభవాలు లభిస్తాయని, టీవీలను విద్యా సాధనాలుగా మార్చడాన్ని తాము లక్ష్యంగా చేసుకున్నామని వివరించింది.

నగరంలో పెళ్లి సందడి..

నేటి నుంచి మార్చి 17 వరకు ముహూర్తాలు



చాదర్‌ఘాట్: మాఘమాసం గురువారంతో ప్రారంభమైంది. నగరంలో ఇక పెళ్లి బాజాలు మోగనున్నాయి. గృహప్రవేశాలకు అన్నీ మంచి రోజులే. ఫిబ్రవరి 2 నుంచి మార్చి 17 వరకూ ముహూర్తాలు ఉండగా వాటిలో ఫిబ్రవరి 16, మార్చి 16న ఎక్కువ పెళ్లిళ్లు జరగనున్నాయని మలక్‌పేటకు చెందిన వాస్తు పండితుడు సింగిరి శ్రీనివాస్ తెలిపారు. ఫిబ్రవరి 2, 3, 7, 13, 14, 15, 16, 21, 23, 25, మార్చిలో 2, 6, 7, 12, 14, 15, 16, 17 తేదీల్లో పెళ్లి ముహూర్తాలు ఉన్నాయని పేర్కొన్నారు. వివాహాలకు ఫంక్షన్ హాళ్లు, డెకరేషన్, కేటరింగ్, బుకింగ్ తదితర పనుల్లో బిజీ అయ్యారు. నగరంలో ఫంక్షన్ హాళ్ల నిర్వాహకులు వసతులను బట్టి రూ.5లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ తీసుకుంటున్నారు. పెళ్లిళ్ల సీజన్ మొదలవ్వడంతో వస్త్ర, బంగారం దుకాణాలు కొనుగోలుదారులతో సందడిగా కనిపిస్తున్నాయి.

సాక్షి పెళ్ళిచూపులు

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



యాదవ/ M.Tech, IIT / C.Govt. సైంటిస్ట్/DRDO/1 Lakh PM/ 5'11" ఎత్తు/30 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8297439565 [HA-15426]

యాదవ/2nd / 50Y / 5'4" / BA, Pvt. Job, 45000/-PM / Hyd, BC వరుడికి చదువుకున్న స్త్రీ కావలెను నో బ్రోకర్స్ Whtsapp/Call. డైరెక్ట్ Ph: 8978107566 [HA-15426]

37 సం. గల బిజినెస్ చేసే వరునికి 1వ లేదా 2వ సంబంధం వధువు కావలెను. పిల్లలు ఉన్నా పర్వాలేదు. కుల ప్రసక్తి లేదు. నో డౌరీ. Ph: 9866724586, 6301943220 [H-783411]

క్రైస్తవ మాల 34 సం॥ 5'10" MD, GM Govt డాక్టర్ వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ గల వరుడుకు MBBS or PG Unmarried / డైవర్సీ డాక్టర్ వధువు కావలెను. No డౌరీ. డైరెక్ట్ సంప్రదించండి. సెల్ : 9441981671 [SCA25001031]

కాపు, డైవర్స్, కెనడా సిటిజన్, USA గ్రీన్‌కార్డ్ గల వరుడుకి 1 & 2 మ్యారేజి (కిడ్స్ లేని) వధువు కావలెను. కుల/ ఆస్తి పట్టింపు లేదు. 98481 88297. [B-782091]

కాపు విడో(50) ఒంటరి. సొంత వ్యాపారాలు, ఆస్తులు కలిగిన వెల్‌సెటిల్డ్ వరునికి కుల, కట్న ప్రసక్తి లేని వధువు కావలెను. పిల్లలున్నా Ok. No Brokers, Direct ✆ 63030 46430 [G-824612]

కుల పట్టింపు లేదు: Ag 58, సెంట్రల్ గవర్నమెంట్ జాబ్, సొంత ఇల్లు కలిగిన వరునికి మంచి సాంప్రదాయమైన, విడో, పిల్లలు ఉన్న ఏ బాదర బందీ లేని వధువు కావలెను. సంప్ర॥ 94999 47658. [MH-13081]

★

మున్నూరు కాపు /32yrs, H: 5'8", హోటల్ మేనేజ్‌మెంట్ ఫ్యాకల్టీ, Hyd, 60K PM, 2Cr, ఆస్తి వరునికి any BC చదువు/జాబ్ ఉన్న వధువు కావలెను. డైరెక్ట్. Ph: 9440122661 [HA-33782]

రెడ్డి/లేట్ మ్యారేజ్ /34y/1L P.M./Hydలో సొంత ఇల్లు, ఏలేశ్‌లో 5 ఎకరాల వ్యవసాయ భూమి గల హైదరాబాద్ వరుడికి ట్లీ తెలంగాణ వధువు కావలెను. పిల్లలు లేకుంటే డైవర్సీ /విడో ఓకె కుల, కట్న ప్రసక్తి లేదు. డైరెక్ట్ Ph: 7989079290 [H-782730]


★★

Christian / 53 సం॥లు (భార్య లేదు) నెలకు 40 వేలు సంపాదన గల వరునికి Christian రక్షణ పొందిన వధువు కావలెను. ✆ 93466 28530 [B-471]

డైరెక్ట్/45/ ప్రభుత్వ ఉద్యోగము చేయుచున్న వరుడికి కుల, మత, వయసు, ఆస్తి, ప్రసక్తి లేని వధువు పెళ్ళి లేదా తోడు కొరకు కావలెను. డైరెక్ట్-Ph: 85199 34926 [L-794731]

A.P. SMP Settled in Hyd. invite alliance for their son 2nd marriage 32y, 5'.9" B.Tech, MBA, working in MNC as Manager req. fair, well educated below 30y can ✆ Shariff 9869223554 [B-7846]

వరుడు కావలెను



రెడ్డి /2nd మ్యారేజ్/కుల, ఆస్తి పట్టింపు లేదు/వయస్సు : 30, H:5'4"/ సొంత బిజినెస్, అందమైన వధువుకి వరుడు కావలెను 1st/2nd అన్ని కులాలు & వయస్సుల వారికి సంబంధాలు కలవు (ఇల్లరికం OK) Ph: 8143011223 [H-783612]

వడ్డెర /B.Tech/C.Govt.Jr. ఇంజనీర్/ రైల్వే /60,000/-PM / 5'4"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8341650195 [HA-15426]

రెడ్డి /38yr/5'5"/ ఫెయిర్/కుల పట్టింపు లేదు/ PG/Govt.ఎంప్లాయ్/90K (PM) & వెల్ సెటిల్డ్, సొంత ఇల్లు కలిగిన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం & పిల్లలు ఉన్నా OK) సంప్ర : 9133672661 [HA-15429]

పద్మశాలి/M.Com / Govt. స్టాటిస్టికల్ ఆఫీసర్ / MRO ఆఫీస్/62000/-PM/ 5'4" ఎత్తు/26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8297439565 [HA-15426]

గౌడ / CA / చార్టెడ్ అకౌంటెంట్/ 9 Lakhs. PA/5'5" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9618008271 [HA-15426]

SC హిందూ మాల / M.Tech, NIT / C. Govt. డిప్యూటీ మేనేజర్/రైల్వేస్ సిగ్నల్ Dept/ 60,000/-PM/5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9908222406 [HA-15426]

క్రిస్టియన్ /29/5'5"/MBBS, MD/డాక్టర్ అందమైన వధువుకు Any డాక్టర్ or సాఫ్ట్‌వేర్ అల్లెంటుగా కావలెను. Ph: 8919759359 [HA-15426]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Contact : K.C. Reddy, Hyderabad. Ph : 9849321309 / 9347807015. Please Check my Whatsapp Status. Email: kcreddy43@gmail.com, Facebook.com / Subscribe Telegram Channel- kcreddymarriagebureau

వధువు కావలెను

Reddy/ CHTHOLIC * USA Citizen * B.Tech/MS/1986/5'7"/200K *96/6'/100K *90/6'/90K/15Cr. *Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015/ 9849321309

Reddy/Divorcee/Now in Hyd/ B.Tech/ MS / H1 / USA / Handsome Boy / 1990/ 5'10"/200K/100Cr *Cont: K.C. Reddy - Hyd- Ph: 9849321309/9347807015

Reddy/B.Tech/ MS/ H1/USA/1998/6'/ 300Cr *97/5'9"/60Cr *95/5'10"/100Cr *91/5'11"/300Cr * Cont. K.C. Reddy-Hyd-Ph: 9347807015/9849321309

Reddy/B.Tech /MS/ Business/Hyd/ 1994 / 6'/1000Cr *95 / 5'7" / 2000Cr * Cont : K.C. Reddy- Mar-Bureau Pvt Ltd-Hyd. Ph: 9849321309/9347807015

Reddy/IIT/B.Tech /SWE /India / *1994/ 5'11"/ 70L/yr/25Cr *94/5'9"/1 Cr/yr/30Cr *96/ 5'7"/50L/yr/20Cr * Cont: K.C. Reddy -Hyd -Ph: 9347807015/9849321309

Reddy / IIT/B.Tech/MS/USA *1996/6'/ 25Cr *94/5'11"/400K/30Cr *93/6'/350K/ 100Cr *93/5'9"/230K/20Cr * Cont : K.C. Reddy -Hyd. Ph : 9347807015/9849321309

Reddy/MBBS /USA - Doctor / MD/ Handsome Boy / USA - Citizen/ 1992 / 6'/Rich * Cont : K.C. Reddy-Mar-Bureau-Hyd. Ph: 9347807015

Reddy/B.Tech/LLM/Handsome Boy/1990/5'11"/Parctce & Business-Hyd/50Cr * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015/ 9849321309

Reddy/Divorcee *B.Tech/SWE/ Hyd/1986/ 5'11"/70L/yr/15Cr *MBBS/ MD(USA)/ 1988/ 5'7"/700K *H1/ USA/ 1990/ 5'9"/ 300K/ 40Cr. * Cont: K.C. Reddy-Hyd- Ph: 9347807015

Reddy/Catholic *V. Handsome Boy/ B.Tech/MBA/30L/yr/10Cr/1987/5'11"/ * Cont: K.C. Reddy -Mar-Bureau-Hyd. Ph: 9849321309/9347807015

వరుడు కావలెను

Reddy/B.Com/Own Business/ Hyd/ 1994 / 5'7"/ 50Cr / *B.Tech / 97 / 5'7"/ 10Cr * Cont:K.C.Reddy-Mar-Bureau-Hyd-Ph: 9347807015 /9849321309

Reddy/MDS/Own Hospital/Most Beautiful /1996 / 5'8"/20Cr * 1995/ 5'5"/5Cr *BDS/95/5'5"/ * Cont: K.C. Reddy-Hyd-Ph: 9849321309

Reddy/MBBS/MS (Gen. Surgeon) Most Beautiful/1995/5'7"/20Cr *MD/ 1998/5'7"/100Cr *94/5'10"/50Cr * Cont: K.C.Reddy-Hyd. Ph: 9347807015

Reddy/IIT/B.Tech/SWE/India * 1996/ 5'4" *2000/5'7"/45L/yr/10Cr *2001/ 5'5" *96/5'2"/40L/yr * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015/9849321309

Reddy/B.Tech / MS/H1/USA/1996/5'3"/ 115K/30Cr *98/5'4"/10Cr *99/5'6"/100Cr *97/5'4"/100Cr *89/5'6"/170K/30Cr * Cont : K.C. Reddy -Hyd- Ph: 9347807015

Reddy/B.Tech/MS/H1/USA *1997/ 5'5"/ 60Cr *96/5'7" *97/5'5"/10Cr *96/5'8"/15Cr *95/5'6"/200K *96/5'5"/15Cr * Cont. K.C. Reddy-Hyd. Ph: 9849321309/9347807015

Reddy/B.Tech/Most Beautiful *1999/ 5'7"/100Cr *1993/5'3"/500Cr *95/5'5"/ 70Cr * 97 / 5'4"/ 150Cr *94/5'3"/300Cr * Cont: K.C. Reddy -Hyd-Ph: 9347807015

Reddy/B.Tech/Most Beautiful / 1999/ 5'8"/25Cr *96/5'7"/50Cr *95/5'3"/75Cr *88/ 5'3"/300Cr *Cont: K.C. Reddy-Hyd.Ph: 9849321309/9347807015

Reddy/Divorcee *MBBS/MD/ 1994/ 5'5"/ 50Cr *93/5'8"/40Cr *87/5'3"/10Cr *92/ 5'3"/ 10Cr *86/5'6"/50Cr * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015/9849321309

Reddy/Divorcee/B.Tech/1993/5'4"/10Cr *88/5'6"/30Cr *91/5'4"/10Cr *93/5'7"/15Cr *85/5'5"/400Cr *85/5'6"/15Cr* Cont : K.C. Reddy- Hyd-Ph: 9849321309

[D-563]

ముదిరాజ్/B.Tech/Govt.Asst. ఇంజనీర్/ ట్రాన్స్‌కో /80,000/-PM/5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618007652 [HA-15426]

SC మాల & క్రిస్టియన్ /B.Tech/ Govt. AEE/ట్రాన్స్‌కో /1,30,000/-PM / 5'4" ఎత్తు /25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9676995093 [HA-15426]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి MBBS, MD, DM, 27, 5' 11", PG Doctor, Hyderabad, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Citizen, BS, MS, 33, 5' 7", Director, 200 K, 25 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS (USA), MBA (ISB), 30, 5' 11", Manager, 36 L P/A, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 29, 5' 10", Bank Of America, SWE, 200 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి Citizen, BS, 28, 5' 6", SWE, 50 Crores, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Citizen, BS, MS, 27, 5' 2", 100 Crores, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE (NIT), MS, 26, 5' 6", SWE, 100 K, H1, Rich Family, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Canada, BE, MS, 28, 5' 7", Data Engineer, 3 Crores, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



www.avinashreddy.com

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (రెడ్డిలకు మాత్రమే)

D.V. Koti Reddy

690, Road No.3, Banjara Hills, (TV 9 : Opp. Colony) Hyderabad

98480 11818, 93933 11818

రెడ్డి Australia, BE, MS, 30, 5' 8", Business Analyst, 90 K, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BS (USA), 34, 5' 10", Manager, 50 L P/A, Hyderabad, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 29, 6' 1", PG Doctor, Rich Family, Hyderabad, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Bengaluru, BE (IIT), MBA (IIM), 35, 5' 10", 34 L P/A, Handsome Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BDS, MDS, 29, 5' 6", Dental Doctor, 2 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Europe, BE (NIT), MS, 28, 5' 2", SWE, Rich Family, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 25, 5' 5", PG Doctor, 60 Crores, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, BE, MBA, 31, 5' 6", 16 L P/A, Hyd, Rich Family, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

SC మాదిగ /B.Tech/C.Govt. Asst. మేనేజర్/ యూనియన్ బ్యాంక్/55000/-PM/ 5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9676995093 [HA-15426]

ఆర్యవైశ్య /21y&23y&25y&27y &28y&30y & 32y&34y&35y&36y&38y & 39y&40y& 42y& 43y&45y&46y&48y&50y/ష. సుప్రజా గుప్తా "మా సేవ" (Since 1998): PH/WA: 9291503949 [HA-15429]

చౌదరి /48/విడో/5'8"/MBA/C.Govt Job/ VRS / 90K PM/Own Business/30 ఎకరాల పొలం/ సొంత ఇల్లు/గ్రానైట్ బిజినెస్ గల అందమైన వధువుకు వరుడు కావలెను. 9642589295 [HA-15429]

రెడ్డి /విడో/ 39y/5'3"డిగ్రీ సొంత ఇల్లు 20 ఎకరాల పొలం కలిగి పిల్లలు లేని వధువుకు వరుడు కావలెను (ఆస్తి కుల పట్టింపు లేదు/మీ ఫోటోలు వాట్సాప్‌లో పంపించండి. 9885463158 [HA-15429]

యాదవ /B.Tech, IT/C.Govt.డిప్యూటీ. మేనేజర్/SBI/60000/-PM/ 5'5" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకి వరుడు కావలెను. Ph: 9515755529 [HA-15429]

2వ పెళ్లి /Govt.Emp, 4,00,000 PM, బాగా స్థిరపడి కోట్ల ప్రాపర్టీ కల్గి, ఎలాంటి కుల లేదా వృత్తితో సంబంధం లేదు, పిల్లలు ఉన్నా OK. ఇల్లరికం, Ph: 9381696641 [H-783612]

రెడ్డి /విడో/కుల, ఆస్తి ప్రసక్తి లేదు/Age: 35/Qly: B.Com/Pvt Job గల అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం అయినా OK) All Caste marriages Available. Ph: 8121347478 [H-783612]

రెడ్డి /2nd మ్యారేజ్ (కుల/ఆస్తి) పట్టింపు లేదు/ 32Y/B.Com, Own Business & Lands వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం OK) అన్ని వయస్సుల వారికి 1వ, 2వ సంబంధాలు కలవు. Ph: 9030062353 [H-783612]

FC/విడో /ప్రభుత్వ ఉద్యోగం / రెండు ఇల్లులు/వెల్ సెటిల్డ్ వధువుకు స్నేహ పూర్వకమైన వరుడు కావలెను. కులప్రసక్తి లేదు. 9390084390 [H-783521]

వైశ్య/ 50y / విడో/5'4"/మార్బుల్ గ్రానైట్ బిజినెస్ /1L/-PM/సొంత ఇల్లు & రెంట్స్/ 50000/-PM/పిల్లలు లేని వధువుకి వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు. 9573060401 [H-783521]

వైశ్య/విడో/50y/డిగ్రీ/సొంత ఇల్లు & బిజినెస్ /9 ఎకరాల ల్యాండ్ గల వధువుకు కుల, ఆస్తి పట్టింపు లేని వరుడు కావలెను. 9705499686 [H-7 83521]

రెడ్డి/విడో/50y/ప్రాపర్ నెల్లూరు / Hydలో సొంత అపార్ట్‌మెంట్స్/సొంత షాప్స్/రెంట్స్/మంచి ఆస్తి గల వధువుకి కుల, ఆస్తి ప్రసక్తి లేని వరుడు కావలెను (అర్జెంట్) నో బ్రోకర్స్ (ఇల్లరికం OK). 7799083500/7386660643 [H-783521]

గౌడ్/31/5'4"/MBBS, Emergency Medicne *34/5'6"*BDS/Pune *26/5'5"/M.Sc, B.Ed/ Asst. Prof / Hyd * 48/5'1"/BA/Teacher Hyd/ 30/5'0"/ B.Tech/Technical /Asst Hyd గౌడ్ అమ్మాయిలకు తగిన వరులు కావలెను. సంప్ర॥ శుభమస్తు DSNR, Hyd. S.రాములు గౌడ్. Ph: 8790690309 [H-783520]

★

డైరెక్ట్, నో బ్రోకర్స్, 38Y, 5.5", కలర్, హైదరాబాద్‌లో జాబ్ చేస్తున్న డైవర్స్ అందమైన వధువుకు ఫ్రెండ్లీ ఆర్థిక స్తోమత గల లేటు, డైవర్స్, విడోయర్ ఒంటరి వరుడు కావలెను. Age/CNB ✆ 73827 77101 [B-1170382]

వేదికలు



కుల పట్టింపు లేని అన్ని కులాల వారికి, 1వ/2వ/లేట్/విడో/విడోయర్స్/పెన్షనర్స్ వ॥ 21-80 సం॥ త్వరగా సంబంధాలు చూడబడును (స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) సంప్ర :7093944378 [H-783612]

మాదిగ వివాహ పరిచయ వేదిక. ఆదివారం తేది : 9/2/2025 హైదరాబాద్‌లో నిర్వహణ : స్వప్న వివాహ వేదిక. 9347046175 [H-783521]

Brahmin పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7093969457 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-15428]

Kapu పెళ్ళి సంబంధాలకైసంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 7032018248 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-15428]

Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7093969457 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-15428]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 7032018248/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-15428]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7093969457/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-15428]

మాల, మాదిగ స్పెషల్ IAS, IPS, IFS, IRS, గ్రూప్-I, II, PG, డాక్టర్స్, బ్యాంక్ PO, Govt. ఆఫీసర్స్, USA, UK. Ph: 7396915712 [HA-15399]

ఫ్రీ రిజిస్ట్రేషన్: 16లో॥ అన్ని కులాల వారికి తగిన సంబంధాలు చూపించగల పెద్ద సంస్థ రోహిణి మ్యారేజ్ లైన్స్. ✆ 94418 29644, 98490 58673, 9493 661 288. వాట్సప్ [B-621]

★

బ్రాహ్మణ వధూ-వరుల స్వయంవరం Free Register 13/April/2025న Kamala Nagar Welfare Office, ECIL, Hyd. Ph: 9704656103/9533608887 Whatsapp. No. [HA-1314]

★★

మారుమనస్సు పొందిన అన్ని కులముల క్రైస్తవ వధూవరులకు మొదటి రెండవ వివాహముల కొరకు సంప్ర. ది హోలీ కమ్యూనిటీ మ్యారేజ్ బ్యూరో ✆ 73999 93599, 73999 93699 [B-1014387]

మాల (క్రైస్తవ, హిందూ) B.Tech, M.Tech, MS, MBA, MBBS చదువులతో డాక్టర్స్, సాఫ్ట్‌వేర్, బ్యాంక్ జాబ్ చేస్తున్న వధూవరుల వివరాలకు kalyanamala.org ✆ 9440545049 [B-1268407]

జాతీయం / అంతర్జాతీయం



విమానం కూలిన ప్రాంతంలో పెద్ద ఎత్తున చెలరేగిన మంటలు

అమెరికాలో మరో విమాన ప్రమాదం

- టేకాఫ్ అయిన నిమిషంలోనే కూలిపోయిన ఎయిర్ అంబులెన్స్
- ఏడుగురు మృతి.. పలువురికి గాయాలు
- మృతులంతా మెక్సికన్ వాసులు

ఫిలడెల్ఫియా: అమెరికాలో మరో విమాన ప్రమా దం జరిగింది. ఫిలడెల్ఫియాలోని ఎయిర్ అంబు లెన్స్ టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కుప్పకూలింది. విమానంలో ఉన్న ఆరుగురు మృతి చెందారు. రద్దీ ఎక్కువగా ఉండే రూజ్‌వెల్ట్ మాల్ సమీపంలో విమానం కూలిపోవడంతో కార్లు, ఇళ్లు దగ్ధమయ్యాయి. కారులో ఉన్న ఒకరు చనిపోయారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న చిన్నారికి ఫిలడెల్ఫియాలోని ష్రైనర్స్ చిల్డ్రన్ హాస్పిటల్‌లో చికిత్స అనంతరం మెక్సికోకు తరలిస్తుండగా ప్రమాదం జరిగింది. చిన్నారితోపాటు ఆమె తల్లి, డాక్టర్, పారా మెడిక్, పైలట్, కో-పైలట్ విమానంలో ఉన్నారు. ఫిలడెల్ఫియా నుంచి బయలుదేరిన విమానం విమానం మిస్సోరి వెళ్లి, అక్కడి నుంచి టిజువా నాకు చేరుకోవాల్సి ఉంది. టేకాఫ్ అయిన కొద్దిసే పటికే రూజ్‌వెల్ట్ మాల్ సమీపంలోని రద్దీ కూడలిలో కూలిపోయింది. కూలిపోవడానికి ముందు కేవలం ఒక నిమిషం మాత్రమే గాల్లో ఉంది. విమానం కు ప్పకూలడంతో ఇళ్లకు మంటలు అంటుకున్నాయని, పార్కింగ్ స్థలాల్లో, వీధుల్లో, కార్లలో, ఇళ్లలో చాలా మంది గాయపడ్డారని ఫిలడె ల్ఫియా మేయర్ తెలిపారు. తీవ్ర గాయాలతో ఒక రు చనిపోగా, 19 మంది చికిత్స పొందుతున్నా రన్నారు. ఈ నేపథ్యంలో ఈశాన్య ఫిలడెల్ఫియా విమానాశ్రయాన్ని తాత్కా లికంగా మూసి వేసి, తరువాత తెరిచారు. ప్రమాదం జరిగిన వెంటనే రూజ్‌వెల్ట్ మాల్‌ను ఖాళీ చేయించారు. మాల్‌లో ఉన్న వారికెలాంటి గాయాలు కాలేదన్నారు.

ఇరు దేశాధ్యక్షుల సంతాపం

ప్రమాదంపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షీన్‌బామ్ స్పందించారు. మరికొంత మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారంటూ ట్రంప్ సోషల్ మీడియా ప్లాట్ఫామ్ ట్రూత్ సోషల్లో పోస్ట్ చేశారు. తమ సిబ్బంది సహాయక చర్యల్లో నిమగ్నమై ఉన్నారని పేర్కొన్నారు. మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షీన్‌బామ్ మృతుల కుటుంబాలకు ప్రగాఢ సాను భూతి ప్రకటించారు. ఆయా కుటుంబాలతో కాన్సు లర్ అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారని, అవసరమైన సహాయాన్ని అందించాలని విదేశాంగ మంత్రిత్వ శాఖను కోరానని ఎక్స్‌లో పేర్కొన్నారు. చిన్నారికి చికిత్స అందించిన ష్రైనర్స్ ఆస్పత్రి సిబ్బంది ప్రమాదం గురించి తెలియగానే దిగ్భ్రాంతికి గురయ్యారు. చికిత్స పూర్తయిన అనంతరం చిన్నారి సంతోషంగా వెళ్లిందని, ప్రాణాంతక వ్యాధి నుంచి బయటపడిన చిన్నారి ఇలా ప్రాణాలు కోల్పోవడం బాధాకరంగా ఉందన్నారు.


ఆప్ ఆశలపై ఐటీ దెబ్బ!

భారీ ఐటీ మినహాయింపు ప్రకటనతో ఆప్ శిబిరంలో ప్రకంపనలు

- ఢిల్లీలో 67 శాతమున్న మధ్యతరగతిపై గట్టి ప్రభావం!
- మూడు రోజుల్లోనే అసెంబ్లీ ఎన్నికల పోలింగ్
- కేజ్రీవాల్ 'హ్యాట్రిక్' ఆశలకు గండి?



నిర్మలా సీతారామన్



కేజ్రీవాల్

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ సారథి అరవింద్ కేజ్రీవాల్ హ్యాట్రిక్ ఆశలకు ఎలాగైనా గండి కొట్టేందుకు కృతనిశ్చయంతో ఉన్న మోదీ సర్కారు ప్రచారం చివరి దశకు చేరిన వేళ తురుపుముక్కను గురి చూసి మరీ వదిలింది. రాజధానిలో మూడొంతుల దాకా ఉన్న వేతన జీవులను ఆకట్టుకునేలా 'ఐటీ మినహాయింపుల' అస్త్రాన్ని ప్రయోగించింది! వారికి ఆదాయ పన్ను మినహాయింపు పరిధిని ఎవరూ ఊహించని విధంగా ఏకంగా రూ.12 లక్షలకు పెంచింది. శనివారం నాటి కేంద్ర బడ్జెట్లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ మేరకు చేసిన ప్రకటన ఆప్ శిబిరంలో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఇది నిజంగా మోదీ మాస్టర్‌స్ట్రోకేనని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరో మూడు రోజుల్లో (బుధవారం) జరగనున్న ఢిల్లీ ఎన్నికల పోలింగ్‌లో ఐటీ మినహాయింపు ప్రభావం గట్టిగానే ఉండగలదని వారంటున్నారు.

మాస్టర్ స్ట్రోక్!

ఆమ్ ఆద్మీ పార్టీ, బీజేపీ మధ్య ప్రతిష్టాత్మక పోరుకు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు వేదికగా మారాయి. పాతికేళ్ల తర్వాత ఎలాగైనా గెలుపు ముఖం చూసేందుకు కాషాయ పార్టీ, వరుసగా మూడో విజయం కోసం ఆప్ ఇప్పటికే ఓటర్లకు లెక్కలేనన్ని వాగ్దానాలు చేశాయి. రాజధాని జనాభాలో 97 శాతం నగర, పట్టణ ప్రాంతాల్లోనే నివసిస్తున్నారు. వారిలోనూ మధ్య తరగతి వర్గం ఏకంగా 67 శాతానికి పైగా ఉంది. దాంతో వాళ్లను ఆకట్టుకోవడానికి రెండు పార్టీలూ శాయశక్తులా ప్రయత్నిస్తున్నాయి. పదేళ్లపాటు సామాన్యులు, అల్పాదాయ వర్గాలే లక్ష్యంగా సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేస్తూ వచ్చిన ఆప్ ఈసారి ప్రభుత్వ వ్యతిరేకత, కేజ్రీవాల్‌పై అవినీతి మచ్చ తదితరాలతో సతమతమవుతోంది. ఈ ప్రతికూలతలను అధిగమించేందుకు మిడిల్‌క్లాస్‌పై గట్టిగా దృష్టి సారించింది. తన మేనిఫెస్టోను కూడా మధ్యతరగతి పేరిటే విడుదల చేసింది. ఆ సందర్భంగా మాట్లాడిన కేజ్రీవాల్, ఐటీ మినహాయింపు పరిధిని రూ.10 లక్షలకు పెంచాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. తద్వారా వేతన జీవులను ఆకట్టుకోవచ్చని భావించారు. కానీ ఆ పరిధిని ఏకంగా రూ.12 లక్షలకు పెంచుతూ మోదీ సర్కారు అనూహ్య నిర్ణయం తీసుకుంది. కేజ్రీవాల్ కంటే రెండాకులు ఎక్కువే చదివానని నిరూపించుకుంది. ఢిల్లీ ఓటర్లలో వేతన జీవులు చాలా ఎక్కువ సంఖ్యలో ఉంటారు. వారందరినీ ఇది బాగా ప్రభావితం చేసేలా కనిపిస్తోంది. దీనికి తోడు బీజేపీ వ్యతిరేక ఓటు ఈసారి ఆప్‌కు బదులు కాంగ్రెస్‌కు పడొచ్చన్న విశ్లేషణలు కేజ్రీవాల్ పార్టీని మరింతగా ఆందోళనకు గురి చేస్తున్నాయి. బీజేపీతో హోరాహోరీ పోరు జరిగే నియోజకవర్గాల్లో ఇది తీవ్రంగా దెబ్బ తీయవచ్చని ఆప్ భావిస్తోంది. గత ఎన్నికల్లో 15కు పైగా స్థానాల్లో 10 వేల లోపు మెజారిటీ నమోదవడం గమనార్హం.

- సాక్షి, నేషనల్ డెస్క్

కేజ్రీవాల్‌కూ ఎదురీతే!

ఆప్‌తో పాటు దాని సారథి కేజ్రీవాల్ కూడా కష్ట కాలంలో ఉన్నట్టు కనిపిస్తోంది. ఆయన కంచుకోట అయిన న్యూఢిల్లీ నియోజకవర్గంలో ఈసారి ఎదురీత తప్పేలా లేదు. ఈ స్థానం పరిధిలో ప్రభుత్వోద్యోగులు, గ్రేడ్ ఏ, బీ అధికారులు ఎక్కువగా ఉండటమే ఇందుకు కారణం. తాజా బడ్జెట్లో ప్రకటించిన ఐటీ వరంతో వీరిలో అత్యధికులు లబ్ధి పొందనున్నారు. అవినీతి ఆరోపణలు, అధికార నివాసం కోసం కోట్లాది రూపాయల ప్రజా ధనాన్ని మంచినీళ్లలా వెచ్చించారంటూ బీజేపీ చేస్తున్న ప్రచారం ఇప్పటికే కేజ్రీవాల్‌కు తల బొప్పి కట్టిస్తున్నాయి. వీటికి తోడు మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తానన్న హామీని నిలబెట్టుకోలేదంటూ ఓటర్లు పెదవి విరుస్తున్నారు. 2013లో తొలిసారి ఎన్నికల బరిలో నిలిచిన ఆయన ఏకంగా నాటి సీఎం అయిన కాంగ్రెస్ సీనియర్ షీలా దీక్షిత్‌నే మట్టికరిపించారు. నాటి నుంచీ అక్కడ వరుసగా గెలుస్తూ వస్తున్నారు. ఈసారి మాత్రం బీజేపీ నుంచి సాహెబ్‌సింగ్ వర్మ కుమారుడు పర్వేశ్ వర్మ, కాంగ్రెస్ నుంచి షీలా కుమారుడు సందీప్ దీక్షిత్ రూపంలో ఏకంగా ఇద్దరు మాజీ సీఎంల వారసులు ఆయనకు గట్టి సవాలు విసురుతున్నారు. కేజ్రీ ఓట్లకు సందీప్ భారీగా గండి కొడతారని, ఇది అంతిమంగా పర్వేశ్‌కు లాభిస్తుందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

బీజేపీలో చేరిన ఆ 8 మంది ఎమ్మెల్యేలు

న్యూఢిల్లీ: టికెటివ్వలేదనే అసంతృప్తితో శుక్రవారం ఆప్‌కు రాజీనామా చేసిన 8 మంది ఎమ్మెల్యేలు శనివారం బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఢిల్లీ అసెంబ్లీకి మరో నాలుగు రోజుల్లో ఎన్నికలు జరుగనున్న వేళ ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. తమతోపాటు మరికొందరు ఆప్ నేతలు కూడా కాషాయ కండువా కప్పుకున్నారని ఆప్ మాజీ ఎమ్మెల్యే విజేందర్ గర్గ్ చెప్పారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బీజేపీ ఢిల్లీ ఇన్‌చార్జి బైజయంత్ పాండా, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విజేంద్ర సచ్‌దేవ వీరికి ఘన స్వాగతం పలికారు. రాజీనామా లేఖలను అసెంబ్లీ స్పీకర్‌కు పంపామని ఎమ్మెల్యేలు తెలిపారు. ఆప్ ప్రాథమిక సభ్యత్వాలకు సైతం రాజీనామా చేసినట్లు ప్రకటించారు. ఆమ్ ఆద్మీ పార్టీ తన ప్రాథమిక సిద్ధాంతాలను పక్కనబెట్టి, అవినీతిలో కూరుకుపోయిందని వీరు ఆరోపించారు.

ముగ్గురు బందీలకు స్వేచ్ఛ

ఖాన్ యూనిస్: ఇజ్రాయెల్, హమాస్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ, బందీల విడుదల ఒప్పందం సజావుగా సాగుతోంది. హమాస్ శ్రేణులు 2023 అక్టోబర్ 7న అపహరించుకు వెళ్లిన వారిలో మరో ముగ్గురిని శనివారం విడుదల చేశాయి. అమెరికన్-ఇజ్రాయెలీ కీత్ సీగెల్(65), యర్డెన్ బిబాస్(34)లను దక్షిణ గాజాలోని ఖాన్‌యూనిస్‌లో, ఫ్రెంచి-ఇజ్రాయెలీ ఒఫెర్ కల్డెరోన్(54)ను గాజా సిటీలో రెడ్ క్రాస్ బృందాలకు అప్పగించాయి. బదులుగా ఇజ్రాయెల్ తమ జైళ్లలో ఉన్న 183 మంది పాలస్తీనియన్లను విడుదల చేసింది. మరో వైపు ..తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న, 50 మంది చిన్నారులతోపాటు వారి 61 మంది సంరక్షకులను రఫా క్రాసింగ్ పాయింట్ మీదుగా ఈజిప్టుకు వెళ్లేందుకు ఇజ్రాయెల్ అనుమతించింది.

ఛత్తీస్‌లో మళ్లీ ఎన్‌కౌంటర్ 8 మంది మావోయిస్టులు మృతి

చర్ల: ఛత్తీస్‌గఢ్ అడవుల్లో మరోసారి తుపాకీ కాల్పులు ప్రతిధ్వనించాయి. శనివారం బీజాపూర్‌లో జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో 8 మంది మావోయిస్టులు చనిపోయారు. కూంబింగ్ జరుపుతున్న భద్రతా బలగాలకు గంగలూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో ఉదయం 8.30 గంటల సమయంలో మావోయిస్టులు తారసపడ్డారు. ఈ సందర్భంగా జరిగిన కాల్పుల్లో 8 మంది మావోయిస్టులు చనిపోయారు. ఘటనాస్థలి నుంచి ఒక ఇన్సాస్ రైఫిల్, బారెల్ గ్రెనేడ్ లాంఛర్(బీజీఎల్) తదితర ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని బస్తర్ రేంజ్ ఐజీ సుందర్ రాజ్ చెప్పారు. తప్పించుకుపోయిన వారి కోసం గాలింపు ఉధృతం చేశామన్నారు.

సోమాలియాలో అమెరికా వైమానిక దాడులు

పలువురు ఐసిస్ ఉగ్రవాదులు హతం

వాషింగ్టన్: సోమాలియాలో కార్యకలాపాలు సాగిస్తున్న ఇస్లామిక్ స్టేట్(ఐఎస్) లక్ష్యంగా అమెరికా మిలటరీ శనివారం వైమానిక దాడులకు పాల్పడింది. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ రెండోసారి బాధ్యతలు చేపట్టాక సోమాలియాలో జరిగిన మొట్టమొదటి దాడి ఇది. అధ్యక్షుడు ట్రంప్ ఆదేశాల మేరకు సోమాలియా ప్రభుత్వ సహకారంతో యూఎస్ ఆఫ్రికా కమాండ్ ఈ దాడులు చేపట్టిందని రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ తెలిపారు. వైమానిక దాడిలో పలువురు ఉగ్రవాదులు మృతి చెందినట్లు రక్షణ శాఖ పెంటగాన్ ప్రకటించింది. అయితే, పౌరులెవరికీ ఎలాంటి హాని కలగలేదని తెలిపింది. సీనియర్ ఐసిస్ నేతతోపాటు మరికొందరు లక్ష్యంగా ఈ దాడులు చేపట్టినట్లు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సైతం సోషల్ మీడియాలో ప్రకటించారు. ఆ సీనియర్ నేత కోసం అమెరికా చాలా ఏళ్లుగా గాలిస్తోందన్నారు. బైడెన్ ప్రభుత్వం మాత్రం ఇతడి అడ్డు తొలగించడంలో ఎంతో అలస్యం చేసిందని విమర్శించారు. ఆ పని తాము చేశామని ట్రంప్ ప్రకటించుకున్నారు. తాజా దాడిలో చాలా మంది ఉగ్రవాదులు హతమయ్యారని, వారు దాక్కున్న గుహలు నామరూపాల్లేకుండాపోయాయని తెలిపారు. అయితే, ఈ దాడుల్లో సదరు ఐఎస్ నేత ఎవరు? అతడు హతమయ్యాడా లేదా? అనే విషయాలను ఆయన వెల్లడించలేదు. అమెరికన్లపై దాడులకు పాల్పడే ఐసిస్ తదితర గ్రూపులకు నా హెచ్చరిక 'మీరెక్కడున్నా కనిపెట్టి, మట్టుబెడతాం' అని ఆయన ప్రకటించారు. సోమాలియా ఉత్తర ప్రాంతంలో దాక్కున్న ఐసిస్ నాయకత్వం విదేశీయులను కిడ్నాప్ చేయడం, డ్రోన్ల దృష్టిలో పడకుండా తప్పించుకోవడం, యుద్ధ తంత్రాలపై తమ శ్రేణులకు తర్ఫీదు నిస్తున్నాయని అమెరికా సైనికాధికారులు అంటున్నారు.

మార్కెట్‌పై దాడి.. 54 మంది హతం

సూడాన్‌లో పారామిలటరీ దారుణం

కైరో: సూడాన్‌లో మిలటరీతో హోరాహోరీ పోరు సాగిస్తున్న పారామిలటరీ బలగాలు మరోసారి రక్తపాతం సృష్టించాయి. ఇటీవలే దార్ఫుర్‌లోని ఎల్ ఫషెర్‌లోని ఆస్పత్రిపై దాడి చేసి 70 మంది అమాయకుల్ని బలి తీసుకున్న వీరు శనివారం మార్కెట్‌పై దాడి చేసి 54 మందికి పైగా చంపేశారు. ఒంబుర్మన్ నగరంలోని సబ్రెయిన్ మార్కెట్‌లో ఈ దారుణం జరిగింది. ఘటనలో మరో 158 మంది గాయపడినట్లు ఆరోగ్య శాఖ తెలిపింది. మృతుల్లో మహిళలు, చిన్నారులు కూడా ఉన్నారంది. ఘటనపై పారా మిలటరీ బలగాలు స్పందించలేదు. మిలటరీ, పారామిలటరీ బలగా లు ఆధిపత్యం కోసం 2023 ఏప్రిల్ నుంచి ముఖాముఖి పోరు సాగిస్తున్నాయి. అయితే, ఇటీవలి కాలంలో జరిగిన పలు ఘటనల్లో రాజధాని ఖార్టూమ్‌తోపాటు పొరుగునే ఉన్న ఒంబుర్మన్, తూర్పు, సెంట్రల్ ప్రావిన్స్‌ల్లోని పలు ప్రాంతాల్లో మిలటరీ పైచేయి సాధించింది. దేశంలోనే అతిపెద్ద ఆయిల్ రిఫైనరీ ఉన్న గెజిరా ప్రావిన్స్ రాజధాని వాద్ మెదానీని కూడా సైన్యం తిరిగి స్వాధీనం పర్చుకుంది.

హృదయ సంధ్యారాగం

సిరిసిల్ల 2వ బైపాస్‌లో మంచు తెరలో సూర్యబింబం



సిరిసిల్ల 2వ బైపాస్‌లో పొగమంచు



దట్టంగా కమ్ముకున్న మంచు తెరలు.. పొగమంచులోంచి చొచ్చుకొస్తున్న సూర్య కిరణాలు.. ఆ సుప్రభాతం సుందరం.. సుమధురం. సిరిసిల్ల రెండో బైపాస్ వద్ద శనివారం ఉదయం కనువిందు చేసిన ప్రకృతి సోయగమిది. - సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్న సిరిసిల్ల జిల్లా.

క్లుప్తంగా...

నాణ్యతతో రోడ్లు, ఆస్పత్రి భవనాల నిర్మాణం

మంత్రి కోమటిరెడ్డి ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో జరుగుతున్న రోడ్లు, భవన నిర్మాణాల్లో నాణ్యత ఉండేలా చర్యలు తీసుకోవాలని రోడ్లు, భవనాల శాఖ చీఫ్ ఇంజనీర్లను ఆ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదేశించారు. ఆ శాఖలో ఐదుగురు చీఫ్ ఇంజనీర్లకు కొత్తగా విభాగాలను కేటాయించిన నేపథ్యంలో.. వారితో శనివారం తన నివాసంలో భేటీ అయ్యారు. పదేళ్లలో రాష్ట్రంలో రోడ్ల విషయంలో నిర్లక్ష్యం కొనసాగినందున, వెంటనే వాటిని మెరుగుపరచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో నిర్మించే రోడ్లపై మరింత దృష్టి సారించాలని స్పష్టం చేశారు. చీఫ్ ఇంజనీర్లు తిరుమలకు అడ్మినిస్ట్రేషన్, జయభారతికి వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంత రోడ్ల నిర్మాణం, రాజేశ్వరరెడ్డికి పీపీపీ ప్రాజెక్టులు, రైల్వే సేఫ్టీ వర్క్స్, సీఆర్ఐఎఫ్ వర్క్స్, చిన్న పుల్లదాసుకు మెంబర్ ఆఫ్ కమిషనరేట్ ఆఫ్ టెండర్స్, శ్యామ్ కుమార్‌కు గ్రామీణ రహదారుల విభాగాలను అప్పగించారు. మరో 118 మంది ఏఈఈలకు డీఈఈలుగా పదోన్నతి కల్పించారు.

వేసవిలో 17 వేల మెగావాట్ల డిమాండ్

ఇంధన శాఖ కార్యదర్శి సందీప్‌కుమార్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ రికార్డు స్థాయిలో పెరిగిందని, వచ్చే వేసవిలో మరింతగా పెరిగే అవకాశం ఉందని ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా చెప్పారు. గతేడాది మార్చి 8న రాష్ట్రంలో నమోదైన 15,623 మెగావాట్లు ఇప్పటి వరకు రాష్ట్రంలో అత్యధిక గరిష్ట విద్యుత్ డిమాండ్ అని, వచ్చే వేసవిలో 17,000 మెగావాట్లకు పెరిగే అవకాశం ఉందని తెలిపారు. పెరిగే డిమాండ్‌కు తగ్గట్టు విద్యుత్ సరఫరా చేసేందుకు సర్వ సన్నద్ధతతో ఉన్నామన్నారు. విద్యుత్ సరఫరాపై శనివారం ఆయన దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) ప్రధాన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. గతేడాది జనవరిలో రోజువారీ గరిష్ట విద్యుత్ డిమాండ్ 13,810 మెగావాట్లుగా నమోదు కాగా.. ఈ ఏడాది జనవరి 31న రికార్డు స్థాయిలో పెరిగి 15,205 మెగావాట్లకు పెరిగిందని సందీప్ వెల్లడించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో గరిష్ట డిమాండ్ 3,018 మెగావాట్ల నుంచి 3,334 మెగావాట్లకు చేరిందన్నారు. టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో 10,000 మెగావాట్లు, జీహెచ్ఎంసీ పరిధిలో 5,000 మెగావాట్లకు గరిష్ట డిమాండ్ పెరగనుందని అంచనా వేశామని చెప్పారు. ఈ మేరకు విద్యుత్ సరఫరా చేసేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టామని, ప్రతి జిల్లాకు సీనియర్ ఇంజనీర్‌ను నోడల్ అధికారిగా నియమించామన్నారు. సమీక్షలో టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ పాల్గొన్నారు.

సింగరేణి సీఎండీగా మరో ఏడాది బలరామ్

పదవీ కాలాన్ని పొడిగిస్తూ ఉత్తర్వులు



సింగరేణి (కొత్తగూడెం): సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ)గా ఎన్.బలరామ్ డిప్యుటేషన్ పదవీకాలాన్ని మరో ఏడాదిపాటు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2010 బ్యాచ్‌కు చెందిన ఐఆర్ఎస్ అధికారి బలరామ్ గత ఐదేళ్లుగా డైరెక్టర్ (ఫైనాన్స్)గా పనిచేస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక 2024 జనవరి 1న సీఎండీగా నియమించారు. ఆయన పదవీ కాలం గతేడాది డిసెంబర్ 24వ తేదీనే ముగిసింది. అయితే తిరిగి మరో ఏడాదిపాటు పొడిగిస్తూ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయన ఈ ఏడాది డిసెంబర్ 24 వరకు సీఎండీగా కొనసాగనున్నారు. ఆయన పదవీ కాలం పెంపుపై ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ బి.జనక్‌ప్రసాద్ శనివారం సింగరేణిభవన్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సీఎండీ సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఆయన పదవీ కాలాన్ని పొడిగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరగా.. మరో ఏడాది పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ సెక్రటరీ వికాస్‌కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

వివక్ష బడ్జెట్‌పై టీపీసీసీ నిరసనలు నేడు

సాక్షి, హైదరాబాద్: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణపై వివక్ష చూపినందుకు నిరసనగా.. ఆదివారం టీపీసీసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా పీఎం, కేంద్ర మంత్రుల దిష్టి బొమ్మలను దహనం చేయాలని టీపీసీసీ నిర్ణయించింది. ఆదివారం సాయంత్రం 4 గంటలకు ట్యాంకుబండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ ధర్నా చేపట్టనున్నట్టు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. బడ్జెట్లో తెలంగాణపై వివక్షకు నిరసనగా.. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా ల్లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ నాయకులు, కేడర్‌కు సూచించారు.

ఎలా ఎదుర్కొందాం?

- రాజకీయ పరిణామాలు, పాలనా అంశాలపై మంత్రులతో సీఎం రేవంత్ సుదీర్ఘ భేటీ
- 9 గంటలకు పైగా కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో పలు కీలకాంశాలపై సమీక్ష
- స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల పెంపు, ఎస్సీల వర్గీకరణపై చర్చ
- ఎమ్మెల్సీ ఎన్నికలు, రాజకీయ పరిణామాలు, ఎమ్మెల్యేల భేటీపై కూడా..
- సోషల్‌మీడియాలో అనుసరించాల్సిన వైఖరి గురించి ప్రత్యేక చర్చ
- అధికారులు, సిబ్బందిని దూరంగా ఉంచి మనసు విప్పి చర్చించుకున్న మంత్రులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలు, పలు పాలనా అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి మంత్రులందరితో సమావేశమయ్యారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, సీతక్కలు శనివారం ఉదయం 10:30 గంటల నుంచి రాత్రి 7:45 నిమిషాల వరకు సుదీర్ఘంగా భేటీ అయ్యారు. దాదాపు 9గంటలకు పైగా జరిగిన ఈ సమావేశంలో అధికారులు, సిబ్బందిని దూరంగా ఉంచిన మంత్రులు అనేక అంశాలపై మనసు విప్పి మాట్లాడుకున్నట్టు సమాచారం.

ఈ నెల 5న అసెంబ్లీ భేటీ...?

బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల పెంపు, ఇటీవల రాష్ట్రంలో చేపట్టిన సామాజిక, ఆర్థిక, రాజకీయ, కులగణన గురించి సీఎం, మంత్రులు సుదీర్ఘంగా చర్చించారు.

➤ బీసీ రిజర్వేషన్ల విషయంలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన అన్యాయాన్ని సరిదిద్దేలా ముందుకెళ్లాలని, ఇటీవల చేపట్టిన కులగణన రిపోర్టును కోర్టు ముందుంచి బీసీ రిజర్వేషన్ల పెంపునకు ఎలాంటి అడ్డంకి లేకుండా చూడాలని నిర్ణయించినట్టు సమాచారం. ఈనెల 5వ తేదీన అసెంబ్లీని ప్రత్యేకంగా సమావేశపరచి స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతానికి తగ్గకుండా రిజర్వేషన్లు కల్పించేలా కేంద్రం చొరవ తీసుకోవాలని తీర్మానం చేయాలని నిర్ణయించినట్టు తెలిసింది.

➤ ఎస్సీల వర్గీకరణ అంశంపై కూడా మంత్రులతో సీఎం చర్చించారని, రాజకీయంగా విమర్శలు రాకుండా వీలున్నంత త్వరగా రాష్ట్రంలో ఎస్సీల వర్గీకరణను అమలు చేయాలని, ఎన్నికల కోడ్ ముగిశాక ఈ విషయంలో ప్రభుత్వ విధానాన్ని స్పష్టంగా మరోమారు ప్రకటించాలని నిర్ణయించినట్టు తెలిసింది.

➤ త్వరలో జరగబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు, ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ ఎన్నికలపై కూడా మంత్రులు చర్చించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి వి.నరేందర్‌రెడ్డి గెలుపొందే ప్రణాళికలు రూపొందించే బాధ్యతలు మంత్రులు దామోదర, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లకు అప్పగించారు.

➤ తాజాగా వివాదాస్పదమైన పార్టీ ఎమ్మెల్యే డిన్నర్ అంశం కూడా చర్చకు వచ్చిందని తెలుస్తోంది. ఈ వ్యవహారంలో ఎమ్మెల్యేలకు ఇబ్బంది కలగకుండా మంత్రులు వ్యవహరించాల్సిన తీరు గురించి సీఎం దిశానిర్దేశం చేశారని, మంత్రులంతా సమష్టిగా పనిచేయాలని, ఒక్కటే మాట.. ఒక్కటే పంథా రీతిలో ఇక ముందు పని చేయాలనే చర్చ కూడా వచ్చినట్టు సమాచారం.

నేడు ఢిల్లీకి సీఎం

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేయనున్న అభ్యర్థుల పక్షాన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రచారం చేయనున్నారు. ఇందుకోసం ఆదివారం ఆయన ఢిల్లీ వెళ్తారని, ఆది, సోమవా రాల్లో ఎన్నికల ప్రచారంలో సీఎం పాల్గొంటారని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి.

అధిష్టానం జోక్యం?

ఇటీవల సోషల్‌మీడియా వేదికగా జరిగిన ఓ వ్యవహారంపై సీఎం, మంత్రులు ప్రత్యేకంగా చర్చించినట్టు తెలిసింది. కాంగ్రెస్ పార్టీ అధికారిక హ్యాండిల్‌లో నిర్వహించిన ఓ పోల్‌లో బీఆర్ఎస్‌కు అనుకూలంగా ఫలితం రావడం, ఈ హ్యాండిల్ స్క్రీన్‌షాట్‌కు బీఆర్ఎస్ సోషల్‌మీడియా విస్తృతంగా ప్రచారం కల్పించిన నేపథ్యంలో సోషల్ మీడియా విషయంలో అటు పార్టీ, ఇటు ప్రభుత్వం అనుసరించాల్సిన వ్యవహారంపై మంత్రులు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. అయితే, ఈ అంశం పార్టీ అధిష్టానం దృష్టికి కూడా వెళ్లిందని, మరోమారు ఇలాంటివి జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఢిల్లీ పెద్దలు రాష్ట్ర పార్టీని ఆదేశించినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ సోషల్‌మీడియా, కాంగ్రెస్ వ్యతిరేక సోషల్‌మీడియాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని అడ్డుకునేలా కాంగ్రెస్ పార్టీ సోషల్‌మీడియాను తయారు చేయాలని, ప్రతి చిన్న అంశంపై చేస్తున్న రాద్ధాంతాన్ని సమర్థవంతంగా అడ్డుకోవాలని ఈ సమావేశంలో నిర్ణయించినట్టు తెలిసింది.

మీడియాతో మంత్రులు ఏం చెప్పారంటే..



సమావేశానంతరం, కమాండ్ కంట్రోల్ సెంటర్ వద్ద మీడియాతో మంత్రులు దామోదర రాజనర్సింహ, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావులు మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన రెండు గంటల్లోనే ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో ప్రకటన చేశామని, వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని దామోదర రాజనర్సింహ చెప్పారు. కేబినెట్ సబ్‌కమిటీ సూచన మేరకు వన్ మ్యాన్ కమిషన్‌ను నియమించామని, ఈ కమిషన్ త్వరలో రిపోర్ట్ ఇస్తుందని, ఆ రిపోర్ట్‌పై కేబినెట్‌లో చర్చించి, అసెంబ్లీలో ప్రవేశపెడుతామని వెల్లడించారు. పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కులగణన కార్యరూపం దాల్చడానికి సంబంధించి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, సహచర మంత్రులు చర్చించామన్నారు. ఈనెల 5వ తేదీన సబ్ కమిటీ ఇచ్చిన నివేదికను కేబినెట్ ముందు పెడతామని, తర్వాత సభలో చర్చకు పెట్టడం ద్వారా ప్రజాస్వామిక విధానాన్ని ముందుకు తీసుకుపోతామన్నారు.

కేసీఆర్ హిస్టరీ.. రేవంత్ లాటరీ

- అబద్ధాలు చెప్పడం, బూతులు మాట్లాడటం తప్ప సీఎంకు ఏమీ చేతకాదు
- అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



అంబేడ్కర్ విగ్రహావిష్కరణ అనంతరం అభివాదం చేస్తున్న కేటీఆర్

కుల్కచర్ల: 'కేసీఆర్ అంటే హిస్టరీ.. రేవంత్ లాటరీ'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలం దాస్యానాయక్‌తండాలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఒక కులానికి, మతానికి చెందిన వారు కాదని, అన్ని వర్గాల వారికి మార్గదర్శకంగా నిలిచే మహోన్నతమైన వ్యక్తి అని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి లాటరీలో సీఎం అయ్యాడని, ఆయనకు అబద్ధాలు చెప్పడం, బూతులు మాట్లాడటం తప్ప మరేమీ చేతకాదని విమర్శించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పట్నం నరేందర్‌రెడ్డి ఆయన్ను మరోసారి ఓడించి తీరుతారని ధీమా వ్యక్తం చేశారు. ఓట్లు వేసి గెలిపించిన అమాయక గిరిజన రైతులు భూములను లాక్కునే ప్రయత్నం చేయడమే కాకుండా వారిని జైలులో పెట్టించిన నీచమైన చరిత్ర కలిగిన వ్యక్తి రేవంత్ అని మండిపడ్డారు.

నిరూపిస్తే రాజకీయ సన్యాసం

ఎప్పుడూ అబద్ధాలు చెప్పే ముఖ్యమంత్రి తన స్వగ్రామంలోనైనా వందశాతం రుణమాఫీ చేశాడని నిరూపిస్తే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడంతో పాటు రాజకీయ సన్యాసం తీసుకుంటానని కేటీఆర్ అన్నారు. ఇందుకోసం ఎక్కడికి రమ్మన్నా వస్తామని సవాల్ విసిరారు. దమ్ముంటే కొడంగల్‌లోని లగచర్లకు రా నేను వస్తా అక్కడే తేల్చుకుందాం ఎంతమందికి రుణమాఫీ అయ్యిందో చర్చ పెడదాం అన్నారు. అంబేడ్కర్ కల్పించిన రాజ్యాంగబద్ధమైన హక్కులతో త్వరలోనే తామంతా లగచర్లలో పర్యటిస్తామని, ఎవరు అడ్డుకుంటారో చూస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎం మహమూద్‌అలీ, మాజీ మంత్రులు పి.సబితాఇంద్రారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, నవీన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మహేశ్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, ఆనంద్, రోహిత్‌రెడ్డి, బాల్క సుమన్, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.



మహిళా న్యాయవాదులతో కబడ్డీ ఆడుతున్న జస్టిస్ సూరేపల్లి నందా

క్రీడలతో శారీరక, మానసిక వికాసం

న్యాయవాదుల క్రీడాపోటీల్లో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందా

ఖమ్మం లీగల్: కేసుల ఒత్తిడితో సతమతమయ్యే మహిళా న్యాయవాదులు క్రీడల్లో పాల్గొనడం ద్వారా మానసిక ప్రశాంతతతో పాటు శారీరక దృఢత్వం లభిస్తుందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందా అభిప్రాయపడ్డారు. ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో రెండు రోజులపాటు జరగనున్న తాళ్లూరి సాహస్ చౌదరి మెమోరియల్ ట్రస్ట్ రాష్ట్రస్థాయి మహిళా న్యాయవాదుల క్రీడా పోటీలను శనివారం జస్టిస్ సూరేపల్లి నందా ప్రారంభించారు. అనంతరం ఆమె మహిళా న్యాయవాదులతో కలిసి కబడ్డీ ఆడారు. కార్యక్రమంలో ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్, హైకోర్టు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పొన్నం అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లకు 5న కేబినెట్, అసెంబ్లీ ఆమోదం!

- జనగణన నివేదికపై నేడు, రేపు మంత్రివర్గ ఉపసంఘం చర్చ
- మార్పులు, చేర్పులతో సీఎంకు నివేదిక

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు ఎంతశాతం రిజర్వేషన్లు కల్పించాలన్న అంశాన్ని ఈ నెల 5న జరగనున్న కేబినెట్ సమావేశంలో తేల్చనున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన 5న మంత్రివర్గం భేటీ అవుతోంది. ఆ సమావేశంలో కులగణన నివేదికపై చర్చించి, బీసీ రిజర్వేషన్లకు ఆమోదముద్ర వేస్తారని తెలిసింది. అదే రోజు మధ్యాహ్నం ప్రత్యేక అసెంబ్లీ సమావేశం నిర్వహించి ఆ నివేదికపై సభలో చర్చించను న్నారు. అదే రోజు నివేదికను సభ ఆమోదించనున్నట్లు అధికార వర్గాల సమాచారం. కాగా ఆదివారం ప్రణాళిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా కులగణన నివేదికను మంత్రివర్గ ఉపసంఘం చైర్మన్, మంత్రి ఉత్తమ్‌కు సచివాలయంలో అందించనున్నట్లు తెలిసింది. ఉత్తమ్ నేతృత్వంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, పొన్నం, సీతక్కలతో కులగణనపై గత ఏడాది అక్టోబర్ 19న మంత్రివర్గ ఉపసంఘం వేసిన విషయం తెలిసిందే. ఈ ఉపసంఘం ఆది, సోమవారాల్లో సమావేశమై నివేదికపై చర్చించి అవసరమైన మార్పులు చేర్పులు చేయనుంది. ఆ తర్వాత తుది నివేదికను సీఎం కు సమర్పించనుంది. ఉపసంఘం సూచనల మేరకు రాష్ట్రంలో ఇంటింటి సర్వే చేసి ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే నిర్వహించి ఈ నివేదికను రూపొందించిన విషయం తెలిసిందే.

స్థానికంలో ఇద్దరు పిల్లల నిబంధన తొలగించండి

మంత్రులకు నాయక్ ధరావత్ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరికి మించి పిల్లలున్నా పోటీకి అర్హత కల్పించాలని మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి అభిమాన్ గాంధీ నాయక్ ధరావత్ విజ్ఞప్తి చేశారు. త్వరలోనే జరగనున్న స్థానిక ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధన అడ్డంకిగా మారనున్నందున నూతన పీఆర్ చట్టంలోని ఈ అంశాన్ని ప్రభుత్వం తొలగించాలని కోరారు. గతంలో ఉమ్మడి ఏపీలో ఈ నిబంధనను తీసుకొచ్చిన చంద్రబాబు ఇప్పుడు ఏపీలో తొలగించారని తెలిపారు. దేశంలోని ఏ రాష్ట్రంలో లేని ఈ నిబంధనను తెలంగాణలోనూ తొలగించాలన్నారు. శనివారం ఈ మేరకు మంత్రులకు వినతిపత్రం ఇచ్చారు.

గచ్చిబౌలిలో కాల్పుల కలకలం



గచ్చిబౌలిలోని ప్రిజం పబ్‌లో కాల్పులు జరిగింది ఇక్కడే...



నిందితుడిని పట్టుకున్న పోలీసులు, బౌన్సర్లు



నిందితుడు బత్తుల ప్రభాకర్

- ప్రిజం పబ్‌లో పోలీసులపై పాత నేరస్తుడు బత్తుల ప్రభాకర్ కాల్పులు
- మాదాపూర్ సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ వెంకట్‌రెడ్డికి బుల్లెట్ గాయం
- ప్రభాకర్ పారిపోతుండగా చుట్టుముట్టి పట్టుకున్న పోలీసులు

గచ్చిబౌలి: కరడుగట్టిన నేరస్తుడు బత్తుల ప్రభాకర్ హైదరాబాద్ గచ్చిబౌలిలోని ప్రిజం పబ్ వద్ద పోలీసులపై కాల్పులకు తెగబడ్డాడు. ఈ కాల్పుల్లో మాదాపూర్ సీసీఎస్ హెడ్‌కానిస్టేబుల్ వెంకట్‌రెడ్డికి బుల్లెట్ గాయమైందని మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్ శనివారం తెలిపారు. ఏపీలోని చిత్తూరు జిల్లా సోముల గ్రామానికి చెందిన బత్తుల ప్రభాకర్.. ఏపీ, తెలంగాణలో అనేక దోపిడీలకు పాల్పడ్డాడు. అతడిపై రెండు రాష్ట్రాలలో 70కి పైగా కేసులు నమోదయ్యాయి. సైబరాబాద్, హైదరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలోనే 16 చోరీ కేసులున్నాయి. 2023 నుంచి పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. ప్రభాకర్ తరచు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని ప్రిజం పబ్‌కు వెళ్తున్నాడని గుర్తించిన పోలీసులు.. అతడిని పట్టుకునేందుకు స్కెచ్ వేశారు. మాదాపూర్ హెడ్ కానిస్టేబుళ్లు వెంకట్‌రెడ్డి, వీరస్వామి, ప్రదీప్‌రెడ్డి ప్రిజం పబ్ వద్ద కాపు కాశారు. ప్రభాకర్ పబ్ వద్దకు రాగానే నిర్బంధించేందుకు ప్రయత్నించారు. దీంతో అతడు తన వద్ద ఉన్న దేశీయ తుపాకీతో రెండు రౌండ్లు కాల్పులు జరిపాడు. ఒక బుల్లెట్ వెంకట్‌రెడ్డి ఎడమ పాదంలోంచి దూసుకెళ్లింది. అయినా వెనుకడుగు వేయకుండా పబ్‌లోని బౌన్సర్ల సాయంతో మిగిలిన ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లు ప్రభాకర్‌ను పట్టుకున్నారు. అతని వద్ద నుంచి రెండు తుపాకులు, 23 బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ వినీత్ తెలిపారు. గాయపడిన కానిస్టేబుల్ వెంకట్‌రెడ్డిని చికిత్స కోసం కాంటినెంటల్ ఆసుపత్రికి తరలించారు. అతడిని శనివారం రాత్రి సైబరాబాద్ కమిషనర్ అవినాశ్ మహంతి పరామర్శించారు.

డిన్నర్ పే 'చర్చ'

- హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో ఇటీవల కలిసిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు
- డిన్నర్ చేద్దామంటూ సన్నిహిత ఎమ్మెల్యేలకు ఉమ్మడి పాలమూరు జిల్లా ఎమ్మెల్యే ఆహ్వానం
- డిన్నర్‌లో భాగంగా పిచ్చాపాటి కబుర్లు..మంత్రులకు నిధులెక్కువ ఎలా వెళతాయంటూ చర్చ
- ఓ మంత్రి తన వ్యవహార శైలితో పార్టీకి చెడ్డపేరు తెస్తున్నారన్న పాలమూరు ఎమ్మెల్యే
- ఎమ్మెల్యేల డిన్నర్‌పై రాష్ట్ర ప్రభుత్వానికి ఇంటెలిజెన్స్ నివేదిక

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కాంగ్రెస్‌లో ఇప్పుడు 'డిన్నర్ పే చర్చ'హాట్‌టాపిక్‌గా మారింది. ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన ఓ యువ ఎమ్మెల్యే తన సన్నిహిత ఎమ్మెల్యేలకు డిన్నర్ ఇవ్వడం, ఆ డిన్నర్‌కు వెళ్లిన ఎమ్మెల్యేలు పలు వివాదాస్పద అంశాలపై చర్చించడంతో కాంగ్రెస్ పార్టీలో ఏదో జరిగిపోతుందనే చర్చ రాజకీయవర్గాల్లో జరుగుతోంది. ఈ ఎమ్మెల్యేల డిన్నర్‌పై ఇంటెలిజెన్స్ నివేదిక ఇవ్వడంతో రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు కూడా అప్రమత్తమయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నిర్వహించిన సుదీర్ఘ భేటీలో ఈ అంశం కూడా చర్చకు వచ్చిందని సమాచారం.

మనం లేకపోతే.. వాళ్లున్నారా ?

ఆ ఎమ్మెల్యే ఆహ్వానం మేరకు హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఐదారుగురు ఎమ్మెల్యేలు ఇటీవల డిన్నర్‌కు వెళ్లారు. ఈ డిన్నర్‌కు వెళ్లిన ఓ ఎమ్మెల్యే కథనం ప్రకారం.. డిన్నర్‌లో భాగంగా ఎమ్మెల్యేలు, మంత్రుల గురించి చర్చించుకున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పరిపాలన, మంత్రుల పనితీరు, ఎమ్మెల్యేలకు ఇస్తున్న నిధులు, మంత్రులతో సఖ్యత, ఓ కీలకశాఖకు చెందిన మంత్రి వ్యవహారశైలి తదితర అంశాలపై వారు మాట్లాడుకున్నారు. మంత్రులు తమ నియోజకవర్గాలకు వేల కోట్ల రూపాయల నిధులు తీసుకెళుతున్నారని, ఎమ్మెల్యేలకు మాత్రం నిధుల కేటాయింపులో ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఓ ఎమ్మెల్యే ఈ సందర్భంగా ప్రస్తావించారు. అసలు ఎమ్మెల్యేలు లేనిదే మంత్రులు ఎక్కడి నుంచి వస్తారని, ఎమ్మెల్యేలను పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని ఆ ఎమ్మెల్యే వ్యాఖ్యానించినట్టు తెలిసింది. పాలమూరు జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే ప్రభుత్వంలోని కీలకశాఖకు చెందిన మంత్రి గురించిన అంశాన్ని లేవనెత్తారు. విచ్చలవిడిగా ఆయన తన వ్యవహార శైలితో పార్టీకి చెడ్డపేరు తెస్తున్నారని, ఆయనపై తన పోరాటాన్ని ఆపేది లేదని, ఈ విషయంలో ఎంత వరకైనా వెళతానని ఆ ఎమ్మెల్యే వ్యాఖ్యానించినట్టు తెలిసింది. కాంగ్రెస్ ప్రజాపాలనలో అన్ని వర్గాలకు న్యాయం చేసేందుకు ప్రయత్నం జరుగుతోందని, ఈ తరుణంలో పార్టీని, ప్రభుత్వాన్ని క్రమశిక్షణగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరముందని వారు మాట్లాడుకున్నారు.

విభేదాలు రానివ్వొద్దన్న సీఎం !

కాగా, ఎమ్మెల్యేల డిన్నర్ వ్యవహారం నిఘా వర్గాల ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి వెళ్లినట్టు తెలిసింది. శనివారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో జరిగిన మంత్రులతో భేటీలో ఈ అంశాన్ని ప్రస్తావించినట్టు సమాచారం. ఎమ్మెల్యేలతో విభేదాలు రానివ్వొద్దని, వారితో గ్యాప్ రావడం ద్వారా పార్టీకి, ప్రభుత్వానికి నష్టం జరుగుతుందని, ఇన్‌చార్జ్ మంత్రులు ఆయా జిల్లాల ఎమ్మెల్యేలను సమన్వయం చేసుకుంటే బాగుంటుందని సూచించినట్టు సమాచారం. ప్రభుత్వానికి, పార్టీకి మధ్య కూడా సమన్వయం అవసరమని సీఎం రేవంత్ మంత్రులకు దిశానిర్దేశం చేసినట్టు తెలిసింది.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

ఆగ్రహం.. ఆరోగ్యానికి అనర్థం



అంతర్గతంగా ఆరోగ్యంపై ప్రభావం.. అధ్యయనాల వెల్లడి

- 17 శాతం గుండె జబ్బులు, స్లీప్ సైకిల్‌కు అంతరాయం,
- 30 శాతం వ్యాధినిరోధక వ్యవస్థ తగ్గుదల
- సరైన పంథా, వ్యూహాలతో కోపాన్ని నియంత్రించ వచ్చంటున్న నిపుణులు

సాక్షి, హైదరాబాద్: భావోద్వేగాల పరంగా చూస్తే.. ఆయా సందర్భాలు, సంఘటనలను బట్టి కోపం రావడాన్ని సహజ లక్షణంగానే పరిగణిస్తుంటారు. కానీ కోపాన్ని నియంత్రించుకోవడంలో విఫలమైతే మాత్రం.. దాని పర్యవసనాలు తీవ్రంగా ఉంటున్నాయనేది అనేక ఘటనలు రుజువు చేస్తున్నాయి. ఎవరైనా తమ కోపాన్ని ఆపుకోవడంలో ఇబ్బందులను ఎదుర్కొంటే.. దాని ప్రతికూల ప్రభావం వారి ఆరోగ్యంపై పడుతోందని స్పష్టమౌతోంది. ఆగ్రహాన్ని ఆపుకోలేకపోతే వివిధ రూపాల్లో ఆరోగ్యంపై ప్రభావంపడడంతో పాటు, ఏదైనా ధ్వంసం చేయాలనే ఆలోచన లేదా ఎవరిపై దాడికి పాల్పడటం, స్వీయ నియంత్రణ కోల్పోవడం, తదితర రుగ్మతలకు దారితీయడం, వ్యక్తుల మధ్య సంబంధాలు దెబ్బ తినడానికి కారణమౌతున్నట్టు నిపుణులు అంచనా వేస్తున్నారు. చిన్న చిన్న విషయాలకే కోపం రావడం వంటివి దీర్ఘకాలం కొనసాగితే.. వ్యక్తిగతంగా ఆరోగ్యంపై, మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపి.. అనేక రకాల ఆరోగ్య సమస్యలు ఎదుర్కోనాల్సి వస్తుందని స్పష్టం చేస్తున్నారు. ట్రాఫిక్‌లో ఇరుక్కుని వెళ్లాల్సిన ముఖ్యమైన సమావేశానికి లేదా ఫంక్షన్‌కు ఆలస్యం కావడం, చిన్న విషయానికే చిరాకు పడటం, అపరాధ భావం, కొందరిపై లేదా పరిస్థితులపై వ్యతిరేక భావం, ఏదైనా విషయమై తోటివారు, స్నేహితులు, బంధువులు, సహచరులతో భిన్నాభిప్రాయాలు ఎదురుకావడం, మానసికంగా కుంగుబాటు, కూడా కోపం రావడానికి కారణాలుగా విశ్లేషిస్తున్నారు.

పలు ప్రతిష్టాత్మక సంస్థలు నిర్వహించిన అధ్యయనాల్లోనూ కోపం వల్ల ఆరోగ్యంపై పడే ప్రభావం, ఇతర అంశాలను పరిశీలించారు. కోపోద్రిక్తులు కావడం వల్ల వెంటనే గుండె కొట్టుకునే వేగం పెరుగుతుంది. రక్తపోటు పెరగడం వల్ల గుండెపై (కార్డియోవాస్క్యులర్ స్ట్రెయిన్) ఎక్కువ ఒత్తిడి పెరుగుతుంది. గుండెజబ్బుల ముప్పు కూడా 19 శాతం పెరుగుతుందని హార్వర్డ్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ తన పరిశీలనలో పేర్కొంది. ఏదైనా సంఘటన లేదా కారణంతో అధికంగా ఉద్రేక పడితే.. ఆ తర్వాత రెండుగంటల వ్యవధిలోనే గుండెపోటు వచ్చే అవకాశం ఎనిమిదన్నర రెట్లు పెరుగుతుందని యూరోపియన్ హార్ట్ జనరల్ వెల్లడించింది. రక్తపోటు పెరిగిపోయి 'క్రానిక్ హైపర్‌టెన్షన్'గా మారితే హార్ట్‌స్ట్రోక్‌తో పాటు మూత్రపిండాల వ్యాధులకు దారితీయొచ్చని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు.

కోపంపై నియంత్రణ కోల్పోతే రోగనిరోధక సామర్థ్యం 30 శాతం తగ్గిపోతుందని పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. కోపానికి గురైనపుడు కొన్ని గంటల పాటు రోగనిరోధక వ్యవస్థ బలహీనమౌతుందని వెల్లడిస్తున్నాయి. 24 గంటల పాటు 'స్లీప్ సైకిల్స్'లో ఇబ్బందులు, కేవలం రెండు నిమిషాల కోపం అనేది 7 గంటల పాటు 'కోర్టిసోల్'స్థాయిల్లో పెరుగుదలకు కారణమౌతుందని హెచ్చరిస్తున్నాయి.

ఆగ్రహం నియంత్రణకు ఏం చేయాలంటే..

- కోపం వచ్చే సూచనలను ముందుగానే గమనించి.. దాని నియంత్రణకు అవసరమైన విధంగా స్పందించాలి
- వెంటనే ప్రతిస్పందించకుండా.. ఏం చేయాలనే దానిపై కొంత సమయమిచ్చి ఆలోచించాలి. ఒకటి నుంచి పది దాకా లెక్క పెట్టడంతో పాటు కామింగ్ బ్రీథింగ్ ఎక్సర్‌సైజులు చేయాలి
- కోపానికి కారణం ఏమిటో తెలియజేయాలి. అందుకు కారణమైన వ్యక్తితో కాకుండా మిత్రుడు లేదా ఆప్తులతో మాట్లాడాలి
- పరుగు, నడక, ఈత, యోగ వంటి ఒత్తిళ్లను తగ్గించే కార్యకలాపాలు చేయాలి
- ఏదైనా సంఘటనకు వెంటనే ప్రభావితమై స్పందించకుండా.. ఏం చేయాలన్న దానిపై దృష్టి పెట్టాలి.

యాంగర్ మేనేజ్‌మెంట్ కేసులే ఎక్కువ

మా దగ్గరకు 'యాంగర్ మేనేజ్‌మెంట్'కు సంబంధించిన కేసులు ఎక్కువగానే వస్తున్నాయి. వైవాహిక బంధంలో తలెత్తే సమస్యలతో దంపతులిద్దరిలో ఎవరో ఒకరు కోపోద్రిక్తులు కావడం, రోడ్డుపై వెళ్లినపుడు ఎదురయ్యే ఘటనలతో, వ్యక్తిత్వాల్లో వచ్చిన మార్పులతో ఆవేశాలు, ఇలా వివిధ కారణాలు, సంఘటనలతో ప్రభావితమై తమ ఆగ్రహాన్ని నియంత్రించుకోలేని వారు వస్తున్నారు. వారికి ఆయా సమస్యలకు అనుగుణంగా మందులు ఇవ్వడం, కౌన్సెలింగ్, యాంగర్ మేనేజ్‌మెంట్ క్లాసెస్ తీసుకుంటున్నాం. అప్పుడప్పుడు ఏదైనా సందర్భంలో లేదా ఏదైనా అనుకోని ఘటన జరిగినప్పుడు ఆగ్రహానికి గురైతే మంచిదే. కానీ ఏ చిన్న సంఘటనకైనా, చిన్నపాటి వాగ్వాదానికి ఇతరులపై కోపగించుకోవడం, రుస రుసలాడటం వంటివి చేస్తే మాత్రం ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. కోపం అనేది 'నెగిటివ్ ఎమోషన్'అయినప్పటికీ.. ఆగ్రహం రావడానికి భావోద్వేగపరమైన అంశాలు మెదడుపై ప్రభావం చూపి (నెర్వస్ సిస్టమ్‌పై) శరీరంలోని అన్ని భాగాలను ప్రభావితం చేసి ఒక్కసారిగా రక్తప్రసారం పెరిగిపోతుంది. వెంటనే ఏదో రూపంలో శరీరం స్పందించేలా చేస్తుంది. మామూలుగా చూస్తే ఇదొక రక్షణ వ్యవస్థ (డిఫెన్స్ మెకానిజం)గా ఉన్నా.. ఒకస్థాయి దాటాక కోపాన్ని నియంత్రించుకోలేకపోతే దాని ప్రభావం తీవ్రంగానే ఉంటుంది. అందువల్ల కోపంపై నియంత్రణ ఎంతైన అవసరం.

– డాక్టర్ ఎమ్మెస్ రెడ్డి,
సీనియర్ సైక్రియాట్రిస్ట్–డైరెక్టర్,
ఆశా హాస్పటల్స్

చేయకూడనివి..

- అన్నింటినీ ఒకేసారి చేయా లని ప్రయత్నించొద్దు. అందుకోగలిగే చిన్న లక్ష్యాలను ముందు నిర్దేశించుకోవాలి
- మనం మార్చలేని వాటిపై దృష్టి కేంద్రీకరించొద్దు. సమయాన్ని, శక్తియుక్తులను నిర్దేశిత లక్ష్యంపై పెట్టాలి. ఎవరికి వారు స్వాంతన చేకూర్చుకుంటే మంచిది
- ఏకాకిగా ఉన్నాననే భావన రానివ్వొద్దు. మిత్రులు, సహచరుల సహకారం, మద్దతు తీసుకోవాలి
- కోపాన్ని తగ్గించుకునేందుకు మద్యం, సిగరెట్, గ్యాంబ్లింగ్, డ్రగ్స్ వంటి వాటిని ఎప్పటికీ ఆశ్రయించవద్దు. ఇవన్నీ కూడా మానసికంగా మరింతగా క్షీణించేలా చేస్తాయి.



బడ్జెట్‌పై ఎవరేమన్నారంటే..

తెలంగాణకు ఒరిగింది సున్నా

సాక్షి, హైదరాబాద్: కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు ఒరిగింది శూన్యం. నిధుల కేటాయింపులో తీరని అన్యాయం జరిగింది. వ్యవసాయ రంగాన్నీ కుదేలు చేసింది. రాష్ట్రాభివృద్ధిని అడ్డుకునేందుకే ఐటీఐఆర్ రద్దు, సంక్షేమ రంగానికి నిధుల కోతలు, ఆహార భద్రతకు తూట్లు పొడిచారు. రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ 2014 చట్టం హామీలు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయి. పాలమూరు–రంగారెడ్డి జాతీయ హోదా ఊసే లేదు. ఇది ముమ్మాటికీ బిహార్, ఢిల్లీ ఎన్నికల బడ్జెట్. తెలంగాణ ప్రజలు బీజేపీని ఎప్పటికీ క్షమించరు.

– మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

తెలంగాణకు తీరని అన్యాయం

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీరని అన్యాయం జరిగింది. నిధులన్నీ ఎన్నికలు జరగబోయే, ఎన్డీయే పాలిత రాష్ట్రాలకు మాత్రమే దక్కాయి. కేంద్ర జీడీపీలో తెలంగాణ వాటా 5 శాతమున్నా ఆ మేరకు నిధులివ్వలేదు. రాష్ట్రం నుంచి పన్నుల రూపంలో వెళ్లే నిధులు గతం కంటే 12 శాతం పెరిగినా రాష్ట్రంపై చిన్నచూపు చూడడానికి రాజకీయ కారణాలే కనిపిస్తున్నాయి. తెలంగాణ నుంచి 8 మంది బీజేపీ ఎంపీలను ప్రజలు గెలిపించినా మోదీ ప్రభుత్వం రాష్ట్రానికి తీరని ద్రోహం చేసింది. ప్రతి బడ్జెట్‌లోనూ తెలంగాణ పట్ల ఇదే ధోరణి అవలంబిస్తోంది.

– ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు

ఇద్దరు కేంద్ర మంత్రులున్నా అన్యాయం

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు ఏ ఒక్క ప్రాజెక్టును, ప్రత్యేక ప్రయోజనాలను మంజూరు చేయకుండా కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేసింది. తెలంగాణపై కేంద్రం పక్షపాత వైఖరితో కక్షపూరితంగా వ్యవహరిస్తోంది. బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని ఊరూరా ఎండగడతాం. రాష్ట్రం నుంచి 8 మంది బీజేపీ ఎంపీలను ప్రజలు గెలిపించారు. తెలంగాణ నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులున్నా కేంద్రం గుండు సున్నా ఇచ్చింది. రాష్ట్ర పునర్విభజన చట్టాన్ని గౌరవిస్తూ.. ఏపీకి బడ్జెట్‌లో నిధులు కేటాయించిన కేంద్రం.. తెలంగాణను మరిచిపోయింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగ పాఠంలో.. తెలంగాణ పదం లేకపోవడం రాష్ట్రంపై బీజేపీ సర్కార్ వివక్షకు అద్దం పడుతోంది.

– సీతక్క, పంచాయతీ, మహిళా సంక్షేమశాఖ మంత్రి

మాటలు రావడం లేదు

తెలంగాణకు తగినన్ని నిధులు కేటాయించలేని ఈ బడ్జెట్ గురించిన ఆవేదనను వ్యక్తపరిచేందుకు నాకు మాటలు రావడం లేదు. ఈ బడ్జెట్‌లో దక్షిణాది రాష్ట్రాలను చిన్నచూపు చూశారు. తెలంగాణకు ఇచ్చిన హామీలను విస్మరించారు.

– మంత్రి కొండా సురేఖ

కిషన్‌రెడ్డి, సంజయ్‌లు ఏం చెప్తారు?

పెద్ద పెద్ద మాటలు చెప్పే కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు.. కేంద్ర బడ్జెట్‌పై తెలంగాణ ప్రజలకు ఏం సమాధానం చెబుతారు? రూ.50 లక్షల కోట్లతో సమర్పించిన కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు ఎలాంటి కేటాయింపులు లేవు. తెలంగాణ నుంచి గెలిచిన 8 మంది బీజేపీ ఎంపీలు ఏం చేస్తున్నారు?. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేరుకే తెలుగు ఆడపడుచు.. రాజకీయంగా మాత్రం బలహీనురాలు. కేంద్ర మంత్రులవి కోతలే తప్ప కేంద్రం నుంచి డబ్బులు రాలేదు.

– జగ్గారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్, టీపీసీసీ

బడ్జెట్‌లో రాజకీయ కోణమే ఎక్కువ

ఉపాధి హామీ పథకం లక్ష్యాన్ని కేంద్ర బడ్జెట్ దెబ్బ తీసింది. ఈ బడ్జెట్‌లో రాజకీయ కోణమే ఎక్కువ కనిపించింది. కొద్దిమందికి లాభదాయకంగా, రాజకీయపరంగా ఉపయోగపడేందుకు ఈ బడ్జెట్‌ను రూపొందించారు. సంపన్న వర్గాల బ్యాంకు రుణాలను మాఫీ చేసిన మోదీ ప్రభుత్వం.. నిరుపేదలకు ఈ బడ్జెట్లో ఏమిచ్చింది?. మాటలు ఎక్కువ.. చేతలు తక్కువని బడ్జెట్ మరోసారి రుజువు చేసింది. బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై బీఆర్ఎస్ పక్షాన ప్రజలకు వివరిస్తాం.

– పొన్నాల లక్ష్మయ్య, మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత

ఉపాధి హామీకి మొండి చెయ్యి

కేంద్ర బడ్జెట్‌లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి మళ్లీ మొండి చెయ్యి చూపారు. ఇది కూలీలను దగా చేయడమే. ఈ పథకాన్ని ఎత్తివేసే కుట్రలో భాగంగానే బడ్జెట్ పెంచలేదు. ఉపాధి హామీకి గత బడ్జెట్‌లో కేటాయించిన రూ. 86 వేల కోట్లే మళ్లీ కేటాయించారు. ఫలితంగా దేశవ్యాప్తంగా 14.55 కోట్ల ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగిన కుటుంబాలు అర్ధాకలికి గురికాక తప్పదు. ప్రతి కుటుంబానికి ఏడాదిలో 100 రోజుల పనిదినాలకుగాను కేవలం 41 రోజులు మాత్రమే పని కల్పించి ఈ చట్టాన్ని కేంద్రం ఉల్లంఘిస్తోంది. బడ్జెట్‌ను సవరించి రూ.3 లక్షల కోట్లు పెంచాలని డిమాండ్ చేస్తున్నాం.

– పి.శంకర్, దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) జాతీయ కార్యదర్శి

బడ్జెట్‌పై ఎవరేమన్నారంటే..

సీనియర్ ఉద్యోగులకు ఊరట దక్కలేదు

రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపు ఊరట కలిగించే అంశమే. కానీ ఈ విధానంతో పదేళ్ల సర్వీసు పైబడిన సీనియర్ ఉద్యోగులకు పెద్దగా ఉపయోగమేమీ లేదు. పాత పన్ను విధానంలో ఎలాంటి మార్పులు చేయలేదు. పాత పన్ను విధానంలో పొదుపులను రూ.5 లక్షలకు పెంచితే బాగుండేది. ఉద్యోగ, ఉపాధ్యాయుల వార్షిక ఆదాయం రూ.16 లక్షలు దాటితే.. 20 శాతం పన్ను పరిధిలోకి రావడం ఎంతో ప్రయోజనకరం. వచ్చే ఐదేళ్లలో దేశవ్యాప్తంగా డిజిటల్ లెర్నింగ్ వనరుల యాక్సెస్ కోసం 50 వేల పాఠశాలల్లో 'అటల్ టింకరింగ్ ల్యాబ్స్' నెలకొల్పాలన్న నిర్ణయం ప్రభుత్వ పాఠశాలలకు ప్రయోజనకరం. అటల్ టింకరింగ్ ల్యాబ్స్‌తో విద్యార్థుల్లో ఆసక్తి, సృజనాత్మకత, శాస్త్రీయ దృక్పథం పెంచుతాయి. అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు బ్రాడ్ బ్యాండ్ సేవలు, పాఠశాల విద్యతో పాటు నైపుణ్య శిక్షణ సౌకర్యం కల్పిస్తామని ప్రకటించడం హర్షణీయం.

– ఏవీ సుధాకర్,
స్కూల్ అసిస్టెంట్, రంగారెడ్డి జిల్లా

ఇంకెంతకాలం పింఛన్లపైనే ఆధారపడాలి

దివ్యాంగులకు ఉపాధి అవకాశాల కొరత కారణంగా.. కేవలం ప్రభుత్వం ఇస్తున్న సామాజిక పింఛన్లపైనే ఆధారపడుతున్నారు. వీరికి కేంద్ర ప్రభుత్వం నుంచి కేవలం రూ.300 అందుతోంది. ఆ మొత్తాన్ని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. జనాభాలో 4శాతం ఉన్న దివ్యాంగులకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచే దిశగా ఎలాంటి చర్యలు లేవు. ఇక బడ్జెట్ కేటాయింపుల్లో కాస్త ఊరట కలిగించినా.. వికలాంగుల సంఘాలు, సంక్షేమ సంస్థలు, మేధావులు అడుగుతున్న డిమాండ్లతో పోలిస్తే ఈ పెంపు ఏమాత్రం సరిపోదు. మానసిక ఆరోగ్య సమస్యల గురించి వరుసగా రెండో సంవత్సరం ఆర్థిక సర్వే చేసి.. హెచ్చరించినా.. ఈ బడ్జెట్‌లో వాటిని పూర్తిగా విస్మరించడం బాధాకరం.

– ముత్తనేని వీరయ్య, చైర్మన్,
తెలంగాణ వికలాంగుల కో–ఆపరేటివ్ కార్పొరేషన్

కొనుగోలు శక్తిని పెంచే బడ్జెట్

ఆదాయపు పన్ను పరిమితి పెంచడం వల్ల.. పన్ను చెల్లించే ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, చిన్నతరహా వ్యాపారులకు ఊరట లభించింది. ఇప్పటివరకు పన్ను మినహాయింపును కార్పొరేట్లకు ఇస్తుండడం.. వారి అప్పులను మాఫీ చేయడం లాంటి నిర్ణయాలతో సామాన్య ప్రజలలో ఒక అసంతృప్తి ఉండేది. ప్రస్తుత బడ్జెట్‌తో కాస్త ఉపశమనం కలిగింది. ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రసంగంలో పన్ను శ్లాబ్‌ల సవరణకు సంబంధించి త్వరలో మరో బిల్లును ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించడం వల్ల మధ్యతరగతి వారికి మరింత ప్రయోజనం కలుగుతుందని ఆశిస్తున్నాం. ప్రస్తుతం ఆదాయపు పన్ను పరిమితి పెంచడం వల్ల కలిగే మిగులుతో కొనుగోలు శక్తి పెరుగుతుంది. వస్తు వినియోగ వ్యయం వల్ల పారిశ్రామిక ఉత్పత్తి మరింత ముందుకు సాగుతుంది. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు ఎలాంటి కేటాయింపులు చేయకపోవడం నిరాశ కలిగించింది.

– ఎ.జగన్మోహన్‌రావు, అసిస్టెంట్ రిజిస్ట్రార్, సహకార శాఖ

సామాన్యులకు కల్పతరువు

ఇది సామాన్యుల కలలను సాకారం చేసే అద్భుత బడ్జెట్. పేదలు, యువత, రైతులు, మహిళలకు ప్రాధాన్యం ఇచ్చింది. ఇది విజనరీ బడ్జెట్. దేశాన్ని ప్రగతి పథంలో పరుగులు పెట్టిస్తుంది. ప్రపంచ దేశాల్లో భారత్‌ను అగ్రగామిగా నిలబెడుతుంది. గ్రామీణ భారతాన్ని.. ప్రత్యేకించి వ్యవసాయ రంగాన్ని ఆర్థికంగా మరింత పరిపుష్టం చేస్తుంది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుతో నిరుద్యోగ సమస్యను తగ్గించడం, మహిళా సాధికారతను సాధించడం లక్ష్యాలుగా రూపొందించారు. ఈ బడ్జెట్ బాగులేదనే వారు, ఇందులో లోపాలను వెతికే వారంతా దేశాభివృద్ధికి వ్యతిరేకులే.

– ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, శాసనసభాపక్ష నేత, బీజేపీ

ఆరోగ్యానికి హనుమాన్ గద

- భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యంలో రూపకల్పన
- వెదురు, కుండ, కాంక్రీట్‌తో తయారీ
- తాను ఉపయోగిస్తున్నట్టు చెప్పిన భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఈసారి హనుమాన్ గదను పరిచయం చేశారు. గతంలో మునగ సాగు, ఆధునిక సమ్మిళిత వ్యవసాయం వంటి అంశాలను యూట్యూబ్‌లో వివరించిన విషయం తెలిసిందే.

స్థానికంగా దొరికే వస్తువులతో..

భద్రాచలం ఐటీడీఏ పరిధిలో కొయ్యబొమ్మల తయారీ కేంద్రం ఉంది. ఇక్కడ కొయ్య బొమ్మలతో పాటు వెదురుతో అలంకరణ వస్తువులు తయారు చేస్తున్నారు. ఆదివాసీ సంప్రదాయం ఉట్టిపడేలా కళాకారులు ఆ వస్తువులకు అందమైన రంగులు అద్దుతున్నారు. ఈ క్రమంలో తక్కువ ఖర్చుతో ఇంట్లోనే కసరత్తు చేసేలా సరికొత్త హనుమాన్ గద తయారు చేయిస్తున్నారు. ఒక వెదురు కర్ర, రెండు మేకులు, ఒక చిన్న కుండ, కొద్ది మొత్తంలో కాంక్రీట్ మిశ్రమాన్ని ఉపయోగించి గదను తయారు చేశారు. దీనికి అందమైన రంగులు అద్ది భద్రాచలం హనుమాన్ గద అని పేరు పెట్టారు.

గదతో వ్యాయామం..

హనుమంతుడు తన గదతో యుద్ధాల్లో పాల్గొంటే.. భద్రాచలం హనుమాన్ గదతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చు. ఈ గదను ఉపయోగిస్తూ షోల్డర్, బైసెప్స్, ఫోర్ ఆర్మ్స్, రిస్ట్‌కు సంబంధించిన వ్యాయామాలు చేయొచ్చు. రెండు చేతులతోనూ గదను పట్టుకొని ఫుల్ సిటప్స్, ఆఫ్ సిటప్స్ వంటి ఎక్సర్‌సైజ్‌లు చేయొచ్చని స్వయంగా కలెక్టర్ యూట్యూబ్ వీడియోలో వివరించారు. ఈ గదను ఇప్పటికే తన ఇంట్లో ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే ఈ గదలను భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ట్రైబల్ విలేజ్‌లో ప్రదర్శన, అమ్మకానికి పెట్టనున్నారు.



గిరిజన కళాకారులు తయారు చేసిన గదలు

హనుమంతుడి కౌమోదికం

పురాణాల ప్రకారం హనుమంతుడు ఉపయోగించే గద పేరు కౌమోదికం. కుబేరుడు ఈ గదను హనుమంతుడికి బహుమతిగా అందజేశాడు. విష్ణుమూర్తి ఉపయోగించే గదను కూడా కౌమోదికమనే అంటారు.



గదతో కలెక్టర్ జితేష్ వి పాటిల్



హైదరాబాద్ జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి శ్రీ జోగులాంబ అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తున్న ఆలయ అర్చకులు. చిత్రంలో ఏఐసీసీ సెక్రటరీ సంపత్ కుమార్ తదితరులు

మట్టిగాజుల మన ఊరి బండి



వారానికోసారి ఇంటికి కావాల్సిన నిత్యావసరాలు, వస్తువులు, మట్టిగాజులు, కంగన్‌హాల్ సామగ్రి, పిల్లల ఆటవస్తువులతో ఉదయాన్నే మన ఊరికొచ్చింది 'మనూరి తోపుడుబండి'. ఇంకేం.. పని ముగించుకొని మహిళలంతా కలిసి బండిచుట్టూ చేరారు. ముచ్చట్లు పెడుతూ తమకు అవసరం ఉన్న సామగ్రి కొనుగోలుకు బేరాలు చేయసాగారు. పూర్తిగా పల్లెటూరి వాతావరణం కళ్లకు కట్టినట్లు తోపుడు బండిపై మట్టిగాజులు కొనుగోలు చేస్తున్న గ్రామ మహిళలు 'సాక్షి'కెమెరాకు ఇలా అందంగా కనిపించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



పుడమి తల్లికి సింగారం.. పచ్చదనమే బంగారం...

కనుచూపు మేరలో పచ్చటి పొలాలు.. అక్కడక్కడ చెట్లు, విద్యుత్ స్తంభాలతో భూమికి పచ్చని రంగేసినట్లు.. ఎటు చూసినా పచ్చదనంతో సింగారించుకున్న కోహెడ మండలపరిధిలోని తంగళ్లపల్లి గోదావరి జిల్లాలను తలపిస్తోంది.

-సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట

కేంద్ర బడ్జెట్‌పై ఎవరేమన్నారంటే..

పన్ను రాయితీతో లబ్ధి పొందే ఉద్యోగుల శాతం స్వల్పం

వార్షికాదాయం రూ.8లక్షల వరకు ఉన్న వారిని పేదవారిగా పరిగణించి విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పిస్తూ మరోపక్క రూ.4 లక్షల వార్షిక ఆదాయం దాటితే పన్ను విధించడం అర్థరహితం. కనీసం రూ.8 లక్షల వరకు ఎలాంటి పన్నులు లేకుండా.. తదుపరి రూ.4 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు వ్యక్తిగత సేవింగ్స్, హెల్త్ ఇన్సూరెన్స్, ఇతర సేవింగ్స్ ద్వారా పన్ను మినహాయింపు ఇచ్చి రూ.12 లక్షల నుంచి రూ.16 లక్షలు వరకు 5 శాతం పన్ను విధానం ఉంటే మధ్యతరగతి ఉద్యోగులకు కొంత వెసులుబాటు కలిగేది.

– కరణం హరికృష్ణ, మాగంటి శ్రీనివాసరావు, నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్

బిహార్‌కి వరాలు.. ఆంధ్రాకు మొండిచేయి

ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బిహార్‌కు కేంద్ర బడ్జెట్‌లో వరాలు కురిపించారు. 21 మంది కూటమి ఎంపీలున్న ఏపీకి మాత్రం మొండిచేయి చూపించారు. ఎన్డీయే భాగస్వామ్య పక్షాల్లో జేడీయూ, టీడీపీ ప్రధానంగా ఉన్నప్పటికీ బిహార్‌కు ప్రాధాన్యత ఇచ్చి ఏపీలోని అమరావతి నిర్మాణం, విశాఖ మెట్రో, స్టీల్‌ప్లాంట్, పోలవరం వంటి ఏ ఒక్క అంశాన్ని ప్రస్తావించలేదు. కేంద్ర ప్రభుత్వాన్ని తామే నిలబెట్టినట్టు చంద్రబాబు, పవన్ గొప్పలు చెబుతారు. ఇది ముమ్మాటికి చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ చేతకానితనమే.

– గుండా సురేంద్ర, మాజీ చైర్మన్, ఏపీ ట్రైకార్

కౌలు రైతులకూ కిసాన్ కార్డులివ్వాలి

కిసాన్ క్రెడిట్ కార్డులు పొందిన రైతులకు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు రుణ పరిమితి పెంచుతున్నామని, దీనివల్ల 7.73 కోట్ల మంది రైతులకు ప్రయోజనం కలుగుతుందని చెప్పటం హాస్యాస్పదం. ఏ ఒక్క కౌలు రైతుకు కిసాన్ క్రెడిట్ కార్డు ఇచ్చిన దాఖలాలు లేవు. దీనివల్ల సాగు చేయకుండానే పంట రుణాలు పొందే భూ యజమానులు, ధనిక రైతులకే ప్రయోజనం కలుగుతుంది తప్ప చిన్న, సన్న కారు, కౌలు రైతులకు ఒరిగేదేమీ ఉండదు. కౌలుమిత్ర గ్రూపులు ఏర్పాటు చేసి కౌలు రైతులందరికీ పంట రుణాలివ్వాలి.

– ఎ.కాటమయ్య, పి.జమలయ్య, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఏపీ కౌలురైతుల సంఘం(సీపీఐ)

కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా 5న నిరసనలు

కేంద్ర బడ్జెట్‌లో రైతులకు ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వలేదు. మరీ ముఖ్యంగా కౌలు రైతుల ప్రస్తావన లేదు. గతేడాది బడ్జెట్ కేటాయింపులకు మించి ఒక్క రూపాయి కూడా ఈ రంగానికి కేటాయించలేదు. 2020–2021 నుంచి వ్యవసాయ రంగానికి ఎన్డీయే ప్రభుత్వం కేటాయింపులు తగ్గిస్తూ వస్తోంది. ఉపాధి కల్పనలో వ్యవసాయ రంగం వాటా 44.1 శాతం నుంచి 46.1 శాతానికి పెరిగింది. కానీ.. బడ్జెట్‌లో ఈ రంగానికి ప్రాధాన్యత ఇవ్వలేదు. ఈ నెల 5న రాష్ట్రవ్యాప్తంగా బడ్జెట్ ప్రతులను దహనం చేసి నిరసన తెలపాలని పిలుపునిచ్చాం.

– వై.రాధాకృష్ణ, ఎం.హరిబాబు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఏపీ కౌలు రైతుల సంఘం(సీపీఎం)

ఆదాయపన్ను మినహాయింపు హర్షణీయం

కేంద్ర బడ్జెట్‌లో రూ.12 లక్షల వరకు వ్యక్తిగత ఆదాయపన్ను నుంచి మినహాయింపు ఇవ్వటం హర్షణీయం. ఈ మినహాయింపు ఉద్యోగులతోపాటు ఇతర ఆదాయపన్ను చెల్లింపుదారులకు భారీ ఊరటనిస్తుంది. మధ్య తరగతి ప్రజలు, ఉద్యోగుల కొనుగోలుశక్తి పెరుగుతుంది. తద్వారా దేశంలో ఆర్థికాభివృద్ధి పెరుగుతుంది. కార్పొరేట్ కంపెనీలు చెల్లించే పన్ను కన్నా వ్యక్తిగత ఆదాయ పన్ను చెల్లిస్తున్న వారి ద్వారానే ప్రభుత్వానికి అత్యధిక ఆదాయం వస్తోంది. పన్ను మినహాయింపును ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం పక్షాన స్వాగతిస్తున్నాం.

– దేవరపల్లి సురేష్‌బాబు, అధ్యక్షుడు, ఏపీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్

క్యాన్సర్ రోగులకు ఊరట

- 36 రకాల మందులకు బేసిక్ కస్టమ్స్ డ్యూటీ మినహాయింపు
- 2025–26 బడ్జెట్‌లో కేంద్రం వెల్లడి

సాక్షి, అమరావతి : 2025–26 కేంద్ర బడ్జెట్‌లో క్యాన్సర్‌తో పాటు, ప్రాణాంతక వ్యాధులతో బాధపడే వారికి ఊరట లభించింది. 36 రకాల ఔషధాలను బేసిక్ కస్టమ్స్ డ్యూటీ నుంచి పూర్తిగా మినహాయించారు. దీంతో ఈ మందుల ధరలు దిగి రానున్నాయని.. రోగులపై ఆర్థిక భారం తగ్గుతుందని వైద్య రంగ నిపుణులు చెబుతున్నారు. ఏటా రాష్ట్రంలో 73 వేల కొత్త క్యాన్సర్ కేసులు నిర్ధారణ అవుతున్నట్లు వైద్యశాఖ అంచనా. అలాగే, లక్షల్లో బాధితులు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఐసీఎంఆర్ ప్రకారం దేశంలో 70 మిలియన్ల మంది అరుదైన ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్నారు. ఇక బేసిక్ కస్టమ్స్ డ్యూటీ నుంచి మినహాయింపు పొందే మందుల్లో పెంబ్రోలిజుమాబ్ కీ, రిబోసిక్లిబ్, సెల్యుమెటినిబ్, ఫుల్వెస్ట్రాంట్, ఓలాపరిబ్, టెక్లిస్టామాబ్, ఇబ్రుటినిబ్ వంటి క్యాన్సర్, లైఫ్ సేవింగ్ డ్రగ్స్ ఉన్నట్లు సమాచారం.

అంబరాన్నంటేలా మావుళ్లమ్మ ఉత్సవాలు



భీమవరంలో ఏటా నెల రోజులపాటు నిర్వహణ



- ప్రతిరోజూ హరికథ, నృత్య, పౌరాణిక, జానపద ప్రదర్శనలు
- ప్రత్యేక ఆకర్షణగా కాస్టింగ్ నాటకాలు
- ఉత్సవాల్లో సంప్రదాయ కళారూపాలకే పెద్దపీట
- వెయ్యి మందికి పైగా కళాకారులు, వేలలో సందర్శకుల రాక
- అబ్బురపరిచేలా విద్యుత్ సెట్టింగులు
- రూ.కోటికి పైగా వ్యయం
- ఘనంగా జరుగుతున్న 61వ వార్షిక ఉత్సవాలు

సాక్షి, భీమవరం: మధ్యాహ్నం మూడు గంటలకు భజనలు.. సాయంత్రం ఐదు గంటలకు సంప్రదాయ నృత్య ప్రదర్శనలు.. ఆరు గంటలకు హరికథా కాలక్షేపం.. రాత్రి తొమ్మిది గంటలకు పౌరాణిక, జానపద నాటక ప్రదర్శన.. ఇలా అర్ధరాత్రి వరకు ఒకటి తర్వాత ఒకటిగా ప్రదర్శనలు సాగిపోతూనే ఉంటాయి. ఒక రోజు కాదు.. రెండు రోజులు కాదు.. నెల రోజుల పాటు కళాభిమానులు, సందర్శకులకు కనువిందు చేస్తాయి. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం ప్రజల ఇలవేల్పు మావుళ్లమ్మ ఉత్సవాలు ఏటా భోగి పండుగ రోజున మొదలై ఫిబ్రవరి రెండో శుక్రవారం వరకు జరుగుతూ ఉంటాయి.

ఆరు దశాబ్దాలుగా...

ఆలయం వద్ద ఉన్న నీరుల్లి కూరగాయలు, పండ్ల వర్తక సంఘం 60 ఏళ్లుగా ఉత్సవాలు నిర్వహిస్తోంది. ఉత్సవాల వ్యయం తొలుత రూ.ఐదు వేలతో మొదలై ఇప్పుడు దాదాపు రూ.కోటికి పైనే అవుతోంది. ఔరా అనిపించే విద్యుత్ సెట్టింగులు, ప్రతిరోజూ మధ్యాహ్నం మొదలై అర్ధరాత్రి వరకు సాగే కళా ప్రదర్శనలు, 30 వేల మంది నుంచి 50 వేల మంది భక్తుల రాకతో 61వ వార్షిక ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.

ఉత్సవాలు 'కళ'కళలాడేలా...

వినోద రంగంలో కొత్త పోకడలు ఎన్నొచ్చినా మావుళ్లమ్మ ఉత్సవాల్లో మాత్రం సంప్రదాయ కళారూపాలకే పెద్దపీట వేస్తారు. భజనలు, పారాయణాలతో మొదలై కూచిపూడి/భరత నాట్యం, హరికథ/బుర్రకథ కాలక్షేపం, సంగీత విభావరి, అనంతరం సాంఘిక/ పౌరాణిక నాటకాల ప్రదర్శనతో ఆ రోజు ముగుస్తుంది.

ప్రత్యేక ఆకర్షణగా కాస్టింగ్ నాటకాలు

బాపట్ల జిల్లా చెరుకుపల్లి ఉషోదయ నాట్యమండలి, గుడివాడ జై నాట్యమండలి, కళారంజని ఆర్ట్స్ అసోసియేషన్, విజయ దుర్గా నాట్యమండలి, గుంటూరు శ్రీ శ్రీనివాస చైతన్య కళా నాట్యమండలి, సమతా నాటక మండలి, రాజమహేంద్రవరం ఉమా శ్రీవాణి కళాసారథి, మిలటరీ మాధవరం జగత్ విజేత నాట్యమండలి తదితర పేరొందిన ఎన్నో సంస్థల వారు ఇక్కడ ట్రూపు ప్రదర్శనలిస్తున్నారు. దేవీ మహత్యం, మాయాబజారు, శ్రీవల్లీ కళ్యాణం, మోహినీ భస్మాసుర, పల్నాటి యుద్ధం, నాలుగు రత్నాలు తదితర పౌరాణిక, సాంఘిక, పద్య నాటకాలు, బుర్ర కథలతో కళాభిమానులను అలరిస్తున్నారు.

20 రోజుల పాటు బయటి కళాపరిషత్‌ల నాటక ప్రదర్శనలు ఉంటే పది రోజుల పాటు ఉత్సవ కమిటీ ప్రత్యేకంగా సమర్పించే కాస్టింగ్ నాటకాలు ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణ. సత్యహరిశ్చంద్ర, శ్రీకృష్ణ తులాభారం, బాల నాగమ్మ, కురుక్షేత్రం, గయోపాఖ్యానం తదితర పౌరాణిక నాటకాల్లో ఒక్కో పాత్రకు ఉభయ రాష్ట్రాల్లో పేరొందిన నలుగురు ఐదుగురు కళాకారులను ఎంపిక చేసి వారితో ఆయా నాటకాలను ప్రదర్శిస్తుంటారు. ప్రముఖ నాటకాల్లోని ముఖ్య ఘట్టాలతో రంగస్థల ఆణిముత్యాలు, రెండు రత్నములు, మూడు రత్నాలు, పంచ రత్నాలు పేరిట ప్రత్యేక నాటకాలు ఉంటాయి. ట్రూపు పదర్శనల కన్నా కాస్టింగ్‌కు నాలుగింతలు ఎక్కువే ఖర్చు చేస్తారు. వీటిని చూసేందుకు ఎందరో కళాభిమానులు వస్తుంటారు. వేడుకల్లో పాల్గొనే ఎవరైనా లాభాపేక్షతో కాకుండా అమ్మవారిపై భక్తిభావంతో రావడం వల్ల భారీ స్థాయిలో జరిగే ఈ ఉత్సవాలకు ఖర్చు తక్కువగానే ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు. ఇదిలాఉండగా నిర్వాహకులు ప్రత్యేకంగా ఏర్పాటుచేయించిన విద్యుత్ కాంతులు ఉత్సవాలకు మరింత శోభను తెస్తున్నాయి. ఆలయం ప్రాంగణం, ఆలయం ముందు, వెనుక భాగాల్లో మూడు డెకరేషన్ సంస్థలు పోటాపోటీగా భారీ సెట్టింగులతో ఆలయ ఆవరణను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశాయి.

తల్లి సన్నిధిలో ప్రదర్శన ఆనందదాయకం



సత్యహరిశ్చంద్రలో చంద్రమతి, రామాంజనేయ యుద్ధంలో శాంతిమతి పాత్రలు చేస్తుంటాను. నేర్చుకున్న కళను అమ్మవారి సన్నిధిలో ప్రదర్శించడం చాలా ఆనందంగా అనిపిస్తుంది. రెండు రాష్ట్రాల నుంచి ఈ నెల రోజులు ఎన్నో వందల మంది కళాకారులు వస్తుంటారు.

– నంద్యాల సత్యకుమారి, కళాకారిణి, ఖమ్మం

40 ఏళ్లుగా వస్తున్నాను



శ్రీకృష్ణుని పాత్రతో నాటక రంగంలో నా అనుభవం ఐదున్నర దశాబ్దాలు అయితే నాలుగు దశాబ్దాలుగా ఏటా మావుళ్లమ్మ వారి ఉత్సవాల్లో ప్రదర్శనలిస్తున్నాం. ఉత్సవ కమిటీ కళారంగానికి ఎంతో ప్రాధాన్యమిస్తూ ప్రత్యేకంగా కాస్టింగ్ నాటకాలను ప్రదర్శించడం అభినందనీయం.

– కందుల గునేశ్వరరావు, కళాకారుడు, విజయనగరం



నాటక ప్రదర్శనలు

సత్యవేడు ఎమ్మెల్యే రాసలీలలపై లేఖాస్త్రం

- సీఎం చంద్రబాబుకు పంపించిన సత్యవేడు ప్రజలు
- సోషల్ మీడియాలో వీడియో హల్‌చల్



సాక్షి టాస్క్‌ఫోర్స్: తిరుపతి జిల్లా సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మరోసారి వార్తల్లోకి ఎక్కారు. గతంలో ఓ మహిళతో రాసలీలలు నడుపుతూ అడ్డంగా దొరికిపోయిన విషయం విదితమే. తాజాగా సత్యవేడు నియోజకవర్గంలోని ఆయన రాసలీలల పేరిట ఓ జాబితాను ఇక్కడి ప్రజలు సోషల్ మీడియా వేదికగా బయట పెట్టారు. సత్యవేడు ప్రజానీకం పేరుతో ఆదిమూలం రాసలీలలు జరిపిన వారి పేర్లు, చిరునామాలతో కూడిన జాబితాను విడుదల చేయడం సంచలనం రేపుతోంది. నియోజకవర్గంలోని పలు మండలాల్లో చాలామంది మహిళలను ఆదిమూలం వేధించి శారీరకంగా లొంగదీసుకున్నారంటూ లేఖాస్త్రాన్ని సంధించారు. కామాంధుని ఆక్రోశానికి నియోజవర్గంలో ఎంతోమంది మహిళలు బలిపశువులయ్యారంటూ ఆ లేఖలో పేర్లతో పాటు పూర్తి వివరాలను పొందుపరిచారు. ఆయనతో పాటు ఆయన తనయుడు, జెడ్పీటీసీ సుమన్ సైతం ఓ ప్రైవేటు కళాశాలలో విద్యార్థులను లొంగదీసుకున్నట్టు వెల్లడించారు. రెండు రోజులుగా సోషల్ మీడియాలో ఈ లేఖ చక్కర్లు కొట్టడంతో విషయం కాస్త పార్టీ అధిష్టానానికి చేరింది. లేఖలోని సారాంశాన్ని సీఎం ప్రత్యేకంగా గమనించి సీరియస్ అయినట్టు తెలుస్తోంది. సీఎం చంద్రబాబుకు కూడా ఆ లేఖ వెళ్లినట్టు సమాచారం.

వీడియో హల్‌చల్

సత్యవేడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే రాసలీలలపై విడుదలైన లేఖాస్త్రంతో కూడిన వీడియో హల్‌చల్ చేస్తోంది. ఎక్కడ చూసినా ఆయన రాసలీలల వీడియో పైన పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. కోనేటి ఆదిమూలం కామాంధుడని, ఆయనను ఇలానే వదిలేస్తే ఎంతోమంది మహిళలు బలవుతారని, మహిళలను రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై తక్షణం సీఎం చంద్రబాబు స్పందించి ఆయనను ఎమ్మెల్యే పదవి నుంచి భర్తరఫ్ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇల్లీగల్ యాప్స్ ప్రమోట్ చేస్తే కఠిన చర్యలు

ఇన్‌ఫ్లుయెన్సర్లకు పోలీసుల హెచ్చరిక



సాక్షి, హైదరాబాద్: రాత్రికి రాత్రి రీల్స్, షార్ట్స్‌తో ఫేమస్ అయిపోయి, సోషల్ మీడియాలో హల్‌చల్ చేసేవారికి కొదవే లేదు. తమలోని ప్రత్యేకశైలిని ప్రదర్శిస్తూ సామాజిక మాధ్యమాల్లో లక్షల్లో వ్యూస్, షేర్స్ సంపాదించుకుని సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లుగా మారుతున్నారు. ఒకసారి సోషల్ మీడియాలో ఫేమస్ అయితే చాలు.. ఇన్‌ఫ్లుయెన్సర్లు ఏది చెబితే అది ఫాలో అయ్యేందుకు వీక్షకులు ఆసక్తి చూపుతున్నారు. సరిగ్గా ఇదే వాడుకుని కొందరు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు పెద్దమొత్తాల్లో సంపాదించేందుకు దారులు వెతుక్కుంటున్నారు. ఇదే అదనుగా వీరితో ప్రకటనలు ఇప్పించి..తమ ఉత్పత్తులు, వ్యాపారాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఇన్‌ఫ్లుయెన్సర్లకు యాడ్స్ ఇచ్చేవారు పెరుగుతున్నారు. అయితే ఇందులో కొన్ని మోసపూరితమైన సంస్థలు, అంశాలకు సంబంధించినవి ఉంటున్నాయి. ఇకపై ఇలాంటి మోసపూరిత యాప్స్, సంస్థల గురించి ప్రమోట్ చేస్తే సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరిస్తున్నారు. డబ్బుల కోసం కక్కుర్తిపడి బెట్టింగ్ యాప్స్, ఫేక్ ట్రేడింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేయవద్దని ఎక్స్ ఖాతాలో సూచించింది.

బడ్జెట్‌పై ఉపాధ్యాయ సంఘాల నేతల స్పందన

పన్ను మినహాయింపులో మతలబు



ఈ బడ్జెట్‌లో ఆదాయపన్ను పరంగా పెద్ద ఊరట లభిస్తుందన్న గంపెడాశతో ఉన్న ఉద్యోగుల ఆశలు అడియాశలయ్యాయి. రూ.12 లక్షల వరకు జీరో ట్యాక్స్ వెనుక చాలా మతలబు ఉంది. రూ.4 లక్షల వరకే జీరో ట్యాక్స్. ఆ తర్వాత రూ.8 లక్షలు పొదుపు చూపిస్తేనే దానిపై జీరో ట్యాక్స్ వర్తిస్తుంది. లేదంటే దానికి ట్యాక్స్ కట్టాల్సిందే. అంత పొదుపు చేస్తే ఉద్యోగి ఏం తినాలి. పిల్లల్ని ఎలా చదివించుకోవాలి. కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలి?.

– చిట్టేటి రమేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బహుజన టీచర్స్ అసోసియేషన్

పొదుపును ప్రోత్సహించని బడ్జెట్

కేంద్ర బడ్జెట్‌లో పొదుపును ప్రోత్సహించే నిర్ణయాలు లేవు. ఆదాయ పన్ను చెల్లించే వారిని కొత్త పన్ను విధానంలోకి తీసుకొచ్చి పాత పన్ను విధానాన్ని రద్దుచేసే యోచనలో ఉన్నట్టు కన్పిస్తోంది. పాత పన్ను విధానంలో 80–సీ కింద ఇప్పటివరకు రూ.1.5 లక్ష వరకు పొదుపు చేసుకునే అవకాశం ఉంది. పాత పన్ను విధానంలో కొనసాగుతున్న వారికి ప్రోత్సాహం లభించలేదు. గృహ నిర్మాణ రుణాలపై చెల్లించే వడ్డీ మినహాయింపు పరిమితిని పెంచలేదు. కొఠారి కమిషన్ సిఫార్సుల అమలు ఊసేలేదు.

– ఎల్.సాయి శ్రీనివాస్, అధ్యక్షుడు, ఏపీ రాష్ట్రోపాధ్యాయ సంఘం

ఉద్యోగులను కనికరించిన కేంద్రం



పన్ను శ్లాబ్‌ల మార్పులతో ఉద్యోగుల పట్ల కేంద్రం సానుకూల వైఖరి ప్రదర్శించింది. రూ.12 లక్షల వరకు పన్ను రాయితీ ప్రకటించటం హర్షణీయం. ఆదాయం ఎంత ఉన్నా రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపు కొనసాగించాలి. కొత్త రెజ్యూమ్‌లో రిబేటు ఆదాయాన్ని రూ.లక్షకు పెంచడం అతిశయోక్తిగా ఉంది. పొదుపు, గృహ రుణాల వడ్డీలు, ఉన్నత చదువుల రుణాల వడ్డీలు, వైద్య ఖర్చులను మినహాయించేలా కేంద్రం చర్యలు తీసుకుంటే బాగుండేది.

– సీవీ ప్రసాద్, అధ్యక్షుడు, ఏపీటీఎఫ్ అమరావతి

ఏపీకి ఎలాంటి ప్రాధాన్యత లేదు

విద్యారంగంలో కృత్రిమ మేధ వినియోగాన్ని, వచ్చే ఐదేళ్లలో అదనంగా 75 వేల మెడికల్ సీట్లు పెంచుతాం, 50 వేల ప్రభుత్వ పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ఏర్పాటు చేస్తామని ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ శిక్షణకు ప్రాధాన్యత ఇస్తామని గొప్పగా చెప్పారు. కానీ.. వాటికి నిధుల కేటాయింపులు ఎక్కడా చూపలేదు. ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరిగితే ఆ రాష్ట్రానికి బడ్జెట్‌లో కేటాయింపులు పెంచడం పరిపాటిగా మారింది. విభజనతో ఆర్థికంగా వెనుకబడిన ఆంధ్రప్రదేశ్‌కు మాత్రం ప్రస్తుత బడ్జెట్‌లో ఎలాంటి ప్రాధాన్యత లేదు.

– మల్లు రఘునాథరెడ్డి, ప్రధాన కార్యదర్శి, ఏపీ రాష్ట్రోపాధ్యాయ సంఘం

వేతన జీవులకు ఊహించని ఊరట

వేతనంపై ఆధారపడి జీవించే మధ్య తరగతి ప్రజలకు, ఉద్యోగులు, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఆదాయ పన్ను పరిమితి రూ.12 లక్షలకు పెంచడం భారీ ఊరట. కొన్నేళ్లుగా ఏటా రెండు నెలల జీతం (రూ.80 వేలు) ఆదాయ పన్ను రూపంలో చెల్లిస్తున్న ఉద్యోగులకు ఇది గొప్ప సంతోషదాయకమైన వార్త. చరిత్రలో ఒకేసారి రూ.ఐదు లక్షల ఆదాయ పన్ను పరిమితి పెంచడం ఇదే తొలిసారి. ఇది నిజంగా వారికి ఒక పెద్ద బొనంజాగా చెప్పవచ్చు.

– ఎస్.బాలాజీ, అధ్యక్షుడు, ఏపీ టీచర్స్ సంఘం

విద్యకు తగిన ప్రాధాన్యత లేదు

బడ్జెట్‌లో విద్యకు కేవలం 2.5 శాతం మాత్రమే కేటాయించడం సబబు కాదు. జీడీపీలో విద్యకు 6 శాతం కేటాయించాలన్న కొఠారి కమిషన్ సిఫార్సులను కేంద్రం పట్టించుకోలేదు. న్యూ ఇండియా అక్షరాస్యత పథకం ప్రవేశ పెట్టినప్పటికీ నిధులు కేటాయించలేదు. ఆదాయపన్ను మినహాయింపు రూ.12లక్షలకు పెంచడం ఊరటనిచ్చే అంశం. పాత పన్ను విధానంలో 80సీ కింద పొదుపు, ప్రామాణిక తగ్గింపులో గానీ మార్పులు చేయకపోవడం వల్ల కొత్త పన్ను విధానాన్ని ఎంచుకోవాల్సిందే.

– జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఏపీ టీచర్స్ ఫెడరేషన్

ట్రిపుల్ ఐటీలకు నిధుల కొరత

ఆర్జీయూకేటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్

వేంపల్లె : రాష్ట్రంలో రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీలకు నిధుల కొరత ఉందని ఆర్జీయూకేటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ విజయ్ కుమార్ పేర్కొన్నారు. శనివారం ఆయన ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీని సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలకు నూతన భవనాలు, మౌలికవసతులు, కంప్యూటర్లు, మెస్‌లు తదితరాల నిమిత్తం రూ.300 కోట్లు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. గతంలో రూ.100 కోట్లు అడగ్గా .. రూ.50 కోట్లు ఇచ్చారని, ఇది జీతాలకే సరిపోయిందన్నారు. ప్రస్తుతం ఒంగోలు ట్రిపుల్‌ఐటీకి సంబంధించి నూతన భవనాలు రూ.200 కోట్లు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి సంబంధించి రూ.50 కోట్లు, ఇడుపుల పాయ ఆర్కే వ్యాలీ, ఒంగోలు ట్రిపుల్ ఐటీలకు సంబంధించి రూ.50కోట్లు అవసరం ఉందన్నారు. అలాగే విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యనందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం పీయూసీ, ఇంజనీరింగ్ విభాగాలకు సంబంధించి 660 రెగ్యులర్ పోస్టులను భర్తీ చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. అయితే కొందరు కోర్టుకు వెళ్లడంతో పోస్టుల భర్తీ ఆగిపోయిందన్నారు.

యువతి స్నానం చేస్తుండగా వీడియో

- చితకబాది గదిలో బంధించిన బంధువులు
- ఆత్మహత్య చేసుకున్న యువకుడు

అక్కిరెడ్డిపాలెం: యువతి స్నానం చేస్తుండగా ఓ యువకుడు వీడియో తీశాడు. యువతి బంధువులు అతన్ని చితకబాది గదిలో బంధించగా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాగా.. తమ కుమారుడిని యువతి బంధువులు కొట్టి హత్య చేశారని యువకుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గాజువాక సీఐ ఎ.పార్థసారథి తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లాకు చెందిన జి. భాస్కరరావు(30) విశాఖ ఫార్మాసిటీలోని ఓ కంపెనీలో ల్యాబ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. అతనికి ఇంకా వివాహం కాలేదు. గాజువాక శ్రీనగర్‌లో శ్రీరాంనగర్‌లోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. కొద్ది రోజుల కిందట ఇంటి యజమానురాలి మనవరాలు ఊరు నుంచి వచ్చింది. శనివారం యువతి స్నానం చేస్తుండగా భాస్కరరావు వీడియో తీస్తున్నాడని బిగ్గరగా అరిచింది. దీంతో యువతి బంధువులు భాస్కరరావుపై దాడికి పాల్పడ్డారు. భాస్కరరావును ఆయన రూమ్‌లో బంధించి తాళం వేశారు. భయపడిపోయిన భాస్కరరావు తన రూమ్‌లోనే కేబుల్ వైర్లతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. భాస్కరరావు తండ్రి తాతారావు.. తన కుమారుడిని యువతి బంధువులు కొట్టి హత్య చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆధ్యాత్మిక సమాచారం

శ్రీవారి దర్శనానికి 8 గంటలు


తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 2 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 51,818 మంది స్వామిని దర్శించుకున్నారు. 19,023 మంది తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.2.52 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 8 గంటలు పడుతోంది.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేంజేంపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు.

శ్రీశైలంలో 19 నుంచి 'మహా' బ్రహ్మోత్సవాలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో ఈ నెల 19వ తేది నుంచి మార్చి 1 వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. శనివారం దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు ఇంజనీరింగ్ అధికారులతో కలిసి లడ్డూ ప్రసాద విక్రయ కేంద్రాలు, క్యూలైన్లు, పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు. లడ్డూ కౌంటర్ వద్ద ప్రస్తుతం ఉన్న 15కేంద్రాలతో పాటు అదనంగా మరో 8 కౌంటర్లను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.

విద్యా సమాచారం

4న ఏయూ రీషెడ్యూల్ పరీక్షలు

విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీ ఆధ్వర్యంలో జనవరి 8న జరగాల్సిన పరీక్షలను ఈ నెల 4న నిర్వహిస్తామని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ తెలిపారు. ఫస్ట్ సెమిస్టర్ హానర్స్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్ష ఈ నెల 4న ఉదయం 9గంటల నుంచి 10.30గంటల వరకు జరుగుతుందన్నారు. మూడో సెమిస్టర్ సప్లిమెంటరీ, అదే విధంగా రీ అడ్మిట్ అభ్యర్థులకు అదే రోజు మధ్యాహ్నం 2గంటలకు పరీక్ష ఉంటుందన్నారు.

జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, ఆంగ్ల శాఖ ఆధ్వర్యంలో మార్చి 21 నుంచి రెండు రోజుల పాటు జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని తెలిపారు. శనివారం సదస్సు పోస్టర్ ఆవిష్కరించారు.

ఏయూలో ఎంబ్రియాలజీ కోర్సుల్లో ప్రవేశాలు

విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీలో 2 సంవత్సరాల మాస్టర్ ఆఫ్ క్లినికల్ ఎంబ్రియాలజీ కోర్సు, ఏడాది పీజీ డిప్లొమా ఇన్ క్లినికల్ ఎంబ్రియాలజీ కోర్సు (సెల్ఫ్ సపోర్ట్ స్పెషలిస్ట్ ప్రోగ్రామ్స్)ల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడులైంది. వివరాలకు వెబ్‌సైట్ www.ifeivftraininf.com సందర్శించాలని అధికారులు సూచించారు.

జీవనశైలిలోని మార్పులే ఒత్తిడికి మూలం

విశాఖ విద్య: జీవనశైలిలోని మార్పులే ఒత్తిడికి మూలమని సాంకేతిక విద్య విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సాయి లక్ష్మి పేర్కొన్నారు. ఆంధ్రాయూనివర్సిటీ లోని సోషల్ వర్క్ విభాగంలో శనివారం 'మానవ జీవన శైలి – సోషల్ వర్కర్ పాత్ర × అంశంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో అనేక రుగ్మతలకు జీవన శైలే ప్రధాన కారణమన్నారు. విద్యార్థులు ఒత్తిడి లేని చదువులకు అలవాటు పడాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ అబ్రహం, పుష్పలత, ఆశాకిరణ్, శ్యాం, లక్ష్మణరావు, శిరీష, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగులో తొలి అడుగు

దేశవ్యాప్తంగా తెలుగు సినిమాలకు ప్రేక్షకాదరణ దక్కుతోంది. టాలీవుడ్ స్టార్ హీరోల సినిమాలైతే ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతున్నాయి. ఆడియన్స్‌ను మెప్పిస్తున్నాయి. దీంతో టాలీవుడ్‌లో సినిమాలు చేయాలని చాలామంది హీరోయిన్స్ ఎప్పటికప్పుడు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఇలా ఇక్కడ అవకాశం దక్కించుకుని, ఈ ఏడాది తెలుగు ఇండస్ట్రీలో తొలి అడుగు వేస్తున్న హీరోయిన్స్‌పై కథనం.

డబుల్ ధమాకా

కన్నడ 'కేజీఎఫ్' మూవీలతో తెలుగు ప్రేక్షకులనూ మెప్పించారు హీరోయిన్ శ్రీనిధీ శెట్టి. ఈ బ్యూటీ ఈ ఏడాది తెలుగు తెరపై కనిపించనున్నారు. శ్రీనిధీ శెట్టి ప్రస్తుతం రెండు స్ట్రయిట్ తెలుగు మూవీస్ చేస్తున్నారు. 'హిట్' మూవీ ఫ్రాంచైజీలో రూపొందుతున్న తాజా చిత్రం 'హిట్: ది థర్డ్ కేస్ 3 (హిట్ 3)'. ఇందులో పోలీసాఫీసర్ అర్జున్ సర్కార్‌గా నాని నటిస్తున్నారు. ఈ చిత్రంలో మృదులగా హీరోయిన్ పాత్రను శ్రీనిధీ శెట్టి చేస్తున్నారు. వాల్ పోస్టర్ సినిమా, యునానిమస్ ప్రొడక్షన్స్ పతాకాలపై డా. శైలేష్ కొలను దర్శకత్వంలో ప్రశాంతి త్రిపిర్నేని నిర్మిస్తున్న ఈ హిట్ 3 మూవీ మే 1న విడుదల కానుంది. ఇక శ్రీనిధి ఓ హీరోయిన్‌గా చేస్తున్న మరో మూవీ 'తెలుసు కదా'. సిద్ధు జొన్నలగడ్డ హీరోగా చేస్తున్న ఈ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ మూవీతో ప్రముఖ కాస్ట్యూమ్ డిజైనర్ నీరజ కోన దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. ఈ చిత్రంలో శ్రీనిధీ శెట్టి, రాశీ ఖన్నా హీరోయిన్లుగా చేస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ మూవీ ఈ ఏడాదే రిలీజ్ కానుంది. 'హిట్ 3, తెలుసు కదా'... ఇలా ఒకేసారి రెండు సినిమాలతో డబుల్ ధమాకాగా శ్రీనిధీ శెట్టి టాలీవుడ్‌కు ఎంట్రీ ఇస్తున్నారు.

పదేళ్ల తర్వాత...

నటిగా కెరీర్‌ను స్టార్ట్ చేసిన పదేళ్ల తర్వాత టాలీవుడ్‌కు వస్తున్నారు హీరోయిన్ మాళవికా మోహనన్. ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో 'రాజా సాబ్' అనే హారర్ కామెడీ మూవీ రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ మూవీలో మాళవికా మోహనన్, నిధీ అగర్వాల్ హీరోయిన్స్‌గా చేస్తున్నారు. మాళవికాకు ఇదే తొలి తెలుగు సినిమా. ఈ సినిమాలో మాళవిక ఓ డిఫరెంట్ రోల్ చేస్తున్నారు. ఆమె పాత్రకు కొన్ని యాక్షన్ సీక్వెన్స్‌లు కూడా ఉంటాయని తెలిసింది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ఏప్రిల్ 10న రిలీజ్ చేయనున్నట్లుగా ఇటీవల మేకర్స్ ప్రకటించారు. కానీ 'రాజా సాబ్' మూవీ ఏప్రిల్ 10న రిలీజ్ కావడం లేదని, కొత్త విడుదల తేదీని మేకర్స్ త్వరలోనే వెల్లడిస్తారని తెలిసింది. కాగా విజయ్ దేవరకొండ హీరోగా మైత్రీ మూవీ మేకర్స్‌లో చేయాల్సిన ఓ స్పోర్ట్స్ డ్రామా 'హీరో' (అప్పట్లో ప్రచారంలోకి వచ్చిన టైటిల్)లో మాళవికా మోహనన్ హీరోయిన్‌గా చేయాల్సింది. 2019 వేసవిలో ఈ మూవీ ఓపెనింగ్ కూడా జరిగింది. కానీ కొన్ని కారణాల వల్ల క్యాన్సిల్ అయ్యింది. ఇలా... టాలీవుడ్‌కి మాళవిక రాక ఆలస్యమైంది.

రీమేక్‌తో ఎంట్రీ

ప్రముఖ తమిళ దర్శక-నిర్మాత శంకర్ కుమార్తె అదితీ శంకర్ ఈ ఏడాది తెలుగు పరిశ్రమకు పరిచయం అవుతున్నారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ హీరోలుగా నటిస్తున్న మూవీ 'భైరవం'. ఈ మూవీలో అదితీ శంకర్, దివ్యా పిళ్లై, ఆనంది హీరోయిన్స్‌గా చేస్తున్నారు. కాగా అదితీ శంకర్‌కు 'భైరవం' తెలుగులో తొలి చిత్రం. డా. జయంతి లాల్ గడ సమర్పణలో విజయ్ కనకమేడల దర్శకత్వంలో కేకే రాధా మోహన్ నిర్మిస్తున్న ఈ మూవీ త్వరలోనే రిలీజ్ కానుంది. గత ఏడాది మేలో రిలీజైన తమిళ హిట్ మూవీ 'గరుడన్'కు తెలుగు రీమేక్‌గా 'భైరవం' మూవీ తెరకెక్కుతున్నట్లు టాక్.

ఫౌజీకి జోడీగా...

స్టార్ హీరో ప్రభాస్ కథానాయకుడిగా రూపొందుతున్న భారీ మూవీ 'ఫౌజీ' (ప్రచారంలో ఉన్న టైటిల్) తో హీరోయిన్‌గా తెలుగు సినీ ఇండస్ట్రీకి పరిచయం అవడం అనేది చిన్న విషయం కాదు. ఈ అవకాశం యంగ్ హీరోయిన్ ఇమాన్వీకి దక్కింది. ప్రభాస్ హీరోగా హను రాఘవపూడి డైరెక్షన్‌లో ఓ పీరియాడికల్ లవ్ అండ్ పేట్రియాట్రిక్ మూవీగా 'ఫౌజీ' రూపుదిద్దుకుంటున్న సంగతి తెలిసిందే. మైత్రీమూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ మూవీలో ప్రభాస్ సరసన ఇమాన్వీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇమాన్వీకి ఫస్ట్ మూవీ ఇదే. హైదారాబాద్ శివార్లలో జరుగుతున్న ఈ మూవీ చిత్రీకరణలో ఇమాన్వీ పాల్గొంటున్నారు. ప్రభాస్, ఇమాన్వీలతో పాటు ప్రధాన తారాగణం పాల్గొంటున్న ఈ షెడ్యూల్‌లో కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు మేకర్స్. జయప్రద, మిథున్ చక్రవర్తి ఈ సినిమాలో కీలక పాత్రలు చేస్తున్నారు. ఇలా కెరీర్ స్టార్టింగ్‌లోనే ప్రభాస్, జయప్రద, మిథున్ చక్రవర్తి వంటి పెద్ద యాక్టర్స్‌తో స్క్రీన్ షేర్ చేసుకోవడం అనేది ఇమాన్వీకి కచ్చితంగా ప్లస్ పాయింటే. ఇక సోషల్ మీడియా మాధ్యమాల్లో ఇమాన్వీ యాక్టింగ్ అండ్ డ్యాన్సింగ్ స్కిల్స్ చూసి, దర్శకుడు హను రాఘవపూడి ఆమెకు 'ఫౌజీ' మూవీలో అవకాశం కల్పించారట.

కాంతార అమ్మాయి

కన్నడ బ్లాక్‌బస్టర్ 'కాంతార' సినిమాలో హీరోయిన్‌గా చేసిన సప్తమీ గౌడ తెలుగు ప్రేక్షకులకు గుర్తుండే ఉంటారు. ఈ బ్యూటీ 'తమ్ముడు' మూవీతో తెలుగు పరిశ్రమకు వస్తున్నారని తెలిసింది. నితిన్ హీరోగా వేణు శ్రీరామ్ డైరెక్షన్‌లో రూపొందుతున్న చిత్రం 'తమ్ముడు'. ఈ సినిమాలో నితిన్ సరసన సప్తమీ గౌడ హీరోయిన్‌నా నటిస్తున్నారు. లైలా మరో లీడ్ రోల్‌లో కనిపిస్తారు. వేణు శ్రీరామ్ డైరెక్షన్లో 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ మూవీని ఈ శివరాత్రికి థియేటర్స్‌లో రిలీజ్ చేయనున్నట్లుగా అప్పట్లో మేకర్స్ ప్రకటించారు. అయితే 'తమ్ముడు' సినిమా విడుదలపై మరోసారి స్పష్టత రావాల్సి ఉంది.

మ్యూజికల్ మ్యాజిక్

ప్రముఖ దర్శకుడు మణిరత్నం 'పొన్నియిన్ సెల్వన్' మూవీలో ఐశ్వర్యా రాయ్ యంగ్ రోల్ చేసిన నటి సారా అర్జున్ గుర్తుండే ఉంటారు. ఈ యంగ్ హీరోయిన్ స్ట్రయిట్‌గా తెలుగులో చేస్తున్న మూవీ 'మ్యాజిక్'. 'జెర్సీ' ఫేమ్ గౌతమ్ తిన్ననూరి డైరెక్ట్ చేస్తున్న ఈ మ్యూజికల్ డ్రామా మూవీలో సారా అర్జున్ ఓ లీడ్ రోల్ చేస్తున్నారు. సితార ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. త్వరలోనే ఈ చిత్రం రిలీజ్ కానుంది. కాలేజ్ ఫెస్టివల్ కోసం నలుగురు టీనేజర్లు ఓ ఒరిజనల్ సాంగ్‌ను కంపోజ్ చేయాలనుకునే ప్రయత్నంలో వారికి ఎలాంటి సవాళ్లు ఎదురయ్యాయన్నది ఈ సినిమా కథాంశమని సమాచారం. ఈ మూవీలో ఎనిమిది పాటలు ఉంటాయట. ఇక ఈ చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ స్వరాలు సమకూర్చుతుండటం విశేషం. ఈ మూవీ ఈ ఏడాదిలోనే రిలీజ్ కానుంది.

అచ్చ తెలుగు అమ్మాయి

ప్రముఖ దర్శకుడు వైవీఎస్ చౌదరి డైరెక్షన్‌లోని సినిమాలతో ఇలియానా వంటి హీరోయిన్స్ తెలుగు తెరకు పరిచయం అయ్యారు. కాగా ఆయన డైరెక్షన్‌లో రానున్న తాజా చిత్రంతో వీణా రావు అనే తెలుగు అమ్మాయి హీరోయిన్‌గా తెలుగు ఇండస్ట్రీకి ఎంట్రీ ఇస్తున్నారు. ఈ లవ్‌స్టోరీ మూవీలో నందమూరి హరికృష్ణ మనవడు, జానకిరామ్ కుమారుడు నందమూరి తారక రామరావు హీరోగా పరిచయం అవుతున్నారు. న్యూ టాలెంట్ రోర్స్ పతాకంపై ఈ మూవీని గీత నిర్మిస్తున్నారు. ఈ మూవీ ఈ ఏడాదే రిలీజ్ కానుంది. అచ్చ తెలుగు అమ్మాయి అయిన వీణా రావుకు కూచిపూడి డ్యాన్స్‌లోనూ ప్రావీణ్యం ఉందని, మేకర్స్ ఇటీవల ఓ సందర్భంగా వెల్లడించారు.

ఇలా తెలుగు చిత్ర పరిశ్రమకు పరిచయం అవుతున్న హీరోయిన్స్ మరికొందరు ఉన్నారు. ఇంకొంత మంది హీరోయిన్స్ తెలుగుకు వచ్చేందుకు కథలు వింటున్నారు.

– మునిమి శివాంజనేయులు


ఇమాన్వీ


శ్రీనిధీ శెట్టి


సప్తమీ గౌడ


సారా అర్జున్


మాళవికా మోహనన్


వీణారావు


అదితీ శంకర్


ఆకాంక్షా శర్మ

ఇటు టాలీవుడ్.. అటు బాలీవుడ్

విశ్వక్ సేన్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ మూవీ 'లైలా'. రామ్ నారాయణ్ డైరెక్షన్‌లో షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ 'లైలా' మూవీలో ఆకాంక్షా శర్మ హీరోయిన్‌గా చేస్తున్నారు. ఈ కన్నడ బ్యూటీకి తెలుగులో ఇదే తొలి సినిమా. ఈ నెల 14న 'లైలా' మూవీ రిలీజ్ కానుంది. మరోవైపు ఈ ఏడాదే బాలీవుడ్‌లోనూ ఎంట్రీ ఇవ్వనున్నారు ఆకాంక్ష. 'తేరా యార్ హూ మై, కేసరి వీర్' చిత్రాలతో పాటు దర్శకుడు మిలిప్ జవేరి డైరెక్షన్‌లోని మరో మూవీలో నటిస్తున్నారు ఆకాంక్ష. ఈ చిత్రాల్లో ఏది ముందు రిలీజ్ అవుతుందో చూడాలి. ఇలా ఇటు తెలుగు అటు బాలీవుడ్‌లో ఒకే టైమ్‌లో ఆకాంక్ష ఎంట్రీ ఖరారు కావడం విశేషమనే చెప్పుకోవాలి.


తేదీ మారలేదు

ధనుష్ నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న మూవీ 'ఇడ్లీ కడై' (తెలుగులో ఇడ్లీ కొట్టు అని అర్థం). నిత్యా మీనన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ మూవీలో అరుణ్ విజయ్, షాలినీ పాండే, సముద్ర ఖని, రాజ్ కిరణ్ ఇతర ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఆకాశ్ భాస్కరణ్‌తో కలిసి ధనుష్ నిర్మిస్తున్న మూవీ ఇది. కాగా 'ఇడ్లీ కడై' సినిమాను ఏప్రిల్ 10న రిలీజ్ చేయనున్నట్లుగా ఇటీవల మేకర్స్ వెల్లడించారు. కానీ తాజాగా ఈ సినిమా రిలీజ్ ఏప్రిల్ 10న విడుదల కావడం లేదనే ప్రచారం జరిగింది. అయితే 'ఇడ్లీ కడై' సినిమాను ఏప్రిల్ 10నే రిలీజ్ చేస్తామన్నట్లుగా వెల్లడించి, ఈ సినిమా కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. దీంతో అనుకున్నట్లే 'ఇడ్లీ కడై' చిత్రం ఏప్రిల్ 10న రిలీజ్ అవుతున్నట్లుగా స్పష్టమైపోయింది. ఇక ధనుష్ దర్శకత్వంలోని మరో మూవీ 'నిలవుక్కు ఎన్ మేల్ ఎన్నడి కోబం' చిత్రం ఈ నెల 21న రిలీజ్ కానుంది. పవీష్, అనిఖా సురేంద్రన్, ప్రియా ప్రకాశ్ వారియర్, మాథ్యూ థామస్, వెంకటేశ్ మీనన్ లీడ్ రోల్స్‌లో నటించిన ఈ మూవీ తెలుగులో 'జాబిలమ్మా నీకు అంత కోపమా...' అనే టైటిల్‌తో రిలీజ్ కానుంది.


ధనుష్, అరుణ్ విజయ్

అదిరిపోయే ట్విస్టులతో ఆకట్టుకుంటుంది

– ఫరియా అబ్దుల్లా



మానస్, జాను, ఓంకార్, రవికాంత్, ఫరియా అబ్దుల్లా, ప్రకృతి, యశ్ మాస్టర్

డ్యాన్స్ లవర్స్‌ను మెప్పించిన 'డ్యాన్స్ ఐకాన్ సీజన్ 1'కు కొనసాగింపుగా 'డ్యాన్స్ ఐకాన్ సీజన్ 2 వైల్డ్‌ఫైర్' రానుంది. ఫిబ్రవరి 14 నుంచి ఈ షో ఆహా ఓటీటీలో ప్రీమియర్‌కు రెడీ అవుతోంది. ఈ షోకు ఓంకార్, హీరోయిన్ ఫరియా అబ్దుల్లా, శేఖర్ మాస్టర్ హోస్ట్‌లుగా వ్యవహరించనున్నారు. 'డ్యాన్స్ ఐకాన్ 2 వైల్డ్‌ఫైర్' షోలో దేశవ్యాప్తంగా కంటెస్టెంట్స్ పాల్గొంటారని, హిప్ హాప్, క్లాసికల్, కాంటెంపరరీ స్టైల్స్‌తో ఈ డ్యాన్స్ షో వీక్షకులను అలరిస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన 'డ్యాన్స్ ఐకాన్ 2' షో ప్రెస్‌మీట్‌లో హోస్ట్‌లో ఒకరైన ఓంకార్ మాట్లాడుతూ– ''డ్యాన్స్ ఐకాన్ 2-వైల్డ్‌ఫైర్'లో ఐదుగురు కంటెస్టెంట్స్ సర్‌ప్రైజ్ చేస్తారు. ముఖ్యంగా ఇద్దరు పిల్లల పెర్ఫార్మెన్స్‌లు చర్చనీయాంశమవుతాయి. ముగ్గురు హోస్ట్‌లతో పాటు సింగర్ జాను లైరి, ప్రకృతి, మానస్, దీపిక ఈ నలుగురు మెంటార్స్ ఉంటారు. 'డ్యాన్స్ ఐకాన్ 2: వైల్డ్ ఫైర్' వీక్షకులకు హోల్ సమ్ ఎంటర్‌టైన్మెంట్ ఇచ్చే కంప్లీట్ డ్యాన్స్ షో'' అని అన్నారు. ఫరియా అబ్దుల్లా మాట్లాడుతూ–'' డ్యాన్స్ ఐకాన్ సీజన్ 1'కు కూడా నన్ను హోస్ట్‌గా అడిగారు. కానీ, ఆ సమయంలో చేయలేకపోయాను. ఇప్పుడు ఓంకార్, శేఖర్ మాస్టర్‌లతో కలిసి హోస్ట్ చేస్తుండటం సంతోషంగా ఉంది. ప్రతి ఎపిసోడ్ అదిరిపోయే ట్విస్టులతో ఆకట్టుకుంటుంది. ఈ షో వీక్షకులకు కంప్లీట్ ఎంటర్‌టైన్మెంట్ ఇస్తుందని గ్యారంటీగా చెప్పగలను'' అని తెలిపారు. ''ఈ షోలో వీక్షకులను సర్‌ప్రైజ్ చేసే డ్యాన్స్ పెర్ఫార్మెన్స్‌లు ఉంటాయి'' అని చెప్పారు శేఖర్ మాస్టర్. ఈ కార్యక్రమంలో మెంటార్ యశ్, మెంటార్ మానస్, సింగర్ జాను లైరి, మెంటార్ ప్రకృతి మాట్లాడారు.


బీసీసీఐ 2024 వార్షిక పురస్కారాల విజేతలు

బెంగాల్ టైగర్స్ విజయ గర్జన

- హాకీ ఇండియా లీగ్ టైటిల్ సొంతం
- ఫైనల్లో హైదరాబాద్ తూఫాన్స్‌పై 4–3 గోల్స్ తేడాతో గెలుపు
- జుగ్‌రాజ్ సింగ్ 'హ్యాట్రిక్'
- సూర్మా హాకీ క్లబ్‌కు మూడో స్థానం

8 పాల్గొన్న జట్లు
44 మొత్తం జరిగిన మ్యాచ్‌లు
199 నమోదైన మొత్తం గోల్స్
103 ఫీల్డ్ గోల్స్
89 పెనాల్టీ కార్నర్ గోల్స్
7 పెనాల్టీ స్ట్రోక్ గోల్స్
95 క్రీడాకారులకు లభించిన గ్రీన్ కార్డులు
16 క్రీడాకారులకు లభించిన ఎల్లో కార్డులు



రూర్కెలా: పది నిమిషాల వ్యవధిలో మూడు గోల్స్... ఆ తర్వాత మ్యాచ్ మరో ఆరు నిమిషాల్లో ముగుస్తుందనగా మరో గోల్... వెరసి పురుషుల హాకీ ఇండియా లీగ్ (హెచ్‌ఐఎల్)లో ష్రాచి రార్ బెంగాల్ టైగర్స్ జట్టు చాంపియన్‌గా అవతరించింది. శనివారం హోరాహోరీగా జరిగిన ఫైనల్లో రూపిందర్ సింగ్ పాల్ కెప్టెన్సీలోని బెంగాల్ టైగర్స్ జట్టు 4–3 గోల్స్ తేడాతో హైదరాబాద్ తూఫాన్స్ జట్టును ఓడించింది. బెంగాల్ టైగర్స్ జట్టు తరఫున జుగ్‌రాజ్ సింగ్ (25వ, 32వ, 35వ నిమిషాల్లో) మూడు గోల్స్ చేసి 'హ్యాట్రిక్' నమోదు చేయగా... స్యామ్ లేన్ (54వ నిమిషంలో) గెలుపు గోల్ కొట్టాడు. హైదరాబాద్ తూఫాన్స్ తరఫున గొంజాలో పీలాట్ (9వ, 39వ నిమిషాల్లో) రెండు గోల్స్ సాధించగా... అమన్‌దీప్ లాక్రా (26వ నిమిషంలో) ఒక గోల్ చేశాడు. ఏడేళ్ల విరామం తర్వాత హాకీ ఇండియా లీగ్‌ను పునరుద్ధరించారు. గత ఏడాది డిసెంబర్ 28వ తేదీన హాకీ ఇండియా లీగ్ మొదలైంది. విజేతగా నిలిచిన బెంగాల్ టైగర్స్ జట్టుకు రూ. 3 కోట్లు... రన్నరప్ హైదరాబాద్ తూఫాన్స్ జట్టుకు రూ. 2 కోట్లు... మూడో స్థానంలో నిలిచిన సూర్మా హాకీ క్లబ్ జట్టుకు రూ. 1 కోటి నగదు పురస్కారం లభించింది. మొత్తం ఎనిమిది జట్లు పోటీపడ్డ హెచ్‌ఐఎల్‌లో లీగ్ దశ మ్యాచ్‌లు ముగిశాక బెంగాల్ టైగర్స్ జట్టు 19 పాయింట్లతో టాపర్‌గా నిలిచింది. తుదకు బెంగాల్ టైగర్స్ జట్టుకే టైటిల్ లభించడం విశేషం. హెచ్‌ఐఎల్ 'బెస్ట్ గోల్ కీపర్'గా బ్రికమ్‌జీత్ సింగ్ (రూ. 10 లక్షలు; హైదరాబాద్ తూఫాన్స్)... 'అప్‌కమింగ్ ప్లేయర్'గా అర్ష్‌దీప్ (రూ. 10 లక్షలు; హైదరాబాద్ తూఫాన్స్)... 'టాప్ స్కోరర్'గా జుగ్‌రాజ్ సింగ్ (బెంగాల్ టైగర్స్; రూ. 10 లక్షలు)... 'బెస్ట్ ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ' సుఖ్‌జీత్ సింగ్ (రూ. 20 లక్షలు; బెంగాల్ టైగర్స్) ఎంపికయ్యారు. యూపీ రుద్రాస్ జట్టుకు 'ఫెయిర్ ప్లే' అవార్డు లభించింది.

బుమ్రా, స్మృతిలకు బీసీసీఐ పురస్కారాలు

- పాలీ ఉమ్రీగర్ అవార్డులు కైవసం
- తనయ్ త్యాగరాజన్, రికీ భుయ్‌లకు మాధవ్‌రావు సింధియా అవార్డులు

ముంబై: వేర్వేరు విభాగాల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన ప్లేయర్లకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) పురస్కారాలు అందజేసింది. 2023–24 సంవత్సరంలో ప్రదర్శనకుగానూ ఉత్తమ అంతర్జాతీయ క్రికెటర్‌కు అందించే 'పాలీ ఉమ్రీగర్ అవార్డు' పురుషుల విభాగంలో మేటి పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాను వరించగా... మహిళల విభాగంలో స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన ఈ పురస్కారం దక్కించుకుంది. ఇక అంతర్జాతీయ స్థాయిలో 664 మ్యాచ్‌లాడి లెక్కకు మిక్కిలి అవార్డులు తన పేరిట లిఖించుకున్న క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌కు బీసీసీఐ 'జీవన సాఫల్య' పురస్కారం అందించింది. శనివారం ముంబైలో నిర్వహించిన వార్షిక అవార్డుల కార్యక్రమంలో అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) అధ్యక్షుడు జై షా చేతుల మీదుగా అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఫార్మాట్‌తో సంబంధం లేకుండా అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తున్న బుమ్రాకు 'పాలీ ఉమ్రీగర్ అవార్డు' దక్కగా... మహిళల విభాగంలో స్మృతి మంధాన నాలుగోసారి ఈ అవార్డుకు ఎంపికైంది. 2017–18, 2020–21, 2021–22లోనూ స్మృతికి పాలీ ఉమ్రీగర్ పురస్కారం లభించింది. ఇటీవల అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన రవిచంద్రన్ అశ్విన్‌కు బోర్డు ప్రత్యేక పురస్కారం అందజేసింది. అత్యుత్తమ అంతర్జాతీయ అరంగేట్రం ఆటగాడి పురస్కారం సర్ఫరాజ్ ఖాన్ గెలుచుకున్నాడు. మహిళల విభాగంలో ఈ పురస్కారం ఆశా శోభనకు దక్కింది. మహిళల వన్డేల్లో అత్యధిక పరుగుల అవార్డు కూడా స్మృతి మంధానకే దక్కింది. అత్యధిక వికెట్లు తీసిన ప్లేయర్‌గా దీప్తి శర్మ పురస్కారం గెలుచుకుంది. రంజీ ట్రోఫీలో ఉత్తమ ప్రదర్శన చేసిన ఆల్‌రౌండర్‌కు అందించే లాలా అమర్‌నాథ్ అవార్డు ముంబై ప్లేయర్ తనుశ్ కొటియాన్‌కు దక్కింది. దేశవాళీ టోర్నీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన జట్టుగా ముంబై నిలిచింది. రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్‌లో అత్యధిక వికెట్లు పడగొట్టిన ప్లేయర్‌కు అందించే మాధవ్‌రావు సింధియా అవార్డుకు తెలంగాణ ప్లేయర్ తనయ్ త్యాగరాజన్ దక్కించుకున్నాడు. ఇదే విభాగంలో అత్యధిక పరుగులు చేసిన ప్లేయర్‌గా ఆంధ్ర ఆటగాడు రికీ భుయ్ పురస్కారం గెలుచుకున్నాడు. ఈ ఇద్దరూ రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్ 'బి' మ్యాచ్‌లు ఆడుతుండటంతో శనివారం జరిగిన బహుమతి ప్రదానోత్సవానికి హాజరు కాలేకపోయారు. వారి స్థానంలో ఆయా రాష్ట్ర సంఘాల ప్రతినిధులు అవార్డులు అందుకున్నారు.

బీసీసీఐ-2024 వార్షిక అవార్డీల జాబితా

- కల్నల్ సీకే నాయుడు జీవన సాఫల్య పురస్కారం: సచిన్ టెండూల్కర్
- పాలీ ఉమ్రీగర్ అవార్డు (ఉత్తమ అంతర్జాతీయ క్రికెటర్): జస్‌ప్రీత్ బుమ్రా
- ఉత్తమ అంతర్జాతీయ క్రికెటర్ (మహిళలు): స్మృతి మంధాన
- ఉత్తమ అంతర్జాతీయ అరంగేట్రం (పురుషులు): సర్ఫరాజ్ ఖాన్
- ఉత్తమ అంతర్జాతీయ అరంగేట్రం (మహిళలు): ఆశా శోభన (కేరళ)
- బీసీసీఐ ప్రత్యేక అవార్డు: అశ్విన్ (తమిళనాడు)
- వన్డేల్లో అత్యధిక పరుగులు (మహిళలు): స్మృతి మంధాన
- వన్డేల్లో అత్యధిక వికెట్లు (మహిళలు): దీప్తి శర్మ
- దేశవాళీల్లో ఉత్తమ అంపైర్: అక్షయ్ టోత్రె
- ఎంఏ చిదంబరం ట్రోఫీ (అండర్-19 కూచ్ బెహార్ ట్రోఫీలో అత్యధిక పరుగులు): కావ్య తియోటియా
- ఎంఏ చిదంబరం ట్రోఫీ (అండర్-19 కూచ్ బెహార్ ట్రోఫీలో అత్యధిక వికెట్లు): విష్ణు భరద్వాజ్
- జగ్‌మోహన్ దాల్మియా ట్రోఫీ (దేశవాళీలో ఉత్తమ సీనియర్ మహిళా క్రికెటర్): ప్రియా మిశ్రా
- జగ్‌మోహన్ దాల్మియా ట్రోఫీ (దేశవాళీలో ఉత్తమ జూనియర్ మహిళా క్రికెటర్): ఐశ్వరి అవసారె
- జగ్‌మోహన్ దాల్మియా ట్రోఫీ (అండర్-16 విజయ్ మర్చంట్ ట్రోఫీలో అత్యధిక వికెట్లు): హేంచుదేశన్
- జగ్‌మోహన్ దాల్మియా ట్రోఫీ (అండర్-16 విజయ్ మర్చంట్ ట్రోఫీలో అత్యధిక పరుగులు): లక్ష్య
- ఎంఏ చిదంబరం ట్రోఫీ (అండర్-23 సీకే నాయుడు ట్రోఫీ ప్లేట్ గ్రూప్‌లో అత్యధిక వికెట్లు): రూప్రియో
- ఎంఏ చిదంబరం ట్రోఫీ (అండర్-23 సీకే నాయుడు ట్రోఫీ ప్లేట్ గ్రూప్‌లో అత్యధిక పరుగులు): హేమ్ ఛెత్రి
- ఎంఏ చిదంబరం ట్రోఫీ (అండర్-23 సీకే నాయుడు ట్రోఫీ ఎలైట్ గ్రూప్‌లో అత్యధిక వికెట్లు): పి. విద్యుత్
- ఎంఏ చిదంబరం ట్రోఫీ (అండర్-23 సీకే నాయుడు ట్రోఫీ ఎలైట్ గ్రూప్‌లో అత్యధిక పరుగులు): అనీశ్ కేవీ
- మాధవ్‌రావు సింధియా అవార్డు (రంజీ ట్రోఫీ ప్లేట్ గ్రూప్‌లో అత్యధిక వికెట్లు): మోహిత్ జాంగ్రా
- మాధవ్‌రావు సింధియా అవార్డు (రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్‌లో అత్యధిక వికెట్లు): తనయ్ త్యాగరాజన్ (హైదరాబాద్)
- మాధవ్‌రావు సింధియా అవార్డు (రంజీ ట్రోఫీ ప్లేట్ గ్రూప్‌లో అత్యధిక పరుగులు): అగ్ని చోప్రా (మిజోరం)
- మాధవ్‌రావు సింధియా అవార్డు (రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్‌లో అత్యధిక పరుగులు): రికీ భుయ్ (ఆంధ్ర)
- లాలా అమర్‌నాథ్ అవార్డు (దేశవాళీ పరిమిత ఓవర్లలో ఉత్తమ ఆల్‌రౌండర్): శశాంక్ సింగ్ (ఛత్తీస్‌గఢ్)
- లాలా అమర్‌నాథ్ అవార్డు (రంజీ ట్రోఫీలో ఉత్తమ ఆల్‌రౌండర్): తనుశ్ కొటియాన్ (ముంబై)
- దేశవాళీ టోర్నీల్లో అత్యుత్తమ ప్రదర్శన: ముంబై

ఇన్నింగ్స్ 242 పరుగుల తేడాతో....

తొలి టెస్టులో శ్రీలంకపై ఆస్ట్రేలియా ఘనవిజయం

గాలె: సొంతగడ్డపై శ్రీలంక స్పిన్నర్లు తేలిపోయిన చోట... ఆస్ట్రేలియా స్పిన్ ద్వయం నాథన్ లయన్, మాథ్యూ కునేమన్ విజృంభించింది. ఫలితంగా రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో భాగంగా జరిగిన తొలి టెస్టులో ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ 242 పరుగుల తేడాతో లంకను చిత్తు చేసింది. టెస్టు క్రికెట్ చరిత్రలో పరుగుల పరంగా శ్రీలంకకు ఇదే అతి పెద్ద పరాజయం కావడం గమనార్హం. ఓవర్‌నైట్ స్కోరు 136/5తో శనివారం మూడో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన శ్రీలంక 52.2 ఓవర్లలో 165 పరుగులకు ఆలౌటైంది. దినేశ్ చండీమల్ (72; 9 ఫోర్లు) ఒంటరి పోరాటం చేయగా... మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. ఆస్ట్రేలియా బౌలర్లలో కునేమన్ 5 వికెట్లతో సత్తా చాటగా... లయన్ 3 వికెట్లు పడగొట్టాడు. దీంతో 489 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కించుకున్న ఆస్ట్రేలియా జట్టు... ప్రత్యర్థిని ఫాలోఆన్‌కు ఆహ్వానించింది. రెండో ఇన్నింగ్స్‌లోనూ ఆసీస్ స్పిన్నర్లను ఎదుర్కోలేకపోయిన శ్రీలంక 54.3 ఓవర్లలో 247 పరుగులకు ఆలౌటైంది. కునేమన్, లయన్ చెరో 4 వికెట్లు పడగొట్టారు. గురువారం నుంచి రెండో టెస్టు గాలెలోనే జరుగుతుంది.

విజయంతో ఆంధ్ర ముగింపు

- చివరి లీగ్ మ్యాచ్‌లో రాజస్తాన్‌పై ఆరు వికెట్ల తేడాతో గెలుపు
- ఐదు వికెట్లతో మెరిసిన విజయ్
- రికీ భుయ్ అర్ధ సెంచరీ


విజయ్


రికీ భుయ్

సాక్షి, విజయనగరం: ప్రతిష్ఠాత్మక దేశవాళీ క్రికెట్ టోర్నమెంట్ రంజీ ట్రోఫీ సీజన్‌ను ఆంధ్ర జట్టు విజయంతో ముగించింది. ఎలైట్ గ్రూప్ 'బి'లో భాగంగా జరిగిన పోరులో ఆంధ్ర జట్టు 6 వికెట్ల తేడాతో రాజస్తాన్ జట్టును చిత్తు చేసింది. తాజా సీజన్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయిన ఆంధ్ర జట్టుకు ఇదే తొలి విజయం కావడం గమనార్హం. ఏడు మ్యాచ్‌ల్లో ఒక విజయం, 3 పరాజయాలు, 3 'డ్రా'లతో 13 పాయింట్లు ఖాతాలో వేసుకున్న ఆంధ్ర జట్టు ఎలైట్ గ్రూప్ 'బి'లో ఆరో స్థానంలో నిలిచింది. ఓవర్‌నైట్ స్కోరు 95/7తో శనివారం మూడో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన రాజస్తాన్ చివరకు 39.4 ఓవర్లలో 114 పరుగులకు ఆలౌటైంది. అభిజీత్ తోమర్ (31), అజయ్ సింగ్ (30 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) కాస్త పోరాడారు. ఆంధ్ర జట్టు బౌలర్లలో త్రిపురాణ విజయ్ మరోసారి 5 వికెట్లతో విజృంభించగా... పృథ్వీరాజ్ 4 వికెట్లు తీశాడు. అనంతరం 153 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆంధ్ర జట్టు 31 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 157 పరుగులు చేసి గెలిచింది. రికీ భుయ్ (76 బంతుల్లో 62; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధశతకంతో మెరవగా... శ్రీకర్ భరత్ (43; 5 ఫోర్లు), కరణ్ షిండే (35 నాటౌట్; 7 ఫోర్లు) రాణించారు. రాజస్తాన్ బౌలర్లలో ఖలీల్ అహ్మద్ 2 వికెట్లు పడగొట్టాడు. అంతకుముందు రాజస్తాన్ తొలి ఇన్నింగ్స్‌లో 258 పరుగులు చేయగా... ఆంధ్ర జట్టు 220 పరుగులు చేసింది. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 10 వికెట్లు పడగొట్టిన ఆఫ్‌స్పిన్నర్ విజయ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. ఎలైట్ గ్రూప్ 'బి' నుంచి విదర్భ, గుజరాత్ క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించాయి.

సాహా వీడ్కోలు

కోల్‌కతా: భారత మాజీ వికెట్ కీపర్ వృద్ధిమాన్ సాహా అన్ని రకాల క్రికెట్ నుంచి వీడ్కోలు తీసుకున్నాడు. పంజాబ్ జట్టుతో శనివారం ముగిసిన రంజీ ట్రోఫీ గ్రూప్ 'సి' చివరి లీగ్ మ్యాచ్‌తో సాహా ఆటకు గుడ్‌బై చెప్పాడు. ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో బెంగాల్ జట్టు ఇన్నింగ్స్ 13 పరుగుల తేడాతో విజయం సాధించింది. పంజాబ్ తొలి ఇన్నింగ్స్‌లో 191 పరుగులకు ఆలౌటైంది. అనంతరం బెంగాల్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 343 పరుగులకు ఆలౌటై 152 పరుగుల ఆధిక్యం సంపాదించింది. అయితే తన కెరీర్ చివరి ఇన్నింగ్స్‌లో సాహా 'డకౌట్' కావడం గమనార్హం. 152 పరుగులతో వెనుకబడి రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన పంజాబ్ 35.4 ఓవర్లలో 139 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. 40 ఏళ్ల సాహా భారత్ తరఫున 40 టెస్టులు, 9 వన్డేలు ఆడాడు. దేశవాళీ క్రికెట్‌లో బెంగాల్, త్రిపుర జట్లకు ప్రాతినిధ్యం వహించి 142 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు, 116 లిస్ట్–ఎ మ్యాచ్‌లు ఆడాడు.

హైదరాబాద్ లక్ష్యం 220

- ప్రస్తుతం 23/1
- 3 వికెట్లతో రాణించిన సిరాజ్
- విదర్భ రెండో ఇన్నింగ్స్‌లో 355
- కరుణ్ నాయర్ సెంచరీ


సిరాజ్

నాగ్‌పూర్: రంజీ ట్రోఫీలో హైదరాబాద్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న భారత పేసర్ మొహమ్మద్ సిరాజ్ (3/59) మెరుగైన ప్రదర్శన కనబర్చాడు. ఫలితంగా ఎలైట్ గ్రూప్ 'బి'లో భాగంగా విదర్భతో జరుగుతున్న మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు విజయంపై కన్నేసింది. ఓవర్‌నైట్ స్కోరు 56/2తో శనివారం మూడో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన విదర్భ జట్టు చివరకు 95.2 ఓవర్లలో 355 పరుగులకు ఆలౌటైంది. సీనియర్ బ్యాటర్ కరుణ్ నాయర్ (193 బంతుల్లో 105; 14 ఫోర్లు, 1 సిక్స్) మరో శతకంతో విజృంభించగా... ఓపెనర్ అథర్వ తైడె (163 బంతుల్లో 93; 10 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీ చేజార్చుకున్నాడు. హర్ష్ దూబే (65 బంతుల్లో 55; 5 ఫోర్లు, 1 సిక్స్) అర్ధశతకంతో మెరిశాడు. హైదరాబాద్ బౌలర్లలో సిరాజ్ 3 వికెట్లు పడగొట్టగా... కెప్టెన్ చామా మిలింద్, తనయ్ త్యాగరాజన్, రక్షణ్ రెడ్డి రెండేసి వికెట్లు తీశారు. అంతకుముందు విదర్భ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 190 పరుగులకు ఆలౌట్ కాగా... హైదరాబాద్ జట్టు 326 పరుగులు చేసింది. దీంతో హైదరాబాద్ ముందు 220 పరుగుల లక్ష్యం నిలిచింది. ఛేదనలో శనివారం ఆట ముగిసే సమయానికి హైదరాబాద్ రెండో ఇన్నింగ్స్‌లో 6 ఓవర్లలో వికెట్ నష్టానికి 23 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్ 'సెంచరీ హీరో' తన్మయ్ అగర్వాల్ (6) అవుట్ కాగా... అభిరత్ రెడ్డి (9 బ్యాటింగ్), తనయ్ త్యాగరాజన్ (7 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. నేడు ఆటకు చివరి రోజు కాగా... చేతిలో 9 వికెట్లు ఉన్న హైదరాబాద్ జట్టు విజయానికి ఇంకా 197 పరుగులు చేయాల్సి ఉంది.



కోహ్లికి గెలుపు కానుక

- రంజీ ట్రోఫీ చివరి లీగ్ మ్యాచ్‌లో రైల్వేస్‌పై ఢిల్లీ విజయం

న్యూఢిల్లీ: పుష్కరకాలం తర్వాత దేశవాళీ టోర్నీ రంజీ ట్రోఫీ బరిలోకి దిగిన భారత స్టార్ విరాట్ కోహ్లికి జట్టు సహచరులు గెలుపు కానుక ఇచ్చారు. కోహ్లికి రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేసే అవకాశమే రాకుండానే ఢిల్లీ జట్టు ఘనవిజయం సాధించింది. ఎలైట్ గ్రూప్ 'డి'లో భాగంగా మూడు రోజుల్లో ముగిసిన పోరులో ఢిల్లీ జట్టు ఇన్నింగ్స్ 19 పరుగుల తేడాతో రైల్వేస్ జట్టును ఓడించింది. ఓవర్‌నైట్ స్కోరు 334/7తో శనివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఢిల్లీ జట్టు... చివరకు 106.4 ఓవర్లలో 374 పరుగులకు ఆలౌటైంది. సుమిత్ మాథుర్ (206 బంతుల్లో 86; 8 ఫోర్లు) మెరుగైన ప్రదర్శన చేశాడు. రైల్వేస్ బౌలర్లలో హిమాన్షు సాంగ్వాన్ 4, కునాల్ మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన రైల్వేస్ జట్టు 30.5 ఓవర్లలో 114 పరుగులకు ఆలౌటైంది. మొహమ్మద్ సైఫ్ (31) టాప్ స్కోరర్. ఢిల్లీ బౌలర్లలో శివమ్ శర్మ 5 వికెట్లతో ఆకట్టుకున్నాడు. అంతకుముందు రైల్వేస్ తొలి ఇన్నింగ్స్‌లో 241 పరుగులు చేసింది. ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చిన సుమిత్ మాథుర్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. మ్యాచ్‌లో భాగంగా మూడో రోజు రక్షణ వలయాన్ని ఛేదించుకొని విరాట్ కోసం ముగ్గురు అభిమానులు మైదానంలోకి పరుగులు తీయడంతో కాస్త గందరగోళ పరిస్థితి నెలకొంది. ఈ మ్యాచ్ తొలి రోజు గ్రౌండ్‌లో ఫీల్డింగ్ చేస్తున్న కోహ్లి వద్దకు వచ్చిన అభిమాని అతడి కాళ్లు మొక్కగా... శనివారం ముగ్గురు అభిమానులు సెక్యూరిటీని దాటి మైదానంలోకి దూసుకొచ్చారు. దీంతో భద్రతా సిబ్బంది వారిని బలవంతంగా బయటకు తీసుకెళ్లారు. 'గతంలో ఇలాంటి సంఘటనలు ఎప్పుడూ చూడలేదు. కోహ్లి భయ్యా క్రేజ్‌కు ఇది నిదర్శనం. మైదానంలో దూసుకొచ్చిన వాళ్లను కొట్టకండి అని కోహ్లి సెక్యూరిటీ సిబ్బందితో చెప్పాడు' అని ఢిల్లీ స్పిన్నర్ శివమ్ శర్మ తెలిపాడు. మ్యాచ్ అనంతరం సహచర ఆటగాళ్లు, సహాయక సిబ్బంది, గ్రౌండ్ స్టాఫ్‌తో కోహ్లి ఫొటోలు దిగాడు.

ముంబై ఘనవిజయం

- ఇన్నింగ్స్ 456 పరుగులతో మేఘాలయ చిత్తు
- శార్దుల్ ఆల్‌రౌండ్ షో
- రైల్వేస్‌పై ఢిల్లీ ఇన్నింగ్స్ తేడాతో విజయం
- రంజీ ట్రోఫీ

ముంబై: నాకౌట్ రేసులో నిలవాలంటే భారీ విజయం సాధించడం తప్పనిసరి అయిన నేపథ్యంలో ముంబై జట్టు ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. ఎలైట్ గ్రూప్ 'ఎ'లో భాగంగా మేఘాలయతో జరిగిన పోరులో ముంబై ఇన్నింగ్స్ 456 పరుగుల తేడాతో గెలిచి 'బోనస్ పాయింట్' సాధించింది. ఈ సీజన్‌లో 7 మ్యాచ్‌లాడిన ముంబై 4 విజయాలు, 2 పరాజయాలు, 1 'డ్రా'తో 29 పాయింట్లు ఖాతాలో వేసుకొని ప్రస్తుతానికి గ్రూప్ అగ్రస్థానంలో కొనసాగుతోంది. జమ్మూ కశ్మీర్ (29 పాయింట్లు), బరోడా (27 పాయింట్లు) వరుసగా రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. ఈ రెండు జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్ ఫలితంతో గ్రూప్ భవితవ్యం తేలనుంది. ఓవర్‌నైట్ స్కోరు 27/2తో శనివారం మూడో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన మేఘాలయ జట్టు 30.1 ఓవర్లలో 129 పరుగులకు ఆలౌటైంది. క్రిషన్ లింగ్డో (39; 8 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా... మిగతావారు ఆకట్టుకోలేకపోయారు. ముంబై బౌలర్లలో పేస్ ఆల్‌రౌండర్ శార్దుల్ ఠాకూర్, తనుశ్ కొటియాన్ చెరో 4 వికెట్లు పడగొట్టారు. అంతకుముందు మేఘాలయ తొలి ఇన్నింగ్స్‌లో 86 పరుగులకు ఆలౌట్ కాగా... ముంబై 671/7 వద్ద తొలి ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. బ్యాట్‌తో మెరుపు హాఫ్‌సెంచరీ చేయడంతో పాటు రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 8 వికెట్లు పడగొట్టిన శార్దుల్ ఠాకూర్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది.


శార్దుల్



రాష్ట్రపతి భవన్ ప్రాంగణంలోని అమృత్ ఉద్యాన్‌లో శనివారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కలియదిరిగారు. ఈ అమృత్ ఉద్యాన్‌ను ఆదివారం నుంచి మార్చి 30వ తేదీ వరకు ప్రజల సందర్శనార్థం తెరచి ఉంచుతారు. సందర్శకులు వారంలో ఆరు రోజులపాటు రాష్ట్రపతి భవన్ మ్యూజియంను కూడా ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల మధ్యలో సందర్శించవచ్చని రాష్ట్రపతి భవన్ ఒక ప్రకటనలో తెలిపింది.

అమెరికా 'గ్రీన్‌ల్యాండ్' కలలకు చెక్ పెట్టిన డెన్మార్క్!

గ్రీన్‌ల్యాండ్ స్వాధీనం కోసం డెన్మార్క్‌కు అగ్రరాజ్యం బెదిరింపులు.. కొన్ని లక్షల మంది ఊబకాయులున్న అమెరికాపైనే ప్రభావం చూపించనున్నాయి. బెదిరింపులకు, ఊబకాయులకు సంబంధమేంటనే సందేహం వస్తోంది కదూ.. అయితే ఇది తెలుసుకోవాల్సిందే!

గ్రీన్‌ల్యాండ్‌పై ఆధిపత్యం కోసం అగ్రరాజ్యం అమెరికా, యూరప్ దేశం డెన్మార్క్ ప్రచ్ఛన్న పోరు కొనసాగుతోంది. గ్రీన్‌ల్యాండ్ ఖనిజ సంపదపై కన్నేసిన డోనాల్డ్ ట్రంప్ అధ్యక్షునిగా ఎన్నికైన నాటినుంచే కొనుగోలు ఆలోచనను తెరపైకి తెచ్చారు. అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన చర్యలను వేగవంతం చేశారు. గ్రీన్‌ల్యాండ్‌పై అధికారాలున్న డెన్మార్క్‌పై బెదిరింపులకు పాల్పడుతున్నారు. తమ ప్రతిపాదనకు అంగీకరించకపోతే అధిక సుంకాలు విధిస్తామంటూ డెన్మార్క్‌ను హెచ్చరించారు. అవసరమైతే సైనిక చర్యకు కూడా వెనుకాడబోమనే సంకేతాలూ ఇచ్చారు. అయినా గ్రీన్‌ల్యాండ్ అమ్మకానికి లేదంటూ డెన్మార్క్ స్పష్టం చేసింది. అమెరికా టారిఫ్ బెదిరింపులు డెన్మార్క్‌ను ప్రభావితం చేయడం ప్రశ్నార్థకమే. ఎందుకంటే అమెరికాను ఎదుర్కోవడానికి డెన్మార్క్ దగ్గర కీలక ఆయుధాలున్నాయి. వీటిలో మొదటిది ఊబకాయాన్ని తగ్గించే ఔషధం ఓజెంపిక్, రెండోది పిల్లలకు ఇష్టమైన లెగో బొమ్మల ఎగుమతులు.

ప్రపంచంలోనే అత్యధిక ఊబకాయులు అమెరికాలోనే..

ప్రపంచంలోనే అత్యధిక ఊబకాయం రేటు అమెరికాలో ఉంది. ఓ నివేదిక ప్రకారం.. 23 అమెరికన్ రాష్ట్రాల్లో, ముగ్గురు పెద్దల్లో ఒకరి కంటే ఎక్కువ మంది (35%) ఊబకాయంతో బాధపడుతున్నారు. డానిష్ ఫార్మా దిగ్గజం నోవో నోర్డిస్క్ తయారు చేసిన ఓజెంపిక్, వెగోవి మందులు.. అమెరికాలో ఊబకాయం, డయాబెటిస్ చికిత్సలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాయి. జర్నల్ ఆఫ్ ది అమెరికన్ మెడికల్ అసోసియేషన్ నిర్వహించిన ఓ అధ్యయనం ప్రకారం.. 2021 నుంచి 2023 వరకు అమెరికాలో ఓజెంపిక్ ఉపయోగిస్తున్నవారి సంఖ్య 400 శాతం పెరిగింది. ఇప్పటికే అమెరికన్లు ఒక ఓజెంపిక్ ప్యాకెట్ కోసం దాదాపు వెయ్యి డాలర్లు చెల్లిస్తున్నారు. బీమా, డిస్కౌంట్లు లేకుండా అది కాస్తా 1300 డాలర్లు అవుతుంది. ఒకవేళ అమెరికా ఈ మందులు తయారు చేయాలనుకున్నా.. ఓజెంపిక్, వెగోవిలకు అవసరమైన సెమాగ్లుటైడ్ డెన్మార్క్‌లోనే తయారవుతుంది. ఇతర దేశాలతో పోలిస్తే అమెరికాలో ఇప్పటికే ఈ మందుల ధర ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో ట్రంప్ డెన్మార్క్‌పై భారీ సుంకాలు విధిస్తే ఓజెంపిక్, వెగోవి ధరలు పెంచే అవకాశం ఉంది. ఆ ఒక్కటే కాదు.. ట్రేడింగ్ ఎకనామిక్స్ డేటా ప్రకారం 2023లో డెన్మార్క్ నుంచి 5.7 బిలియన్ డాలర్ల విలువైన మందులు, వ్యాక్సిన్లు మరియు యాంటీబయాటిక్స్‌ను అమెరికా దిగుమతి చేసుకుంది.





డెన్మార్క్ కేంద్రంగా లెగో గ్రూప్...

ప్రపంచంలోనే అతిపెద్ద బొమ్మల తయారీ సంస్థ లెగో గ్రూప్ కూడా డెన్మార్క్ కేంద్రంగానే పనిచేస్తోంది. ఈ బొమ్మలకు అమెరికాలో ప్రజాదరణ ఎక్కువ. అంతేకాదు.. అమెరికాకు వినికిడి పరికరాల సరఫరాలో కూడా డెన్మార్క్‌దే అగ్రస్థానం. ఇలాంటి పరిస్థితుల్లో ట్రంప్ టారిఫ్ బెదిరింపులు.. తిరిగి అమెరికాకు తలనొప్పులు తెచ్చే అవకాశం ఉంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

ట్రంప్ మరో ఉత్తర్వును నిలిపేసిన జడ్జి

బోస్టన్: ఫెడరల్ నిధులను నిలిపివేయాలన్న డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వ ఆదేశాలను తాత్కాలికంగా నిలిపివేస్తూ మరో జడ్జి ఉత్తర్వులు జారీ చేశారు. నిధుల్లేకుంటే పలు ఫెడరల్ విభాగాల కార్యకలాపాలు నిలిచిపోతే ప్రమాదమున్నందున తక్షణమే జోక్యం చేసుకోవాలంటూ దాదాపు డజను రాష్ట్రాలు చేసిన వినతిపై రోడ్ ఐలాండ్‌కు చెందిన జడ్జి జాన్ మెకొన్నెల్ శుక్రవారం ఈ మేరకు ఆదేశించారు. రుణాలు, గ్రాంట్ల నిలిపివేత ఉత్తర్వులు అమల్లోకి రాకమునుపే ఈ వారం మొదట్లోనే వాషింగ్టన్‌కు చెందిన ఫెడరల్ కోర్టు జడ్జి తాత్కాలిక నిలిపివేత ఆదేశాలివ్వడం తెలిసిందే. ఈ ఉత్తర్వులను పొడిగించకుంటే సోమవారం వరకు మాత్రమే అమల్లో ఉంటాయి. కాగా, జడ్జి మెకొన్నెల్ మాజీ అధ్యక్షుడు ఒబామా హయాంలో నియమితులవడం గమనార్హం.

'క్యాపిటల్' కేసులు వాదించిన లాయర్లపై వేటు

వాషింగ్టన్: 2021 జనవరి 6న వాషింగ్టన్‌లోని కేపిటల్ హిల్ భవనంపై దాడికి పాల్పడిన వారికి వ్యతిరేకంగా వాదించిన లాయర్లపై వేటు వేసేందుకు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం సిద్ధమైంది. తాత్కాలిక డిప్యూటీ అటార్నీ జనరల్ ఎమిల్ బోవ్ ఈ మేరకు వాషింగ్టన్ డీసీలోని తాత్కాలిక యూఎస్ అటార్నీకి ఆదేశాలిచ్చినట్లు వార్తలు వచ్చాయి. అయితే, ఎందరికి ఉద్వాసన పలుకుతున్నారన్నది వెల్లడి కాలేదు. ఆ ఘటనపై దర్యాప్తు చేపట్టిన ఎఫ్‌బీఐ అధికారుల్లో కొందరిని సైతం ఇళ్లకు పంపించేందుకు ట్రంప్ సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇటువంటి చర్యలతో అధ్యక్షుడు ట్రంప్ దేశ న్యాయవ్యవస్థ స్వతంత్రతను దెబ్బతీస్తున్నారన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. కాగా, క్యాపిటల్ భవనంపై దాడిలో పాల్గొన్న సుమారు 1,500 మందికి ట్రంప్ ఇటీవల క్షమాభిక్ష ప్రకటించడం తెలిసిందే.

సాయుధ ముఠాల చేతుల్లోకి ఖైబర్ ప్రావిన్స్

పెషావర్: పాకిస్తాన్‌లోని కల్లోలిత ఖైబర్ పఖ్తున్వా ప్రావిన్స్ సాయుధ ముఠాల చేతుల్లోకి వెళ్లింది. ఇప్పటి వరకు అక్కడ అధికారంలో ఉన్న ఇమ్రాన్ ఖాన్‌కు చెందిన పాకిస్తాన్ తెహ్రీక్–ఇ–ఇన్సాఫ్(పీటీఐ) పట్టుకోల్పోయింది. సాయుధ గ్రూపులే ప్రావిన్స్‌లో పాలనను నడిపిస్తున్నాయని జమియత్ ఉలేమా–ఇ–ఫజుల్(జేయూఐ–ఎఫ్) చీఫ్ మౌలానా ఫజులుర్ రెహ్మాన్ చెప్పారు. ఖైబర్ ప్రావిన్స్‌లో అధికారంలోకి రావడానికి పీటీఐకి సహకరించిన సాయుధ గ్రూపులే ఇప్పుడు సొంతంగా పాలనా బాధ్యతలు చేపట్టాయన్నారు. ప్రావిన్స్‌లో క్షీణిస్తున్న శాంతిభద్రతలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. చీకటి పడ్డాక పోలీసులు గస్తీ చేపట్టే పరిస్థితులు అక్కడ లేవన్నారు. తాము మద్దతు ఉపసంహరించుకున్న మరుక్షణమే ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం పడిపోతుందన్నారు. ఒక్క రోజు కూడా సొంతంగా పాలించే సత్తా ఈ ప్రభుత్వానికి లేదంటూ వ్యాఖ్యానించారు. దేశంలో రాజకీయ సమస్యకు చర్చలే ఏకైక పరిష్కారమన్నది తమ పార్టీ నమ్మకమని ఆయన చెప్పారు. అద్భుత శక్తులు జోక్యం చేసుకుంటే తప్ప పీటీఐ చీఫ్ ఇమ్రాన్ ఖాన్ జైలు నుంచి ఇప్పట్లో బయటకు వచ్చే అవకాశాల్లేవన్నారు.

ప్రజ్ఞా ఠాకూర్‌పై వారెంట్ రద్దు

ముంబై: బీజేపీ మాజీ ఎంపీ, మాలెగావ్ పేలుడు కేసులో ప్రధాన ముద్దాయి ప్రజ్ఞా సింగ్ ఠాకూర్ శుక్రవారం ఎన్ఐఏ ప్రత్యేక కోర్టులో హాజరయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మహారాష్ట్ర యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్(ఏటీఎస్) పెట్టిన చిత్రహింసల వల్లే తన ఆరోగ్యం దెబ్బతిందని చెప్పారు. స్వయంగా ఆమె హాజరుకావడంతో జడ్జి ఏకే లాహోటీ బెయిలబుల్ వారెంట్‌ను కొట్టివేస్తున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి మొదటి వారంలో మరోసారి కోర్టులో హాజరు కావాల్సి ఉంటుందని తెలిపారు. 2024 జూన్ నుంచి విచారణకు హాజరు కాకపోవడంతో ఆమెపై అదే ఏడాది నవంబర్‌లో బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. 2008 సెప్టెంబర్ 29న మహారాష్ట్రలోని మాలెగావ్ పట్టణంలోని మసీదు వద్ద బైక్‌కు అమర్చిన బాంబు పేలిన ఘటనలో ఆరుగురు చనిపోగా 100 మంది గాయపడ్డారు.

ఛత్తీస్‌గఢ్‌లో బర్డ్‌ఫ్లూ కలకలం

రాయ్‌గఢ్: ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌గఢ్‌లోని ప్రభుత్వ పౌల్ట్రీ ఫామ్‌లో బర్డ్ ఫ్లూ కలకలం రేపింది. దీంతో అధికారులు 17,000 కోళ్లు, కౌజు పిట్టలను చంపారు. ఫామ్ చుట్టూ 10 కిలోమీటర్ల పరిధిలో అధికారులు నిఘా పెంచారు. స్థానికంగా ఓ పౌల్ట్రీ ఫామ్‌లో ఇటీవల కొన్ని కోళ్లు మృతి చెందడంతో నమూనాలను పరీక్షల నిమిత్తం భోపాల్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హై సెక్యూరిటీ యానిమల్ డిసీజెస్ (ఎన్ ఐహెచ్ ఎస్ ఏడీ)కు పంపించారు. బర్డ్‌ఫ్లూ నిర్ధారణ కావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. 5 వేల కోళ్లు, 12 వేల కౌజు పిట్టలను చంపేశారు. కోళ్లఫారాన్ని సీల్ చేశారు. ఇన్‌ఫెక్షన్ ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా పౌల్ట్రీ ఫామ్‌లను శానిటైజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. 'నిఘా జోన్'లోని పౌల్ట్రీఫామ్‌లను, గుడ్ల దుకాణాలను మూసివేశారు. బర్డ్ ఫ్లూ మనుషులపై ప్రభావం పడలేదని అధికారులు ధ్రువీకరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. అనారోగ్యం వస్తే సకాలంలో చికిత్స కోసం సమీప ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలని సూచించారు.

బీజేపీ మద్దతుదారులూ మాకే ఓటేయాలి

- మా పథకాలతో వారికీ్కూడా నెలకు రూ. 25వేల ఆదా
- ఎన్నికల ప్రచార వీడియోలో ఆప్ చీఫ్ కేజ్రీవాల్

న్యూఢిల్లీ: ఢిల్లీలో తమ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో బీజేపీ కార్యకర్తలకు సైతం నెలకు రూ.25 వేల వరకు ఆదా అవుతున్నందున, వారు కూడా తమ అభ్యర్థులకే ఓటేయాలిని ఆప్ చీఫ్ కేజ్రీవాల్ కోరారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పథకాలతో ప్రజలు ఎలాంటి లబ్ధి పొందుతున్నారో చెప్పాలని బీజేపీ అభిమానిని తాను ప్రశ్నించానన్నారు. ఇందుకు సంబంధించిన ఒక వీడియోను శనివారం ఆయన విడుదల చేశారు. కొత్తగా ప్రకటించిన పథకాలతో కలుపుకుంటే ఒక్కో కుటుంబానికి నెలకు రూ.35 వేల వరకు ఆదా కానుందన్నారు. అందుకే చీపురు గుర్తు మీటనే నొక్కాలని ప్రజలను కేజ్రీవాల్ కోరారు. ఇలా ఉండగా, రోహిణి ప్రాంతంలో ఎన్నికల ప్రచారం చేసుకుంటున్న తమ ఎమ్మెల్యే మొహిందర్ గోయెల్‌పై బీజేపీ గూండాలు దాడికి దిగారని కేజ్రీ ఆరోపించారు. అయితే, ఈ ఘటనలో మొహిందర్‌కు ఎలాంటి గాయాలు కాలేదని పోలీసులు తెలిపారు. అనంతరం, రిథాలాలో కేజ్రీవాల్ ప్రసంగించిన సభలో ఆయన బ్యాండేజీలతో వీల్‌చైర్‌లో కన్పించారు. ఆయన్ను ఈ స్థితిలో చూసి తనకు ఏడుపొస్తోందని కేజ్రీవాల్ అన్నారు. ఓటమి తప్పదని తెలిసే బీజేపీ ఇలాంటివి చేయిస్తోందని ఆరోపించారు. ఆప్ తరఫున టీఎంసీ ఎంపీ శత్రుఘ్న సిన్హా శనివారం ఢిల్లీలోని కృష్ణా నగర్, లక్ష్మీ నగర్‌లలో ప్రచారం చేశారు.

మాజీ సీఈసీ నవీన్ చావ్లా ఇకలేరు

న్యూఢిల్లీ: మాజీ ఎన్నికల ప్రధానాధికారి(సీఈసీ) నవీన్ చావ్లా(79) కన్నుమూశారు. అపోలో ఆస్పత్రిలో శనివారం ఉదయం ఆయన తుదిశ్వాస విడిచారని మరో మాజీ సీఈసీ ఎస్‌వై ఖురేషి తెలిపారు. పది రోజుల క్రితం కలిసినప్పుడు బ్రెయిన్ సర్జరీ కోసం ఆస్పత్రిలో చేరనున్నట్లు చెప్పారని గుర్తు చేసుకున్నారు. 1969 బ్యాచ్ ఐఏఎస్ అయిన చావ్లా 2005 నుంచి 2009 వరకు ఎన్నికల కమిషనర్‌గా ఉన్నారు. అనంతరం 2009 ఏప్రిల్ నుంచి 2010 జులై వరకు సీఈసీగా పనిచేశారు. కమిషనర్‌గా ఆయన పక్షపాతంతో వ్యవహరించినట్లు బీజేపీ ఆరోపించింది. 2006లో లోక్‌సభలో అప్పటి ప్రతిపక్ష నేత ఎల్‌కే అడ్వాణీ 204 మంది ఎంపీల సంతకాలతో రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాంకు వినతి పత్రం సమర్పించారు. బీజేపీ ఆరోపణలపై 2009లో అప్పటి సీఈసీ ఎన్ గోపాలస్వామి కమిషనర్ బాధ్యతల నుంచి చావ్లాను తొలగించాలంటూ ప్రభుత్వానికి సిఫారసు కూడా చేశారు. ఈ విషయమై బీజేపీ సుప్రీంకోర్టు దాకా వెళ్లింది. దేశ 16వ సీఈసీ నవీన్ చావ్లా హయాంలో కీలక ఎన్నికలు సంస్కరణలు అమలయ్యాయి. స్త్రీ, పురుషతో పాటు థర్డ్ జెండర్ వ్యక్తులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా 'ఇతరులు'అనే కేటగిరీని తీసుకురావడం అందులో ఒకటి. సీఈసీతో సమానంగా కమిషనర్లను అభిశంసించాలన్నా పార్లమెంట్‌లో మూడింట రెండొంతుల మెజారిటీ అవసరమయ్యేలా రాజ్యాంగ సవరణ తేవాలని ప్రతిపాదించారు. ప్రభుత్వం దీనిపై స్పందించకపోవడంతో కార్యరూపం దాల్చలేదు. కాగా, నవీన్ చావ్లా 1992లో మదర్ థెరిసా జీవిత చరిత్రను రాశారు. 1997లో ప్రచురితమైన లైఫ్ అండ్ వర్క్ ఆఫ్ మదర్ థెరిసా అనే పుస్తకానికి సహ రచయితగా ఉన్నారు.

కాల్వలో పడ్డ కారు.. 9 మంది సజీవ సమాధి

చండీగఢ్: హరియాణాలోని ఫతేహాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. 14 మందితో వెళ్తున్న క్రూయిజర్ వాహనం భాక్రా కాల్వలోకి దూసుకెళ్లగా అందులోని ఐదుగురు మహిళలు సహా 9 మంది సజీవ సమాధి అయ్యారు. మరో ముగ్గురు గల్లంతయ్యారు. 11 ఏళ్ల బాలుడితోపాటు మరో వ్యక్తిని రక్షించామని, గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు. రటియా ప్రాంతంలోని సర్దారెవాలా గ్రామ సమీపంలో శుక్రవారం రాత్రి ఘటన జరిగిందన్నారు. దట్టమైన పొగమంచే కారణమని భావిస్తున్నామన్నారు. బాధితులంతా మెహ్మరా గ్రామానికి చెందిన వారని, పంజాబ్‌లోని ఫజిల్కాలో పెళ్లి వేడుకకు హాజరై వస్తుండగా ప్రమాదం జరిగిందని తెలిపారు.



మహాకుంభ మేళాను పురస్కరించుకుని శనివారం ప్రయాగ్‌రాజ్‌లోని సంగం వద్ద పుణ్యస్నానాలచరిస్తున్న ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్, ఆయన భార్య సుదేశ్ ధన్‌ఖడ్

ఆప్‌కు ప్రతికూల పవనాలు: అమిత్ షా

న్యూఢిల్లీ: అవినీతిలో కూరుకుపోయి, అక్రమ వలసదారులకు ఆశ్రయమిస్తున్న ఆప్ ప్రభుత్వానికి ఈ ఎన్నికల్లో గట్టి ప్రతికూల పవనాలు వీస్తున్నాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు. ఢిల్లీలో ఆప్ '3జీ'ప్రభుత్వాన్ని నడుపుతోందన్న ఆయన అవి ఘొటాలె వాలె సర్కార్(కుంభకోణాల సర్కార్), ఘుస్‌బైఠియోం కో పనాహ్ దేనేవాలీ సర్కార్ (చొరబాటుదార్లకు ఆశ్రయమిచ్చే ప్రభుత్వం), ఘప్లె కర్నే వాలీ సర్కార్(అవినీతిలో మునిగిన ప్రభుత్వం) అంటూ వ్యాఖ్యానించారు. ముస్తాఫాబాద్ నియోజకవర్గంలో జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీలో అమిత్ షా మాట్లాడారు. ఈ ఎన్నికల్లో వీస్తున్న ప్రతికూల పవనాల గురించి అప్రమత్తంగా ఉండాలని ఆప్ నేతలను కోరారు. ఆప్‌ను ప్రజలు చీపురుతో ఆప్‌ను ఊడ్చేయబోతున్నారన్నారు. ఆప్ సర్కార్‌ను వదిలించుకునే సమయం ఆసన్నమైందని చెప్పారు. ఢిల్లీ అభివృద్ధి కోసం బీజేపీకే ఓటేయాలని ఆయన ప్రజలను కోరారు.

గుజరాత్ అల్లర్లపై న్యాయ పోరాటం చేసిన జకియా జాఫ్రి కన్నుమూత

అహ్మదాబాద్: 2002 గుజరాత్ అల్లర్లలో ప్రాణాలు కోల్పోయిన కాంగ్రెస్ మాజీ ఎంపీ ఎహ్సాన్ జాఫ్రి భార్య జకియా జాఫ్రి(86) శనివారం చనిపోయారు. 'అమ్మ అహ్మదాబాద్‌లోని ఆమె సోదరి ఇంట్లో ఉన్నారు. ఎప్పటిలాగానే శనివారం ఉదయం కూడా కుటుంబసభ్యులతో గడిపారు. అసౌకర్యం అనిపిస్తోందని చెప్పడంతో డాక్టర్‌ను పిలిచాం. ఆయన వచ్చే సరికే చనిపోయారు. అప్పుడు సమయం 11.30 గంటలు'అని జాఫ్రి కుమారుడు తన్వీర్ తెలిపారు. అయోధ్య నుంచి కరసేవకులతో వస్తున్న రైలుకు అహ్మదాబాద్‌లో దుండగులు నిప్పు పెట్టడంతో 59 మంది కరసేవకులు చనిపోవడం మరునాడే అహ్మదాబాద్‌లోని గుల్బర్గ్‌సొసైటీ కాలనీపై జరిగిన దాడిలో ఎహ్సాన్ జాఫ్రి సహా 69 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ పరిణామాలు రాష్ట్రంలో తీవ్ర కలహాలకు దారి తీశాయి. ఈ ఘటనల వెనుక భారీ రాజకీయ కుట్ర దాగి ఉందంటూ అనంతరం జకియా జాఫ్రి సుప్రీంకోర్టు గడప తొక్కారు. న్యాయం పోరాటం చేపట్టి, దేశం దృష్టిని ఆకర్షించారు. అప్పటి ముఖ్యమంత్రి నరేంద్ర మోదీ తదితరులపై చార్జిషీటు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అల్లర్లను అదుపు చేసేందుకు పోలీసు బలగాలు చాలినంతగా లేరనే విషయం తెలిసి కూడా ఆయన ప్రభుత్వం సైన్యాన్ని మోహరించడంలో ఆలస్యం చేసిందని వాదించారు.

ఆమె వాదనను గుజరాత్ హైకోర్టు తిరస్కరించడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆమె ఆరోపణలపై విచారణకు సుప్రీం ఆదేశాలతో 2008లో సిట్ ఏర్పాటైంది. 2012లో సిట్ నివేదిక ఇవ్వడంతో సుప్రీంకోర్టు కేసును మూసివేసింది. మోదీ, మరో 62 మందికి క్లీన్‌చిట్ ఇచ్చింది. దీనిని సవాల్ చేస్తూ ఆమె తిరిగి మెట్రోపాలిటన్ కోర్టుకు, తర్వాత గుజరాత్ హైకోర్టుకు వెళ్లారు. ఫలితం దక్కలేదంటూ చివరికి మళ్లీ సుప్రీంకోర్టుకు వచ్చారు. చివరికి, జకియా జాఫ్రి వాదనల్లో పస లేదంటూ సుప్రీంకోర్టు 2022లో ఆమె అర్జీని కొట్టివేసింది. జకియా జాఫ్రి మరణంపై సామాజిక కార్యకర్త తీస్తా షెతల్వాడ్ స్పందించారు. దూరదృష్టి కలిగిన మానవతావాదిగా జకియా జాఫ్రిని అభివర్ణించారు.

రష్యా క్షిపణి దాడుల్లో ఐదుగురు మృతి

కీవ్: ఉక్రెయిన్ నగరాలు, పట్టణాలే లక్ష్యంగా రష్యా క్షిపణులు, డ్రోన్లతో జరిపిన దాడుల్లో కనీసం ఐదుగురు చనిపోగా 10 మంది వరకు గాయపడ్డారు. పొల్టావా నగరంలోని అపార్టుమెంట్‌పై జరిగిన క్షిపణి దాడిలో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. తీవ్రంగా దెబ్బతిన్న భవనంలోని 21 మందిని సిబ్బంది కాపాడారు. ఖర్కివ్ రీజియన్‌లో కూల్చి వేసిన డ్రోన్ శిథిలాలు పడి ఒక వృద్ధురాలు చనిపోయారని స్థానిక అధికారులు తెలిపారు. మరోవైపు డొనెట్స్క్‌లోని పొక్రొవ్స్క్, చాసివ్ యార్‌లపై పట్టు సాధించడమే లక్ష్యంగా రష్యా ఎడతెగని దాడులు కొనసాగిస్తోంది. చుట్టుపక్కల గ్రామాలను చుట్టుముడుతున్న రష్యా ఆర్మీతో పంట పొలాలు, అటవీ ప్రాంతాల్లో ఉక్రెయిన్ ఆర్మీ తలపడుతోంది. శనివారం రష్యా చేపట్టిన క్షిపణి దాడులతో ఉక్రెయిన్‌లోని పొల్టావా సహా ఏడు ప్రాంతాల్లో విద్యుత్ గ్రిడ్‌లు దెబ్బతిని, అంధకారంలో మునిగిపోయాయి.

కన్స్యూమర్ వాచ్‌డాగ్ చీఫ్ రోహిత్ చోప్రాను తొలగించిన ట్రంప్

పామ్ బీచ్ (యూఎస్): వినియోగదారుల ఆర్థిక రక్షణ సంస్థ డైరెక్టర్ రోహిత్ చోప్రాను అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తొలగించారు. జనవరి 20న ట్రంప్ ప్రమాణ స్వీకారం చేసిన తరువాత.. ఇప్పటికీ పదవిలో ఉన్న డెమొక్రటిక్ అధికారుల్లో చోప్రా ఒకరు. చోప్రా తొలగింపును ఈమెయిల్ ద్వారా ఆయనకు తెలియజేశారు. దీంతో తన నిష్క్రమణ గురించి చోప్రా శనివారం ఎక్స్ వేదికగా ప్రకటించారు. ఏజెన్సీతో తమ ఆలోచనలు, అనుభవాలను పంచుకున్న ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ''చట్టాన్ని ఉల్లంఘించినందుకు శక్తివంతమైన కంపెనీలు, వాటి ఎగ్జిక్యూటివ్‌లపై చర్యలు తీసుకోవడంలో మీరు మాకు సహాయపడ్డారు. మా పనిని మెరుగుపరిచారు''అని చోప్రా పేర్కొన్నారు. ఈ చట్టం ప్రకారం చోప్రా ఐదేళ్ల పాటు సీఎఫ్‌పీబీ డైరెక్టర్‌గా కొనసాగాల్సి ఉంది. అయితే కొత్త అధ్యక్షుడు కోరితే తన పదవి నుంచి తప్పుకుంటానని ఆయన బహిరంగంగానే ప్రకటించారు. చోప్రా తన పదవీకాలంలో క్రెడిట్ రిపోర్టుల నుంచి వైద్య రుణాన్ని తొలగించడం, ఓవర్‌డ్రాఫ్టల జరిమానాలపై పరిమితులను తొలగించడం వంటి చర్యలు తీసుకున్నారు. ఆయన చర్యలను రెగ్యులేటరీ అతిక్రమణగా కొందరు వ్యతిరేకించారు. చోప్రా తొలగింపు.. వినియోగదారుల రక్షణ శకానికి ముగింపును సూచిస్తుందని డెమొక్రాట్, కాలిఫోర్నియా ప్రతినిధి మాక్సిన్ వాటర్స్ అన్నారు. వాల్‌స్ట్రీట్ బిలియనీర్లకు లొంగిపోయి సంస్థను నాశనం చేయడానికి రిపబ్లికన్లు ప్రయత్నిస్తే.. పోరాటం చేస్తామని వారెన్ హెచ్చరించారు.

2008లో ఏర్పాటైన బ్యూరో

2008 ఆర్థిక సంక్షోభం తరువాత తనఖాలు, కారు రుణాలు, ఇతర వినియోగదారుల ఫైనాన్స్‌ను నియంత్రించడానికి బ్యూరోను ఏర్పాటు చేశారు. దీన్ని రిపబ్లికన్లు, వారి ఆర్థిక మద్దతుదారులు చాలాకాలంగా వ్యతిరేకిస్తున్నారు. బ్యూరోను బలహీనపరిచే ఒక సవాలును గతేడాది సుప్రీంకోర్టు తిరస్కరించింది. దీనికి నిధులు సమకూర్చే విధానం రాజ్యాంగాన్ని ఉల్లంఘించదని తీర్పు ఇచ్చింది.

చెన్నై కారు ఛేజింగ్ కేసులో మరో నిందితుడి అరెస్ట్

చెన్నయ్: చెన్నైలోని ఈస్ట్‌కోస్ట్ రోడ్డులో కారు ఛేజింగ్ ఘటనలో మరో నిందితుడిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఏడుగురు నిందితుల్లో ఇప్పటికే నలుగురిని అరెస్టు చేశారు. చంద్రు అనే వ్యక్తిని శనివారం అరెస్టు చేయడంతో మొత్తం అరెస్టుల సంఖ్య ఐదుకు చేరింది. నిందితులను పట్టుకోవడానికి ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, దర్యాప్తు అనంతరం సీసీ కెమెరాల్లో నమోదైన ఫుటేజీలను పరిశీలించి ఫిబ్రవరి 1న చంద్రును అరెస్టు చేశామని డిప్యూటీ పోలీస్ కమిషనర్ కార్తికేయన్ (పల్లికరనై) తెలిపారు. మరో ఇద్దరు నిందితులను కోసం ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయని తెలిపారు. శనివారం అరెస్టైన చంద్రుపై ఇప్పటికే కిడ్నాప్ సహా రెండు క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఈ నేరం సమయంలో ఉపయోగించిన రెండు ఎస్‌యూవీలను ఇప్పటికే స్వాధీనం చేసుకున్నారు. కొద్దిరోజుల క్రితం కారులో ఉన్న కొందరు మహిళలను డీఎంకే జెండా ఉన్న ఎస్‌యూవీలో వచ్చిన వ్యక్తులు వెంబడించి బెదిరిస్తున్న వీడియో క్లిప్ వైరల్‌గా మారింది. ఈస్ట్‌కోస్ట్ రోడ్డులో 2025 జనవరి 25 తెల్లవారుజామున 3 గంటలకు ఈ ఘటన జరిగింది. ఫిర్యాదు ఆధారంగా తొలుత సీఎస్ఆర్ (కమ్యూనిటీ సర్వీస్ రిజిస్టర్) నమోదు చేసిన పోలీసులు.. విచారణ అనంతరం బీఎన్ఎస్, తమిళనాడు మహిళలపై వేధింపుల నిరోధక చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్‌గా మార్చారు. అయితే ఘటన పట్ల ప్రభుత్వ తీరుపై అన్నాడీఎంకే, బీజేపీ సహా విపక్షాలు మండిపడ్డాయి. కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. అయితే రాజకీయ సంబంధాలను పోలీసులు తోసిపుచ్చారు. టోల్ ప్లాజాల వద్ద రుసుము వసూలు చేయడానికి నిందితులు పార్టీ జెండాను ఉపయోగించారని చెప్పారు.

కాంగోలో భీకర పోరు.. 700 మంది మృతి

గోమా: కాంగో సైన్యం, రువాండా మద్దతున్న ఎం23 తీవ్రవాదుల మధ్య భీకరపోరు సాగుతోందని ఐక్యరాజ్యసమితి తెలిపింది. ఈ పోరాటంలో కనీసం 700 మంది చనిపోగా మూడు వేల మంది వరకు గాయాలపాలయ్యారని పేర్కొంది. ఇప్పటికే గోమా నగరాన్ని, ఒక అంతర్జాతీయ విమానాశ్రయాన్ని స్వాధీనం చేసుకున్న తీవ్రవాదులు దక్షిణాన ఉన్న కివు ప్రావిన్స్‌లోకి శరవేగంగా చొచ్చుకు వస్తున్నారని వెల్లడించింది. ఈ క్రమంలో జరుగుతున్న పోరులో భారీగా ప్రాణనష్టం సంభవించిందని వివరించింది. తీవ్రవాదులు మరో విమానాశ్రయాన్ని సైతం స్వాధీనం చేసుకునే ప్రమాదముందని పేర్కొంది. దక్షిణ కివు ప్రావిన్స్‌లోని కొన్ని గ్రామాలను ఆర్మీ తిరిగి స్వాధీనం చేసుకున్నారని ఐరాస పేర్కొంది. గోమా తీవ్రవాదుల వశం కావడంతో విదేశీ సాయుధ ముఠాలు లొంగుబాట పట్టడం, పెద్ద సంఖ్యలో సైనికులు చనిపోవడంతో కాంగో ఆర్మీ బలహీనపడిందని వివరించింది. కాంగోలోని సాయుధ గ్రూపుల్లో ఎం23యే అతిపెద్దది.

మహారాష్ట్రలో 4కు చేరిన జీబీఎస్ మరణాలు

పుణే/గౌహతి: మహారాష్ట్రలో జీబీఎస్ అనుమానిత మరణాల సంఖ్య నాలుగుకు చేరింది. పుణేలోని సింఘడ్ రోడ్డులోని దయారి ప్రాంతానికి చెందిన 60 ఏళ్ల వృద్ధుడు శుక్రవారం మరణించారు. విరేచనాలు, ఇతర లక్షణాలతో జనవరి 27న ఆస్పత్రిలో చేరిన ఆయన శుక్రవారం గుండెపోటుతో మరణించినట్లు పుణె మున్సిపల్ కార్పొరేషన్ (పీఎంసీ) ఆరోగ్య శాఖ తెలిపింది. రాష్ట్రంలో ఇప్పటివరకు 140 జీబీఎస్ అనుమానిత కేసులు నమోదయ్యాయని, వారిలో 98 మందికి జీబీఎస్‌గా నిర్ధారణ అయినట్లు వైద్యారోగ్యశాఖ అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని కేసుల్లో ఎక్కువ శాతం పుణే, పరిసర ప్రాంతాల్లో నమోదవుతున్నాయి. దీంతో నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 160 నీటి నమూనాలను సేకరించిన అధికారులు పరీక్షలు నిర్వహించారు. ఎనిమిది వనరుల నుంచి సేకరించిన నీటి నమూనాలు కలుషితమయ్యాయని వెల్లడించారు.

అసోంలో తొలి జీబీఎస్ మరణం

జీబీఎస్ కారణంగా అసోంలోని గౌహతిలో 17 ఏళ్ల బాలిక మరణించింది. అస్సాంలో ఇలాంటిది మొదటి కేసని ఆరోగ్య కేంద్రం వైద్యులు శనివారం తెలిపారు. అయితే దీనిని ఆస్పత్రి గానీ, రాష్ట్ర ఆరోగ్య శాఖ గానీ ధ్రువీకరించలేదు. అయితే 12వ తరగతి చదువుతున్న బాలిక తీవ్రమైన బలహీనత, విరోచనాలతో ఆస్పత్రిలో చేరిందని, పరిస్థితి విషమించడంతో వెంటిలేటర్‌పై ఉంచగా శుక్రవారం రాత్రి మరణించిందని డాక్టర్లు వెల్లడించారు. కాగా, ప్రతి సంవత్సరం జీబీఎస్ కేసులు ఉంటాయని, కానీ ఏడాది తీవ్రంగా ఉందని వైద్యులు చెబుతున్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని కేసులు నమోదయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

మహా కుంభమేళాకు విదేశీ దౌత్యాధికారులు

మహాకుంభ నగర్(యూపీ): ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా ఉత్సవం మహాకుంభమేళాకు శనివారం 73 దేశాల దౌత్యవేత్తలతోపాటు విదేశీ అతిథులు హాజరైన పుణ్య స్నానాలు చేశారు. వీరిలో అర్జెంటీనా, జపాన్, అమెరికా, దక్షిణాఫ్రికా, స్విట్జర్లాండ్, రష్యా, ఫ్రాన్స్, జర్మనీ, కెనడా తదితర దేశాల అధికారులున్నారు. అంతకు ముందు ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ దంపతులు, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ కూడా పుణ్య స్నానాలాచరించారు.

కృష్ణ చరితం అనే గ్రంథాన్ని రచించిన గుప్తరాజు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

గుప్త సామ్రాజ్యం

గుప్తుల సమాచారం అనేక సాహిత్య, పురావస్తు ఆధారాల ద్వారా లభిస్తోంది. వీరి కాలంలోని అనేక మంది కవులు గుప్తులకు సంబంధించిన సమాచారాన్ని తమ గ్రంథాల ద్వారా అందించారు. సాహిత్యాధారాలతోపాటు గుప్తులు 42 శాసనాలను జారీ చేశారు. వీటిలో కొన్ని రాజ ప్రశస్తులు కాగా మిగిలినవి దాన శాసనాలు. మొదట కుషాణులకు సామంతులుగా ఉన్న గుప్తులు వారి రాజ్య పతనం తర్వాత అధికార పగ్గాలు చేపట్టారు.

> మౌర్య సామ్రాజ్యం అంతమైన తర్వాత మళ్లీ ఉత్తర భారత దేశాన్ని ఏకం చేసి పాలించిన రాజులు గుప్తులు. కుషాణ రాజ్య శిథిలాలపై క్రీ.శ. 4వ శతాబ్దంలో ఆవిర్భవించిన ఈ రాజ్యం 6వ శతాబ్దం వరకూ కొనసాగింది.

గుప్తుల రాజకీయ చరిత్ర

శ్రీగుప్తుడు

ఇతడు కుషాణుల సామంతుడిగానే పరిపాలన సాగించినట్లు తెలుస్తోంది. అందుకే నాటి సామంత రాజులు, భూస్వాములు ధరించే 'మహారాజ' అనే సాధారణ బిరుదును శ్రీగుప్తుడు ధరించాడు. ఇత్సింగ్ ప్రకారం.. మృగశిఖవనం వద్ద చైనాకు చెందిన బౌద్ధ సన్యాసుల ప్రయోజనార్థం శ్రీగుప్తుడు ఒక దేవాలయాన్ని నిర్మించినట్లు తెలుస్తోంది. అంతేగాక దాని నిర్వహణకు 20 గ్రామాలను కూడా అతడు దానం చేశాడు.

ఘటోత్కచ గుప్తుడు

ఇతడు క్రీ.శ.300 ప్రాంతంలో రాజ్యానికి వచ్చాడు. ఘటోత్కచుడు కూడా తన తండ్రి శ్రీగుప్తుడిలాగే ఒక సామంతరాజుగానే పరిపాలించాడు. ఇతడు తన కుమారుడైన మొదటి చంద్రగుప్తుడికి లిచ్ఛవీల రాకుమార్తె కుమారదేవితో వివాహం జరిపించాడు. తద్వారా గుప్త రాజ్య పటిష్టతకు కృషి చేశాడు.

మొదటి చంద్రగుప్తుడు

ఇతడు తన తాత, తండ్రిలా 'మహారాజ' అనే బిరుదుతో కాకుండా 'మహారాజాధి రాజు'గా ప్రసిద్ధుడయ్యాడు. గుప్తవంశంలో తొలి స్వతంత్ర రాజుగా ఇతడిని భావించాలి. మొదటి చంద్రగుప్తుడు క్రీ.శ.320లో గుప్త శకాన్ని ప్రారంభించాడు. తన భార్య తరపు నుంచి మగధ రాజ్యాన్ని పొందాడు. అందుకే తన నాణేలన్నింటిపై తన భార్య



కుమారదేవి చిత్రంతో పాటు లిచ్ఛవీ వంశస్తుల పేర్లనూ ముద్రించాడు. గుప్త సామ్రాజ్య విస్తరణను చంద్రగుప్తుడే ప్రారంభించాడు.

సముద్ర గుప్తుడు

సముద్ర గుప్తుడు రాజ్యానికి రాకముందు..'కచ' అనే మరో గుప్త రాకుమారుడు ఈ రాజ్యాన్ని పాలించినట్లు కొన్ని నాణేల ద్వారా తెలుస్తోంది. సముద్రగుప్తుడు ఈ వంశంలో అందరి కంటే గొప్పరాజు. గుప్తుల జైత్రయాత్రను ఆసేతు హిమాచలం కొనసాగించాడు. సముద్రగుప్తుడి విజయాలపై ఇతడి ఆస్థాన కవి హరిసేనుడు ప్రయాగ ప్రశస్తి (అలహాబాద్ ప్రశస్తి)ని జారీ చేశాడు. దక్షిణాపథాన్ని పాలించే 12మంది రాజులను సముద్రగుప్తుడు జయించాడు. తర్వాత వారినే తన సామంతులుగా నియమించుకున్నాడు. ఆర్యావర్తాన్ని పాలించే 8 మంది రాజులను ఓడించి వారి రాజ్యాలను స్వాధీనం చేసుకున్నాడు. ఆ తర్వాత నేపాల్, బెంగాల్, అస్సాం మొదలైన సరిహద్దు రాజ్యాలను జయించాడు. అనేక ఆటవిక రాజ్యాలూ సముద్ర గుప్తుడికి దాసోహమన్నాయి. ఆ తర్వాత దైవపుత్ర షహానుషాహీలు, శక మురుండులు,సింహళీయులూ ఇతడి సార్వభౌమత్వాన్ని స్వచ్ఛందంగా అంగీకరించారు. సముద్రగుప్తుడిలో సైనిక సామర్థ్యంతో పాటు,కవితా గుణాలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఇతడికి 'కవిరాజు' అనే బిరుదు ఉంది. తన విజయాలకు గుర్తుగా సముద్ర గుప్తుడు అశ్వమేధ యాగాన్ని నిర్వహించాడు. పులిని వేటాడుతున్నట్లు, వీణను సాధన చేస్తున్నట్లు ఉండే చిహ్నాలతో పలు నాణేలు జారీ చేశాడు. అప్రతిరథ, సర్వరాజాచ్ఛేత, అశ్వమేధ పరాక్రమ, వ్యాఘ్ర పరాక్రమ.. తదితర బిరుదులు ఇతడికి ఉన్నాయి.

రెండో చంద్రగుప్తుడు

ఇతడికి విక్రమాదిత్య, నరేంద్రచంద్ర, సింహ చంద్ర, సింహ విక్రమ.. తదితర బిరుదులున్నాయి. విశాఖదత్తుని 'దేవీచంద్రగుప్తం' అనే గ్రంథం ప్రకారం.. రెండో చంద్రగుప్తుడు తన అన్న రామగుప్తుడిని వధించి సింహాసనాన్ని ఆక్రమించినట్లు తెలుస్తోంది. ఇతడు సౌరాష్ట్ర, గుజరాత్ ప్రాంతాలను తన సామ్రాజ్యంలో విలీనం చేశాడు. దీంతో పశ్చిమాసియాతో పెద్ద ఎత్తున వ్యాపార-వాణిజ్యాలు నిర్వహించే అవకాశం కలిగింది. రెండో చంద్రగుప్తుడు.. తన కుమార్తె ప్రభావతీ గుప్తను వాకాటక రెండో రుద్రసేనుడికిచ్చి వివాహం చేశాడు. ఇతడు తన సైనిక విజయాలను చంద్ర అనే పేరుతో మెహ్రౌలీ ఇనుప స్తంభ శాసనాన్ని జారీచేశాడు. తన తండ్రి సముద్రగుప్తుడిలాగే రెండో చంద్రగుప్తుడు కూడా అనేక బంగారు నాణేలు జారీ చేశాడు. సింహాన్ని వధిస్తున్నట్లుగా, చేతిలో పుష్పాన్ని ధరించినట్లుండే చిహ్నాలతో ఇతడు బంగారు నాణేలు జారీ చేశాడు. ఇతడు ఉజ్జయినీని తన రెండో రాజధానిగా చేసుకున్నాడు. రెండో చంద్రగుప్తుడి ఆస్థానంలో నవరత్నాలు అనే కవులున్నట్లు ప్రతీతి.

కుమార గుప్తుడు

తన సోదరుడు గోవింద గుప్తుడితో వారసత్వ తగాదాల అనంతరం ఇతడు రాజ్యానికి వచ్చాడు. క్రీ.శ.415 నుంచి క్రీ.శ.455 వరకు దాదాపు 40 ఏళ్ల పాటు ఇతడు గుప్త సామ్రాజ్యాన్ని పరిపాలించాడు. కుమారగుప్తుడు జారీచేసిన 1,400 నాణేలు మహారాష్ట్రలోని సామంద్ అనే ప్రాంతంలో బయటపడ్డాయి. తాను నిర్వహించిన అశ్వమేధ యాగానికి గుర్తుగా.. సముద్రగుప్తుడిలాగే ఇతడు కూడా అశ్వమేధ నాణేలు జారీ చేశాడు. కుమారు గుప్తుడు.. మహేంద్రాదిత్య, అశ్వమేధ మహేంద్ర అనే బిరుదులతో నాణేలు జారీ చేశాడు. మయూర వాహనంపై కార్తికేయుడి చిత్రంతో బంగారు నాణేలు ముద్రించాడు.

స్కంద గుప్తుడు

ఇతడు విక్రమాదిత్యుడు అనే బిరుదును ధరించాడు. వారసత్వ యుద్ధాల్లో పురు గుప్తుడిని ఓడించి రాజ్యానికి వచ్చాడు. జునాగఢ్, భిటారి ప్రశస్తుల్లో.. స్కందగుప్తుడు తన శత్రువుల గురించి పేర్కొన్నాడు. హూణులపై ఇతడు సాధించిన విజయాల వల్ల 50 ఏళ్లపాటు గుప్త సామ్రాజ్యానికి హూణుల నుంచి ప్రమాదం తొలగిపోయింది.

బుధ గుప్తుడు

బుధ గుప్తుడి కాలంలో గుప్తసామ్రాజ్య పతనం ప్రారంభమైంది. ఇతడి తర్వాత భానుగుప్తుడు, నరసింహ గుప్త, బాలాదిత్యుడు, 3వ కుమారగుప్తుడు, విష్ణుగుప్తుడు పాలించారు. గుప్తవంశ పాలన క్రీ.శ. 550లో అంతమైంది.

మాదిరి ప్రశ్నలు

1. 'ఆర్య మంజుశ్రీ మూలకల్ప' గ్రంథం ప్రకారం బౌద్ధులను హింసించిన గుప్తరాజు?
   ఎ) సముద్ర గుప్తుడు బి) కచ గుప్తుడు
   సి) నరసింహ బాలాదిత్యుడు
   డి) విష్ణు గుప్తుడు
2. భూమిపై ఉన్న సమస్త రాజులను ఓడించినట్లు ఎరాన్ ప్రశస్తిలో పేర్కొన్న రాజు?
   ఎ) మొదటి చంద్రగుప్తుడు
   బి) రెండో చంద్రగుప్తుడు
   సి) సముద్రగుప్తుడు డి) స్కంద గుప్తుడు
3. గుప్తుల అధికారిక చిహ్నం?
   ఎ) పులి బి) గరుడ
   సి) వీణ డి) సింహం
4. కామరూపలో సముద్రగుప్తుడి ప్రతినిధిగా నియమితుడైన రాజు?
   ఎ) భాస్కర వర్మన్ బి) సూర్య వర్మన్
   సి) పుష్య వర్మన్ డి) గృహ వర్మన్
5. సముద్రగుప్తుడికి కానుకలు పంపిన గాంధార రాజు?
   ఎ) కిదార బి) చిరాతదత్త
   సి) సిద్ధార్థ డి) నరసింహన్
6. రోమ్‌కు రాయబార బృందాన్ని పంపిన గుప్తరాజు?
   ఎ) పురు గుప్తుడు బి) సముద్ర గుప్తుడు
   సి) కుమార గుప్తుడు డి) బుధ గుప్తుడు
7. బోధ్‌గయలో సింహళ విహారాన్ని నిర్మించిన శ్రీలంక రాజు?
   ఎ) శ్రీ మార విజయోత్తుంగ వర్మ
   బి) శ్రీ మేఘవర్మ సి) విజయబాహు
   డి) కుమార బాహు
8. తాను వీణ వాయిస్తున్నట్లుగా బంగారు నాణేలను జారీ చేసిన రాజు..?
   ఎ) కుమార గుప్తుడు
   బి) చంద్రగుప్త విక్రమాదిత్యుడు
   సి) సముద్ర గుప్తుడు డి) శ్రీ గుప్తుడు
9. కృష్ణ చరితం అనే గ్రంథాన్ని రచించిన గుప్తరాజు?
   ఎ) సముద్ర గుప్తుడు
   బి) నరసింహ గుప్తుడు
   సి) మొదటి చంద్రగుప్తుడు
   డి) రెండో చంద్రగుప్తుడు
10. అశ్వమేధ నాణేలు జారీ చేసిన గుప్తరాజు?
   ఎ) విష్ణు గుప్తుడు బి) సముద్ర గుప్తుడు
   సి) కుమార గుప్తుడు డి) బి, సి
11. సముద్ర గుప్తుడిని 'ఇండియన్ నెపోలియన్' అని పిలిచినవారు ?
   ఎ) సర్ విలియం జోన్స్
   బి) వి.ఎ.స్మిత్ సి) హెచ్.సి. రామచౌదరి
   డి) కె.పి. జయస్వాల్
12. రెండో చంద్రగుప్తుడి చేతిలో హతుడైన శకరాజు?
   ఎ) రెండో రుద్రసేనుడు
   బి) మూడో రుద్రసేనుడు
   సి) రెండో రుద్రసింహుడు
   డి) మూడో రుద్రసింహుడు
13. సాహసాంక, శకారి అనే బిరుదులున్న గుప్త రాజు?
   ఎ) మొదటి చంద్రగుప్తుడు
   బి) రెండో చంద్రగుప్తుడు
   సి) సముద్ర గుప్తుడు డి) కుమార గుప్తుడు
14. నవ రత్నాలు ఏ రాజు ఆస్థాన కవులు?
   ఎ) సముద్రగుప్తుడు బి) కచ గుప్తుడు
   సి) రెండో చంద్రగుప్తుడు డి) బుధ గుప్తుడు
15. రెండో చంద్రగుప్తుడి కాలంలో భారతదేశాన్ని సందర్శించిన చైనా యాత్రికుడు?
   ఎ) ఇత్సింగ్ బి) పాన్‌చావో
   సి) హుయాన్‌త్సాంగ్ డి) ఫాహియాన్
16. ఖడ్గమృగాన్ని సంహరిస్తున్నట్లుగా నాణేలు జారీ చేసింది?
   ఎ) కుమార గుప్తుడు బి) 2వ చంద్రగుప్తుడు
   సి) సముద్రగుప్తుడు
   డి) మొదటి చంద్రగుప్తుడు
17. సుదర్శన తటాకానికి మరమ్మతులు నిర్వహించినట్లు శాసనం జారీ చేసింది?
   ఎ) స్కంద గుప్తుడు బి) కుమార గుప్తుడు
   సి) పురు గుప్తుడు డి) బుధ గుప్తుడు
18. హూణుల దాడిని విజయవంతంగా ఎదుర్కొన్న గుప్తరాజు?
   ఎ) సముద్ర గుప్తుడు బి) నరసింహ గుప్తుడు
   సి) స్కంద గుప్తుడు డి) బి, సి
19. వంద రాజులకు అధిపతిగా ప్రశస్తుడైన గుప్త రాజు?
   ఎ) స్కంద గుప్తుడు బి) సముద్ర గుప్తుడు
   సి) మొదటి చంద్రగుప్తుడు
   డి) రెండో చంద్రగుప్తుడు
20. సముద్రగుప్తుడి పాలనలో హరిసేనుడు అధిష్ఠించిన పదవి?
   ఎ) మహాదండ నాయకుడు
   బి) కుమారామాత్యుడు
   సి) సంధి విగ్రాహకుడు
   డి) పైవన్నీ
21. గుప్తుల కాలంలో రాష్ట్ర పాలకులను ఎలా పిలిచేవారు?
   ఎ) విషయపతి బి) ఉపారిక
   సి) కుమారామాత్య
   డి) అమాత్యా
22. గుప్తుల కాలంలో భూమి శిస్తు ఎంత?
   ఎ) 1/6వ వంతు
   బి) 1/4వ వంతు
   సి) 1/4 నుంచి 1/6వ వంతు
   డి) 1/8వ వంతు
23. గుప్తుల కాలంనాటి అధికారులను సరిగా జతపరచండి?

A) టిలుపతి	1) గజదళ అధ్యక్షుడు
B) పుష్టపాల	2) భూ విక్రయాల రికార్డులు
C) దివిర	3) లేఖకుడు
D) శౌల్కిక	4) సుంకాల వసూలు అధికారి

	A)	B)	C)	D)
ఎ)	1	2	3	4
బి)	2	1	4	3
సి)	4	3	2	1
డి)	3	4	1	2

24. గుప్తుల కాలంలో ఉపారికార, హిరణ్య అనేవి?
   ఎ) పన్నులు బి) అధికారులు
   సి) భూమి కొలబద్దలు డి) నాణేలు
25. గుప్తుల కాలంలో గుజరాత్ నుంచి మాండసోర్‌కు వలస వెళ్లిన వ్యాపార సంఘం ఏ వృత్తికి సంబంధించింది?
   ఎ) కుండల తయారీ
   బి) సిల్క్ తయారీ
   సి) దంతపు వస్తువుల తయారీ
   డి) ఇనుప వస్తువుల తయారీ

సమాధానాలు

1) బి; 2) సి; 3) బి; 4) సి; 5) ఎ; 6) బి; 7) బి; 8) సి; 9) ఎ; 10) డి; 11) బి; 12) డి; 13) బి; 14) సి; 15) డి; 16) ఎ; 17) బి; 18) డి; 19) ఎ; 20) డి; 21) బి; 22) బి; 23) ఎ; 24) ఎ; 25) బి.

సూర్యుడి వయసు సుమారుగా?

సౌర కుటుంబం - భూమి

సౌర కుటుంబంలో సూర్యుడు, ఎనిమిది గ్రహాలు, ఉపగ్రహాలు, లఘు గ్రహాలు ఉంటాయి. సూర్యుడు మనకు అతి దగ్గరలో ఉన్న నక్షత్రం. ఎనిమిది గ్రహాల్లో భూమి ఒకటి. సూర్యగోళం భూమి కంటే 1.3 మిలియన్ రెట్లు పెద్దది. సూర్యుడి ఉపరితలంపై 6000°c, కేంద్రంలో $1,000,000^\circ$c ఉష్ణోగ్రత ఉంటుంది.

నక్షత్రాలు స్వయం ప్రకాశకాలు. కొన్ని కోట్ల నక్షత్రాల సముదాయాన్ని 'పాలపుంత' అంటారు. దీన్నే పాలవెల్లి, ఆకాశగంగ అని కూడా అంటారు.

మొత్తం గ్రహాల సంఖ్య - 8. గ్రహాల్లో బుధుడు సూర్యుడికి అతి చేరువలో ఉంటాడు. తర్వాత వరుసగా శుక్రుడు, భూమి, కుజుడు, గురుడు, శని, యురేనస్, నెప్ట్యూన్ గ్రహాలున్నాయి. **గ్రహాలను రెండు భాగాలుగా విభజించారు. అవి..**

1) అంతర్ గ్రహాలు 2) బాహ్య గ్రహాలు

అంతర గ్రహాలు: బుధుడు, శుక్రుడు, భూమి, కుజుడు.

బాహ్య గ్రహాలు: గురుడు,శని, యురేనస్, నెప్ట్యూన్.

గమనిక: 2006లో ప్రేగ్‌లో జరిగిన అంతర్జాతీయ ఖగోళ శాస్త్రవేత్తల సదస్సులో ప్లూటోను గ్రహాల జాబితా నుంచి తొలగించి డ్వార్ఫ్ (మరుగుజ్జు) గ్రహంగా ప్రకటించారు.

భూమి.. సూర్యుడి నుంచి 149.5 మిలియన్ కి.మీ. దూరంలో ఉంది. సూర్యకాంతి భూమిని చేరడానికి 8 నిమిషాల సమయం పడుతుంది. భూమి ఉపగ్రహం చంద్రుడు. భూమికి, చంద్రుడికి మధ్య దూరం సుమారు 3,84,365 కి.మీ.లు. సౌర కుటుంబం పుట్టుక గురించి అనేక ప్రతిపాదనలు ఉన్నాయి. అవి:

సిద్ధాంతకర్త	సిద్ధాంతం
చాంబర్లిన్,	గ్రహాల పరికల్పన
మౌల్టన్‌లు	సిద్ధాంతం
కాంట్	గ్యాసియస్ మాస్ థియరీ
లాప్లేస్	నెబ్యులార్ థియరీ
జీన్స్, జెఫ్రీ	టైడల్ సిద్ధాంతం
రస్సెల్, లిటిల్‌టన్	బైనరీ స్టార్ హైపోథీసిస్

భూచలనాలు - వాటి ఫలితాలు

భూమికి రెండు చలనాలున్నాయి. ఒకటి భూభ్రమణం, రెండోది భూపరిభ్రమణం. భూమి తన అక్షంపై తన చుట్టూ తాను పశ్చిమం వైపు నుంచి తూర్పునకు గంటకు 1610 కి.మీ. వేగంతో తిరుగుతుంది. భూమి తన చుట్టూ తాను తిరగడాన్ని భూభ్రమణం అంటారు.

భూమి తన చుట్టూ తాను తిరిగేటప్పుడు ఉత్తరాన ఒక బిందువు, దక్షిణాన ఒక బిందువు స్థిరంగా ఉంటాయి. ఉత్తరాన ఉన్న స్థిర బిందువును ఉత్తర ధ్రువమని, దక్షిణాన ఉన్న స్థిర బిందువును దక్షిణ ధ్రువమని అంటారు. భూభ్రమణం వల్ల రాత్రి, పగలు ఏర్పడతాయి.

ఉత్తర,దక్షిణ ధ్రువాలను కలుపుతూ భూ నాభి ద్వారా గీసిన ఊహారేఖను'అక్షం'అంటారు. భూమి తన అక్షంపై తాను తిరిగేటప్పుడు సూర్యుడికి ఎదురుగా ఉన్న అర్ధగోళంపై సూర్యకాంతి పడి పగలు, మిగిలిన అర్ధ గోళంలో రాత్రి ఏర్పడుతుంది.

భూమి ఒకసారి తన చుట్టూ తాను తిరిగి రావడానికి 23 గంటల 56 నిమిషాల 4.09 సెకన్లు అంటే 24 గంటలు లేదా ఒక రోజు పడుతుంది. భూభ్రమణం వల్ల రేయింబవళ్లు ఏర్పడడమే కాకుండా పవనాలు, సముద్ర ప్రవాహాల మార్గాల్లో మార్పులు సంభవిస్తాయి. సముద్రంలో రోజుకి రెండుసార్లు పోటుపాట్లు కలగడానికి భూభ్రమణమే కారణం.

భూమి తన అక్షంపై తాను తిరుగుతూ సూర్యుడి చుట్టూ తిరిగి రావడాన్ని 'భూ పరిభ్రమణం' అంటారు. భూమి సూర్యుడి చుట్టూ తిరిగే నిర్ణీత మార్గాన్ని 'కక్ష్య' అంటారు. ఈ కక్ష్య దీర్ఘ వృత్తాకారంలో ఉంది. దీని పొడవు 965 కి.మీ. భూ పరిభ్రమణానికి ఒక సంవత్సర కాలం అంటే 365 1/4 రోజుల సమయం పడుతుంది.

సాధారణంగా సంవత్సరంలో 365 రోజులుంటాయి. అయితే మిగిలిన 1/4 రోజును (6 గం॥లను) నాలుగు సంవత్సరాలకు ఒకసారి కలిపి 366 రోజులుగా లెక్కిస్తారు. ఈ సంవత్సరాన్ని 'లీపు సంవత్సరం' అంటారు. అందువల్ల లీపు సంవత్సరంలో 366 రోజులుంటాయి. భూ పరిభ్రమణం వల్ల పగలు, రాత్రి వేళలో తేడాలు ఉంటాయి. రుతువులు ఏర్పడతాయి.

సూర్యుడి నుంచి అతి తక్కువ దూరంలో ఉండే భూమి స్థానాన్ని పరిహేళి అంటారు. సూర్యుడి నుంచి భూమికి కనిష్ఠ దూరం 147 మిలియన్ కి.మీ. ఈ పరిహేళి జనవరి 3న సంభవిస్తుంది.

సూర్యుడి నుంచి ఎక్కువ దూరంలో ఉండే భూమి స్థానాన్ని 'అపహేళి' అంటారు.ఈ అపహేళి జూలై 4న సంభవిస్తుంది. సూర్యుడి నుంచి భూమికి గరిష్ఠ దూరం 152 మిలియన్ కి.మీ. భూమి అక్షం వంగి ఉండడం, భూమధ్యరేఖ నుంచి ధ్రువాల వైపు వెళ్లే కొద్దీ అక్షాంశాల నిడివి తగ్గడం వంటి కారణాలతో రాత్రింబవళ్లలో వ్యత్యాసం ఏర్పడుతుంది. భూమి అక్షం భూకక్ష్య మీది క్షితిజ లంబం నుంచి $23\frac{1}{2}^\circ$లు వంగి ధ్రువ నక్షత్రానికి ఎదురుగా ఉంటుంది.

భూమి తన చుట్టూ తాను పడమర నుంచి తూర్పునకు తిరగడం వల్ల సూర్యుడు తూర్పున ఉదయించి పడమర అస్తమిస్తాడు. అదేవిధంగా ధ్రువాల వద్ద భూభ్రమణ వేగం – 0. భూమి అక్షం $23\frac{1}{2}^\circ$ వంగి ఉండడంతోపాటు భూమి.. సూర్యుడి చుట్టూ పరిభ్రమించడం వల్ల రుతువులు ఏర్పడతాయి. భూమి అక్షం వంగి ఉండక నిటారుగా ఉన్నట్లయితే సూర్యుడు ఎప్పుడూ భూమధ్య రేఖకు లంబంగానే ఉండేవాడు. దీనివల్ల భూమిపై ప్రాంతాలన్నీ సంవత్సరం పొడవునా ఒకే రకమైన శీతోష్ణస్థితిని కలిగి ఉండేవి. ఇప్పటిలాగా రుతువులు ఏర్పడేవి కాదు.

సూర్యుడు మకరరేఖ నుంచి ఉత్తరానికి పయనించడం ప్రారంభిస్తే ఉత్తరాయనమని, సూర్యుడు కర్కటరేఖ నుంచి దక్షిణాభిముఖంగా పయనించడం ప్రారంభించినప్పటి నుంచి దక్షిణాయనమని అంటారు.

చంద్రుడు తన చుట్టూ తాను తిరగడానికి, భూమి చుట్టూ తిరగడానికి ఒకే సమయం తీసుకుంటున్నందువల్ల మనం చంద్రుడిని ఒకే వైపు చూడగలుగుతున్నాం. చంద్రుడు తన చుట్టూ తాను తిరగ



డానికి, భూమి చుట్టూ తిరగడానికి 27 1/3 రోజులు సమయం పడుతుంది.

గ్రహణాలు

సూర్యుడి చుట్టూ భూమి, భూమి చుట్టూ చంద్రుడు తిరిగేటప్పుడు.. సూర్యుడు, భూమి, చంద్రుడు ఒకే సరళరేఖ మీదకు వచ్చినప్పుడు గ్రహణాలు ఏర్పడతాయి. ఈ గ్రహణ కాలంలో సూర్యుడిపైన, చంద్రుడిపైన నీడ పడినట్లు కనిపిస్తుంది. సూర్యుడి కిరణాలు చంద్రుడి మీద పడకుండా భూమి అడ్డు వచ్చినప్పుడు 'చంద్రగ్రహణం' ఏర్పడుతుంది.

భూమి ఎప్పుడూ సూర్యుడి ఎదురుగా ఉండి మిగతా సగం సూర్యకిరణాలు పడక చీకటిగా ఉంటుంది. అంటే భూమి మిగతా సగం తన నీడ భాగం. ఈ నీడ భాగాన్ని 'ప్రచ్ఛాయ'అని, నీడ చుట్టూ ఉన్న భాగాన్ని 'పాక్షిక ఛాయ' అని అంటారు.

చంద్రుడు ప్రచ్ఛాయలోకి వచ్చినప్పుడు 'చంద్ర గ్రహణం' ఏర్పడుతుంది. ఇది పౌర్ణమి రోజు వస్తుంది. చంద్రుడి కక్ష్యతలం భూ కక్ష్య తలానికి 5°9 నిమిషాల కోణంలో ఉన్నందువల్ల భూ కక్ష్య తలానికి బాగా పైన లేదా కింద ఉన్నప్పుడు అన్ని పౌర్ణమి దినాల్లో చంద్రగ్రహణం ఏర్పడుతుంది.

సూర్యుడు కనిపించకుండా భూమికి చంద్రుడు అడ్డు వస్తే అప్పుడు 'సూర్యగ్రహణం' ఏర్పడుతుంది. సూర్యగ్రహణం అమావాస్య రోజుల్లో వస్తుంది. సూర్యుడు, చంద్రుడు, భూమి ఒకే సరళ రేఖ మీద ఉన్నప్పుడు చంద్రబింబం సూర్యకాంతి ఆవరణాన్ని కప్పినట్లు కనిపిస్తుంది. అప్పుడు నేరుగా చంద్రుడి నీడలో ఉన్న భూ భాగంలో 'సంపూర్ణ సూర్య గ్రహణం' ఏర్పడుతుంది.

అక్షాంశాలు - రేఖాంశాలు

ఉత్తర, దక్షిణ ధ్రువాలకు సమాన దూరంలో, భూమి మధ్య, భూమి చుట్టూ గీసిన ఊహారేఖను 'భూమధ్యరేఖ' అంటారు. ఇది భూమిని రెండు గోళాలుగా విభజిస్తుంది. భూమధ్యరేఖకు ఉత్తరాన ఉండే గోళాన్ని 'ఉత్తరార్ధ గోళమని', దక్షిణాన ఉండే గోళాన్ని 'దక్షిణార్ధ గోళమని' అంటారు.

భూమి చుట్టూ ఉత్తర, దక్షిణ ధ్రువాల వరకు గీసిన ఊహారేఖలను 'అక్షాంశాలు' అని అంటారు. ఇవి వృత్త రేఖలు. భూమిని మొత్తం 1° అంతరంతో మొత్తం 180 అక్షాంశాలుగా విభజించారు. భూమధ్యరేఖను కలుపుకుంటే మొత్తం 181. భూమధ్య రేఖ 0°ల అక్షాంశం కాగా, ఉత్తర ధ్రువం 90° ఉత్తర అక్షాంశం, దక్షిణ ధ్రువం 90° దక్షిణ అక్షాంశం. భూమధ్యరేఖనే 'గ్రేట్ సర్కిల్' అంటారు.

అక్షాంశాలని 'సమాంతర రేఖలు' అని కూడా అంటారు. వీటిలో పెద్ద అక్షాంశం భూమధ్యరేఖ. అక్షాంశాల వల్ల ఒక ప్రదేశం శీతోష్ణస్థితిని తెలుసుకోవచ్చు. అక్షాంశాలు ధ్రువాల వద్ద బిందువులుగా ఉంటాయి. అక్షాంశాలన్నీ ఊహారేఖలే. అక్షాంశాలన్నీ తూర్పు, పడమరలుగా వ్యాపించి ఉన్నాయి. అంటే అడ్డంగా సమాంతరంగా ఉన్నాయి. ఒక అక్షాంశం 111 కి.మీ.లకు సమానం. అదేవిధంగా రెండు వరుస అక్షాంశాల మధ్య దూరం 111 కి.మీ.

$23\frac{1}{2}^\circ$ల ఉత్తర అక్షాంశరేఖను కర్కటరేఖ అని, $23\frac{1}{2}^\circ$ల దక్షిణ అక్షాంశ రేఖను మకర రేఖ అని అంటారు. $66\frac{1}{2}^\circ$ ఉత్తర అక్షాంశాన్ని 'ఉత్తర ధ్రువ వలయం' అని, $66\frac{1}{2}^\circ$ దక్షిణ అక్షాంశాన్ని 'దక్షిణ ధ్రువ వలయం' అని అంటారు.

సూర్య కిరణాలు భూమిపై $23\frac{1}{2}^\circ$ ఉత్తర అక్షాంశం, $23\frac{1}{2}^\circ$ దక్షిణ అక్షాంశ రేఖల మధ్య ఉండే ప్రదేశాల మీద లంబంగా పడతాయి. ఈ రెండు రేఖలకు బయటి ప్రదేశాల్లో ఎప్పుడూ లంబంగా పడవు. ఈ రెండు అక్షాంశ రేఖలనే ఇతర రేఖాంశాలను గుర్తించేందుకు సూచికగా పరిగణిస్తారు. దీన్నే '0°' లేదా 'గ్రీనిచ్ మెరిడియన్' అంటారు.

భూమధ్యరేఖను ఖండిస్తూ ధ్రువాలను కలుపుతూ భూమి చుట్టూ లంబంగా గీసిన వృత్తాలను 'రేఖాంశాలు' అంటారు. వీటిని 'అర్ధ వృత్తాలు, మధ్యాహ్న రేఖలు' అని పిలుస్తారు. రేఖాంశాల వల్ల వివిధ ప్రదేశాల్లోని కాలంలో తేడాలను గుర్తించవచ్చు. రేఖాంశాలు ధ్రువాల వద్ద కేంద్రీకృతం అవుతాయి. రేఖాంశాలన్నీ కూడా ఊహారేఖలే.

రేఖాంశాలన్నీ ఉత్తర, దక్షిణాలుగా వ్యాపించి ఉన్నాయి. అంటే నిలువుగా లంబంగా ఉన్నాయి. రేఖాంశాలు మొత్తం 360. గ్రీనిచ్ రేఖకు తూర్పుగా 180° వరకు 180 తూర్పు రేఖాంశాలు, పశ్చిమంగా 180°వరకు 180 పశ్చిమ రేఖాంశాలు ఉన్నాయి.

రేఖాంశంపై ఉన్న అన్ని ప్రదేశాల్లోనూ ఒకేసారి 'మధ్యాహ్నం' అవుతుంది. కాబట్టి రేఖాంశాలను 'మధ్యాహ్న రేఖలు' అంటారు. భూమధ్య రేఖ నుంచి ధ్రువాల వైపునకు పోయే కొద్దీ రేఖాంశాల మధ్య దూరం తగ్గుతుంది. ధ్రువాల వద్ద రేఖాంశాలన్నీ కలుస్తాయి. అక్కడ వాటి మధ్య దూరం '0' అవుతుంది.

లండన్ సమీపంలోని గ్రీనిచ్ ఖగోళ పరిశోధన కేంద్రం మీదుగా వెళ్లే రేఖాంశాన్ని 'ప్రామాణిక రేఖాంశం'గా తీసుకున్నారు.

గ్రీనిచ్ రేఖకు, 180° తూర్పు రేఖాంశానికి మధ్య ఉన్న భూభాగాన్ని 'పూర్వార్ధ గోళం' అని, గ్రీనిచ్ రేఖకు, 180°ల పశ్చిమ రేఖాంశానికి మధ్య ఉన్న భూభాగాన్ని 'పశ్చిమార్ధ గోళం' అని అంటారు. భూమి 1° రేఖాంశం తిరగడానికి 4 నిమిషాల సమయం పడుతుంది. భూమిపై ఒక ప్రాంత ఉనికిని తెలుసుకోవడానికి అక్షాంశాలు, రేఖాంశాలు ఉపయోగపడతాయి. 180°ల తూర్పు రేఖాంశం, 180° పశ్చిమ రేఖాంశం ఒకటే రేఖాంశం అవుతుంది.ఈ రేఖాంశాన్నే'అంతర్జాతీయ దినరేఖ' అంటారు. ఇది పసిఫిక్ సముద్రం ద్వారా పోతుంది.

రేఖాంశంపై పగలు సూర్యుడు నడినెత్తిన ప్రకాశించినప్పుడు 12 గంటలుగా తీసుకొని నిర్ణయించిన కాలాన్ని 'స్థానిక కాలం' అంటారు. ఒక ప్రాంతానికి, ఒక దేశానికి ప్రామాణిక రేఖాంశాన్ని నిర్ణయించి దీనిపై ఉన్న స్థానిక కాలాన్ని ఆ ప్రాంత 'ప్రామాణిక కాలం' అంటారు. గ్రీనిచ్ స్థానిక కాలాన్నే 'ప్రపంచ ప్రామాణిక కాలం'గా పరిగణిస్తున్నారు. సముద్రయానం చేసేవారి నౌక ఏ రేఖాంశంపై ఉందో తెలుసుకోవడానికి 'క్రోనోమీటర్' అనే పరికరాన్ని ఉపయోగిస్తారు.

సూర్యుడు ఉత్తరార్ధ గోళంలో ఉండే ఆరు నెలల కాలంలో ఉత్తర ధ్రువ వలయం అంటే $66\frac{1}{2}^\circ$ల ఉత్తర అక్షాంశంపైన ఉన్న భూభాగంలో 24 గంటలు పగలు ఉంటుంది. అదే సమయంలో దక్షిణ ధ్రువ వలయం అంటే $66\frac{1}{2}^\circ$ల దక్షిణ అక్షాంశంపైన ఉన్న భూభాగంలో 24 గంటలు రాత్రి ఉంటుంది. సూర్యుడు దక్షిణార్ధ గోళంలో ఆరు నెలల కాలంలో ఉత్తర ధ్రువ వలయం 24 గంటలు చీకటిలో ఉంటే, దక్షిణ ధ్రువ వలయం 24 గంటలు వెలుతురులో ఉంటుంది.

$82\frac{1}{2}^\circ$ల తూర్పు రేఖాంశాన్ని ప్రమాణంగా తీసుకొని భారత్ ప్రామాణిక కాలాన్ని నిర్ణయిస్తారు. ఈ రేఖాంశం అలహాబాద్ ద్వారా వెళ్తుంది. మన రాష్ట్రంలో కాకినాడ ద్వారా పోతుంది. గ్రీనిచ్ ప్రామాణిక కాలం కంటే మనదేశ ప్రామాణిక కాలం $5\frac{1}{2}$ గంటల ముందు ఉంటుంది.

అత్యధిక కాల మండలాలు కలిగిన దేశం రష్యా. సూర్యుడు ఉత్తరార్ధ గోళంలో ఉన్నప్పుడు, ఉత్తర ధ్రువ ప్రాంతంలో జూన్‌లో కొన్ని రోజులు సూర్యుడు రోజుకీ 20 గంటలకు పైగా కనిపించడాన్ని 'అర్ధరాత్రి సూర్యుడు' అంటారు. నార్వేను 'ల్యాండ్ ఆఫ్ మిడ్‌నైట్ సన్'గా పేర్కొంటారు. సూర్యుడు అన్ని దేశాల కంటే ముందుగా జపాన్‌లో ఉదయిస్తాడు. అందుకే జపాన్‌ని 'ల్యాండ్ ఆఫ్ రైజింగ్ సన్' అంటారు.

మాదిరి ప్రశ్నలు

1. సూర్యుడి ఆకర్షణ శక్తి.. భూమి ఆకర్షణ శక్తికి ఎన్నిరెట్లు అధికంగా ఉంటుంది?
   1) 32 2) 28 3) 22 4) 36
2. సూర్యుడి వయసు సుమారుగా?
   1) 3 మిలియన్ సంవత్సరాలు
   2) 8 మిలియన్ సంవత్సరాలు
   3) 5 బిలియన్ సంవత్సరాలు
   4) 10 బిలియన్ సంవత్సరాలు
3. అత్యల్ప సాంద్రత గల గ్రహం?
   1) గురుడు 2) శుక్రుడు
   3) బుధుడు 4) శని
4. అత్యధిక పరిభ్రమణ కాలం గల గ్రహం?
   1) శుక్రుడు 2) శని
   3) నెప్ట్యూన్ 4) యురేనస్
5. ఏ గ్రహాలకు ఉపగ్రహాలు లేవు?
   1) బుధుడు, శుక్రుడు
   2) శుక్రుడు, కుజుడు
   3) కుజుడు, గురుడు
   4) నెప్ట్యూన్, బుధుడు
6. పవనాల మార్గాలు, సముద్ర ప్రవాహ మార్గాల్లో మార్పులు వేటివల్ల సంభవిస్తాయి?
   1) రుతువులు 2) భూ పరిభ్రమణం
   2) భూ భ్రమణం 4) గ్రహణాలు
7. భూభ్రమణం గంటకు ఎంత వేగం?
   1) 1610 కి.మీ. 2) 1016 కి.మీ.
   3) 1601 కి.మీ 4) 1616 కి.మీ.
8. భూకక్ష్య పొడవు?
   1) 695 కి.మీ. 2) 956 కి.మీ
   3) 965 కి.మీ. 4) 659 కి.మీ.
9. పరిహేళి ఎప్పుడు సంభవిస్తుంది?
   1) జూలై 4 2) జనవరి 4
   3) జనవరి 3 4) జూలై 3
10. చంద్రుడి కక్ష్యతలం.. భూమి కక్ష్యతలానికి ఎన్ని డిగ్రీల కోణంలో ఉంది?
   1) 9°ల 5 నిమిషాలు 2) 8°ల 9 నిమిషాలు
   3) 5°ల 9 నిమిషాలు
   4) 9°ల 4 నిమిషాలు
11. పరిహేళి దశలో భూమి, సూర్యుడికి —— మి.కి.మీ. దూరంలో ఉంటుంది?
   1) 152 2) 150 3) 147 4) 137
12. సూర్యుడికి.. భూమి అతి దగ్గరగా ఏ రోజు వస్తుంది?
   1) జనవరి - 3 2) జూలై 4
   3) మార్చి - 21 4) సెప్టెంబర్ - 23
13. అక్షాంశ - రేఖాంశాలను ఆధారం చేసుకొని మానవ చరిత్ర రచనకు అధిక ప్రాధాన్యం ఇచ్చిన శాస్త్రవేత్త?
   1) అరిస్టాటిల్ 2) హోమర్
   3) స్ట్రాబ్ 4) టాలమీ
14. అంతర్జాతీయ దినరేఖ ఏ జలసంధి ద్వారా వెళ్తుంది?
   1) బేరింగ్ 2) పాక్
   3) పనామా 4) సూయజ్ కాలువ
15. కర్కటరేఖ మనదేశంలోని ఎన్ని రాష్ట్రాల ద్వారా వెళ్తుంది?
   1) 3 2) 5 3) 8 4) 9
16. భూమిని మూడు పొరలుగా విభజించిన శాస్త్రవేత్త?
   1) సుయెస్ 2) వెజ్‌నర్
   3) వాండర్‌గ్రాచ్ 4) ఎవాన్స్

సమాధానాలు

1) 2; 2) 3; 3) 4; 4) 3; 5) 1; 6) 3; 7) 1; 8) 3; 9) 3; 10) 3; 11)3 ; 12) 1; 13) 4; 14) 1; 15) 3; 16) 1.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ-మెయిల్ sakshieducation@gmail.com

సాక్షి ప్లస్
ఆదివారం । 2-2-2025

రాజ్యం తలరాతను మార్చిన సంస్కరణల వరదాత

నాలుగో అసఫ్ జా 'నసీరుద్దౌలా' 1853 మే 31న 'తురాబ్ అలీఖాన్'ను హైదరాబాద్ రాజ్య ప్రధాన మంత్రిగా నియమించాడు. ఇతడికి 'సాలార్‌జంగ్' అనే బిరుదు ప్రదానం చేశాడు. సాలార్‌జంగ్.. రాజ్యంలో అనేక సామాజిక, ఆర్థిక, న్యాయపాలనా సంస్కరణలు ప్రవేశపెట్టి రాజ్యాన్ని అభివృద్ధి పథంలో నడిపాడు. 1883లో మరణించే వరకూ ప్రధాని పదవిలో కొనసాగాడు. నసీరుద్దౌలా (1829-57), అఫ్జల్ ఉద్దౌలా (1857-69), మీర్ మహబూబ్ అలీఖాన్ (1869-1911)ల కొలువులో పనిచేశాడు. హైదరాబాద్ ప్రధానుల్లోకెల్లా అత్యంత సమర్థుడిగా పేరు గడించాడు.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర

సాలార్‌జంగ్ సంస్కరణలు

సాలార్‌జంగ్ ఆర్థిక సంస్కరణలపై దృష్టి కేంద్రీకరించి రాజ్యం ఆర్థిక పరిస్థితి చక్కదిద్దాడు. సాలార్‌జంగ్ ప్రధాని కావడానికి ముందు పన్ను వసూళ్లను వేలం పద్ధతిలో గుత్తేదారులకు అప్పగించేవారు. వీరు ప్రజల నుంచి బలవంతంగా పన్నులు వసూలు చేసేవారు. వారిని నిర్దాక్షిణ్యంగా దోచుకునేవారు. గుత్తేదారులు ప్రభుత్వ అధికారులతో లోపాయికారి ఒప్పందాలు కుదుర్చుకొని ప్రభుత్వ ఖజానాకు పన్నులు కట్టేవారు కాదు. సాలార్‌జంగ్ ఈ పద్ధతులను రద్దు చేశాడు. మొదటగా పన్ను వసూళ్లపై అదుపు కలిగిన దఫ్తాదార్ల అధికారాలు తగ్గించాడు. పన్ను వసూలు చేసే గుత్తేదారుల స్థానంలో నెల జీతంపై పనిచేసే తాలుకాదారులను నియమించాడు. ఈ రెండు విధానాల వల్ల రాజ్యానికి ఆదాయం పెరిగింది. దీంతో తనఖా పెట్టిన రాష్ట్ర ప్రభుత్వ ఆభరణాలను సాలార్‌జంగ్ విడిపించాడు.

సాలార్‌జంగ్ తక్కువ వడ్డీతో కొత్త రుణాలు సేకరించి రాజ్య రుణభారాన్ని తగ్గించాడు. నాణేల సంస్కరణల్లో భాగంగా హైదరాబాద్‌లో కేంద్ర ద్రవ్య ముద్రణాలయాన్ని స్థాపించాడు. గద్వాల, నారాయణపేటలోని జిల్లా ద్రవ్య ముద్రణాలయాలను దీని పరిధిలోకి తీసుకువచ్చాడు. 1854లో 'హాలిసిక్కా' అనే నూతన నాణేన్ని ప్రవేశపెట్టాడు. ఈ నాణెం విలువ బ్రిటిష్ రూపాయి కంటే 15 రెట్లు ఎక్కువ.

పాలనా సంస్కరణలు

సాలార్‌జంగ్ కంటే ముందు పాలనా సౌలభ్యం కోసం రాజ్యాన్ని సుబాలుగా విభజించారు. సుబాలను సర్కారులుగా, వాటిని తాలుకాలుగా వర్గీకరించారు. సుబాలో సుబేదార్, తాలుకాలో తాలుకాదార్ అనే అధికారులు పాలనా వ్యవహారాలను నిర్వహించేవారు. తాలుకాదార్ బ్రిటిష్ ఇండియాలోని కలెక్టర్‌తో సమానం. తాలుకాలో పన్ను వసూలు చేసే అధికారాన్ని ప్రభుత్వం తాలుకాదారులకు ఇచ్చింది. వీరికి ఎలాంటి జీతభత్యాలు ఉండేవి కాదు. రైతుల నుంచి పన్ను వసూలు చేసి అందులో కమీషన్ తీసుకునేవారు. పై అధికారులకు నజరానా(లంచం) చెల్లించి కొంతమంది తాలుకాదార్ పదవి పొందేవారు. ఈ విధంగా పదవి పొందినవారు పన్ను వసూలు కోసం 'నాయిబ్' (డిప్యూటీ తాలుకాదార్) అనే అధికారులను నియమించుకునేవారు. తాలుకాదారులు మాత్రం హైదరాబాద్ నగరంలో ఉండేవారు. ఈ విధానంలో లోపాలు ఉండటంతో హైదరాబాద్‌లోని బ్రిటిష్ రాజ ప్రతినిధి చార్లెస్ మెట్‌కాఫ్ తాలుకాదారులను పర్యవేక్షించడానికి బ్రిటిష్ అధికారులను నియమించాడు. అతడు హైదరాబాద్ నుంచి వెళ్లిన తర్వాత బ్రిటిష్ అధికారుల స్థానంలో 'అమిన్' అనే స్థానికాధికారులను నియమించారు.

- సాలార్‌జంగ్ పన్ను వసూలు కోసం 1855లో తాలుకాదారులను నియమించాడు.
- 1865లో జిలాబంది విధానాన్ని ప్రవేశపెట్టి రాజ్యాన్ని 17 జిల్లాలుగా విభజించాడు. ప్రతి జిల్లాలో పాలనా బాధ్యతలను నిర్వహించడానికి సాలార్‌జంగ్ 'అవల్ తాలుకాదార్'ను నియమించాడు. ఇతడికి బ్రిటిష్ ఇండియాలోని జిల్లా కలెక్టర్‌తో సమాన విధులు ఉండేవి. అవల్ తాలుకాదార్‌కు సహాయంగా 'దోయం తాలుకాదార్' (సబ్ కలెక్టర్)లను నియమించాడు. వీరికి తోడ్పడటానికి సోయం తాలుకాదార్ అనే మూడో తరగతి ఉద్యోగులు కూడా ఉండేవారు. వీరికి బ్రిటిష్ ఇండియాలోని తహశీల్దార్లతో సమాన అధికారాలు ఉండేవి.
- హైదరాబాద్ రాజ్యంలోని జిల్లాలను కలిపి అయిదు ప్రాంతీయ విభాగాలుగా ఏర్పాటు చేశారు. ప్రతి ప్రాంతీయ విభాగాన్ని పాలించడానికి ఒక సదర్ తాలుకాదార్‌ను నియమించారు. ఇతడికి బ్రిటిష్ ఇండియాలోని రెవెన్యూ కమిషనర్‌తో సమాన అధికారాలు ఉండేవి.

భూమిశిస్తు: రాజ్యంలో ప్రధాన ఆదాయ వనరు భూమిశిస్తు. తర్వాతి స్థానాల్లో ఆబ్కారీ పన్నులు, వాణిజ్య పన్నులు ఉండేవి. వీటితోపాటు స్థానిక జమీందారులు, రాజులు చెల్లించే పేష్కష్ ఇతర ఆదాయ వనరుగా ఉండేది. పేష్కష్ అంటే స్థానిక రాజులు లేదా సామంతరాజులు చెల్లించే కప్పం.

రాజ్యమంతటా రైత్వారీ విధానం అమల్లో ఉండేది. మునగాల, అమరచింత, గద్వాల లాంటి జమీందారీ సంస్థానాలు కూడా చాలా ఉండేవి. ప్రతి గ్రామంలో పటేల్ అనే అధికారి ఉండేవాడు. వీరు వంశపారంపర్యంగా అధికారం చెలాయించేవారు. గ్రామాల్లో శాంతిభద్రతలు కాపాడటానికి 'పౌజుదారీ పటేల్' అనే ఉద్యోగి ఉండేవాడు. గ్రామంలో లెక్కలు చేసే వ్యక్తిని పట్వారీ లేదా పాండే అని పిలిచేవారు. దేశ్‌ముఖ్, దేశ్‌పాండేల నాయకత్వంలో గ్రామాలను కొన్ని సర్కిళ్లగా విభజించారు.

- సాలార్‌జంగ్ ప్రజలకు సమర్థమైన న్యాయ పాలన అందించడానికి న్యాయస్థానాలను సంస్కరించాడు. జిల్లాల్లో ఉన్న న్యాయస్థానాల్లో మున్సిఫ్, మీర్ ఆదిల్ అనే న్యాయాధికారుల్ని నియమించాడు. వీరిపై హైదరాబాద్‌లోని హైకోర్టు (మహ్‌కాయ-ఇ- సదర్)కు అధికారం ఉండేది.
- హైకోర్టుకు పైన అప్పీలు చేయడానికి 'మజ్లిస్-ఇ-మురఫా' పేరుతో సుప్రీంకోర్టును ఏర్పాటు చేశాడు.
- హైదరాబాద్‌లో బుజుంగ్ దివానీ అదాలత్, కుర్ద్ దివానీ అదాలత్ అనే రెండు సివిల్ కోర్టులు స్థాపించాడు. పౌజుదారీ అదాలత్ అనే క్రిమినల్ కోర్టును కూడా ఏర్పాటు చేశాడు.
- ముస్లిం చట్టం 'షరియత్' ఆధారంగా ప్రధాన న్యాయమూర్తి 'నాజిమ్' తీర్పు చెప్పేవాడు.
- వివిధ కోర్టుల కార్యక్రమాలను సమన్వయ పరచడానికి ప్రత్యేక న్యాయ విభాగాన్ని ఏర్పాటు చేశారు.

పోలీసు వ్యవస్థ

1865కు ముందు హైదరాబాద్ రాష్ట్రంలో సరైన పోలీసు వ్యవస్థ లేదు. కొత్వాల్ అనే నగర పోలీసు కమిషనర్ ఉండేవాడు. కాలక్రమంలో రెవెన్యూ అధికారులే పోలీసు విధులను నిర్వహించారు. గ్రామాల్లో వంశ పారంపర్యంగా వచ్చే గ్రామ కాపాలాదార్ల పద్ధతి ఉండేది.

- సాలార్‌జంగ్ పోలీసు సంస్కరణల్లో భాగంగా 'మహ్‌కామ-ఇ-కొత్వాలి' అనే పోలీసు డిపార్ట్‌మెంట్‌ను ఏర్పాటు చేశాడు. నిజామత్ అనే పేరుతో పోలీసు దళాన్ని కూడా ఏర్పాటు చేశాడు.
- పోలీసు సూపరింటెండెంట్‌ను మహ్‌తామీన్‌గా, ఇన్‌స్పెక్టర్‌ను 'అమీన్'గా వ్యవహరించేవారు. పోలీసు స్టేషన్లను 'చౌకీ'లు అని పిలిచేవారు.
- 1867లో సాలార్‌జంగ్ పోలీసు, రెవెన్యూ శాఖలను వేరు చేశాడు.

ఇతర సంస్కరణలు

- హైదరాబాద్ రాజ్యంలో సతీ సహగమనాన్ని నిషేధించాడు.
- 1856లో హైదరాబాద్‌లో మొదటిసారిగా పారిశ్రామిక వస్తు ప్రదర్శన(నుమాయిష్) ఏర్పాటు చేశాడు.
- 1862లో పోస్టల్ శాఖను స్థాపించి హైదరాబాద్ నుంచి బొంబాయికి టెలిగ్రాఫ్ లైన్‌ను వేయించాడు.
- సాలార్‌జంగ్ అనేక మంది స్థానికేతరులకు ఉద్యోగాలు కల్పించాడు. ఉత్తర భారతదేశానికి చెందిన చాలామంది ముస్లింలు, కాయస్థులు హైదరాబాద్‌లో ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరారు. వీరిలో సయ్యద్ హుస్సేన్ బిల్ గ్రామి, సయ్యద్ అలీ బిల్ గ్రామి, మోహిబ్ హుస్సేన్, సయ్యద్ మహ్మద్ అలీ, మొహిన్ ముల్క్ తదితరులు పరిపాలనలో సాలార్‌జంగ్‌కు సహకరించారు.
- చాలా మంది స్థానికేతరులను ప్రభుత్వ ఉద్యోగాల్లో నియమించడం వల్ల తర్వాతి కాలంలో స్థానికులు, స్థానికేతరుల మధ్య వివాదాలు తలెత్తాయి. ఇది ముల్కీ ఉద్యమానికి దారితీసింది.

1857లో సిపాయిల తిరుగుబాటు సమయంలో బ్రిటిష్ ప్రతినిధి కల్నల్ డేవిడ్‌సన్‌కు సాలార్‌జంగ్ సహాయం చేశాడు. తుర్రేబాజ్‌ఖాన్‌ను, మౌల్వీ అల్లా ఉద్దీన్‌లను అరెస్ట్ చేసి హైదరాబాద్ రాజ్యంలో 1857 సిపాయిల తిరుగుబాటును అణచివేశాడు. సాలార్‌జంగ్ నిర్విరామ కృషి వల్ల 1860లో ధారాశివ్, రాయచూర్ జిల్లాలు తిరిగి నిజాంకు దక్కాయి. బీరారు ప్రాంతాన్ని కూడా తిరిగి దక్కించుకునేందుకు కృషి చేశాడు. బీరారును తిరిగి పొందడం కోసం బ్రిటిష్ రాణితో చర్చలు జరపడానికి ఇంగ్లండ్ వెళ్లాడు. దీంతో బ్రిటిష్ ఇండియాలోని గవర్నర్‌లు ఇతడి పట్ల శత్రుత్వం వహించారు. వికార్-ఉల్-ఉమార్‌ను మహబూబ్ అలీఖాన్‌కు సహ రాజ ప్రతినిధిగా నియమించారు. బీరారును తిరిగి పొందడానికి సాలార్‌జంగ్ చేసిన ప్రయత్నాలు లార్డ్ లిట్టన్‌ను ఇబ్బంది పెట్టాయి. సిపాయిల తిరుగుబాటులో సహాయం చేసినందుకు హైదరాబాద్ నిజాం అఫ్జల్ ఉద్దౌలాకు బ్రిటిషర్లు 'స్టార్ ఆఫ్ ఇండియా' బిరుదును ఇచ్చారు. హైదరాబాద్ రాజ్యం ఈస్ట్ ఇండియా కంపెనీకి బాకీపడ్డ రూ. 50 లక్షల అప్పును రద్దు చేశారు.

1883 ఫిబ్రవరి 8న సాలార్‌జంగ్ మరణించాడు. అతడి మరణానంతరం రాజ్య పాలన అస్తవ్యస్తమైంది. ముల్కీ, నాన్ ముల్కీ వివాదాలు తలెత్తాయి. దీనివల్ల పరిపాలనలో పూర్తిగా స్తబ్దత ఏర్పడింది. బ్రిటిష్ ప్రభుత్వం సాలార్‌జంగ్ కుమారుడైన మీర్ లాయక్ అలీఖాన్‌ను, రాజా నరేంద్ర బహదూర్‌ను రాష్ట్రానికి సంయుక్త పాలకులుగా నియమించింది.

సాలార్‌జంగ్ కుమారుడైన మీర్ లాయక్ అలీఖాన్.. ఆరో నిజాం మహబూబ్ అలీఖాన్‌తో కలిసి చదువుకున్నాడు. ఇతడే 1884లో రెండో సాలార్‌జంగ్ బిరుదుతో హైదరాబాద్ రాజ్యానికి ప్రధానమంత్రి అయ్యాడు.



విద్యా సంస్కరణలు

- పరిపాలనలో సహాయం చేయడం కోసం సుశిక్షితులైన ఉద్యోగులను నియమించేందుకు అనుగుణంగా విద్యా విధానంలో అనేక మార్పులు ప్రవేశపెట్టాడు.
- 1855లో దార్-ఉల్-ఉలూమ్ అనే ఉన్నత పాఠశాలను రాజ్యంలో ఏర్పాటు చేశాడు. ఈ పాఠశాల స్థాపన పాశ్చాత్య విద్యాబోధనలో తొలిమెట్టుగా చెప్పొచ్చు. ఈ పాఠశాలలో పర్షియన్, ఉర్దూ భాషల్లోనే కాకుండా ఆంగ్ల భాషలోనూ బోధించేవారు.
- 1869లో సాలార్‌జంగ్, మీర్ మహబూబ్ అలీఖాన్‌కు సహ రాజప్రతినిధిగా నియమితులయ్యాడు. ఆంగ్ల భాషా బోధన, పాశ్చాత్య విద్యా వ్యాప్తికి అనేక పాఠశాలలు నెలకొల్పాడు.
- 1870లో హైదరాబాద్‌లో నగర ఉన్నత పాఠశాల, 1872లో చాదర్‌ఘాట్ ఉన్నత పాఠశాలను స్థాపించాడు. ప్రజా పనుల శాఖలో పనిచేయడానికి కావాల్సిన సాంకేతిక సిబ్బంది శిక్షణ కోసం 1870లో ఇంజనీరింగ్ పాఠశాల నెలకొల్పాడు.
- పాలకుల పిల్లల కోసం 1873లో 'మదరసా-ఇ-అలియా' స్థాపించాడు.
- రాజ కుటుంబంలోని పిల్లలు చదుకోవడం కోసం కోసం 1878లో మదరసా-ఇ-ఐజాను ప్రారంభించాడు.
- అలీఘర్‌లో విద్యాసంస్థల్ని స్థాపించడానికి సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్‌కు ఆర్థిక సహాయం అందజేశాడు. హైదరాబాద్‌కు చెందిన వికార్-ఉల్-ముల్క్, మొహసిక్-ఉల్-ముల్క్ అనే ఇద్దరు అధికారులు అలీఘర్ కాలేజీ ఏర్పాటులో చురుగ్గా పాల్గొన్నారు.
- 1881లో గ్లోరియా గర్ల్స్ హైస్కూల్‌ను ఏర్పాటు చేశాడు.
- సాలార్‌జంగ్ మరణించాక 1887లో చాదర్‌ఘాట్ ఉన్నత పాఠశాలను 'మదరసా-ఇ-అలియా'లో విలీనం చేసి నిజాం కాలేజీని ఏర్పాటు చేశారు.

రవాణా సంస్కరణలు

- 1863లో హైదరాబాద్ నుంచి షోలాపూర్ వరకు గ్రాండ్ ట్రంక్ రోడ్డు నిర్మించాడు.
- బ్రిటిషర్లు మద్రాసు-బొంబాయి మధ్య రైల్వే లైన్‌ను హైదరాబాద్ రాజ్య భాగాలైన గుల్బర్గా,వాడి ద్వారా పోయేవిధంగా నిర్మించారు.
- 1874లో హైదరాబాద్, వాడి మధ్య రైల్వే నిర్మాణం ప్రారంభించి 1878లో పూర్తి చేశాడు. దీంతో రాజ్యంలో ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడ్డాయి.
- పరిపాలనా భారం విపరీతంగా పెరగడంతో సాలార్‌జంగ్ 'సదర్-ఉల్-మహమ్' అనే నలుగురు మంత్రులను నియమించాడు. వీరిలో ముగ్గురు మంత్రులకు కొత్తగా ఏర్పాటు చేసిన పోలీసు, రెవెన్యూ, న్యాయ శాఖలను అప్పగించాడు. విద్య, ఆరోగ్య శాఖలకు ఉమ్మడిగా నాలుగో మంత్రిని నియమించాడు. వీరందరూ ప్రధానమంత్రి (దివాను) నేతృత్వంలో పనిచేసేవారు.

The telephone is an example of..



1. What is the responsibility of the logical unit in the CPU of a computer?
   a) Producing result
   b) Comparing numbers
   c) Controlling flow of information
   d) Performing mathematical operations
   e) Controlling flow of data
2. Abacus was the first ___
   a) Electronic computer
   b) Mechanical computer
   c) Electronic calculator
   d) Mechanical calculator
   e) Electronic chip
3. If in a computer, 16 bits are used to specify address in a RAM, the number of addresses will be ___
   a) 216 b) 65,536
   c) 64K d) 128K
   e) 135K
4. Instructions and memory address are represented by ___
   a) Character code
   b) Binary code c) Binary word
   d) Parity bit e) Bite code
5. The terminal device that functions as a cash register, computer terminal and OCR reader is:
   a) Data collection terminal
   b) OCR register terminal
   c) Video Display terminal
   d) POS terminal
   e) None of the above
6. A set of flip flops integrated together is called ____
   a) Counter b) Adder
   c) Register d) Flip flop
   e) All of the above
7. People often call ______ as the brain of computer system.
   a) Control Unit
   b) Arithmetic Logic Unit
   c) Central Processing Unit
   d) Storage Unit e) Store data
8. Which of the following is used for manufacturing chips?
   a) Bus b) Control unit
   c) Semiconductors
   d) a and b only
   e) None of the above
9. The value of each bead in heaven is ___
   a) 1 b) 3 c) 5 d) 7 e) 8
10. The first computer introduced in Nepal was ___
    a) IBM 1400 b) IBM 1401
    c) IBM 1402 d) IBM 1406
    e) IBM 1405
11. Bluetooth is a type of radio wave information transmission system that is good for about:
    a) 30 feet b) 30 yards
    c) 30 miles d) 300 miles
    e) 3000 miles
12. The telephone is an example of a(n)____ signal.
    a) analog b) digital
    c) modulated d) demodulated
    e) compiler
13. A credit card-sized expansion board that is inserted into portable computers that connects the modem to the telephone wall jack is:
    a) Internal modem
    b) External modem
    c) PC Card modem
    d) Wireless modem
    e) Wired modem
14. A modem that is contained within the system unit is called:
    a) External b) Internal
    c) Wireless d) Wi-Fi e) Bluetooth
15. A modem that doesn't need to be connected to a telephone line is the ___ modem.
    a) external b) internal
    c) wireless d) DSL e) NSL
16. A special high-speed line used by large corporations to support digital communications is known as:
    a) satellite/air connection service lines
    b) cable modems
    c) digital subscriber lines
    d) T1, T2, T3 and T4 lines
    e) None of the above
17. An affordable technology that uses existing telephone lines to provide high-speed connections is called ________.
    a) ISDN b) microwave
    c) cable modem
    d) DSL e) ALU
18. The capacity of a communication channel is measured in ___
    a) Bandwidth b) Bit capacity
    c) Baud rate d) Data flow
    e) Store data
19. A relatively new technology that allows wireless connectivity:
    a) Bluetooth b) Black tooth
    c) Blue band d) Broadband
    e) Wi- fi
20. In MS-DOS 5.0, which is the number that acts as a code to uniquely identify the software product?
    a) MS b) DOS
    c) MS DOS d) 5.0 e) 4.2.0
21. A page fault:
    a) Is an error in a specific page
    b) Occurs when a program accesses a page of memory
    c) Is an access to a page not currently in memory
    d) None of the above
    e) All of the above
22. The process of transferring data intended for a peripheral device into a disk or intermediate store so that it can be transferred to peripheral at a more convenient time or in bulk, is known as ___.
    a) Multiprogramming
    b) Spooling c) Caching
    d) Virtual programming
    e) Code programming
23. An instruction in a programming language that is replaced by a sequence of instructions prior to assembly or compiling:
    a) Procedure b) Macro
    c) Label d) Literal e) External
24. Banker's algorithm for resource allocation deals with:
    a) Deadlock prevention
    b) Deadlock avoidance
    c) Deadlock recovery
    d) Mutual exclusion
    e) Data recovery
25. The state of a process after it encounters an I/O instruction is _____.
    a) Ready b) Blocked/ Waiting
    c) Idle d) Running e) Compiling
26. The number of processes completed per unit time is known as__.
    a) Output b) Throughput
    c) Efficiency d) Capacity
    e) Input
27. Which of the following file name extension suggests that the file is Backup copy of another file?
    a) TXT b) COM
    c) BAS d) BAK e) BAT
28. Which technique was introduced because a single job could not keep both the CPU and the I/O devices busy?
    a) Time-sharing b) Spooling
    c) Preemptive scheduling
    d) Multiprogramming
    e) Multiplexing
29. The speed of your net access is defined in terms of ___
    a) MHz b) Megabytes
    c) RAM d) Kbps e) GHz
30. AOL stands for:
    a) America Over LAN
    b) America Online
    c) Arranged Outer Line
    d) Audio Over LAN
    e) Audio Outer Line

KEY

1) b; 2) d; 3) b; 4) b; 5) d; 6) c; 7) c; 8) c; 9) c; 10) b 11) a; 12) a; 13) c; 14) b; 15) c; 16) d; 17) d; 18) a; 19) a; 20) d; 21) c; 22) b; 23) b; 24) b; 25) b; 26) b; 27) d; 28) d; 29) d; 30) b.

TYPES OF COMPUTER

On the basis of working principle there are three types of computers.

a) Analog Computer

An analog computer (spelt analogue in British English) is a form of computer that uses continuous physical phenomena such as electrical, mechanical or hydraulic quantities to model the problem being solved.

1. Thermometer 2. Speedometer
3. Petrol Pump Indicator
4. Multi meter

b) Digital Computer

A computer that performs calculations and logical operations with quantities represented as digits, usually in the binary number system.

c) Hybrid Computer (Analog + Digital)

A combination of computers those are capable of inputting and outputting in both digital and analog signals. A hybrid computer system setup offers a cost effective method of performing complex simulations.

On the basis of Size..

a) Super Computer

It is the fastest computer. Supercomputers are very expensive and are employed for specialized applications that require immense amounts of mathematical calculations. For example, weather forecasting requires a supercomputer. Other uses of supercomputers include animated graphics, fluid dynamic calculations and nuclear energy research and petroleum exploration.

The major difference between a supercomputer and a mainframe is that a supercomputer channels all its power into executing a few programs as fast as possible, whereas a mainframe uses its power to execute many programs concurrently.

b) Mainframe Computer

A very large and expensive computer capable of supporting hundreds and even thousands of users simultaneously. In the hierarchy that starts with a simple microprocessor (**Eg:** in watches) at the bottom and moves to supercomputers at the top, mainframes are just below supercomputers. In some ways, mainframes are more powerful than supercomputers because they support more simultaneous programs. But supercomputers can execute a single program faster than a mainframe.

c) Mini Computer

In size and power, minicomputers lie between workstations and mainframes. In the past decade, the distinction between large minicomputers and small mainframes has blurred, however, as has the distinction between small minicomputers and workstations. But in general, a minicomputer is a multiprocessing system capable of supporting from 4 to about 200 users simultaneously.

d) Micro Computer

i. Desktop Computer: A personal or micro-mini computer sufficient to fit on a desk.

ii. Laptop Computer: A portable computer complete with an integrated screen and keyboard. It is generally smaller in size than a desktop computer and larger than a notebook computer.

iii. Palmtop Computer/ Digital Diary/ Notebook / PDAs: A hand-sized computer. Palmtops have no keyboard but the screen serves both as an input and output device.

e) Workstations

It is a terminal or desktop computer in a network. In this context, workstation is just a generic term for a user's machine (client machine) in contrast to a "server" or "mainframe."

Major brands of the computer:

a) IBM/ IBM Compatible Computers
b) Apple/ Macintosh.